# భారతదేశంలో జాతుల సమస్య-మన పార్టీ వైఖరి

జనవరి 2021

కేంద్ర కమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# భారతదేశంలో జాతుల సమస్య-మన పార్టీ వైఖరి

జనవరి 2021

కేంద్ర కమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## నోట్

సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ 'భారతదేశంలో జాతుల సమస్య – మన పార్టీ వైఖరి' అనే ఈ డాక్యుమెంట్‌ను రూపొందించి మే 26, 2019లో విడుదల చేసింది. అనంతరం కొందరు సీసీ కామ్రేడ్స్ నుండి, రాష్ట్రకమిటీల కామ్రేడ్స్ నుండి దీనికి కొన్ని సలహాలు, వ్యాఖ్యలు, సవరణలు కేంద్రకమిటీ ముందుకు వచ్చాయి. కేంద్రకమిటీ వీటిని చర్చించి ప్రస్తుతం సవరించిన డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్నది.

జనవరి 2021

విప్లవాభినందనలతో

కేంద్రకమిటీ

సీపీఐ (మావోయిస్టు)

భారతదేశంలో జాతుల సమస్య – మన పార్టీ వైఖరి
మొదటి ప్రచురణ: మే 26, 2019
రెండవ (సవరించిన) ప్రచురణ: జనవరి 2021
కేంద్రకమిటీ
సిపిఐ (మావోయిస్టు) డాక్యుమెంట్

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | 7 |
| 1. | జాతుల సమస్యపై కార్మికవర్గ మౌలిక అవగాహన | 11 |
| 2. | భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగం జాతులసమస్య | 45 |
| 3. | జాతుల విముక్తికై మన పార్టీ కార్యక్రమం | 98 |

# ముందుమాట

బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మన దేశంలో జాతుల ఉద్యమాలు కొనసాగాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి భారత దోపిడీ వర్గాలకు 1947 ఆగస్టు 15న అధికార మార్పిడి జరగడంతో భారతదేశంలోని జాతుల సమస్య అపరిష్కృతంగానే మిగిలి పోయింది. అప్పటి నుండి ఇప్పటి వరకు గడిచిన కాలమంతా భారతదేశంలో జాతుల సమస్య కొనసాగుతూనే ఉంది. నేడు అది మరింత తీవ్రంగానూ, జటిలంగాను ఉంది. జాతి రాజ్యాల ఏర్పాటుతో జాతుల సమస్య పరిష్కారమయ్యిందని చెప్పబడ్డ పలు యూరప్ దేశాల్లో కూడా నేడు ఆ సమస్య తిరిగి వివిధ రూపాల్లో తల ఎత్తుతూనే ఉంది. ఈ స్థితిలో, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మౌలిక అవగాహన వెలుగులో, మన అనుభవాల వెలుగులో, మన దేశంలో జాతుల ఉద్యమాల నిర్దిష్ట పరిస్థితులలో ఈ సమస్య పరిష్కారం కోసం మన పార్టీ అనుసరిస్తున్న విధానాన్ని సంపద్వంతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

భారతదేశంలో జాతుల సమస్యపై మునుపటి సీపీఐ (ఎంఎల్)కు, ఎంసీసీఐకి, మన ఐక్య పార్టీ సీపీఐ (మావోయిస్టు)కు మొదటి నుండి మౌలికంగా స్పష్టమైన అవగాహన ఉంది. మన దేశంలో తలెత్తిన జాతుల సమస్య పట్ల మనం ఈ మౌలిక అవగాహనపై ఆధారపడి వివిధ సందర్భాలలో మన వైఖరిని ప్రకటించడమే కాకుండా, న్యాయమైన ఆ ఉద్యమాలకు మద్దతునందించాం. ఆ ఉద్యమ సంస్థలతో సత్సంబంధాలు కొనసాగించాం. మన పార్టీ నాయకత్వాన కొన్ని ఉద్యమాల్నీ నడిపాం. మనం సరైన వైఖరిని ప్రకటించి, దాని ఆధారంగా ఆచరణను చేపట్టినప్పుడు సకారాత్మక (పాజిటివ్) ఫలితాలతో పాటు విలువైన అనుభవాలను కూడా పొందాం.

నేడు ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ వివక్షతలకు వ్యతిరేకంగా, ప్రాంతీయ వెనుకబాటుతనానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగుతున్నాయి. చారిత్రకంగా గల జాతిపర మూలాలపై ఆధారపడి ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు కోసం ఉద్యమాలు సాగుతున్నాయి. సుదీర్ఘకాలంగా కశ్మీర్ జాతి, నాగా, మణిపూర్, అసోం జాతులు భారతదేశం నుండి విడిపోయి జాతి ప్రాతిపదికన స్వతంత్ర దేశాల్ని ఏర్పాటు చేసుకోవడం కోసం పోరాడుతూనే ఉన్నాయి. ఈశాన్య భారతంలోని వివిధ జాతులు స్వయంపాలన (అటానమీ), ప్రత్యేక రాష్ట్రం, రాష్ట్రాలకు అధికారాల పెంపు, నిధుల పెంపు కోసం పోరాడుతున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్స్ తలెత్తుతున్నాయి. అంతర్‌రాష్ట్ర నదీ జలాల పంపకాల వివాదాలు, సరిహద్దు వివాదాలు కొనసాగుతున్నాయి.

ప్రాంతీయ పార్టీలు – డీఎంకే, అన్నాడీఎంకే, తెలుగుదేశం, అకాలీదళ్, శివసేన, సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పీ), జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ), అసోం

గణ పరిషత్ (ఏజీపీ), బిజూ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్), ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వగైరాలు కేంద్ర ప్రభుత్వ కేంద్రీకృత అధికారాల్లో కొన్నింటిని తగ్గించి రాష్ట్రాలకు అధికారాల్ని పెంచాలనీ, భారత రాజ్యాంగం కల్పించిన ఫెడరల్ హక్కులను అమలు చేయాలనీ డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ పార్టీలన్నీ ప్రాంతీయ దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవే. సామ్రాజ్యవాదుల, అఖిల భారత దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను ఈడేర్చేవే కావడంతో ఈ సమస్యపై ఈ పార్టీలు ఎన్నికల రాజకీయాల్లో లబ్ధి పొందడం కోసం అధికారంలో ఉన్నప్పుడు ఒక రకమైన వైఖరిని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక వైఖరిని అవకాశవాదంతో అనుసరిస్తున్నాయి. ఈ పార్టీలు చేస్తున్న డిమాండ్స్ ప్రకారం జాతుల సమస్య మౌలికంగా ఏ మాత్రం పరిష్కారం కాదు. అవి దోపిడివర్గాల ప్రయోజనాలను ఈడేర్చడానికే తోడ్పడుతాయి.

సీపీఐ, సీపీఐ(ఎమ్) తదితర రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీలు నేటి భారత రాజ్యాంగపు నామమాత్రపు ఫెడరల్ స్వభావాన్ని కాపాడడం ద్వారా జాతుల సమస్య పరిష్కారమవుతుందని చెబుతాయి. వాస్తవానికి, ఈ అవకాశవాద రివిజనిస్టు పార్టీలు జాతుల స్వయంనిర్ణయాధికారాన్ని పూర్తిగా తిరస్కరిస్తాయి. ఈ పార్టీల వైఖరులకు పాలకవర్గ పార్టీల వైఖరులకు మౌలికంగా తేడా లేదు. ఈ పార్టీలు ప్రధానంగా సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కోసం పాటుపడుతూ జాతుల న్యాయమైన పోరాటాలన్నింటినీ అణచివేయడానికి కొమ్ముకాస్తున్నాయి.

గత 73 సంవత్సరాలలో అత్యధిక కాలం కేంద్రంలో, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 'బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని' నిలబెట్టడం కోసం 'దేశ సమైక్యత', 'దేశ సమగ్రత', 'దేశ భద్రత'ల పేరుతో నిరంకుశ పాలనను, దక్షిణాసియాలో విస్తరణవాద విధానాలు అమలు చేసింది. 1950లు, 60లలో నెహ్రూ–పటేల్‌ల నాయకత్వంలో భారత పాలకవర్గాలు రకరకాల మోసాలకు, కుయుక్తులకు, బెదిరింపులకు పాల్పడడమే కాకుండా అనేక సంస్థానాలపై 'మిలిటరీ చర్యలకు' సైతం పాల్పడి 'ఇండియన్ యూనియన్'ను నిలబెట్టి మొదటిసారిగా దేశంలో 'రాజకీయ ఏకీకరణ'ను సాధించాయి. వారి అడుగుజాడల్లో నడచిన ఇందిరాగాంధీ 1973లో సిక్కింపై దురాక్రమణ దాడిచేసి దానిని ఇండియాలో కలిపేసింది. తదనంతర కాలంలో దేశంలో అధికారాన్ని చలాయించిన కాంగ్రెస్ పార్టీ, సంయుక్త కూటమి, భారతీయ జనతా పార్టీలు జాతుల ఆకాంక్షల్ని క్రూరంగా అణచివేయడంతో పాటు విస్తరణవాద విధానాలను కొనసాగిస్తూ సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను నెరవేర్చాయి.

భారతదేశం విభిన్న జాతులకు నిలయం కాదనీ, భారతదేశంలో ఉన్నది ఒకే జాతి అనీ,

అదే 'హిందూ' జాతి అనీ, హిందూ మతమే సాంస్కృతికంగా ఈ జాతిని సమైక్యం చేసి నిలబెడుతూ వస్తోందనీ, ఈ సాంస్కృతిక జాతీయవాదం ఆధారంగా భారతదేశం ఒకే జాతిని కలిగిన దేశమనీ (సింగిల్ నేషనల్ స్టేట్), దక్షిణాసియా భూభాగాన్నంతటినీ కలిపి 'అఖండ భారతాన్ని' ఏర్పాటు చేసే లక్ష్యంతో 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' (ఆర్ఎస్ఎస్) భారతదేశంలోని పీడిత జాతులతో పాటు దక్షిణాసియాలోని ఇతర దేశాలన్నింటిపై విస్తరణవాద ఆధిపత్య విధానాలను అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ లక్ష్య సాధన కోసం రాజకీయ రంగంలో పనిచేయడానికి ఆర్ఎస్ఎస్ ఏర్పరచిన భారతీయ జనతా పార్టీ దళారీ పాలకవర్గాల పార్టీగా మొదటి నుండీ ఇందుకు అనుగుణంగా పని చేస్తున్నది. బీజేపీ 2014 మే నెలలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత అది 'వస్తు సేవల పన్ను' (జీఎస్టీ) పేరుతో ఆర్థిక ఏకీకరణ సాధించడంలో భాగంగా దేశమంతా ఒకే పన్ను (జీఎస్టీ) విధానాన్ని అమలులోకి తెచ్చింది. 'ఒకే దేశం–ఒకే పన్ను విధానం' నినాదాన్నిచ్చింది. తన 'అఖండ భారత్' స్థాపన దిశగా అది 'ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్' నినాదాన్ని ముందుకు తెచ్చింది. అత్యంత అభివృద్ధి నిరోధక, కాలంచెల్లిన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు 2022 నాటికి సాధించదలచిన 'నయా భారత్' (న్యూ ఇండియా) అంటే భారతదేశంలోని పీడిత జాతులన్నింటిని అణచివేసే, భారత రాజ్యాంగంలోని లాంఛనప్రాయమైన ఫెడరల్ స్వభావాన్ని కూడా తొలగించి, పూర్తి యూనిటరీ స్వభావం కలిగిన కేంద్రీకృత, ఫాసిస్టు దేశంగా మార్చడమే తప్ప మరేమీ కాదు. ఇది సామ్రాజ్యవాదుల, భారత దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను మరింత దూకుడుగా నెరవేర్చడానికి ఉద్దేశించినదే.

దేశంలోని ఆదివాసీ ప్రాంతాలంతటా ఆదివాసీ సముదాయాలపై సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల దోపిడీ, పీడనలు తీవ్రతరమవుతూ వాటి అస్థిత్వం ప్రమాదంలో పడింది. ఈ ప్రాంతాలలో పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా సెక్షన్లు పెరగడంతో పాటు ఒక చిన్న సెక్షన్ దళారీ బూర్జువా వర్గంగా కూడా ఏర్పడుతున్నది. ఆదివాసీ ప్రజలు తమకు స్వయం పాలన (అటానమి) కావాలనీ, ప్రత్యేక రాష్ట్రాలు కావాలనీ డిమాండ్ చేస్తున్నారు. ఆదివాసీ సముదాయాలు జాతులుగా ఆవిర్భవించే (ప్రాదుర్భావ) క్రమంలో భాగంగానే ఈ డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. వీటిపైన మనం సమగ్రమైన కార్యక్రమాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ముందుకు వచ్చింది.

మన దేశంలోని మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీల్లో జాతుల సమస్యపై రెండు తప్పుడు ధోరణులు ఉన్నాయి. అందులో –

**ఒకటి :** వివిధ జాతుల పోరాటాలు ప్రత్యేకించి భారత యూనియన్ నుండి విడిపోవాలన్న డిమాండ్‌తో సాగుతున్న పోరాటాలు సామ్రాజ్యవాద ప్రేరణతో సాగుతున్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పాటు సాగించిన పోరాటం ద్వారా భారత

ప్రజలు సాధించిన ఐక్యతను అవి విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఇవి వర్గ పోరాటాలు గావు లేదా కార్మికవర్గ నాయకత్వాన సాగుతున్న పోరాటాలు గావు. అందువలన వాటిలో జోక్యం చేసుకోవడం విప్లవకారుల పనికాదు అనే అభిప్రాయం.

**రెండవది :** ఆయా జాతుల పోరాటాల లక్ష్యాన్నీ, ధ్యేయాలనూ విశ్లేషించకుండా అన్ని జాతుల పోరాటాల్నీ సమర్థిస్తూ భారత దేశంలోని ప్రతి జాతిని విడిగా సంఘటితపరచి ఒక జాతి చారిత్రక అభివృద్ధి దశతో సంబంధం లేకుండా, వర్గపోరాట అభివృద్ధితో ప్రజలలోని రాజకీయ చైతన్యంతో సంబంధం లేకుండా ప్రతి జాతి భారతదేశం నుండి విడిపోవడం కోసం పోరాటం చేయడం అనే పంథాతో వర్గపోరాటం స్థానంలో జాతి పోరాటాన్ని ప్రవేశపెట్టే బూర్జువా జాతీయవాద దృక్పథం.

బూర్జువా, రివిజనిస్టు, పెటీబూర్జువా, హిందుత్వ ఫాసిస్టు విధానాలకు (పాలసీలకు), వైఖరులకు, ధోరణులకు భిన్నంగా భారతదేశంలోని జాతుల సమస్యపై కార్మికవర్గ అగ్రగామి పార్టీగా మన పార్టీకి మౌలికంగా సరైన విధానం ఉంది.

దోపిడీ వ్యవస్థను నిర్మూలించడానికీ, జాతుల పరిపూర్ణ వికాసానికి మధ్య అవినాభావ సంబంధం ఉన్నదని మన పార్టీ దృఢంగా ప్రకటిస్తోంది.

విభిన్న జాతులకు నిలయంగా ఉన్న ఏ వెనుకబడిన దేశంలోనయినప్పటికీ, భూస్వామ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే నూతన ప్రజాస్వామిక విప్లవంలో జాతుల సమస్య విడదీయరాని భాగమని మన పార్టీ అభిప్రాయపడుతోంది.

వివిధ జాతులు తమ అభివృద్ధి కొరకు చేసే పోరాటాలూ; భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడిని దేశవ్యాప్తంగా సమూలంగా నిర్మూలించడానికి జరిగే పోరాటాలు అవిభాజ్యమైనవి. ఒకే లక్ష్యానికి సంబంధించిన వేర్వేరు అంశాలు, ఒకే ప్రజాతంత్ర విప్లవంలో ఒకదాని అభివృద్ధికి మరొకటి తోడ్పడుతూ కొనసాగుతున్న రెండు అంతర్వాహినులని మన పార్టీ అవగాహన.

భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా జాతుల సమస్యపై సమగ్ర విధానాన్ని రూపొందించిన ఈ డాక్యుమెంట్‌లో మూడు అధ్యాయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయంలో 'జాతుల సమస్యపై కార్మికవర్గ మౌలిక అవగాహన' గురించి, రెండవ అధ్యాయంలో 'భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగం జాతుల సమస్య' గురించి, మూడవ అధ్యాయంలో 'జాతుల సమస్య–మన విప్లవ కార్యక్రమం' గురించి వివరించాం.

జాతుల బందిఖానాగా ఉన్న మన దేశంలోని వివిధ జాతుల ఆకాంక్షలకు అనుగుణంగా వాటిని నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం చేసేలా వాటికి మన పార్టీ నాయకత్వం వహించడంతో పాటు, జాతుల సమస్య ఏ రాష్ట్రంలో ఏ రూపంలో తలెత్తినా, ఏ స్థాయిలో

ముందుకు వచ్చినా, ఆ పోరాటాలకు, ఉద్యమాలకు కూడా మన పార్టీ నాయకత్వాన్ని అందించాలి.

దేశంలో మన పార్టీ బలంగా ఉన్న చోట అయినా, బలహీనంగా ఉన్న చోట అయినా ఈ పాలసీ డాక్యుమెంట్ ఆధారంగా జాతుల సమస్యపై బూర్జువా, రివిజనిస్టు, పెటీ బూర్జువా, హిందుత్వ ఫాసిస్టు విధానాలను, వైఖరులను, ధోరణులను రాజకీయంగా ఎండగట్టాలి. దేశంలో కొనసాగుతున్న జాతుల న్యాయమైన ఉద్యమాలను బలపరచాలి. మన విధానం చుట్టూతా పీడిత జాతుల ప్రజలను రాజకీయంగా సమీకరించే కృషి చేయడం, జాతుల ఉద్యమాలలోని పాజిటివ్ శక్తులను ఐక్యం చేయడం అవసరం. అప్పుడే, మన దేశంలో భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గపోరాటం, జాతుల పోరాటాలు రెండు స్రవంతులుగా ఏకమయ్యి ఒకదాని ఆధారంగా మరొకటి బలపడుతూ భారత విప్లవోద్యమాన్ని పురోగమింపజేస్తాయి. భారత విప్లవం విజయవంతం కావడంతో పాటు సాంఘికంగా పీడిత వర్గాలతో పాటు పీడిత సామాజిక సెక్షన్లు, జాతిపరంగా పీడిత జాతులు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్యం సంకెళ్ళ నుండి విముక్తమవుతాయి. తద్వారా దేశం, ప్రపంచం వర్గ పీడనలేని, జాతి పీడనలేని మహోన్నత సమాజం దిశగా ముందుకు సాగుతాయి.

# మొదటి అధ్యాయం

# జాతుల సమస్యపై కార్మికవర్గ మౌలిక అవగాహన

## ప్రపంచంలో జాతుల ఆవిర్భావం, వాటి అభివృద్ధి క్రమం

చారిత్రకంగా ప్రపంచంలో జాతుల ఆవిర్భావం, వాటి అభివృద్ధి క్రమాన్ని అర్థం చేసుకోవడానికి సమాజ పరిణామ క్రమాన్ని సంక్షిప్తంగానైనా తెలుసుకోవడం అవసరం.

క్రీ.పూ. 4000 నుండి క్రీ.పూ. 1000 వరకు దాదాపు 3 వేల ఏళ్ళ పాటు ప్రపంచంలో కొన్ని చోట్ల బానిస సమాజాలు ఉండగా, అత్యధిక భూభాగంలో ఆదిమ సమాజాలు (ఆదిమ కమ్యూనిస్టు సమాజాలు) కొనసాగాయి. భారతదేశంలో క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 400 వరకు భూస్వామ్య వ్యవస్థకు పునాది రాళ్ళయిన స్వయం సంపూర్ణ గ్రామాలు ఆవిర్భవించాయి. ఈ కాలంలో ప్రపంచమంతా ఆదిమ సమాజాల వలసలు కొనసాగుతూనే ఉండినాయి. అలాగే ఆయా సమాజాలు నిర్ణీతమైన భూభాగాలకు పరిమితం కాలేదు. ఆ కాలంలో ఆయా సమాజాల భాష, సంస్కృతుల అభివృద్ధి ప్రారంభ దశలోనే ఉండింది. ప్రపంచవ్యాప్తంగా అనాగరిక యుగపు ప్రాథమిక దశ వరకు అన్ని మానవ సమాజాలు దాదాపు ఒకే విధంగా చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందాయి. తదనంతర కాలంలో ఒక్కో ప్రాంతంలో ఉన్న భౌగోళిక ప్రత్యేకతలు - సహజ వనరులు, వాతావరణం, ఇతర ప్రకృతి వైవిధ్యాల కారణంగా ఆయా సమాజాలు అసమానంగా అభివృద్ధి చెందాయి. ఫలితంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో అసమానతలు చోటు చేసుకున్నాయి. దీనితో పాటు ఆయా సమాజాల్లో అంతర్గతంగా జరిగిన వర్గ పోరాటాలు, ప్రపంచవ్యాప్తంగా జరిగిన యుద్ధాల్లాంటి రాజకీయ పరిణామాలు ఆయా దేశాల్లో జాతులు రూపొందే క్రమాన్ని, వాటి అభివృద్ధి క్రమాన్ని ప్రభావితం చేసాయి.

ప్రపంచ వ్యాప్తంగా బానిస సమాజాలు దెబ్బతిని భూస్వామ్య సమాజాలు ఆవిర్భవించడంతో ప్రాచీన చరిత్ర అంతమయ్యి మధ్య యుగాల చరిత్ర ఆరంభమైంది. క్రీ.శ. 4వ, 5వ శతాబ్దాల నుండి మొదలుకుని క్రీ.శ. 16వ శతాబ్దం వరకు ప్రపంచంలో కొంత వెనకా-ముందుగా భూస్వామ్య సమాజాలు ఏర్పడి కొనసాగాయి. ఈ భూస్వామ్య సమాజాల కాలంలో ఆయా సమాజాలకు భాష, సాహిత్యం, సంస్కృతులు సాపేక్షికంగా అభివృద్ధి చెందాయి, అయితే మధ్య యుగాల్లో నిరంతరం రాజరికపు యుద్ధాల ఫలితంగా ఒక ప్రజా సమూహం ఒకే రాజరికం కింద ఉండడం సాధ్యం కాలేదు. రాజరికాల మధ్య సాగే యుద్ధాల్లోని జయాపజయాల వల్ల ఆయా ప్రజా సమూహాలు విభక్తమయ్యి వేర్వేరు రాజరికాల కింద జీవించాల్సి వచ్చేది. ఆనాడు ఒక ప్రాంతంలోని ప్రజా సమూహంలో తామంతా ఒకే జాతి అనే భావనను కలిగించే ఒకే ఆర్థిక వ్యవస్థ లేకపోవడంతో ఆధునిక జాతులు ఏర్పడలేదు. ఈ చైతన్యాన్ని మొదట పెట్టుబడిదారీ

విధానమే అందించింది. అయితే ఒక్కో ఫ్యూడల్ రాజ్యంలో భాష ప్రాతిపదికగా జాతిగా గుర్తించబడే ప్రాచీన జాతులు మాత్రం అనేకం కలిసి ఉండేవి. దీంతో ఒకే భాష, ఒకే సంస్కృతి కలిగి ఉన్న ప్రజా సముదాయాల్లో తామంతా ఒకటేననే మానసికత తగినంత అభివృద్ధి కాని స్థితి ఉండేది.

మధ్య యుగం నుండి ఆధునిక యుగానికి పరివర్తన అంటే ఫ్యూడలిజం నుండి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన అన్నమాట. ఇంగ్లండ్‌లో 1640లో ప్రారంభమైన బూర్జువా విప్లవం 1649 జనవరిలో ఆ దేశ రాజును ఉరితీయడంతో విజయవంతమైంది. ఈ రకంగా భూస్వామ్య సమాజాలకు వ్యతిరేకంగా 17వ శతాబ్దం నుండి యూరప్‌లో బూర్జువా విప్లవాలు ప్రారంభమయ్యాయి. 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం జరిగింది. 17వ శతాబ్దంలో పశ్చిమ యూరప్‌లో ప్రారంభమయిన బూర్జువా విప్లవాలు యూరప్ అంతటికీ విస్తరిస్తూ 19వ శతాబ్దం చివరి వరకు తూర్పు యూరప్ దేశాల్లో విజయవంతమయ్యాయి. బూర్జువా విప్లవాలను వెన్నంటి ఆధునిక జాతులు కూడా రూపుదిద్దుకున్నాయి.

పశ్చిమ యూరప్ దేశాల్లో బూర్జువా విప్లవాల ఫలితంగా ఫ్యూడలిజం నిర్మూలించబడి పెట్టుబడిదారీ విధానం ఏర్పడింది. ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ కావడంతో అది స్థానిక, చెల్లాచెదురు స్వభావాన్ని కలిగి ఉండేది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే క్రమంలో విడివిడిగా బతుకుతున్న ప్రజల్ని సమైక్యం చేసింది. అంటే ఆనాటి ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాల సంకెళ్లలో నలిగిపోతున్న ఉత్పత్తి శక్తులను పెట్టుబడిదారీ విధానం విముక్తి చేసింది. అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానానికి అత్యవసరమయిన విషయాల్లో మార్కెట్ ఒకటి. అలాంటి స్థిరమయిన మార్కెట్‌ను సృష్టించుకునే లక్ష్యంలో భాగంగానే పెట్టుబడిదార్లు తమ అవసరం కొద్దీ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందింపజేశారు. ముడి పదార్థాల తరలింపు కోసం, పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకం కోసం, కేంద్రీకృత పరిపాలన కోసం దేశ వ్యాప్తంగా రోడ్డు, రైలు వ్యవస్థలను నిర్మాణం చేశారు. వాటి ఆధారంగా విస్తృతమైన, జాతీయ (హోం) మార్కెట్‌ను సృష్టించుకున్నారు. మార్కెట్‌తో విడదీయరాని సంబంధాన్ని కలిగించే సరుకుల ఉత్పత్తి విధానం ఆరంభమయిన తరువాత ఒకే భూభాగంలో నివసిస్తూ, ఒకే భాష మాట్లాడుతున్న ప్రజల మధ్య ఒకే విధమయిన మానసికతత్వం కూడా అభివృద్ధి చెందుతూ వచ్చి ఒకే జాతిగా సమైక్యమవుతూ వచ్చారు. ఆ విధంగా స్వయం సంపూర్ణమయిన జాతిగా ఆ ప్రజలు రూపొందారు. ఈ క్రమంలో పశ్చిమ యూరప్‌లో బ్రిటిష్, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్ తదితర ప్రజలు ప్రత్యేక జాతులుగా రూపొందడంతో పాటుగానే, అదే సమయంలో స్వతంత్ర జాతీయ ప్రభుత్వాలు కూడా ఏర్పరచుకున్నారు (సింగిల్ నేషన్ స్టేట్స్).

ఆయా ప్రజా సమూహాలు స్వయం సంపూర్ణమయిన జాతులుగా రూపొందే క్రమం ఎక్కడా సాఫీగా జరగలేదు, ఒకేలా జరగలేదు. పెట్టుబడిదారీ విధానాభివృద్ధికి ఆటంకంగా ఉన్న

ఫ్యూడలిజంతో జరిగిన తీవ్రమైన పోరాటాలలో భాగంగానే ఆ పరిణామం జరిగింది, జరుగుతోంది. ఆయా దేశాల్లోని సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా జాతులు రూపొందే క్రమం వేర్వేరు రూపాలు తీసుకుంది.

17వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం చివరి వరకు యూరప్ ఖండమంతటా ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా బూర్జువా విప్లవాలు కొనసాగుతూ జాతి రాజ్యాలు ఏర్పడిన చరిత్రనంతటినీ విశ్లేషిస్తూ (అంటే పెట్టుబడిదారీ సమాజం స్వేచ్ఛాయుత పోటీ దశ కాలంలో) మార్క్సిస్టు మహోపాధ్యాయుడు స్టాలిన్ చెప్పిన విషయాలు ఆధునిక జాతుల ఆవిర్భావ క్రమాల్ని అర్థం చేసుకోవడానికి చక్కగా ఉపయోగపడుతాయి.

"జాతి అనేది కేవలం చరిత్రకు సంబంధించిన ఒక అంశం మాత్రమే కాదు. నిర్దిష్టమైన ఒక శకానికి చెందిన, అంటే అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానపు శకానికి చెందిన చారిత్రకాంశం కూడా. ఫ్యూడలిజం యొక్క నిర్మూలన, పెట్టుబడిదారీ విధానం యొక్క అభివృద్ధీ జరిగే క్రమంలోనే, పై వాటితో పాటుగానే ప్రజలు జాతులుగా రూపొందే క్రమం కూడా జరుగుతుంది. ఉదాహరణకు పశ్చిమ యూరప్‌లో అలాగే జరిగింది. ఫ్యూడల్ అనైక్యతను నిర్మూలించి, పెట్టుబడిదారీ విధానం విజయవంతంగా పురోగమిస్తున్న కాలంలోనే బ్రిటిషు, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్ తదితర ప్రజలు జాతులుగా రూపొందారు.

"అయితే పై ఉదాహరణలో ఆయా ప్రజలు ప్రత్యేక జాతులుగా రూపొందడంతో పాటుగానే, అదే సమయంలోనే అవి స్వతంత్ర జాతీయ రాజ్యాలుగా కూడా రూపొందాయి. అంటే బ్రిటిషు, ఫ్రెంచి తదితర జాతులు బ్రిటిషు, ఫ్రెంచి వగైరా జాతీయ ప్రభుత్వాలుగా కూడా రూపొందాయి. ఆ క్రమంలో ఐర్లండు భాగస్వామి కాలేదు. అయినా పశ్చిమ యూరపుకు చెందిన పై జనరల్ లక్షణం అందుమూలంగా మారదు.

"తూర్పు యూరపులో పరిస్థితి మరో విధంగా నడిచింది. పశ్చిమ యూరపులో జాతులు స్వతంత్ర జాతీయ ప్రభుత్వాలుగా రూపొందితే తూర్పు యూరప్‌లో అనేక జాతులతో కూడిన బహు జాతుల ప్రభుత్వాలు (మల్టీ నేషనల్‌స్టేట్స్) యేర్పడ్డాయి. ఆస్ట్రో హంగరీ, రష్యా ప్రభుత్వాలు అలాంటివే. ఆస్ట్రియాలోని జర్మన్లు రాజకీయంగా చాలా అభివృద్ధి చెందిన జాతి కాబట్టి ఆస్ట్రియాలోని తదితర జాతులన్నింటినీ సమైక్యం చేసి ఒకే ప్రభుత్వం కింద సమీకరించే బాధ్యతను జర్మన్లు నిర్వర్తించారు. హంగరీలో ఉన్న జాతులన్నింటిలోనూ అభివృద్ధి చెందిన మాగ్యార్లు అచ్చట ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి పూనుకున్నారు. తద్వారా వారు హంగరీలో ఉన్న మిగిలిన జాతులన్నింటినీ సమైక్యం చేయగలిగారు. శక్తిమంతమై బాగా సంఘటితమై చారిత్రక పరిణామంలో ఏర్పడివున్న ఆరిస్టోక్రటిక్ మిలిటరీ బ్యురోక్రసీ ఆధిపత్యంలో ఉండిన గ్రేటు రష్యన్లు, రష్యాలోని తదితర జాతులన్నింటినీ సమైక్యం చేయగల భారాన్ని వహించారు.

"తూర్పు యూరపులో పరిస్థితి అలా నడిచింది.

"అంటే ఎక్కడయితే ఫ్యూడలిజం అప్పటికింకా నిర్మూలింపబడలేదో, ఎక్కడయితే పెట్టుబడిదారీ విధానం చాలా బలహీనంగా ఉందో, ఎక్కడయితే వెనుకకు నెట్టబడ్డ జాతులు అప్పటికింకా ఆర్థికంగా సంఘటితమయి సమగ్ర జాతులుగా అభివృద్ధి చెందడంలో జయప్రదం కాలేదో అలాంటి చోట్ల ఇలాంటి బహుళ జాతుల ప్రభుత్వాలు ఏర్పడే ఈ ప్రత్యేక పద్ధతి చోటు చేసుకుంటుంది.

"కాని తూర్పు యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం క్రమంగా అభివృద్ధి చెందసాగింది. వ్యాపార రవాణా మార్గాలు అభివృద్ధి చెందసాగాయి. పెద్ద పెద్ద పట్టణాలు వెలుస్తున్నాయి. జాతులు ఆర్థికంగా సౌష్టవాన్ని పొందసాగాయి. వెనుకబడ్డ జాతుల స్తబ్ద జీవితంలో నెలకొంటున్న పెట్టుబడిదారీ విధానం వారిని ఉత్తేజపర్చి కార్యాచరణకు పురికొల్పుతోంది. ప్రెస్సు, థియేటరు వగైరాలలో వచ్చిన అభివృద్ధి మూలంగానూ, రీచ్‌స్టాగ్ (ఆస్ట్రియా), డ్యూమా (రష్యా) వగైరా శాసనసభల కార్యకలాపాల మూలంగానూ, "జాతీయ భావాలు" వారిలో బలపడసాగాయి. అభివృద్ధి చెందుతున్న మేధావులు "జాతీయ భావాల"తో ఉత్సాహం పొందడమే కాక ఆ భావాన్ని విస్తృతంగా వ్యాపింపజేయడానికి కూడా పూనుకోసాగారు.

"కాని వెనుకకు నెట్టబడి అప్పుడప్పుడే మేలుకుని స్వతంత్ర జీవితాన్ని కాంక్షిస్తున్న జాతులు స్వతంత్ర జాతీయ ప్రభుత్వాలుగా రూపొందలేకపోయాయి. రాజ్యాంగ యంత్రాన్ని చాలా కాలంగా తన అదుపులోకి తీసికొని అధికారాన్ని చెలాయిస్తున్న జాతికి చెందిన పాలకవర్గం నుంచి ఎదురైన గట్టి ప్రతిఘటన వారి దారికి అడ్డంకిగా తయారైంది. స్వతంత్ర జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి పూనుకోవడంలో వారు చాలా వెనుకబడ్డారు. ఆ విధంగా పరిస్థితులు తూర్పు యూరపులోని వెనకబడ్డ జాతుల్ని పోరాట మార్గానికి నెట్టాయి" (స్టాలిన్, మార్క్సిజం-జాతుల సమస్య, 2వ వాల్యూం, 313-315 పేజీలు).

కామ్రేడ్ స్టాలిన్ రాసిన పై విషయాన్ని బట్టి చూసినప్పుడు జాతుల సమస్య అన్ని దేశాలలోనూ అన్ని కాలాలలోనూ ఒకే రూపంలో లేదు. అంతేకాదు, ఫ్యూడలిజం యొక్క నిర్మూలన, పెట్టుబడిదారీ విధానం యొక్క అభివృద్ధి ఏ దేశంలో, ఏ కాలంలో, ఏ మోతాదులో జరుగుతుందో ఆ పరిస్థితులకు అనుగుణ్యంగా జాతుల సమస్య స్వభావం రూపొందుతుంది.

యూరప్ దేశాలకు బయట వేగంగా అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానం ఫలితంగా అమెరికా, బ్రిటిష్ వలసవాదం నుండి 1776లో విముక్తమయ్యి 'అమెరికా జాతి' రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. జపాన్‌లో జాతి రాజ్యం (నేషన్ స్టేట్)కు ఒక ప్రత్యేకత ఉంది. అక్కడి పెట్టుబడిదారీ వర్గం, ఫ్యూడల్ ప్రభువర్గంతో (ఫ్యూడల్ నోబెల్స్) మిలాఖతై అక్కడ పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేసింది. పెట్టుబడిదారీ విధానాన్ని వెన్నంటి ఆ దేశంలో జాతి రాజ్యం

ఏర్పడింది.

ఈ విధంగా పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని వెన్నంటి 18, 19వ శతాబ్దాలలో పశ్చిమ, తూర్పు యూరప్ దేశాలలో, యూరప్‌కు బయట అమెరికా, జపాన్‌లలో జాతి రాజ్యాలు ఏర్పడ్డాయి. ప్రపంచంలోని మిగతా దేశాలలో ఆనాడు పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి సంబంధాలు ఉనికిలో ఉండేవి.

## సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్య

17వ శతాబ్దపు మధ్య భాగంలో మొదలయిన పెట్టుబడిదారీ విధానం 19వ శతాబ్దపు చివరి వరకు స్వేచ్ఛాయుత పెట్టుబడిదారీ విధానంగా కొనసాగింది. ఈ క్రమంలో స్వంత దేశాల మార్కెట్ (జాతీయ మార్కెట్) దాని అభివృద్ధికి సరిపోని స్థితి తలెత్తింది. దీంతో అది విదేశీ మార్కెట్ల కోసం ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే 20వ శతాబ్దపు ఆరంభంలో స్వేచ్ఛాయుత పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారింది.

1870ల నాటి నుండి విదేశీ మార్కెట్లకు సరుకుల ఎగుమతి, పెట్టుబడి ఎగుమతి వేగంగా సాగాయి. సరుకుల ఎగుమతి, పెట్టుబడి ఎగుమతి ఇలా వేగంగా పెరగడానికి కారణం 1873-95 నాటి మొదటి గ్రేట్ డిప్రెషన్ (మహా మాంద్యం)తో ముడిపడి ఉంది. పెట్టుబడి, ఉత్పత్తి ఉన్నత స్థాయిలో సాంద్రీకరించబడడమూ, కేంద్రీకరించబడడమూ పెట్టుబడిదారీ దేశాలలో బ్రహ్మాండమైన జాతీయ గుత్త సంస్థల ఆవిర్భావానికీ, ఉత్పత్తి బ్రహ్మాండంగా పెరగడానికి కారణమైంది. ఇలా పెద్దఎత్తున పెరిగిన ఉత్పత్తిని ఇముడ్చుకోవడానికి పశ్చిమ యూరప్ జాతీయ మార్కెట్లు ఎంతమాత్రమూ సరిపోలేదు. స్వదేశంలోని మార్కెట్లు పరిమితం కావడమే గాక, లాభాల రేటు పడిపోతుండింది. ఫలితంగా, గుత్త పెట్టుబడిదారుల చేతుల్లో పెద్దఎత్తున పోగుపడిన పెట్టుబడిని విదేశాలలో మదుపు పెట్టడానికి నూతన మార్గాలు అవసరమయ్యాయి. అందువలన, 19వ శతాబ్దం చివరి పాదం నాటి సంక్షోభం నుండి బయటపడడానికి పెట్టుబడిదారీ విధానం అనుసరించిన మార్గం పెట్టుబడి ఎగుమతి.

పెట్టుబడిదారీ గుత్త సంస్థలు తమ సరుకులను, పెట్టుబడులను (ప్రత్యేకించి పెట్టుబడిని) విదేశీ మార్కెట్లకు/విదేశాలకు ఎగుమతి చేసే క్రమంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు వలసలుగా, అర్ధవలసలుగా, పరాధీన దేశాలుగా మారాయి. అయితే, సామ్రాజ్యవాద దేశాలు వెనకబడిన దేశాలపై దురాక్రమణ యుద్ధాలు చేసి వాటిని వలసలుగా మార్చుకోవడం ఆనాటి ప్రధాన ధోరణి. దీంతో ఆ దేశాల్లోని జాతి సమస్య సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట స్వభావాన్ని సంతరించుకున్నది.

యూరప్‌లో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఆవిర్భవించడానికి ముందే వర్తక పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు సాగిస్తుండింది. 17వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో బూర్జువా

విప్లవం జరిగిన కాలం నుండే పశ్చిమ యూరప్‌లోని అనేక దేశాలు - బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, హాలండ్ (నెదర్లాండ్), స్పెయిన్, పోర్చుగీసు, తూర్పు యూరప్ దేశమైన రష్యా ప్రపంచంలోని వెనుకబడిన దేశాలను తమకు వలసలుగా చేసుకున్నాయి. పెట్టుబడిదారీ విధానంలోని అభివృద్ధిని వెన్నంటి (మొదట వర్తక పెట్టుబడి దశ, ఆ తరువాత పారిశ్రామిక పెట్టుబడి దశ, చివరకు ద్రవ్య పెట్టుబడి దశ) పెట్టుబడిదారీ దేశాలు వలస దేశాల్లో తమ కార్యకలాపాల్ని సాగిస్తూ వచ్చాయి. స్థూలంగా 17వ శతాబ్దం నుండి 19వ శతాబ్దపు ఆరంభం దాకా వర్తక పెట్టుబడి కార్యకలాపాల ద్వారా, 19వ శతాబ్దపు తొలి సంవత్సరాల నుండి 20వ శతాబ్దపు ఆరంభం వరకు పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా, 20వ శతాబ్దపు ఆరంభం నుండి ద్రవ్య పెట్టుబడి ఎగుమతుల ద్వారా పెట్టుబడిదారీ దేశాలు, సామ్రాజ్యవాద దేశాలు వెనుకబడిన దేశాలను వలసలుగా, అర్ధ వలసలుగా, పరాధీన దేశాలుగా మార్చుకున్నాయి.

**వలసల కోసం-ప్రపంచ పునర్విభజన కోసం సాగిన రెండు ప్రపంచ యుద్ధాలు:**

1870ల నుండి పెట్టుబడిదారీ దేశాలు తమ వలసల విస్తరణను ఇంకా పెద్దఎత్తున సాగించాయి. 20వ శతాబ్దపు ప్రారంభం నుండి విస్తారమైన భూభాగాలను ఆక్రమించాయి. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదంగా పరిణమించడంతో వలసల కొరకు పోటీ మరింత తీవ్రతరమైంది. వలసలను ఆక్రమించుకోవడం ద్వారా బూర్జువా ప్రభుత్వాలు ముడి సరుకుల వనరులూ, తమ దేశాల పారిశ్రామిక సరుకులకు మార్కెట్లూ సంపాదించుకుని వాటి మీద గుత్తాధిపత్యం పొందడానికీ, పెట్టుబడి ఎగుమతికి అనుకూలమైన పరిస్థితులు నెలకొల్పడానికి ప్రయత్నించినాయి.

19వ శతాబ్దపు అంతం నాటికి దాదాపు భూగోళమంతా ఇంగ్లండ్, ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ, అమెరికా, రష్యా మధ్య పంపకమైంది. ప్రపంచ విభజనలో చిన్న పెట్టుబడిదారీ దేశాలు కూడా కొన్ని పాల్గొన్నాయి.

20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు బాగా తీవ్రరూపం దాల్చాయి. సామ్రాజ్యవాద యుగం ఆరంభంతో పెట్టుబడిదారీ విధానం 'శాంతియుతంగా' అభివృద్ధి చెందే దశ అంతమైంది. వలసల కోసం, ప్రపంచ పునర్విభజన కోసం సామ్రాజ్యవాద యుద్ధ పరంపర ప్రారంభమైంది. ఈ యుద్ధాల్లో భాగంగానే 1914-18 వరకు మొదటి ప్రపంచయుద్ధం సాగింది. 1918 నవంబరులో ఆస్ట్రో జర్మనీ కూటమి ఓటమితో, మిత్రమండలి (బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా) విజయంతో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసింది.

మొదటి ప్రపంచయుద్ధ కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో సార్వత్రిక సంక్షోభం ప్రారంభమైంది. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ నాయకత్వంలోని బోల్షెవిక్ పార్టీ సరైన ఎత్తుగడలతో ఆ సంక్షోభాన్ని ఉపయోగించుకుని రష్యాలో మహత్తర సోషలిస్టు విప్లవాన్ని

విజయవంతం చేసింది. రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతం కావడంతో అప్పటివరకు ప్రపంచమంతటిని ఆవరించిన ఏకైక ఆర్థిక వ్యవస్థగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ అంతరించి, దాని పక్కనే నూతన సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించింది.

మొదటి ప్రపంచయుద్ధం ముగిసినప్పటికీ సామ్రాజ్యవాద వ్యవస్థలోని పాత వైరుధ్యాలు సమసిపోలేదు, సరికదా కొత్త వైరుధ్యాలు తోడయినాయి. యుద్ధంలో గెలుపొందిన రాజ్యాలకూ, ఓడిపోయిన రాజ్యాలకు మధ్య వైరుధ్యాలు ఉత్పన్నమయ్యాయి.

20వ శతాబ్దం ఆరంభం నాటికి అమెరికా, జపాన్‌లు మహా శక్తులుగా బ్రిటన్, ఫ్రాన్సుల సరసన చేరాయి. జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, రష్యా అనే మూడు సామ్రాజ్యవాదశక్తులు తీవ్రంగా బలహీనపడడంతో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, జపాను అనే నాలుగు దోపిడీదారీ మహా శక్తులు ఆ యుద్ధం నుండి అవతరించాయి. మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా జర్మనీ ఘోరంగా బలహీనపడి, దాని భూభాగం మరియు వలసలు, గెలిచిన మహా శక్తుల మధ్య పంపకమయ్యాయి. కానీ, జర్మనీ ఆ నష్టాల నుండి త్వరలోనే కోలుకుని, మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఒక దశాబ్దం లోపలే ఒక మహా శక్తిగా తయారయింది.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభానికి ముందు ఇటలీతో సహా ఆరు మహా శక్తుల యుద్ధకాంక్షతో రెండు సైనిక కూటములుగా ఏర్పడ్డాయి (బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా ఒక కూటమిగా; జర్మనీ, ఇటలీ, జపాన్ మరో కూటమిగా ఏర్పడ్డాయి. ఆనాడు ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాతో సోషలిస్టు రష్యా ఐక్యసంఘటన కట్టింది). వీటిలో ప్రతి ఒక్క శక్తి, భూగోళంలో ఎక్కువ భాగాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నించడం వల్ల వినాశకరమైన రెండవ ప్రపంచ యుద్ధం బద్దలైంది. ఈ ప్రపంచ యుద్ధం ఫలితంగా దాదాపుగా ఈ శక్తులన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క అమెరికానే మహా శక్తిగా మిగిలిపోయింది.

రెండవ ప్రపంచ యుద్ధం ఫలితంగా పెట్టుబడిదారీ విధానంలో సార్వత్రిక సంక్షోభపు రెండవ దశ ప్రారంభమయింది. దీని ఫలితంగా అనేక దేశాలలో సోషలిజం విజయం సాధించి, సోషలిస్టు శిబిరం అవతరించింది, దాదాపు అన్ని పూర్వ వలసల్లో, అర్ధవలసల్లో సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష పాలన అంతరించి, దాని స్థానంలో నయా వలసవాదపు పాలనా రూపాలు ముందుకొచ్చాయి. దాంతో సామ్రాజ్యవాదం తీవ్రంగా బలహీనపడింది.

**నయా వలసవాదం:**

సామ్రాజ్యవాదం క్షీణిస్తూ, వ్యూహాత్మకంగా తిరోగమిస్తున్న దశలో తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి అది చేపట్టిన వలస విధానపు విలక్షణ నూతన రూపం నయా వలస

విధానం. ప్రత్యక్ష వలస పాలనను విడనాడకతప్పని స్థితిలో, ఆయా దేశాల్లో తామే ఎంచుకుని శిక్షణ ఇచ్చిన తొత్తులపై ఆధారపడి వలస పాలననూ, దోపిడీని కొనసాగించే కొత్త పద్ధతిని అనుసరించడమే నయా వలసవాదపు ఒక ముఖ్య లక్షణం. 'ఆర్థిక సహాయం', 'రుణం' తదితర రూపాల ద్వారా వారు ఈ దేశాలను తమ సరుకులకు మార్కెట్లుగా, ముడి పదార్థాల వనరులుగా, పెట్టుబడి ఎగుమతికి మార్గాలుగా ఉంచేసుకున్నారు. నయా వలసవాదపు దోపిడీ, నియంత్రణ కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాలేదు. సైనిక 'సహాయం', 'సహకారం', సలహాదారుల నియామకం వంటి వివిధ పద్ధతుల ద్వారా సైనిక విధానాల పైన కూడా తమ స్వంత పలుకుబడిని, దోపిడీని, అజమాయిషినీ నెలకొల్పుకున్నారు. మొత్తంగా చూస్తే, నయావలస వాదం వలసవాదపు మరింత వినాశకర రూపం; మరింత కపట రూపం.

1919లో, 1,800 మిలియనుల ప్రపంచ జనాభాలో 1,200 మిలియనులకు పైగా ప్రజలు (దాదాపు 70 శాతం) వలసలలో, నయా వలసలలో నివశిస్తుండేవారు. కానీ, 1966 నాటికి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రాంతాల్లో చాలా భాగంలో ప్రత్యక్ష వలస పాలన అంతమైపోయింది. దీంతో సామ్రాజ్యవాదం తీవ్రంగా బలహీనపడిపోయింది. దిగువున ఉదాహరించినటువంటి మూడు ప్రధాన రాజకీయ శక్తులూ కలిసి ప్రత్యక్ష వలస పాలనా పద్ధతికి స్వస్తి పలికాయి. అవి:

1. జాతీయ విముక్తి పోరాటాలకు పూర్తి మద్దతునిచ్చిన శక్తిమంతమైన సోషలిస్టు శిబిరం;
2. వలస, అర్ధవలస దేశాల్లో సాగుతుండిన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విముక్తి పోరాటాలు;
3. సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గ ఉద్యమాలు, శాంతి ఉద్యమాలు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ.

రెండవ ప్రపంచ యుద్ధం ఈ శక్తులు బలపడడానికి దోహదం చేసింది. అదే సమయంలో అది, మొత్తంగా సామ్రాజ్యవాదాన్ని బలహీనపరిచింది. సామ్రాజ్యవాదం తిరోగమించక తప్పనిస్థితిని కల్పించింది.

శతాబ్దాలుగా ప్రత్యక్ష వలస పాలన కింద వుండిన పీడిత దేశాలలోని అధిక భాగం రెండవ ప్రపంచ యుద్ధం తరువాతి రెండు దశాబ్దాలలో సామ్రాజ్యవాద ప్రత్యక్ష పాలన నుండి విముక్తిని పొందింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఒక దశాబ్దంలోనే సామ్రాజ్యవాద ప్రత్యక్ష పాలన నుండి ఆసియా బయటపడింది. రెండవ దశాబ్దంలో ఆఫ్రికాలో ప్రత్యక్ష వలస పాలన అంతమైంది. వివిధ సామ్రాజ్యవాద శక్తులు ఈ దేశాలను కొల్లగొట్టేందుకూ, దోపిడీ కొనసాగించేందుకూ భవిష్యత్ వ్యూహాలను తయారు చేసుకునేటప్పుడు ఈ దేశాల్లో బ్రహ్మాండంగా వృద్ధి చెందిన జాతీయ చైతన్యాన్ని పరిగణనలోకి తీసుకోవలసి వచ్చింది.

సామ్రాజ్యవాదులు, ఒకప్పటి తమ వలసలలో కార్యకలాపాలను కొనసాగించడానికి తమ

దోపిడీ పద్ధతులనూ ఆధిపత్య పద్ధతులనూ మెరుగుపరిచి విస్తృతపరచుకున్నారు. ఐరాస, ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్, గాట్ (తదనంతర కాలంలో ఇదే ప్రపంచ వాణిజ్య సంస్థ–డబ్ల్యుటీఓగా మారింది), యుఎస్ఎయిడ్, ఐడిఏ, ఏడిబి మొదలైన నూతనమైన సంస్థలను ఏర్పరచి నయా వలసవాద విధానాల్ని అమలు చేసారు.

వెనకబడిన దేశాలపై నయా వలసవాద దోపిడీకి టీఎన్సీలు, బహుళజాతి సంస్థలు (ఎమ్ఎన్సీలు) అత్యంత ప్రధానమైన సాధనంగా అవతరించాయి. జ్యూరిచ్‌లో స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ ప్రచురించిన రిపోర్టు ప్రకారం పిడికెడు గుత్తసంస్థలు యావత్తు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అదుపు చేస్తున్నాయి. కేవలం ఆరుగురు ధనాఢ్యుల చేతిలో ప్రపంచ జనాభాలో సగం మంది అంటే 360 కోట్ల మందికి ఉన్నంత సంపద పోగుబడి ఉంది.

బృహత్ బహుళజాతి సంస్థలు ప్రపంచ ప్రజల జీవితాలలోని సకల రంగాలను శాసించడం ప్రారంభమవడంతో, వెనకబడిన దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనకు అంతులేకుండా పోయింది. “21వ శతాబ్దంలో అమెరికా సైన్యం కుట్రపూరితంగా హొండూరస్, ఉక్రెయిన్, ఈజిప్టులలో సాగించిన సైనిక తిరుగుబాట్లలో; బ్రెజిల్‌లో పార్లమెంట్ కుట్ర; అమెరికా మిత్ర కూటమి 20 దేశాలలో కొనసాగించిన సైనిక జోక్యాల కారణంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా 3 కోట్ల 20 లక్షల మంది ముస్లిము ప్రజలు మరణించారు. ఆఫ్రికాలో సెక్యులర్, ధనిక దేశమైన లిబియాను ధ్వంసం చేసి, ఒకప్పుడు ప్రపంచంలో ప్రవాసులకు అత్యధికంగా ఆశ్రయాన్ని కల్పించిన ఆ దేశంలోని సగానికి పైగా జనాభాను నిరాశ్రయులను చేసారు. అమెరికా తన దేశంలోని ప్రజల సంక్షేమాన్ని సైతం పక్కన బెట్టి, పెరిగిపోయిన ఇజ్రాయిల్ ఖర్చులను పూడ్చేందుకు దీర్ఘకాల ప్రాతిపదికన 40 ట్రిలియన్ డాలర్లు చెల్లించడం, ముస్లిములను ఊచకోత కోయడం కోసం ట్రిలియన్ల (వందల వేల కోట్ల) డాలర్లను ‘వార్ ఆన్ టెర్రర్’ (వార్ ఆన్ ముస్లిమ్స్) పేరుతో ఖర్చు చేస్తూ పేదల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం వల్ల పేదరికంలో మగ్గుతున్న అమెరికా పౌరులే సంవత్సరానికి 17 లక్షల మంది మరణిస్తున్నారు” (డాక్టర్ గిడాన్ పోల్యా, అబద్ధాలకోరు–యుద్ధ నేరస్థుడు ఒబామా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో చివరి ఉపన్యాసం, సెప్టెంబర్ 24, 2016, 3వ పేజీ, 6వ అంశం).

ఆర్థిక దోపిడీకి సంబంధించి నయా వలసవాద దశలో సామ్రాజ్యవాదులు వెనకబడిన దేశాలపైన సాగించిన లూటీ, దోపిడీల స్థాయి వలసవాద కాలం నాటి లూటీ, దోపిడీలను ఎంతగానో మించిపోయింది. వెనకబడిన దేశాల భూమినీ, శ్రమనూ, సంపదనూ, వనరులనూ నిలువు దోపిడీ చేయడానికి సామ్రాజ్యవాదులు అసంఖ్యాకమైన పద్ధతులను ఉపయోగిస్తారు. వాటిలో ప్రధానమైనవి – అడ్డూఆపూ లేకుండా సామ్రాజ్యవాద సరుకులను, సర్వీసులను, ‘ఆర్థిక సహాయం’ తదితర పేర్లతో పెట్టుబడి మదుపులను ప్రవహింపజేయడం, సరుకుల

అసమాన మారకం, రుణాలపైన అధిక వడ్డీ రేట్లు, రుణాలకు షేర్ల బదిలీ, రాయల్టీలు, గుత్తాధిపత్య ధరలు, కరెన్సీ విలువ తగ్గింపు, ఎగుమతులపై దృష్టి పెట్టే వ్యూహం, ఆహార ధాన్యాల కోసం దిగుమతులపై ఆధారపడడం, ఆయుధాలపై విపరీతంగా ఖర్చు పెట్టించడం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, మేధోవలస.

నయా వలసవాదం లెక్కలేనన్ని మార్గాల ద్వారా వెనకబడిన దేశాల నుండి అత్యధిక గుత్త లాభాలను రాబడుతూనే ఉంది. 1950లలో, 1960లలో (70ల మధ్య వరకూ గల కాలంలో కూడా) వెనకబడిన దేశాల్లో వలసవాద, నయా వలసవాద దోపిడీకీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజా పోరాటాలు పెల్లుబికాయి. సోషలిస్టు దేశాల బలమూ, మద్దత్తుల కారణంగానూ, సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గమూ, ప్రజలూ చూపిన సౌహార్ద్రత కారణంగానూ ప్రజా విముక్తి పోరాటాల సంఘటిత బలం కారణంగానూ పీడిత ప్రజలు, జాతులు ఈ పోరాటాలలో కొన్ని గణనీయమైన విజయాలు కూడా సాధించారు. 1970 దశకం మధ్యలో, సామ్రాజ్యవాదం పెద్దఎత్తున వెనకబడిన దేశాలపై దాడికి దిగింది. 1970ల ప్రారంభం నుండి సామ్రాజ్యవాదం గొంతు లోతున సంక్షోభంలో కూరుకుపోవడం వలనా, ప్రపంచ మార్కెట్‌లో మరింత పెద్ద వాటా కోసం వివిధ సామ్రాజ్యవాద శక్తుల మధ్య కుమ్మక్కు, పోటీ వృద్ధి చెందడం వలనా వెనకబడిన దేశాలపైన వాటి దాడి తీవ్రతరమైంది. వెనకబడిన దేశాల్లోని తమ స్థానిక దళారీలపై, తొత్తు ప్రభుత్వాలపై ఆధారపడి సామ్రాజ్యవాదం ఆ దేశాల్లో ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులను పెంచేసింది.

నయా వలసవాదం, ప్రతి సామ్రాజ్యవాద శక్తికీ దోపిడీ చేయడానికి నూతన అవకాశాలను కల్పించింది. అంతేగాక, వెనకబడిన దేశాలను "ఉమ్మడిగా దోచుకోవడా"న్ని, అంటే, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ప్రపంచ వ్యాపార సంస్థ తదితర సామ్రాజ్యవాద సంస్థల ద్వారా వ్యక్తమయ్యే సమష్టి వలసవాదాన్ని సాధ్యం చేసింది. ఇది నయా వలసవాదపు ఒక విశిష్ట లక్షణం. ఈ సమష్టి వలసవాదం సామ్రాజ్యవాదం బలహీనపడడాన్నే సూచిస్తుంది. సర్వత్రా వృద్ధి చెందుతున్న సంక్షోభమూ, పడిపోతున్న లాభాల రేట్లూ కాలక్రమేణా వివిధ సామ్రాజ్యవాద శక్తుల మధ్యా, వాటి బహుళజాతి సంస్థల మధ్యా మరింత క్రూరమైన పోటీకీ, తీవ్రమైన ఘర్షణలకూ దారితీయడమే ఇందుకు నిదర్శనం.

**ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్):**

రెండవ ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాద క్యాంపుకి ఎదురులేని నాయకుడిగా ముందుకొచ్చిన అమెరికా సామ్రాజ్యవాదం సహాయంతో యుద్ధంలో నష్టపోయిన సామ్రాజ్యవాద దేశాలు (ముఖ్యంగా పశ్చిమ యూరప్ దేశాలు) 1950 దశాబ్దం మధ్య నాటికి యుద్ధపూర్వ ఉత్పత్తి స్థాయిల్ని అధిగమించాయి. వాటి ఆర్థిక వ్యవస్థలు దాదాపు రెండు దశాబ్దాల పాటు

అత్యంత వేగంగా విస్తరించి పెట్టుబడిదారీ విధానం పాక్షిక స్థిరత్వానికి దారితీసింది. కానీ అది శాశ్వతంగా నిలబడలేకపోయింది. 1973 నుండి సుదీర్ఘ మాంద్యంలోకి ప్రవేశించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిరంతరాయంగా విస్తరిస్తుంది అనే భ్రమ పటాపంచలయింది. వియత్నాం, కంపూచియా, లావోస్ జాతుల ప్రజలు సాగించిన వీరోచిత జాతి విముక్తి యుద్ధాలలో అమెరికా చిత్తుగా ఓడిపోవడం, ప్రపంచ పునర్విభజన కోసం పోటీదారుగా, అగ్రరాజ్యంగా ఆనాడు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం ఆవిర్భవించిన నేపథ్యంలో ఈ సంక్షోభం ముందుకు వచ్చింది.

1973లో ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం ప్రారంభమైన ఫలితంగా సామ్రాజ్యవాద దేశాలలో పెట్టుబడి వస్తువులకు (కాపిటల్ గూడ్స్) డిమాండ్ క్షీణించింది. పెట్టుబడి వస్తువులకు మార్కెట్ కల్పించేలా, ఈ సంక్షోభాన్ని పరిష్కరించడం కోసం సామ్రాజ్యవాదం 1980ల, 1990ల నుండి ఉత్పత్తి అంతర్జాతీయీకరణలో భాగంగా ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) విధానాల్ని అనుసరించింది. ఇది రెండవ ప్రపంచ యుద్ధానాంతరం కాలం నుండి సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న నయావలస విధానంలో భాగమే. అయితే సామ్రాజ్యవాదం 1946–80 మధ్య నయా వలసవాదంలో భాగంగా అనుసరించిన విధానాలకు, 1980ల నుండి, మరీ ముఖ్యంగా రష్యా అగ్రరాజ్యం పతనమయిన 1990ల ప్రారంభం నుండి అనుసరిస్తున్న ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) విధానాలకు తేడా వుంది. అప్పటి వరకు కీనీషియన్ ఆర్థిక విధానాలను అనుసరించిన సామ్రాజ్యవాదులు 1990ల ప్రారంభం నుండి స్వేచ్ఛాయుత మార్కెట్ విధానాలను ప్రవేశపెట్టారు. ఈ ప్రపంచీకరణ విధానంతో అంతర్జాతీయ రంగంలో మౌలిక వైరుధ్యాలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి.

## ప్రపంచ కార్మికవర్గంపైనా, పీడిత ప్రజలపైనా, పీడిత జాతులపైనా ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) ప్రభావం:

1990ల ప్రారంభం నుండీ, దాదాపు అన్ని ప్రభుత్వాలూ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ అన్న కీనీషియన్ విధానం స్థానంలో హేక్, మిల్టన్ ఫ్రీడ్‌మాన్‌ల వంటి నయా–ఉదారవాద మితవాదుల స్వేచ్ఛాయుత మార్కెట్ విధానాలను ప్రవేశపెట్టాయి. 1950లు, 1960లలో గుత్త సంస్థలు అపారమైన మిగులును సంచయనం చేయడానికి కీనీషియన్ విధానాలు ఉపయోగపడ్డాయి. కానీ, 1970ల సంక్షోభంతో ఈ పరిస్థితి మారిపోయింది. అంతర్జాతీయ కార్పొరేషన్లు, ఫైనాన్షియల్ స్పెక్యులేటర్ల దృష్టిలో ఆ విధానాలు తాము మరింతగా సంచయనం సాగించడానికి ప్రతిబంధకమైనవిగా మారాయి. ఏ విధమైన నియంత్రణా చట్రమైనా వారికి ఊపిరి సలపనివ్వనిదిగా మారిపోయింది, వారి ప్రపంచవ్యాప్త కార్యకలాపాలకు ఆటంకంగా మారిపోయింది. పైగా, పూర్తి ఉద్యోగిత కల్పించాలన్న కీనీషియన్ విధానం (దానికి పరిమితులున్నప్పటికీ) చౌకగా శ్రమశక్తిని సంపాదించడాన్ని మరింత కష్టతరం చేసింది. కార్మికుల బేరమాడగల సామర్థ్యాన్ని దెబ్బతీసి, చౌకగా శ్రమశక్తిని పొందడానికి వీలుగా ఒక విశాలమైన

నిరుద్యోగ రిజర్వు సైన్యాన్ని సృష్టించడం కోసం స్వేచ్ఛాయుత మార్కెట్ విధానాలు వారికి అవసరమయ్యాయి.

ఈ స్వేచ్ఛాయుత మార్కెట్ విధానాలూ, ఐఎమ్ఎఫ్, ప్రపంచబ్యాంకులచే రుద్దబడిన వ్యవస్థాపరమైన సర్దుబాట్ల కార్యక్రమాలూ ప్రపంచంలోని విశాల ప్రజానీకంలో, పీడిత జాతులలో ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, రోగాలను పెద్దయెత్తున వ్యాపింపజేశాయి.

సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికులు వేతనాల కోతలకు, పనిలో వేగం పెంపుదలకు, రిట్రెంచ్‌మెంట్లకు, సంక్షేమ చర్యల రద్దుకు వ్యతిరేకంగానూ, తమ హక్కుల పునరుద్ధరణ కోసమూ తీవ్రంగా పోరాడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

వెనుకబడిన దేశాలతోపాటు, ప్రపంచవ్యాప్తంగా మధ్యతరగతి ప్రజల జీవన స్థితిగతులు కూడా పెద్దఎత్తున దిగజారుతున్నాయి. కాంట్రాక్టు కార్మికులూ, పార్ట్‌టైమ్ ఉద్యోగులూ నేడు అన్ని వెనుకబడిన దేశాల, పారిశ్రామిక దేశాల సాధారణ లక్షణంగా మారిపోయారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) వల్లా, పెట్టుబడిదారీ దేశాల్లో బూర్జువా వర్గానికీ కార్మికవర్గానికీ నడుమ వైరుధ్యం; సామ్రాజ్యవాదానికీ పీడిత ప్రజలకు, పీడిత జాతులకు నడుమ వైరుధ్యం తీవ్రతరమవుతున్నాయి.

1980ల నుండి సామ్రాజ్యవాదం అనుసరించిన ప్రపంచీకరణ విధానాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో కనివిని ఎరగని ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని సృష్టించాయి. దీంతో చాలా పరిశ్రమలు మూతపడి లక్షలాది కార్మికులు నిరుద్యోగులుగా మారారు. లక్షలాది మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు. సామ్రాజ్యవాద దేశాలు కాపిటల్ గూడ్స్, ఆయుధాలు, విలాస వస్తువులు తయారు చేసి ఈ దేశాలకు అమ్మి విపరీతంగా లాభాలు పోగు చేసుకుంటున్నాయి. సామ్రాజ్యవాదులు సమాచార సాంకేతిక పరిజ్ఞానం మీద తమకు గల సంపూర్ణ గుత్తాధిపత్యంపై ఆధారపడి వెనకబడిన దేశాల్లో సాంస్కృతిక దాడిని తీవ్రతరం చేసారు. దీనితో స్థానిక సంస్కృతులు నాశనమై సామ్రాజ్యవాద విష సంస్కృతి ప్రభావం పెరుగుతోంది. ప్రపంచీకరణ విధానాల అమలుతో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకించి వెనకబడిన దేశాల్లో ఆర్థిక, రాజకీయ, సామాజిక-సాంస్కృతిక, ఆహార, నీటి, చమురు, పర్యావరణ సంక్షోభాలు తీవ్రతరమవుతున్నాయి.

2వ ప్రపంచ యుద్ధానంతర కాలం నుండి ఇప్పటి వరకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల పీడిత జాతులు, ప్రజలు చేసిన వీరోచిత పోరాటాల ఫలితంగా అమెరికా అగ్రరాజ్యం బలహీనపడింది, రష్యా అగ్రరాజ్యం పతనమయ్యింది. ఇందులో ప్రత్యేకించి వియత్నాం, లావోస్, కంపూచియా జాతి విముక్తి పోరాటాలకు, అఫ్ఘనిస్తాన్, ఇరాక్ జాతి విముక్తి పోరాటాలకు విశేష స్థానముంది.

ఈ పోరాటాలన్నీ, సామ్రాజ్యవాద దేశాలలో సైతం మిలిటెంటు కార్మికవర్గ పోరాటాలను రాజుకోవడానికి తోడ్పడుతున్నాయి. పెట్టుబడి అంతర్జాతీయాకరణ క్రమం ప్రపంచ స్థాయిలో కార్మికవర్గ పోరాటాలను నిర్మించవలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నది. ప్రపంచ సోషలిస్టు విప్లవంలోని రెండు ప్రవాహాల మధ్య – సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గ ఉద్యమాలకూ, వెనకబడిన దేశాలలోని సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక జాతీయ ప్రజాస్వామిక విప్లవాలకూ మధ్య ఐక్యతకు గల వస్తుగత పునాదిని అది దృఢతరం చేస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయాకరణ వలన ఏర్పడే అనుకూల విప్లవ పరిస్థితిని ఉపయోగించుకోవడం ప్రపంచ కార్మికవర్గపు కర్తవ్యం.

పెట్టుబడిదారీ విధానం స్వేచ్ఛాయుత పోటీ దశలోనయినా, సామ్రాజ్యవాద దశలోనయినా, వలసవాద కాలంలోనయినా, ప్రస్తుత నయా వలసవాద కాలంలోనయినా అది శ్రామిక వర్గాన్ని, వెనుకబడిన జాతులను, వెనుకబడిన దేశాలను దోపిడి పీడనలకు గురి చేస్తూనే ఉంది. సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా సాగిస్తున్న శ్రమ దోపిడీ, వనరుల దోపిడీ, జోక్యందారీ విధానాలు, దురాక్రమణ యుద్ధాల ఫలితంగా పీడిత ప్రజలు, పీడిత జాతులు పరాధీనతకు, దారిద్ర్యానికీ, ఆకలిచావులకూ, రోగాలకూ, ఆత్మహత్యలకూ గురవడమే కాకుండా తమ స్వంత భూభాగాల నుండి, దేశాల నుండి విస్థాపితులవుతున్నారు. దీంతో పీడిత జాతులు, ఆదివాసీ సముదాయాలు తమ అస్థిత్వాన్ని, అస్మితను (గుర్తింపు/ఐడెంటిటీ), ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నాయి. ఈ స్థితిలో సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్య అంటే అది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే.

సామ్రాజ్యవాద యుగం ఆరంభమయినప్పటి నుండి ప్రపంచ పీడిత ప్రజల, జాతుల, పీడిత దేశాల విముక్తి కోసం మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్, స్టాలిన్, మావోలు ఎప్పటికప్పుడు తమ సమకాలీన ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలను గుర్తిస్తూ, వాటి ఆధారంగా ప్రపంచ విప్లవ సాధారణ పంథాను రూపొందిస్తూ వచ్చారు. 1917 నాటి రష్యన్ అక్టోబర్ విప్లవం నుండి మొదలుకొని 1973లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ 10వ కాంగ్రెస్ వరకు మార్క్సిస్టు మహోపాధ్యాయులు, పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్య గల వైరుధ్యం వల్లా తలెత్తే కార్మికవర్గ పోరాటాలనూ; సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులకూ, ప్రజలకు మధ్య గల వైరుధ్యం వల్ల తలెత్తే జాతీయ విముక్తి ఉద్యమాలను/జాతీయ ప్రజాస్వామిక ఉద్యమాలను సమైక్యం చేస్తూ ప్రపంచ సోషలిస్టు విప్లవ సాధారణ పంథానూ రూపొందించి, దాని అమలు కోసం కృషి చేశారు. ఫలితంగా రష్యా, చైనాలు సోషలిస్టు దేశాలుగా ఉనికిలో ఉన్న కాలాల్లో వాటి మద్దతుతో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోని కొన్ని దేశాలు, జాతులు, ప్రజలు సామ్రాజ్యవాద దోపిడీ, పీడనల నుండి విముక్తిని సాధించాయి.

## జాతుల సమస్యపై మార్క్సిస్టు మహోపాధ్యాయుల బోధనలు

ఇంగ్లండ్‌లో, 17వ శతాబ్దంలో బూర్జువా విప్లవం, 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం జరిగిన ఫలితంగా సమాజంలో రెండు నూతన మౌలిక సామాజిక వర్గాలు–పారిశ్రామిక బూర్జువా వర్గం, పారిశ్రామిక కార్మికవర్గం–అవతరించాయి. ఈ బూర్జువా విప్లవాలను, పారిశ్రామిక విప్లవాలను వెన్నంటి మొదట యూరప్, అమెరికాల్లో పెట్టుబడిదారీ సమాజాలు, జాతి రాజ్యాలు ఏర్పడ్డాయి. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారే క్రమంలో పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా విస్తరించే క్రమంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు వలసలుగా, అర్ధ వలసలుగా మారి అక్కడ కూడా బూర్జువావర్గం, కార్మికవర్గం తలెత్తాయి.

పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి ఒక సామాజిక ప్రక్రియ. కానీ, కార్మికుల శ్రమశక్తి ఫలితాలను ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగిన పెట్టుబడిదారులు అనుభవిస్తారు. దీంతో పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తికి గల సామాజిక స్వభావానికీ, యాజమాన్యపు వ్యక్తిగత స్వభావానికీ మధ్య వైరుధ్యం తలెత్తుతుంది. ఇది పెట్టుబడిదారీ విధానంలో మౌలిక, వైషమ్యపూరిత వైరుధ్యం. ఈ వైరుధ్యం పెట్టుబడిదారీ వర్గాన్ని, కార్మికవర్గాన్ని పరస్పరం శాశ్వత శత్రు వర్గాలుగా నిలబెడుతుంది. అందుకే ఆ రెండు వర్గాల ప్రాపంచిక దృక్పథాలే వేర్వేరుగా ఉంటాయి.

కార్మికవర్గ మహోపాధ్యాయులు కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని అందించినప్పటి నుండి (1848 ఫిబ్రవరిలో కమ్యూనిస్టు ప్రణాళిక విడుదలయినప్పటి నుండి) కార్మికవర్గం తన విముక్తి కోసం శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతంతో సాయుధం అయింది.

కమ్యూనిస్టు ప్రణాళిక రాసింది మొదలుకొని మార్క్స్, ఎంగెల్స్‌లు, తదనంతర కాలంలో లెనిన్, స్టాలిన్, మావోలు చేసిన వివిధ రచనల ద్వారా పీడిత జాతుల సమస్య అంతిమంగా వర్గ సమస్యేననీ, కార్మికవర్గ నాయకత్వంలో పీడిత వర్గాల విముక్తి ద్వారానే జాతుల విముక్తి సాధ్యమవుతుందని చెప్పారు. మార్క్స్, ఎంగెల్స్‌ల నుండి మొదలుకుని మావో వరకు గడచిన కాలంలో జాతుల సమస్య గురించి, వివిధ రూపాల గురించి, వాటిలోని సమస్యల గురించి, వాటి పరిష్కారం గురించి వారు చేసిన బోధనలు సంక్షిప్తంగా ఇలా ఉన్నాయి.

ఏ సాంఘిక సమస్యనైనా కూడా నిర్దిష్టమైన చారిత్రక చట్రం లోపల పరిశీలించాలి అన్నది మార్క్సిస్టు సిద్ధాంతానికి సంబంధించిన నియమం. అలాగే, ఆ సమస్య ఏ ప్రత్యేక దేశానికైనా సంబంధించినదైతే (ఉదాహరణకు ఒక దేశపు జాతీయ కార్యక్రమం) అదే చారిత్రక దశలో ఇతర దేశాల నుంచి ఆ దేశాన్ని వేరు చేసే నిర్దిష్ట లక్షణాలేమిటో పరిశీలించి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ నియమం ప్రకారం జాతుల సమస్యకు సంబంధించిన చరిత్రను మూడు దశలుగా

విభజించవచ్చు.

**మొదటి దశ:** మొదటి దశ పెట్టుబడిదారీ విధానపు తొలిదశకు సంబంధించినది. ఈ దశలో భూస్వామ్య విధానాన్ని నిర్మూలించడం ద్వారానే పెట్టుబడిదారీ విధానం విజయం పొందింది. ఆ విజయం మహత్తరమైన విప్లవాల ద్వారానే సాధ్యపడింది. ఆ విప్లవాల క్రమంలోనే జాతులు యేర్పడ్డాయి. అంతేకాదు, ఆ క్రమంలోనే కేంద్రీకృత రాజ్యాలుగా జాతి రాజ్యాలు కూడా రూపొందాయి. తూర్పు యూరప్‌లో ఏర్పడిన బహుళజాతి రాజ్యాలు జాతుల అణచివేతకు జన్మస్థానమయ్యాయి.

**రెండవ దశ:** రెండవ దశ పశ్చిమ దేశాల్లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం మార్కెట్టును విస్తరింపజేసుకోవడానికీ, ముడి సరుకులు, ఇంధనం, చౌక శ్రమశక్తి మొదలగు వాటిపై ఆధిపత్యాన్ని సంపాదించుకోవడానికి వలస రాజ్యాలను సంపాదించుకోవడంలో పరస్పరం పోటీ పడుతున్న యుగానికి సంబంధించినది. ఇదే 20వ శతాబ్దంతో ఆరంభమైన సామ్రాజ్యవాద యుగం. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలకు సంబంధించిన దేశాలన్నీ అభివృద్ధి చెందిన కొన్ని పీడక దేశాలకు వలస దేశాలుగా మారిపోయాయి. అప్పటి నుండి జాతుల సమస్య సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ ఉద్యమంలో విడదీయరాని భాగమైంది.

**మూడవదశ:** మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధానంతరం రష్యాలో విజయవంతమైన సోషలిస్టు విప్లవంతో ఈ మూడవ దశ ఆరంభమౌతుంది. ఆ విప్లవం అచట పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించింది. జాతుల నిర్బంధాన్ని అంతరింపజేసింది. ప్రతి జాతికి విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారాన్ని గుర్తించింది. ఆ విధంగా ఎలాంటి నిర్బంధానికీ తావు లేని వివిధ జాతుల స్వచ్ఛంద యూనియన్ అచట యేర్పడింది. తద్వారా జాతుల నిజమైన స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛాయుత అభివృద్ధికి లెనిన్ ఊహించిన 'వివిధ జాతులకు చెందిన ప్రపంచ ప్రజల స్వచ్ఛంద సమూహా'నికి ప్రాతిపదిక ఏర్పడిందని చెప్పవచ్చు. ఈ మూడవ దశ నుండి జాతుల సమస్య ప్రపంచ సోషలిస్టు విప్లవంతో విడదీయరాని భాగమైంది.

**జాతుల సమస్య – మార్క్స్–ఎంగెల్స్:**

పెట్టుబడిదారీ విధానపు తొలిదశకు చెందిన కాలంలో మార్క్స్–ఎంగెల్స్‌లు వలసల జాతుల సమస్యను అధ్యయనం చేశారు. పశ్చిమ యూరప్‌లో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాల దశ 1789–1871 మధ్య సాగింది. ఇది జాతీయోద్యమాలు సాగిన, జాతి రాజ్యాలు ఏర్పడిన దశ. ఈ కాలంలోనే మార్క్స్–ఎంగెల్స్‌లు సాధారణంగా వలసల, జాతుల సమస్య గురించి, నిర్దిష్టంగా ఐరిష్ సమస్య గురించి తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు అణచబడ్డ జాతుల విముక్తి పోరాటాల గురించి, ప్రపంచ విప్లవ క్రమంపై వాటి ప్రభావం గురించి, జాతి విముక్తి ఉద్యమానికి, అంతర్జాతీయ కార్మికోద్యమానికీ

మధ్య సంబంధం గురించి, మెట్రోపాలిటన్ దేశాల కార్మికవర్గం తమ దేశాల ప్రభుత్వాల వలస విధానాల పట్ల కలిగి ఉండే వైఖరి గురించి, విప్లవంలో కార్మికవర్గ మిత్రుల గురించీ శాస్త్రీయంగా విశ్లేషించారు. వలసలపై పెట్టుబడిదారీ దేశాల పాలన ఆ వెనకబడిన దేశాలలో సంస్కృతి, నాగరికతల వ్యాప్తిని సుగమం చేస్తుందని, తద్వారా ఆ వలస పాలన వలస దేశాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్న బకూనినిస్టుల వాదనలను వారు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. "ఇతర జాతుల నణచివేసే జాతి తన సంకెళ్లను తానే తయారు చేసుకుంటుంది" అని మార్క్స్ బకూనినిస్టులతో చర్చలో పేర్కొన్నాడు.

"పెట్టుబడిదారీ విధానపు సంస్కృతిని వ్యాపింపజేసే కార్యక్రమం"గా బెర్న్‌స్టీన్ వలసవాదాన్ని సమర్థించడాన్ని మొదటి ఇంటర్నేషనల్ తోసిపుచ్చింది.

పీడిత ప్రజలు తమ విముక్తి కోసం పోరాడే చారిత్రక హక్కును మార్క్స్, ఎంగెల్స్ సమర్థించారు. తమ విముక్తి కోసం ఐరిష్ ప్రజలు సాగిస్తున్న పోరాటానికి మద్దతునివ్వవలసిందిగా ఇంగ్లండు కార్మికవర్గానికి, అంతర్జాతీయ కార్మికోద్యమానికీ వారు పిలుపునిచ్చారు. "ఇంగ్లాండులో కార్మికవర్గం అధికారంలోకి వస్తే ఐరిష్ పాలనను కూలదోయవచ్చని నేను చాలాకాలంగా నమ్మాను. అయితే ఇది తద్విరుద్ధంగా జరుగుతుందని లోతైన అధ్యయనం ద్వారా గ్రహించాను. ఐర్లాండును వదిలించుకునే వరకు ఇంగ్లాండు కార్మికవర్గం ఏమీ సాధించజాలదు. కీలకమైన మీట ఐర్లాండులో నొక్కాలి. అందుకనే మొత్తం సామాజిక ఉద్యమానికి ఐరిష్ సమస్య అంత ప్రాముఖ్యత కలిగినది"

(మార్క్స్, మార్క్స్–ఎంగెల్స్ సెలెక్టెడ్ కరెస్పాండెన్స్, ఇంగ్లీషు ప్రతి, పేజీ–218).

జాతి విముక్తి పోరాటాలకూ సోషలిస్టు విప్లవానికీ మధ్య గల సంబంధాన్ని మార్క్స్, ఎంగెల్స్ గుర్తించారు. "రివల్యూషన్ ఇన్ చైనా అండ్ ఇన్ యూరప్" (చైనాలోను యూరప్‌లోనూ విప్లవం) అన్న వ్యాసంలో మార్క్స్ ఇలా అన్నాడు : "వింతగానూ అసంబద్ధంగానూ అనిపించవచ్చు గానీ యూరపు ప్రజల తదుపరి తిరుగుబాటూ, గణతంత్ర స్వేచ్ఛ కోసం, ఆర్థిక వ్యవస్థకోసం లేదా ప్రభుత్వం కోసం వారి తదుపరి ఉద్యమమూ ప్రస్తుత ఏ ఇతర రాజకీయ కారణంపై కంటే కూడా, యూరపుకు పూర్తి విరుద్ధమైన చైనా (celestial–చైనా సామ్రాజ్యానికి పాత పేరు) సామ్రాజ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల మీద ఆధారపడి ఉండవచ్చు" (మార్క్స్ –ఎంగెల్స్ రచనలు, ఇంగ్లీషు ప్రతి, 12వ సంపుటి, పు.98).

'సైనికులు, ధనం పెద్దఎత్తున అవసరం అవుతున్నందువల్ల', భారతదేశంలోని తిరుగుబాటు బ్రిటన్ కార్మికవర్గ పోరాటానికి దోహదపడే వస్తుగత అంశంగా మారిందని 1858 జనవరిలో ఎంగెల్స్‌కు రాసిన ఉత్తరంలో మార్క్స్ పేర్కొన్నాడు.

ఎంగెల్స్ జీవించి ఉన్న సమయంలోనే సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో వలసవాదాన్ని

సమర్థించే ధోరణి క్రమంగా వ్యాప్తి చెందసాగింది. వలసల నుంచి లభించే లాభాలతో యావత్తు ఐరోపా కార్మికవర్గం మరింతగా అభివృద్ధి చెందుతుందన్న అభిప్రాయం ప్రాచుర్యం పొందింది. స్టట్‌గార్డ్ కాంగ్రెస్ నాటికి రెండవ ఇంటర్నేషనల్‌లో ఈ ధోరణి బలపడింది. డచ్ సోషల్ డెమోక్రాట్ వాన్‌కోల్ ప్రతిపాదించిన "సోషలిస్టు వలస విధానా"న్ని ఆ కాంగ్రెస్ తిరస్కరించింది. అయితే ఆ తీర్మానానికి అనుకూలంగా 108 ఓట్లు వచ్చాయనేది గమనార్హం (వ్యతిరేకంగా 128 వోట్లు వచ్చాయి). పెట్టుబడిదారీ వలసవాదం వెనకబడిన అనాగరిక దేశాలలో విప్లవోద్యమాలను పురోగమింపజేస్తుందని ఈ సోషలిస్టు వలసవాదులు వాదించారు.

1864 సెప్టెంబర్ 26న లండన్‌లో జరిగిన వివిధ దేశాల కార్మికుల మహాసభలో ఒక అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నేషనల్) ఏర్పడింది. అది, తన కార్యక్రమంలో, సకల దేశాల కార్మికులు సాధించవలసిన రెండు కర్తవ్యాలను చెప్పింది. ఒకటి, ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యం రద్దు చేయడం, రెండు, విప్లవ పద్ధతుల ద్వారా అధికారం స్వాధీనం చేసుకునే లక్ష్యంతో కార్మికవర్గ పార్టీని నిర్మించడం.

ఇంగ్లీషు వలసవాదుల పెత్తనం నుండి ఐరిష్ రైతుల విమోచన కొరకు, స్వతంత్ర విప్లవ ప్రజాతంత్ర పోలండు కొరకు మొదటి ఇంటర్నేషనల్ పోరాడింది. మార్క్స్ అనేక వ్యాసాల్లో అన్ని రకాల వలస దోపిడీని బట్టబయలు చేశాడు. మొదటి ఇంటర్నేషనల్ వలస యుద్ధాలను దృఢంగా వ్యతిరేకించింది. అమెరికాలో బానిసత్వం రద్దు కావాలని కోరింది. ఇంటర్నేషనల్ స్థాపనకు పూర్వమే అమెరికన్ అంతర్యుద్ధంలో ఇంగ్లిష్ బూర్జువావర్గ జోక్యానికి వ్యతిరేకంగా మార్క్స్, ఇంగ్లిష్ కార్మికులు పోరాడారు.

మార్క్స్ మరణానంతరం 1889 జులై 14న ఎంగెల్స్ నాయకత్వంలో రెండవ ఇంటర్నేషనల్ ఏర్పడింది. అయితే అది ఏర్పడిన కొద్ది కాలానికే 1895లో ఎంగెల్స్ మరణించాడు. దీంతో రెండవ ఇంటర్నేషనల్‌లో అవకాశవాదుల కార్యకలాపాలు ఆధిక్యతలోకి వచ్చాయి. సామ్రాజ్యవాద దశలో తమకు లభించే అధిక లాభాల్లో నుండి కొంత భాగాన్ని కార్మికవర్గంలోని పై తరగతికి, ట్రేడ్ యూనియన్ నాయకులకు లంచాల రూపంలో, మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించే రూపంలో బూర్జువా వర్గం అందజేయడం ప్రారంభించింది. దీంతో కార్మికవర్గంలో అవకాశవాదం తలెత్తింది. బూర్జువా వర్గం నుండి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం సార్వత్రిక రాజకీయ సమ్మె, సాయుధ తిరుగుబాటు మొదలైన పోరాట పద్ధతులకు బదులు, పార్లమెంటరీ పద్ధతులే కార్మికవర్గానికి ప్రధాన పోరాట పద్ధతులని రెండవ ఇంటర్నేషనల్‌లోని అవకాశవాద పార్టీలు ప్రచారం చేయడం ప్రారంభించాయి. దీంతో రెండవ ఇంటర్నేషనల్‌లోని అత్యధిక పార్టీలు విప్లవ పార్టీల స్వభావాన్ని కోల్పోయి సంస్కరణవాద, రివిజనిస్టు పార్టీలుగా మారిపోయాయి. ఇవి సామ్రాజ్యవాద వకాల్తాదారీ పార్టీలుగా, వలస పీడన వకాల్తాదారీ పార్టీలుగా దిగజారిపోయాయి.

**జాతుల సమస్య–లెనిన్:**

లెనిన్, స్టాలిన్‌లు సామ్రాజ్యవాద యుగంలో జాతుల, వలసల సమస్యను అధ్యయనం చేసి కార్మికవర్గం అనుసరించాల్సిన వైఖరిని ప్రకటించారు. వాళ్ళు సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్యపై కార్మికవర్గం అనుసరించాల్సిన వైఖరితో పాటు, అక్టోబర్ విప్లవ విజయంతో ఆరంభమయిన ప్రపంచ సోషలిస్టు విప్లవ దశలో భాగంగా జాతుల సమస్యను ఎలా పరిష్కరించాలనేది కూడా ప్రకటించి సోషలిస్టు రష్యాలో జాతుల సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

సామ్రాజ్యవాద యుగంలో, ప్రపంచ సోషలిస్టు విప్లవ దశలో జాతుల సమస్యపై, వలసలపై కార్మికవర్గం అనుసరించాల్సిన వైఖరుల గురించి లెనిన్, స్టాలిన్‌లు చెప్పిన విషయాలు నేటికి ప్రపంచ కార్మికవర్గానికి మార్గదర్శకంగా ఉంటాయి.

రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాద, రివిజనిస్టు శక్తుల ఆధిపత్యంలో ఉన్న రోజుల్లో ఇతర అన్ని రాజకీయ సమస్యలపై అనుసరించినట్లుగానే అది జాతుల సమస్యపై తప్పుడు వైఖరిని అనుసరించింది.. రెండవ ఇంటర్నేషనల్‌లో బెర్న్‌స్టీన్, మిటెరాండ్ తదితరుల నాయకత్వంలోని అవకాశవాదానికి వ్యతిరేకంగా లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్‌లు మాత్రమే రాజీలేని పోరాటం చేశారు.

సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు తీవ్రమవుతున్న పరిస్థితుల్లో 1912 నవంబరులో బాసెల్‌లో రెండవ ఇంటర్నేషనల్ మహాసభ జరిగింది. సామ్రాజ్యవాద యుద్ధంలో సోషల్ డెమోక్రాట్ల పాత్ర గురించి ఈ మహాసభ చర్చించింది. ఆ మహాసభ యుద్ధ వ్యతిరేక ప్రణాళికను రూపొందించింది. యుద్ధ నివారణకు తమ సర్వశక్తులు ఒడ్డి పోరాడాలని సకల దేశాల కార్మికులను ఆ ప్రణాళిక ఉద్బోధించింది.

కానీ, మొదటి సామ్రాజ్యవాద ప్రపంచయుద్ధం చెలరేగినపుడు రెండవ ఇంటర్నేషనల్ నాయకుల్లో అధిక భాగం కార్మికవర్గానికి సంపూర్ణంగా ద్రోహం చేసి తమ తమ దేశాల బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు మద్దతునిచ్చే వైఖరి తీసుకున్నారు. ప్రపంచ యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే ఇంగ్లండ్, ఫ్రాన్సు, జర్మనీ, ఆస్ట్రియా–హంగరీ, బెల్జియంల సోషలిస్టు పార్టీల నాయకులు ఈ అన్యాయమైన యుద్ధంలో పెట్టుబడిదారీ 'మాతృదేశాన్ని రక్షించాలనే' వైఖరిని అనుసరించారు. ఈ అవకాశవాద పార్టీలు కార్మికవర్గ అంతర్జాతీయతకు ద్రోహం చేసి బూర్జువా వర్గంతో కలసినాయి, అందుకే వాళ్లకు జాతీయ దురహంకార సోషలిస్టులు అని పేరు వచ్చింది. లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ ఒక్కటే యుద్ధానికి కారణమైన సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడానికి 'సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి' అనే పిలుపునిచ్చింది.

మొదటి ప్రపంచ యుద్ధం కొనసాగుతున్న రోజుల నుండి లెనిన్ అవకాశవాదులు లేని నూతన కార్మికవర్గ ఇంటర్నేషనల్ నిర్మించడానికి ఎంతో శ్రమించాడు. జర్మనీలోనూ, ఇతర దేశాల్లోనూ సోషల్ డెమోక్రటిక్ పార్టీల్లో క్రమంగా విప్లవ బృందాలు ఏర్పడినాయి. ఆ బృందాలు జాతీయ దురహంకార సోషలిస్టుల ద్రోహపూరిత విధానాలతో పోరాడి, చివరకు వాళ్ళతో తెగతెంపులు చేసుకున్నాయి.

యుద్ధ కాలంలో స్విట్జర్లాండ్‌లో అంతర్జాతీయవాదుల మహాసభలు రెండు జరిగాయి. మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణానికి అవి తొలి చర్యలు. రష్యాలో సోషలిస్టు విప్లవం తర్వాత 1919 మార్చి 2-6 తేదీల మధ్య లెనిన్ నాయకత్వంలో తన మొదటి కాంగ్రెస్‌లోనే మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడింది.

యుద్ధంలో దిగిన అన్ని దేశాల్లోనూ 1916 చివరి నాటికి ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు తలెత్తాయి. దీన్ని ఆసరా చేసుకుని లెనిన్ నాయకత్వంలో రష్యాలో 1917 అక్టోబరు 25న (కొత్త కాలండర్ ప్రకారం నవంబర్ 7న) మహత్తర సోషలిస్టు విప్లవం విజయవంతమైంది.

అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం మానవ చరిత్రలో ఒక నూతన యుగాన్ని ప్రవేశపెట్టింది. అది మనిషి మీద మనిషి సాగించే దోపిడీని సంపూర్ణంగా నిర్మూలించి, సకల దోపిడీ వర్గాలనూ తొలగించేందుకు కృషి జరిగే యుగం.

అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవపు బలీయమైన ప్రభావం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని శ్రామిక ప్రజల మీద పడడమే కాకుండా అది మొత్తం సామ్రాజ్యవాదాన్నే కుదిపివేసింది. సామ్రాజ్యవాద ఆధిపత్య కేంద్రాలైన "మాతృదేశాల"లో మాత్రమే కాదు, వలస దేశాల్లోనూ, పరాధీన దేశాల్లోనూ కూడా అది సామ్రాజ్యవాద పరిపాలనను బలహీనపరిచింది.

1913లో స్టాలిన్, జాతుల సమస్యపైన మొట్టమొదటిసారిగా క్రమ పద్ధతిలో మార్క్సిస్టు విశ్లేషణ చేశాడు. ఆయన జాతిని "ఒకే భాష, ఒకే భూభాగం, ఒకే ఆర్థిక జీవితం, ఉమ్మడి సంస్కృతిగా వ్యక్తమయ్యే మానసికత పునాదిగా ఏర్పడిన చారిత్రకంగా రూపొందిన స్థిర ప్రజా సముదాయం"గా నిర్వచించాడు (స్టాలిన్, మార్క్సిజం-జాతుల సమస్య, ఇంగ్లీషు ప్రతి, 2వ వాల్యూం, పేజీ-307).

స్టాలిన్ వ్యాసం ప్రచురించబడిన తరువాత వలసలకు, అర్ధవలసలకు వర్తించే సిద్ధాంతాన్ని లెనిన్ అభివృద్ధి చేయడం ప్రారంభించాడు. 1914 ఫిబ్రవరి-మే మధ్య కాలంలో జాతుల స్వయంనిర్ణయాధికార హక్కుపై లెనిన్ ఒక వ్యాసాన్ని రాశాడు. ఆ తరువాత మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ మహాసభ కొరకు జాతుల, వలసల సమస్యల గురించిన ప్రధానాంశాల ప్రాథమిక ముసాయిదాను 1920 జూన్‌లో రాశాడు. దీనినే జాతుల, వలసల సమస్యపై లెనిన్ థీసిస్ అని కూడా అంటారు. అదే సంవత్సరం ఆగస్టులో జాతుల, వలస సమస్యలపై కమిషన్

నివేదికను రాశాడు. ఈ ముఖ్యమైన రచనలతో పాటు, లెనిన్, స్టాలిన్‌లు జాతుల సమస్యపై ఎన్నో రచనలు చేశారు.

**జాతుల స్వయంనిర్ణయాధికార హక్కు:** మొట్టమొదట కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమస్యపై తన విధానాన్ని (పాలసీని) రూపొందించుకునే విషయం గురించి లెనిన్ చెబుతూ – బూర్జువా ప్రజాస్వామ్యాన్ని ఎదిరించి దాని కుహనా (ఫాల్స్‌నెస్); వంచననూ బట్టబయలు చేసే మౌలిక కర్తవ్యానికి అనుగుణంగా, బూర్జువా శృంఖలాల విచ్ఛిత్తి కొరకు పోరాడే కార్మికవర్గానికి ఛాంపియన్‌గా ప్రకటించుకున్న (avowed champion) కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమస్య మీద అనిర్దిష్ట లాంఛనప్రాయ సూత్రాల మీద ఆధారపడి తన విధానాన్ని రూపొందించుకోగూడదని, ఆ విధానాన్ని నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల మీద అంచనాపై, ఆర్థిక పరిస్థితుల మీద అంచనాపై ఆధారపడి రూపొందించుకోవాలనీ; కార్మికవర్గ ప్రయోజనాలకు, పాలకవర్గ ప్రయోజనాలకు మధ్య గల భేదం మీద ఆధారపడి, పీడిత, పరాధీన జాతులకూ పీడక, దోపిడీ చేసే జాతుల మధ్య గల భేదం మీద ఆధారపడి రూపొందించుకోవాలని అన్నాడు.

పీడిత జాతి విడిపోయే హక్కును సమర్థించడమే కార్మికవర్గపు సరైన వైఖరనీ, దానిని తిరస్కరించడమంటే బూర్జువా వర్గ విధానానికి లోబడడమేనని లెనిన్ స్పష్టంగా చెప్పాడు. స్వయంనిర్ణయాధికార హక్కు అంటే విడి రాజ్యంగా ఉండే హక్కు మాత్రమే అని కాకుండా ఇతరత్రా అని భాష్యం చెప్పడం తప్పని లెనిన్ ఖండించాడు.

ప్రపంచంలో ఎక్కడయినా కమ్యూనిస్టులు పీడిత జాతుల స్వయంనిర్ణయాధికార హక్కును నిర్ద్వంద్వంగా సమర్థించాలని చెబుతూ, ప్రపంచంలోని ఏ దేశంలోనయినా పీడిత జాతి, పీడక జాతి–ఈ రెండు జాతులలోని కార్మికవర్గం తమ వర్గ శత్రువులకు వ్యతిరేకంగా ఐక్యమై పోరాడాలనీ, అప్పుడే బూర్జువా సంకుచిత జాతీయవాదానికి బలికాకుండా కార్మికవర్గ అంతర్జాతీయవాదంతో ప్రపంచ కార్మికవర్గం ఐక్యమై పోరాడగలుగుతుందని లెనిన్ స్పష్టంగా చెప్పాడు.

"ఏదెలా ఉన్నా, వేతన కార్మికుడు దోపిడీకి గురవుతూనే ఉంటాడు. దోపిడికి వ్యతిరేకంగా జరిపే పోరాటం విజయవంతం అవ్వాలంటే కార్మికవర్గం జాతీయవాదాన్ని వదిలించుకోవాలి, ఆ మాటకొస్తే, వివిధ దేశాల బూర్జువా వర్గాల మధ్య సర్వాధికారం కోసం జరుగుతున్న పోరాటంలో పూర్తి తటస్థంగా ఉండాలి. ఏ ఒక దేశపు కార్మిక వర్గమైనా తన "సొంత" జాతీయ బూర్జువా వర్గపు విశేష హక్కులకు ఏ కొంచెం తోడ్పాటునిచ్చినా, అది ఇంకో దేశపు కార్మికవర్గంలో విధిగా అపనమ్మకాన్ని ఉత్పన్నం చేస్తుంది. అది కార్మికుల అంతర్జాతీయ వర్గ సంఘీభావాన్ని సడలింపజేసి, వాళ్లని చీల్చి, బూర్జువా వర్గానికి సంతోషం కలిగిస్తుంది. జాతుల స్వయంనిర్ణయాధికార హక్కు లేక విడిపోయే హక్కును తిరస్కరించడమంటే, ఆచరణలో విధిగా

అర్థం, ఆధిపత్య జాతి విశేష హక్కులకు తోడ్పాటు ఇవ్వడమే"

(లెనిన్ సంకలిత రచనలు, సంపుటి–20, పేజీ–424).

కార్మికవర్గ అంతర్జాతీయతను అనుసరించి విడిపోయే హక్కు పట్ల పీడిత జాతిలోని కార్మికవర్గం పీడకజాతిలోని కార్మికవర్గంతో ఐక్యతను కోరుకోవాలనీ, పీడకజాతిలోని కార్మికవర్గం పీడిత జాతి విడిపోయే హక్కును సమర్థించాలని లెనిన్ చెప్పాడు. పీడిత జాతి కార్మికవర్గం, పీడక జాతి కార్మికవర్గం అనుసరించే ఈ వైఖరిలో వైరుధ్యం లేదని, కార్మికవర్గ అంతర్జాతీయతను అనుసరించి ఈ వైఖరిని చేపట్టాలని లెనిన్ చెప్పాడు.

"పీడించే దేశాల్లో కార్మికవర్గం అంతర్జాతీయతత్వం అలవర్చుకోవాలంటే పీడింపబడు దేశాలకు విడిపోయే స్వేచ్ఛ ఉండాలనే డిమాండుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలా చేయకపోతే అంతర్జాతీయతత్వం అలవడదు....

"మరోవైపు పీడిత జాతికి చెందిన డెమోక్రాటు తన ఆందోళనలో రెండవ అంశానికి అనగా వివిధ జాతులు 'ఐచ్ఛికంగా సమైక్యత చెందా'లనే అంశానికి ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది. అతడు అంతర్జాతీయవాదిగా తన విధులను నిర్వర్తిస్తూనే తన జాతి యొక్క రాజకీయ స్వాతంత్ర్యానికై పాటు పడవచ్చు .... అతడు జాతీయ సంకుచితతత్వానికి, ఒంటెత్తు ధోరణికి వ్యతిరేకంగా పోరాడడమవసరం. తన ఒక్క జాతి పొందవలసిన ప్రయోజనాల కంటే అన్ని జాతులూ పొందవలసిన ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.

"కొందరు ఈ సమస్యను సమగ్రంగా పరిశీలించక పీడించే దేశాల్లోని సోషల్ డెమోక్రాట్ల వైఖరికి, పీడిత దేశాల్లోని సోషల్ డెమోక్రాట్ల వైఖరికి "వైరుధ్యం" ఉన్నట్లు భావిస్తారు. విడిపోవడానికి స్వేచ్ఛ ఉండాలంటూ సామ్రాజ్యవాద దేశాల్లో సోషల్ డెమోక్రాట్ల "ఆందోళనకు", కలిసి ఉండడం మంచిదని పీడిత దేశాల వారు చేసే "ఆందోళనకూ" వైరుధ్యం లేదా? అని వారంటారు. కాని కొంచెం లోతుగా ఆలోచిస్తే అట్టి వైరుధ్యం లేదని, ఉండడానికి అవకాశమేలేదని స్పష్టమవుతుంది. ఒకానొక పరిస్థితి నుంచి "అంతర్జాతీయతత్వానికి" సమస్త జాతుల సమైక్యతకు పురోగమించాలంటే ఆ గమ్యస్థానం చేరుకోవాలంటే మరొక మార్గం లేదని, ఉండడానికి అవకాశం లేదని మనం తెలుసుకోగలుగుతాం"

(లెనిన్ సంకలిత రచనలు, రష్యన్ కూర్పు, సంపుటి–19, పేజీ–261).

జాతుల స్వయంనిర్ణయాధికారం గురించి లెనిన్ పైన చెప్పిన విషయాలను సంక్షిప్తంగా చెప్పాలనుకుంటే –

- రాజకీయంగా విడిపోవడానికి, స్వతంత్ర రాజ్య ఏర్పాటుకూ ఏ జాతికైనా హక్కు ఉంటుంది.

- ఇది ఆర్థిక స్వాతంత్ర్యానికి సంబంధించిన సమస్యే కానవసరం లేదు.
- ఇది కార్మికవర్గ మొత్తం ప్రయోజనాలకు లోబడి ఉండాలి.
- విడిపోయే హక్కు విడిపోయే జాతికి మాత్రమే వర్తిస్తుంది తప్ప ఆధిపత్య జాతికి కాదు.
- విడిపోయే హక్కును ఎత్తిపడుతున్నామంటే అర్థం కార్మికవర్గం ప్రతీ సందర్భంలోనూ విడిపోయే హక్కును గుర్తిస్తుందని కాదు.
- పీడక జాతి కార్మికవర్గం పీడిత జాతి విడిపోయే హక్కును ఎత్తిపట్టాలి, పీడిత జాతి కార్మికవర్గం ఐక్యం కావాలనే ఆకాంక్షను కలిగి ఉండాలి.
- స్వయంనిర్ణయాధికార హక్కును బేషరతుగా ఎత్తిపట్టాలి. ఈ హక్కు అమలుకు ఎటువంటి ముందు షరతులూ ఉండరాదు. ఉదాహరణకు, బూర్జువా నాయకత్వం, రైతాంగ భాగస్వామ్యం లేకపోవడం మొదలైన వాటి గురించి మాట్లాడడం స్వయంనిర్ణయాధికార హక్కును నిరాకరించడమే అవుతుంది.
- పీడిత జాతుల విడిపోయే హక్కును కార్మికవర్గం ఏ పరిస్థితులలో సమర్థించాలి? ఏ ప్రాతిపదికన సమర్థించాలనే విషయంపై లెనిన్ మార్గదర్శకత్వాన్ని సంక్షిప్తంగా చెప్పుకుంటే–
    - విడిపోయే హక్కు జాతి స్వయంనిర్ణయాధికార హక్కులో అంతర్భాగం. అయితే ఈ హక్కు అమలును కార్మికవర్గం ఎప్పుడు ఏ పునాది మీద సమర్థించాలి?
    - కార్మికవర్గం విడిపోయే హక్కును బేషరతుగా ఎత్తిపడుతుంది. అయితే కార్మికవర్గ విప్లవ పురోగమనానికి ఉపయోగపడినప్పుడు మాత్రమే విడిపోయే డిమాండ్‌ను సమర్థిస్తుంది.
    - ఒక ప్రత్యేక సందర్భంలో ఒక ప్రత్యేక జాతి విడిపోవడం పీడక జాతి కార్మికవర్గానికి లాభదాయకంగా లేకపోయినా కూడా విడిపోవడం గురించి మరోసారి ఆలోచించమని పీడక జాతి కార్మికవర్గం పీడిత జాతి కార్మికవర్గానికి విజ్ఞప్తి మాత్రమే చేయాలి కానీ పీడిత జాతి మీద తమ ఇష్టాన్ని రుద్దే ఎటువంటి ప్రయత్నాన్నయినా వ్యతిరేకించాలి. విజ్ఞప్తి చేసినప్పటికీ పీడిత జాతి విడిపోవడం గురించి నిశ్చయంగా ఉన్నప్పుడు పీడక జాతి కార్మికవర్గం తమ లక్ష్యం నిర్ణయించుకోవడానికి ఆ జాతికి ఉన్న హక్కును ఎత్తిపట్టాలి. ఇటువంటి వైఖరి మాత్రమే కార్మికవర్గ ఐక్యతకు హామీ ఇస్తుంది.
    - కాబట్టి విడిపోయే హక్కును కేవలం విడిపోవాలని కోరుకునే జాతి మాత్రమే పొందాలి, ఇతరులు కాదు.

- పీడిత జాతి కార్మికవర్గం విడిపోవడం కోసము, అందుకు వ్యతిరేకంగా జరిగే ప్రచారంపైనా పోరాడే తమ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాలి, అమలు చేయాలి. మరో మాటలో చెప్పాలంటే బూర్జువా వర్గం నుంచీ తన స్వతంత్రాన్ని నిలబెట్టుకోవాలి. ఇంతేకాక, పీడిత జాతి కార్మికవర్గం విడిపోవడం కోసం పోరాడే క్రమంలో పీడక జాతి కార్మికవర్గంతో ఐక్యత కోసం ఎల్లప్పుడూ ప్రచారం చేయాలి.
- జాతి సమస్య పట్ల పీడిత జాతి కార్మికవర్గం స్వతంత్ర వైఖరి అవలంబించి జాతి పీడనకు వ్యతిరేకంగా పోరాడితేనే విడిపోయే సమస్య గురించిన దాని వైఖరి, పోరాటం ప్రజల మీద ఆచరణయుత ప్రభావం వేయగలుగుతుంది.
- అంతేకాక, పీడక జాతి కార్మికవర్గం దృఢంగా, నిరంతరంగా పీడిత జాతుల స్వయంనిర్ణయాధికారం కోసం పోరాడినప్పుడు మాత్రమే విడిపోవద్దని పీడిత జాతికి విజ్ఞప్తి చేసే నైతిక హక్కు కలిగి ఉంటుంది. అప్పుడు మాత్రమే పీడిత జాతి కార్మికవర్గం, ప్రజలూ ఎటువంటి ద్వేషాలకూ తావులేకుండా ఇటువంటి వినతిని స్వీకరించగలుగుతారు.
- అంటే పీడక, పీడిత జాతుల కార్మికవర్గాలు జాతి సమస్య పట్లా, విడిపోయే ప్రత్యేక సమస్య పట్ల ఉమ్మడి విధానం, ఐక్య వైఖరి కలిగి ఉంటాయి.
- విడిపోయే విధానం విషయంలో పీడక జాతి పట్ల పీడిత జాతి అపనమ్మకంతో నిండిపోయినప్పుడు, పీడిత జాతి బూర్జువా వర్గం ప్రజలపై చూపిస్తున్న ప్రభావాన్ని పీడిత జాతి కార్మికవర్గం అడ్డుకోలేనప్పుడూ 'తరువాత ఐక్యం కావడానికి ఇప్పుడు విడిపోవడం' అనేదాన్ని గురించీ మాట్లాడుతూ లెనిన్ ఐక్యత కంటే విడిపోవడం మంచిదంటాడు.

ప్రపంచవ్యాప్తంగా జాతీయ పీడనా, అసమనత్వాలూ రద్దు కావాలంటే సకల జాతుల, సకల దేశాల కార్మికులు సమైక్యమై పోరాడాలని లెనిన్ చెప్పాడు. "జాతుల, వలసల సమస్య మీద కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మొత్తం విధానమంతా భూస్వాములనూ, బూర్జువాలనూ కూలదోసే సమైక్య విప్లవ పోరాటం కొరకు సకల జాతుల, సకల దేశాల కార్మికుల, శ్రామిక ప్రజల సన్నిహిత సమైక్యత మీద ఆధారపడాలి. ఇలా అయినప్పుడే పెట్టుబడిదారీ వ్యవస్థ మీద విజయం నిస్సందేహంగా లభిస్తుంది. ఈ విజయం లేకుండా జాతీయ పీడనా, అసమానత్వమూ రద్దు కావడం అసాధ్యం." (లెనిన్ ఏరిన రచనలు, సంపుటి-8, పేజీ-143).

రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతమైన తర్వాత ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా జాతుల సమస్యలను పరిష్కరించుకోవాలనీ, దాని కోసం సోవియట్ రష్యాతో ప్రపంచంలోని జాతీయ విమోచనా, వలస విమోచనా ఉద్యమాలన్నీ పొత్తు సాధించగల విధానాన్ని

అనుసరించడం అవసరమని లెనిన్ చెప్పాడు.

"ప్రస్తుతం వివిధ జాతుల శ్రామిక ప్రజల సన్నిహిత సమైక్యతా అవసరాన్ని కేవలం గుర్తించడమో, ప్రకటించడమో చాలదు. సోవియట్ రష్యాతో జాతుల విమోచనా, వలసల విమోచనా ఉద్యమాలన్నీ సన్నిహిత పొత్తు సాధించగల విధానాన్ని అనుసరించడం అవసరం."
(పై పుస్తకమే, పేజీ-143).

నూతనంగా ఉనికిలోకి వచ్చిన సోవియట్ రిపబ్లిక్కులు సామ్రాజ్యవాద దాడిలో దెబ్బతినకుండా ఉండాలంటే సోవియట్ రష్యాతో ప్రపంచంలోని జాతుల విమోచనా, వలసల విమోచనా ఉద్యమాలన్నీ సన్నిహిత పొత్తు సాధించడం అవసరమని లెనిన్ బలంగా చెప్పాడు.

"మొదటిది, మొత్తం ప్రపంచంలోని సామ్రాజ్యవాద రాజ్యాల చేత, మిలిటరీ దృష్ట్యా అనంత బలసంపన్నమైన వాటిచే చుట్టుముట్టబడిన సోవియట్ రిపబ్లిక్కులు అత్యంత సన్నిహితమైన పొత్తు లేకుండా బతకడం సాధ్యం కాదు. రెండవది, సోవియట్ రిపబ్లిక్కుల మధ్య సన్నిహిత ఆర్థిక కూటమి అవసరం. ఇది లేకుండా సామ్రాజ్యవాదం చేత విచ్ఛిన్నం చేయబడిన ఉత్పత్తి శక్తులను యథాస్థితికి తేవడమూ, శ్రామిక ప్రజల సంక్షేమాన్ని సందేహరహితం చేసుకోవడమూ సాధ్యం కాదు."
(పై పుస్తకమే, పేజీ-144).

మాటలలో అంతర్జాతీయతను గుర్తిస్తూనే, చేతలలో - ప్రచారంలోనూ, ఆందోళనలోనూ, కార్యాచరణలోనూ - పెటీబూర్జువా జాతీయతనూ, శాంతివాదాన్ని అనుసరించే పెటీబూర్జువా జాతీయతా సిద్ధాంతాన్ని తిరస్కరిస్తూ, కమ్యూనిస్టులు అనుసరించాల్సిన అంతర్జాతీయత గురించి లెనిన్ ఈ విధంగా చెప్పాడు, "కార్మికవర్గ అంతర్జాతీయత, మొదట, ఒక దేశంలోని కార్మిక పోరాటపు ప్రయోజనాలు ప్రపంచ స్థాయిలోని కార్మికవర్గపు పోరాట ప్రయోజనాలకు లోబడి ఉండాలనీ డిమాండ్ చేస్తుంది. రెండవది, బూర్జువా వర్గం మీద విజయం పొందుతున్న జాతి అంతర్జాతీయ పెట్టుబడిని కూలదోయడానికి మహోన్నత జాతీయ త్యాగాలు చేయగలిగి ఉండాలనీ, చేయడానికి సిద్ధపడాలనీ డిమాండ్ చేస్తుంది. కనుక, పూర్తి పెట్టుబడిదారీ దేశాలుగా ఉన్నట్టి, నిజంగా శ్రామికవర్గ అగ్రగామి దళంగా పనిచేసే కార్మిక పార్టీలు ఉన్నట్టి దేశాలలో, అంతర్జాతీయతా భావానికీ, అంతర్జాతీయతా విధానానికీ కట్టుబడి ఉంటూ అవకాశవాదులు, పెటీబూర్జువా శాంతివాదులూ కల్పించే వికృత రూపాలతో పోరాడడం ముఖ్యమైన, ప్రాథమిక కర్తవ్యం."
(పై పుస్తకమే, పేజీ-145).

వెనకబడిన దేశాల జనాభాలో అత్యధిక భాగం రైతాంగమే ఉంటుంది కాబట్టి అక్కడి జాతీయోద్యమాలను నడిపే కమ్యూనిస్టు పార్టీలు ఫ్యూడలిజపు సకల రూపాలకు వ్యతిరేకంగా పోరాడాలనీ, రైతు ఉద్యమంతో స్పష్టమైన సంబంధాలు పెట్టుకుని, ఆ ఉద్యమాలకు అండదండలు ఇవ్వాలని లెనిన్ చెప్పాడు. వలస దేశాల బూర్జువా వర్గం ఒక వైపు ఆ దేశాల్లో జాతీయోద్యమాల్ని

బలపరుస్తూనే సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో సహకరిస్తుంటుందని, అందుకోసం ఆ దేశాల జాతి విముక్తి ఉద్యమాలు విప్లవకరంగా ఉన్నప్పుడు మాత్రమే సంస్కరణవాద బూర్జువావర్గంతో సహకరిస్తూనే, దానితో తప్పక పోరాటం కూడా చేయాలని లెనిన్ చెప్పాడు.

"వెనుకబడిన దేశాలలో, భూస్వాములకు వ్యతిరేకంగా, విస్తృత భూ యాజమాన్యానికి వ్యతిరేకంగా, ఫ్యూడలిజపు సకల రూపాలకూ, సకల అవశేషాలకూ వ్యతిరేకంగా జరిగే రైతు ఉద్యమాలకు ప్రత్యేక సహాయం ఇవ్వాలి; రైతు ఉద్యమాలకు ప్రగాఢ విప్లవ స్వభావం సమకూర్చడానికి ప్రయత్నించాలి. తూర్పులో, ప్రపంచంలో వలసలలోనూ, వెనుకబడిన దేశాలలోనూ ఉన్న విప్లవ రైతు ఉద్యమాలకూ, పశ్చిమ యూరోపియన్ కమ్యూనిస్టు కార్మికవర్గానికీ సాధ్యమైనంత సన్నిహిత కూటమి ఏర్పడడానికి కృషి చేయాలి. పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలు ఉన్న దేశాలలో సోవియట్ వ్యవస్థ మౌలిక సూత్రాలు వర్తింపజేయడానికి ("శ్రమజీవుల సోవియట్లు" నెలకొల్పడం, వగైరాల ద్వారా) సకల ప్రయత్నాలూ చేయడం ప్రత్యేకంగా అవసరం."

(పై పుస్తకమే, పేజీ–146).

"వలస దేశ బూర్జువా వర్గానికీ, పీడక దేశ బూర్జువా వర్గానికీ మధ్య కొంత అన్యోన్యత ఉంటున్నది. అనేక సందర్భాలలో బహుశా, అత్యధిక సందర్భాలలో కూడా–జాతీయ ఉద్యమాల్ని బలపరుస్తూనే ఉన్న పీడిత దేశ బూర్జువా వర్గం, మరోవైపున, సామ్రాజ్యవాద బూర్జువావర్గంతో సహకరిస్తూ ఉంటుంది. అనగా, సమస్త విప్లవోద్యమాలకూ, సమస్త విప్లవ వర్గాలకూ భిన్నంగా సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో కలిసి కృషి చేస్తుంటుంది. ... కనుక, ఈ భేదాన్ని గమనించి, దాదాపు అన్ని సందర్భాల్లోనూ "బూర్జువా ప్రజాతంత్ర" అనే మాటకు బదులు "జాతీయ విప్లవ" అనే పదాన్ని వాడటం ఒక్కటే సరైన పని అని మేము నిశ్చయించినాము. ఈ మార్పు ప్రాముఖ్యం ఏమిటంటే, మనం, కమ్యూనిస్టులుగా, వలస దేశాల బూర్జువా విమోచన ఉద్యమాలను బలపరచేది ఎప్పుడంటే, బలపరచి తీరవలసింది ఎప్పుడంటే, అవి నిజంగా విప్లవకరంగా ఉన్నప్పుడు మాత్రమే, రైతాంగానికీ, పీడిత జన సామాన్యానికీ మనం విప్లవతత్వంలో శిక్షణ ఇచ్చి సమీకరించే కృషికి ఆ ఉద్యమకర్తలు అడ్డుపడకుండా ఉన్నప్పుడు మాత్రమే. ఈ పరిస్థితులు లేనప్పుడు, వలస దేశాల కమ్యూనిస్టులు సంస్కరణవాద బూర్జువా వర్గంతో తప్పక పోరాటం చేయాలి". (పై పుస్తకమే, పేజీ–181, 182).

మానవాళి, పీడిత జాతులన్నీ సంపూర్ణంగా విముక్తి చెందాలంటే ఏ జాతికి ఆ జాతి విడిపోయి ఏకాకిగా ఉండడం కాకుండా, జాతుల ఏకీకరణ జరగాలని లెనిన్ చెప్పాడు, అయితే ఆ ఏకీకరణ స్వేచ్ఛాయుత ఏకీకరణగా ఉండాలన్నాడు. అయితే ఈ జాతుల విలీనాన్ని సాధించడం జాతులను బలవంతంగా విలీనం చేయడం ద్వారా జరిగేది కాదు. అవి పూర్తి స్వాతంత్ర్యాన్ని పొంది స్వచ్ఛంధమైన యూనియన్‌గా విలీనం కావడం ద్వారా మాత్రమే అది సాధించబడుతుంది.

ఆధునిక పెట్టుబడిదారీ మార్కెట్ అభివృద్ధిలో భాష కీలకమైన పాత్ర పోషించిందని చెప్పిన లెనిన్, అన్ని జాతులు సమానంగా అభివృద్ధి చెందాలంటే ఏ ఒక్క భాషకూ ప్రత్యేక హోదాను కల్పించకూడదనీ, అన్ని భాషలకూ సమాన హక్కును కల్పిస్తూ, అన్ని భాషలనూ అభివృద్ధి చేయాలనీ, దానికై రిపబ్లిక్కుల రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా దాన్ని పొందుపరచాలనీ చెప్పాడు. "....అది సమస్త జాతుల, భాషల సంపూర్ణ సమానత్వానికి గ్యారంటీ ఇచ్చే; ఒక్క భాషనే తప్పనిసరి అధికార భాషగా గుర్తించని; యావత్తు స్థానిక భాషలలో ప్రజలకు విద్యా బోధన చేసే పాఠశాలలను నెలకొల్పే; ఒక్క జాతికే ప్రత్యేక సదుపాయాలు ఇవ్వకుండా, ఏ జాతీయ మైనారిటీల హక్కులను ఏ విధంగానూ కాలరాయకుండా నివారించే మౌలిక చట్టంతో కూడిన రాజ్యాంగం  స్థిరమైన, సంపూర్ణమైన ప్రజాస్వామిక గణతంత్ర వ్యవస్థలో మాత్రమే నెలకొంటుంది" (లెనిన్, సంకలిత రచనలు, సంపుటి-19, పేజీ-427).

సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్యను విశ్లేషించిన లెనిన్, సామ్రాజ్యవాదాన్ని కూలదోయడం కోసం పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గ పోరాటాలు, వలస, పరాధీన దేశాల్లోని వలసవాద వ్యతిరేక, జాతీయ విముక్తి ఉద్యమాలు రెండూ కలిసి ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యసంఘటనగా ఏర్పడి పోరాడాలనే ప్రపంచ సోషలిస్టు ఉద్యమపు సాధారణ పంథాను రూపొందించాడు. ఇది వలసల, జాతుల సమస్యల్లో లెనిన్ రూపొందించిన కీలకమైన విధానం.

**జాతుల సమస్య-స్టాలిన్:**

మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్, స్టాలిన్ ఇద్దరూ సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్యను విశ్లేషించి, ఆ సమస్యపై కార్మికవర్గ ఎత్తుగడలను రూపొందించారు. వారు పెట్టుబడిదారీ దేశాల్లోని/సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గానికి, వెనుకబడిన దేశాల్లోని పీడిత జాతులకు ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదాన్ని కూలదోసేందుకు పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గం పీడిత జాతుల, పరాధీన దేశాల స్వాతంత్రోద్యమాలను దృఢ నిశ్చయంతో సమర్థించాలని చెప్పారు. 1917 అక్టోబర్ రష్యా విప్లవ విజయం తరువాత జాతుల సమస్యను ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా చూడాలని స్టాలిన్ చెప్పాడు. ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయం కోసం కార్మికవర్గం సామ్రాజ్యవాదాన్ని బలపరిచే, దాన్ని కాపాడే జాతీయోద్యమాలకు సహాయం చేయకూడదనే స్పష్టతను స్టాలిన్ కల్పించాడు. వలస, అర్ధవలస, పరాధీన దేశాల జాతీయ ఉద్యమాల పట్ల కార్మికవర్గ అంతర్జాతీయత సూత్రంపై ఆధారపడి పీడక దేశాల కార్మికవర్గం అనుసరించే వైఖరినీ, పీడిత దేశాల కార్మికవర్గం అనుసరించాల్సిన వైఖరిని 1925లో స్టాలిన్ మరింత స్పష్టంగా రూపొందించాడు.

"పీడిత దేశాల స్వాతంత్రోద్యమాలలో విప్లవ అవకాశాలెన్నో ఉన్నాయని లెనినిజం గుర్తిస్తుంది.

ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసేందుకు ఈ అవకాశాలను ఉపయోగించుకోవచ్చునని అది చెబుతుంది. ఈ విషయంలో లెనినిజం చెప్పేది సరైనదని సామ్రాజ్యవాదపు అభివృద్ధి, సామ్రాజ్యవాద యుద్ధం, రష్యన్ విప్లవం రుజువు చేసాయి.

"అందుచేత కార్మికవర్గం పీడిత జాతుల, పరాధీన దేశాల స్వాతంత్రోద్యమాలను ప్రత్యక్షంగా దృఢనిశ్చయంతో బలపరచవలసి ఉంది.

"అయితే, దీని అర్థం ప్రతి జాతీయోద్యమాన్ని, ప్రతి దేశంలోనూ, ప్రతిసారీ, ప్రతి సందర్భంలోనూ బలపరచాలని కాదు, సామ్రాజ్యవాదాన్ని బలహీనపరచే, దాన్ని కూలదోసే జాతీయోద్యమాలకు మాత్రమే సహాయం చేయాలి. అంతేగాని సామ్రాజ్యవాదాన్ని బలపరిచే, దాన్ని కాపాడే జాతీయోద్యమాలకు సహాయం చేయకూడదు. ఒక్కొక్కప్పుడు కొన్ని పీడిత దేశాల్లో జాతీయోద్యమం కార్మికోద్యమపు పురోభివృద్ధికి వ్యతిరేకంగా పరిణమించవచ్చు. అట్టి సందర్భాలలో దానికి సహాయం చేయడం అసంభవం. వివిధ జాతులకు సంబంధించిన హక్కుల సమస్యకూ, ఇతర సమస్యలకూ సంబంధం చాలా ఉంది. కార్మిక విప్లవమనే అసలు సమస్యలో అదొక భాగం. అందుచేత అసలు సమస్య కంటే దాని ప్రాధాన్యత తక్కువ. అసలు సమస్యను దృష్టిలో ఉంచుకుంటూ దాన్ని పరిశీలించాలి.

"ఈ దృక్పథంతోనే మొత్తం మీద జాతీయోద్యమాల విప్లవ స్వభావాన్ని కూడా అంచనా వేయవలసి ఉంటుంది. కొన్ని జాతీయోద్యమాలు ఆయా ప్రత్యేక పరిస్థితుల్లో అభివృద్ధి నిరోధక స్వభావాన్ని కలిగియున్నట్లే జాతీయోద్యమాలలో అత్యధిక భాగం ఆయా ప్రత్యేక పరిస్థితుల్లో విప్లవ స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఒకానొక జాతీయోద్యమం విప్లవకరమైనదని మనమన్నప్పుడు ఆ ఉద్యమంలో కార్మిక శక్తులున్నాయని గానీ, విప్లవకరమైన రిపబ్లిక్ కార్యక్రమం దానికున్నదని గానీ, ప్రజాతంత్ర సూత్రాలపై అది ఆధారపడియుందని గానీ అర్థం కాదు. ఉదాహరణకు అఫ్ఘనిస్తాన్ స్వాతంత్ర్యం కొరకు ఆ దేశపు అమీర్ సాగిస్తున్న పోరాటం అక్కడి పరిస్థితుల దృష్ట్యా ఒక విప్లవ పోరాటం. అతని భావాలు రాచరిక భావాలే కావచ్చు. కాని ఆ పోరాటం సామ్రాజ్యవాదాన్ని బలహీనపరిచేది, విచ్ఛిన్నం చేసేది, కూలద్రోసేది కాబట్టి అది విప్లవ పోరాటమే. కానీ సామ్రాజ్యవాద యుద్ధం జరుగుతున్నప్పుడు 'దుస్సాహసులైన' ప్రజాతంత్ర వాదులు, "సోషలిస్టులు", "విప్లవకారులు", "రిపబ్లికన్‌లు" చేసిన పోరాటం మాత్రం అభివృద్ధి నిరోధక పోరాటం. కెరెన్‌స్కీ, ట్సెరిటెలీ, రెహడెల్, షీడ్మన్, షెర్నోవ్, డావ్, హెండర్సన్, క్లయిన్స్‌లు సాగించిన పోరాటం ఇలాంటిదే. కారణమేమంటే, వారి పోరాటం సామ్రాజ్యవాదపు స్వభావాన్ని మెరుగుబెట్టి బలపరచింది, దానికి విజయం చేకూర్చింది" (స్టాలిన్, లెనినిజం పునాదులు గ్రంథంలో జాతుల సమస్య నుంచి, పేజీ-63-66).

సామ్రాజ్యవాద యుగంలో జాతీయ ఉద్యమాల పట్ల కార్మికవర్గం అనుసరించాల్సిన వైఖరి

గురించి లెనిన్ చెప్పిన సూత్రాలకు మరింత స్పష్టత కలిగిస్తూ స్టాలిన్ చెప్పిన విషయాలు మనకు మార్గదర్శకంగా ఉంటాయి. జాతుల సమస్య వలసవాద ఉద్యమ సమస్యగా మారడంతో రష్యాలో సోషలిస్టు విప్లవ విజయానంతరం ఈ సమస్యను కార్మికవర్గం ప్రపంచ సోషలిస్టు విప్లవ సమస్యలో భాగంగా పరిగణించింది. కాబట్టి సామ్రాజ్యవాద యుగంలో ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా జాతుల సమస్యను ఎలా చేపట్టాలనే విషయం గురించి స్టాలిన్ చెప్పిన విషయాలను చూద్దాం -

"జాతుల సమస్యను పరిష్కరించడంలో లెనినిజం ఈ కింది సూత్రాల నుండి మొదలవుతుంది.

"ఎ. ఈ రోజున ప్రపంచమంతా రెండు శిబిరాలుగా విభజింపబడి ఉంది. మొదటిది, ఫైనాన్స్ పెట్టుబడి కలిగియుంటూ, ప్రపంచ జనాభాలో అత్యధిక భాగాన్ని కొల్లగొట్టే కొద్దిపాటి నాగరికత జాతులు; రెండవది వలస దేశాలలోనూ, పరాధీన దేశాలలోనూ, దారుణమైన దోపిడికి గురిఅయ్యే జాతులు అంటే ప్రపంచంలో అత్యధిక జనాభా ప్రజలు.

"బి. ఫైనాన్స్ పెట్టుబడి కింద దోచుకొనబడే వలస దేశాలు, పరాధీన దేశాలు సామ్రాజ్యవాదానికి పెద్ద రిజర్వులుగా ఉపయోగపడుతున్నాయి. వాటి నుంచే ప్రధానంగా సామ్రాజ్యవాదానికి బలం లభిస్తోంది.

"సి. వలస, పరాధీన దేశాల ప్రజలు ఈ దోపిడి నుంచి విముక్తి చెందాలంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విప్లవ పోరాటం సాగించడమొక్కటే అందుకు మార్గం.

"డి. .... .... ..... .....

"ఇ. అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికోద్యమ ప్రయోజనాలు, వలస-పరాధీన దేశాల్లో స్వాతంత్రోద్యమ ప్రయోజనాలు ఫలించాలంటే ఈ రెండు విప్లవోద్యమాలూ ఒకటిగా కలిసిపోవాలి. సమష్టి శత్రువైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యసంఘటన ఏర్పడాలి.

"ఎఫ్. అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికవర్గం జయించాలంటేనూ, వలస దేశాల్లో పీడిత ప్రజలు సామ్రాజ్యవాద సంకెళ్ళ నుంచి విముక్తి చెందాలంటేనూ, విప్లవకరమైన ఈ సంయుక్త సంఘటన బలపడి తీరాలి"

(స్టాలిన్, లెనినిజం పునాదులు గ్రంథంలో జాతుల సమస్య నుంచి, 66-67 పేజీలు).

**వలస, అర్ధవలస, పరాధీన దేశాల జాతీయ విముక్తి పోరాటాలను నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం చేసిన మావో:**

జాతుల సమస్యపై లెనినిస్టు అవగాహనను అనుసరించి కొమింటర్న్ (కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) వలస, అర్ధవలస, పరాధీన దేశాల కమ్యూనిస్టు పార్టీలను గైడ్ చేయడానికి ప్రయత్నాలు చేసింది. అయితే, ఆ దేశాల కమ్యూనిస్టు పార్టీలతో పాటు కొమింటర్న్ నాయకుల్లో

ఉన్న యాంత్రిక అవగాహనల ఫలితంగా, సామ్రాజ్యవాద యుగంలో విప్లవాలను నడిపే విషయంపై కొంత మంది కొమింటర్న్ నాయకులకు స్పష్టత లేని ఫలితంగా ఆ దేశాల జాతీయ విముక్తి ఉద్యమాలను లెనినిస్టు అవగాహన ప్రకారం నడపలేకపోయాయి. మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ మాత్రమే జాతుల సమస్యపై లెనినిస్టు అవగాహనను అనుసరించి, దాన్ని సృజనాత్మకంగా అమలు చేస్తూ ఆచరణ క్రమంలో అభివృద్ధి చేసింది. మార్క్సిజం-లెనినిజాన్ని వలస, అర్ధవలస దేశమైన చైనాకు అన్వయించి 'నూతన ప్రజాస్వామిక విప్లవ' సిద్ధాంతాన్ని మావో అభివృద్ధి చేశాడు.

మావో అభివృద్ధి చేసిన నూతన ప్రజాస్వామిక విప్లవ సిద్ధాంతాన్ని, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను తూర్పు దేశాల (వలస, అర్ధవలస, పరాధీన దేశాలు) విప్లవాలు అనుసరించదగ్గ సాధారణ విప్లవ పంథాగా 1950లో కమ్యూనిస్టుల, కార్మిక పార్టీల సమాచార బ్యూరో (ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ కమ్యూనిస్ట్స్ అండ్ వర్కర్స్ పార్టీస్-కొమిన్‌ఫామ్-COMINFORM) గుర్తించింది.

జాతుల సమస్యపైన లెనినిస్టు అవగాహన ప్రకారం, వలసలు అర్ధవలసలలో జాతీయవాదాన్ని సృష్టించేది సామ్రాజ్యవాదమనేది సుస్పష్టం. "వలస, అర్ధ వలస దేశాలలో పెట్టుబడిదారీ విధానం వృద్ధి చెందుతున్న శకం ఉండదు. అంటే వృద్ధి చెందుతున్న స్థానిక బూర్జువా వర్గం ప్రాబల్యం వహించే శకం ఉండదు. విదేశీ గుత్తాధిపతులూ, వారిపై ఆధారపడిన బడా బూర్జువా వర్గమూ అంటే దళారీ స్వభావం కలిగిన బూర్జువా వర్గమూ ఆధిపత్యం వహిస్తాయి.

"ఈ పరిస్థితులలో జాతి అనేది ప్రధానంగా, వృద్ధి చెందుతున్న బూర్జువావర్గం భూస్వామ్య బంధనాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించడం యొక్క ఫలితంగా ఉండదు. అది ముఖ్యంగా, పీడితవర్గాలు ప్రధానంగా శ్రామిక ప్రజా బాహుళ్యం సాగించే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం యొక్క ఫలితంగా ఉంటుంది. ఈ పోరాటంలో విజయం సాధించడానికిగానూ ఆ పోరాటం పైన కార్మికవర్గ ఆధిపత్యాన్ని నెలకొల్పడం చారిత్రకంగా ఆవశ్యకం.

"అందువలన వలసలలోని జాతీయవాదం, జాతీయ విముక్తి పరిణత పెట్టుబడిదారీ విధానం ఏర్పడడానికి గాక, సోషలిజానికి దారి తీస్తాయి. కావున అది, పాత బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో భాగం కాదు. అది నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం. దాని అంతస్సారం వ్యవసాయిక విప్లవం". (పీపుల్స్‌వార్, సంచిక-5, జూన్ 1982, 35-36 పేజీలు)

లెనిన్ తదనంతర కాలంలో ఈ జాతీయ విముక్తి పోరాటాలూ, కొత్త తరహా ప్రజాస్వామిక విప్లవాలూ ప్రధాన ధోరణిగా మారాయి. ఈ ధోరణిపై దృష్టిని సారిస్తూ మావో ఇలా అన్నాడు, "ఒక బలహీనమైన జాతి బలమైన జాతిని ఓడించగలదు. ఒక చిన్న జాతి పెద్ద జాతిని ఓడించగలదు. అయితే పోరాడడానికి సాహసించడం, ఆయుధాలు చేపట్టడానికి సాహసించడం, తమ దేశ భవితవ్యాన్ని తమ చేతులలోకి తీసుకోవడం ద్వారా మాత్రమే ఒక చిన్న దేశంలోని

ప్రజలు ఒక పెద్ద దేశపు పీడనను తప్పక ఓడించగలుగుతారు. ఇది ఒక చారిత్రక నియమం". (మావో, ప్రపంచ ప్రజలారా ఐక్యంకండి అమెరికా దురాక్రమణదారులను, వారి కావలికుక్కలను ఓడించండి, 9వ సంపుటి, పేజీ-410).

అర్ధవలసలలో ఏర్పడిన బహుళ జాతుల రాజ్యాల జాతులలో జాతీయ విముక్తి పోరాటాలు ఊపిరి పోసుకోవడం, వెల్లువెత్తడం అనేది ఈ ధోరణికి సంబంధించిన మరొక అంశం. "లెనిన్ తరువాత, ప్రత్యేకించి రెండవ ప్రపంచ యుద్ధకాలం నుండి, వలస అర్ధవలస దేశాలలో రెండు ముఖ్యమైన పరిణామాలు సంభవించాయి. ఒకటి, జాతీయ విముక్తి వర్తమానానికి సంబంధించిన విషయంగా మారింది. రెండు, చాలా వలస దేశాలు స్వతంత్ర ప్రజాస్వామిక దేశాలుగా కావడానికి బదులుగా, రాజకీయంగా స్వతంత్ర రాజ్యాల ముసుగులో ఆర్థికంగానూ, ఫైనాన్స్‌పరంగానూ, సైనికంగానూ పూర్తిగా సామ్రాజ్యవాదులపై ఆధారపడి ఉండే రాజ్యాలుగా మారాయి. జాతీయ ఉద్యమం నేటి విషయంగా మారిందని మనం అంటున్నామంటే దానర్థం, వెనుకబడిన, పలు జాతులతో కూడిన, వలస అర్ధవలస దేశాలలో జాతులు ఏర్పడడం జరిగిందని అర్థం. ఈ వలసలు అర్ధవలసలుగా మారినందువలన, కొత్తగా ఆవిర్భవించిన జాతులు పాలక బడా బూర్జువా జాతీయ దురంహకారుల ఆధిపత్యానికి గురికావడం మాత్రమేగాక, సామ్రాజ్యవాద దోపిడీ పీడనలకు కూడా గురవుతున్నాయి. అందువలన బహుళ జాతులతో కూడిన అర్ధవలస దేశంలో కొత్తగా ఆవిర్భవించిన పీడిత జాతులు రెండు రకాల పీడన కింద నలిగి పోతున్నాయి. కావున, ఈ దేశాలలో సామ్రాజ్యవాదం నుండి దేశాన్ని విముక్తం చేయడమన్న కర్తవ్యంతో పాటు, పీడిత జాతుల స్వయంనిర్ణయాధికారం కోసం పోరాడడమనేది కూడా ముందుకు వస్తుంది" (పీపుల్స్‌వార్, సంచిక-5, జూన్ 1982, 35-36 పేజీలు).

"అంతిమ విశ్లేషణలో, జాతుల పోరాటం వర్గ పోరాట సమస్యలో భాగమే"నని ఇదొక మార్క్సిస్టు-లెనినిస్టు నియమమని మావో చెప్పాడు. (మావో, 'అమెరికా సామ్రాజ్యవాద జాతి వివక్షకు వ్యతిరేకంగా ఐక్యం కావలసిందిగాను, జాతి వివక్షకు వ్యతిరేకంగా అమెరికా దేశ నీగ్రోల పోరాటానికి మద్దతు అందించవలసిందిగానూ ప్రపంచ ప్రజలకు పిలుపునిస్తూ చేసిన ప్రకటన', ఇంగ్లిష్ ప్రతి, ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, పెకింగ్, 1964, పేజీ-5). పీడక జాతులు లేదా పీడక జాతుల్లోని పిడికెడుమందయిన దోపిడీ వర్గాలు పీడిత జాతులపై సాగించే జాతి పీడనను, అణచివేతను అనుభవించేది పీడిత జాతి మొత్తమే అయినప్పటికీ ప్రధానంగా పీడిత జాతిలోని అత్యధిక సంఖ్యాకులైన కార్మికులు, కర్షకులు, ఇతర శ్రామిక ప్రజానీకమే పీడన, అణచివేతలకు గురవుతుంది. ఈ అర్థంలో జాతి సమస్య వర్గ సమస్యే. ఈ దృష్టితో చూసినప్పుడు జాతి పీడన అనేది నిజానికి వర్గ పీడనే. కాబట్టి, జాతుల పీడనకు వ్యతిరేకంగా సాగే పోరాటం నిజానికి వర్గ పీడనకు వ్యతిరేకంగా సాగే పోరాటమే. పీడిత జాతి చేసే జాతి పోరాటం పీడక జాతిలోని పిడికెడు మంది దోపిడీ వర్గాలతో పాటు, వారికి తొత్తులుగా ఉండే తమ పీడిత

జాతిలోని దళారీ దోపిడిదార్లకు వ్యతిరేకంగా కూడా సాగుతుంది. అందుకే, కమ్యూనిస్టులు జాతి సమస్యను విడి సమస్యగా చూడరు. జాతుల సమస్య పరిష్కారాన్ని విప్లవ సమస్యలో భాగంగా, విప్లవ సాధారణ సమస్యల్లో భాగంగానే చూస్తారు.

ప్రజాస్వామిక విప్లవ కాలంలో, మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతానికి అనుగుణ్యంగాను, చైనా విప్లవ చారిత్రక పరిస్థితులను, ఆ సమయానికి జాతుల మధ్య ఉన్న సంబంధాన్ని దృష్టిలో ఉంచుకునీ, చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ, కామ్రేడ్ మావో సే-టుంగ్ చైనాలో జాతుల సమస్యను పరిష్కరించేందుకు మౌలిక సూత్రాన్ని రూపొందించారు. ఆ సూత్రం ఏమంటే - జాతీయ సమానత్వాన్ని ఆచరించడం కోసం - ముగ్గురు పెద్ద శత్రువులకు వ్యతిరేకంగా విప్లవ పోరాటాన్ని కొనసాగించేందుకు సమస్త జాతులకు నాయకత్వం వహించి ఐక్యం చేయడం; విప్లవ విజయానంతరం సమైక్య దేశాన్ని అంటే చైనా ప్రజా రిపబ్లిక్‌ను నిర్మించడం; జాతి పీడనా వ్యవస్థను రద్దు చేయడం; ప్రాంతీయ జాతీయ స్వయంప్రతిపత్తిని స్థాపించి, జాతీయ సమానత, సంఘీభావం, స్నేహం, సహకారం పునాదిగా ఉన్న ఒక గొప్ప కుటుంబమైన మాతృభూమిలో సమస్త జాతుల ఉమ్మడి అభివృద్ధిని, సౌభాగ్యాన్ని నెలకొల్పడం. ఈ సూత్రం కేంద్రంగా జాతులకు సంబంధించి సీపీసీ వరుసగా పాలసీలను రూపొందించింది. పలు సంవత్సరాల పాటు వీరోచితంగా విప్లవోద్యమాన్ని కొనసాగించడం కోసం హాన్ ప్రజలతో సమైక్యం చేస్తూ వివిధ మైనారిటీ జాతుల ప్రజలకు నాయకత్వం వహించింది.

విప్లవ విజయానంతరం మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ దేశంలో సోషలిజాన్ని నిర్మించేందుకు మైనారిటీ జాతులను, ప్రజలను మెజారిటీ అయిన హాన్ జాతి ప్రజలతో సమైక్యం చేసే కృషి చేపట్టింది.

సీపీసీ, కామ్రేడ్ మావో సే-టుంగ్ నాయకత్వంలో దేశంలోని మైనారిటీ జాతుల ప్రజలు జాతుల సమస్యకు సంబంధించిన పార్టీ పంథాను, విధానాలను దృఢంగా కొనసాగించారు. మొట్టమొదట ప్రజాస్వామిక సంస్కరణలు నిర్వహించారు. స్వీయ కృషితో భూస్వాముల, బానిస యాజమానుల వర్గ పాలనను కూలదోసారు. ఆ తర్వాత మైనారిటీ జాతులు నివసించే అధిక ప్రాంతాలలో సోషలిస్టు పరివర్తనను అమలులోకి తెచ్చారు. విశాల రైతాంగ, పశుపోషక ప్రజలు ఉత్సాహంగా ప్రజా కమ్యూన్లలో చేరి సమిష్టీకరణ మార్గాన్ని చేపట్టారు. అలాగే దేశంలో ఇతర యావత్తు ప్రాంతాలలో లాగానే మైనారిటీ జాతుల ప్రాంతాల ప్రజలు పరిపూర్ణ సోషలిస్టు నిర్మాణ కార్యక్రమం ఆరంభించారు. తత్ఫలితంగా ఈ ప్రాంతాల సమాజ ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పు జరిగింది. ప్రజలు నూతన స్ఫూర్తి పొందారు.

సీపీసీ ఈ యావత్తు పరివర్తనా కాలంలో పరిపూర్తి చేయాల్సిన జాతుల సమస్యకు సంబంధించిన ఒక గొప్ప చారిత్రక కర్తవ్యాన్ని చేపట్టింది. ఆ కర్తవ్యం ఏమిటంటే, మాతృభూమి

సమైక్యతను సంఘటితం చేయడం; జనతా ప్రజాస్వామిక నియంతృత్వాన్ని, జాతీయ ఆత్మరక్షణను, కార్మిక-కర్షక మైత్రిని, జాతుల ఐక్యతనూ బలోపేతం చేయడం; జాతీయ స్వయంప్రతిపత్తిని పరిరక్షించడం; మైనారిటీ జాతులకు తమ ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసేలా, సోషలిస్టు విప్లవాన్ని, నిర్మాణాన్ని కొనసాగించేలా మార్గదర్శకత్వం అందించడం; మైనారిటీ జాతులు ఆధునిక జాతులుగా అభివృద్ధి అయ్యేలా సహకారం అందించడం; సోషలిస్టు విప్లవాన్ని తుదకంటా కొనసాగించి చైనాలో జాతుల సమస్యను సంపూర్ణంగా పరిష్కరించడం, ఈ విధంగా యావత్తు జాతులూ కలిసికట్టుగా కమ్యూనిజం దశ వైపుగా ముందడుగు వేసేలా చేయడం.

పెట్టుబడిదారీ సమాజ ఆవిర్భావాన్ని వెన్నంటి సమాజంలో ఆధునిక జాతులు ఏర్పడ్డాయి. పెట్టుబడిదారీ సమాజం సామ్రాజ్యవాదంగా మారడంతో ప్రపంచవ్యాప్తంగా జాతుల పోరాటాలన్నీ ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విడదీయరాని భాగాలయ్యాయి. 1917లో రష్యాలో మహత్తర సోషలిస్టు విప్లవం విజయవంతం కావడంతో జాతుల పోరాటాలు ప్రపంచ సోషలిస్టు విప్లవంలో విడదీయరాని భాగాలయ్యాయి. సమాజ పరిణామ క్రమంలో నూతన దృగ్విషయంగా (ఫినామినా) ఉనికిలోకి వచ్చిన జాతుల సమస్యను మార్క్సిస్టు మహోపాధ్యాయులు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోలు తమ సమకాలీన పరిస్థితుల్లో విస్తారంగా అధ్యయనం చేసి, ఆ సమస్యను పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటంలో భాగం చేసారు. పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గ పోరాటాలు, వలస, అర్ధవలస, పరాధీన దేశాల జాతీయ విముక్తి పోరాటాలు అనే రెండు స్రవంతులను కలిపి ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో బలమైన ఐక్యసంఘటనగా నిలబెట్టారు. దాని ఫలితంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పీడిత జాతులు బలంగా పోరాడిన చోట, కొన్ని పీడిత జాతులు సామ్రాజ్యవాద దోపిడీ నుండి విముక్తం అయ్యాయి. జాతుల సమస్యపై మార్క్సిస్టు-లెనినిస్టు బోధనలను సరిగా అన్వయించిన మావో చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతంగా నడపగలిగారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్, స్టాలిన్, మావోలు సోషలిస్టు వ్యవస్థలో జాతుల సమస్యను పరిష్కరించడానికి సంబంధించిన నూతన అనుభవాలను అందించారు.

జాతి రాజ్యాల ఏర్పాటు అనంతరం ప్రపంచవ్యాప్తంగా బూర్జువాజీ తన ప్రగతిశీల స్వభావాన్ని కోల్పోయింది. తన సహజమైన దోపిడీ స్వభావంతో పాటు, పారిస్ కమ్యూన్, రష్యా సోషలిస్టు విప్లవాల అనంతరం ప్రపంచవ్యాప్తంగా బూర్జువాజీ ప్రజాస్వామిక విప్లవాలకు నాయకత్వాన్ని అందించకుండా ఫ్యూడలిజంతో మిలాఖత్తయ్యింది. దీంతో ఫ్యూడలిజాన్ని కూలదోసే చారిత్రక బాధ్యత ప్రపంచ కార్మికవర్గంపైన బడింది. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారిన తర్వాత అది ప్రపంచవ్యాప్తంగా వలస, అర్ధవలస, పరాధీన దేశాల్లోని ఫ్యూడలిజంతో, బడా బూర్జువా వర్గంతో మిలాఖతయింది. దీనితో ఈ దేశాల్లో సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం, బడా బూర్జువా (దళారీ బూర్జువా) వర్గం పీడిత ప్రజలకు, జాతులకు ఉమ్మడి శత్రువులుగా మారాయి.

ఈ స్థితిలో పీడిత ప్రజల, పీడిత జాతుల విముక్తికై సామ్రాజ్యవాదాన్ని, ఫ్యూడలిజాన్ని కూల్చివేసే చారిత్రక బాధ్యత ప్రపంచ కార్మికవర్గం బాధ్యతగా మారింది. కాబట్టి నేటి స్థితిలో జాతుల పోరాటాలకు కార్మికవర్గమే నాయకత్వాన్ని అందించాలి. జాతుల పోరాటానికి సంబంధించిన అన్ని సమస్యలపై బూర్జువా వర్గ విధానానికి భిన్నంగా కార్మికవర్గం తన స్వంత విధానాన్ని రూపొందించుకుని, స్వతంత్రంగా ఆ పోరాటాలకు నాయకత్వాన్ని అందించాలి. ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో ఎత్తుగడలపరంగా బూర్జువాజీతో ఐక్యసంఘటనకు పూనుకున్న కార్మికవర్గం తన స్వంత నిర్మాణ స్వతంత్రంపైన ఆధారపడే ఆ కార్యకలాపాల్లో పాల్గొనాలి. దానికి భిన్నంగా వ్యవహరిస్తే కార్మికవర్గం రాజకీయంగా చౌరవ కోల్పోయి, బూర్జువాజీకి తోకగా మారిపోతుంది.

జాతి నిర్వచనం, జాతుల స్వయంనిర్ణయాధికారాన్ని, జాతుల విడిపోయే హక్కుని ఎలా అర్థం చేసుకోవడం, సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్య పట్ల కార్మికవర్గం అనుసరించాల్సిన వైఖరి, విప్లవకరమైన జాతుల పోరాటం అంటే ఏమిటి, జాతుల సమస్య పట్ల కార్మికవర్గ అంతర్జాతీయతా వైఖరి, పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గ పోరాటాలు, వలస, అర్ధవలస, పరాధీన దేశాల్లోని జాతీయ విముక్తి ఉద్యమాలు రెండూ కలిసి ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యసంఘటనగా ఏర్పడడం, జాతుల ఏకీకరణ, జాతుల సమస్య వర్గ పోరాట సమస్యలో భాగం వగైరా విషయాల పట్ల మార్క్సిస్టు మహోపాధ్యాయుల మౌలిక బోధనల్ని ఈ అధ్యాయంలో పేర్కొన్నాం. ఇప్పుడు భారతదేశంలోని జాతుల సమస్యపై మార్క్సిస్టు మహోపాధ్యాయుల మౌలిక బోధనలను సృజనాత్మకంగా అన్వయించుకుని వీటి ఆధారంగా భారతదేశంలో జాతుల సమస్యను విశ్లేషించుకుని, జాతుల పోరాటానికి తగిన కార్యక్రమాన్ని రూపొందించుకుందాం.

# రెండవ అధ్యాయం

# భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని భాగం

# జాతుల సమస్య

జాతుల సమస్యపై మార్క్సిస్టు మహోపాధ్యాయుల మౌలిక బోధనలను అనుసరించి మన దేశంలోని జాతుల పోరాట సమస్య సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవంలో అవిభాజ్యమైన అంశం; మన దేశంలో జాతుల విముక్తి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమవుతుంది. భారత ప్రజల ఉమ్మడి శత్రువులైన సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారీ విధానానికీ, బడా భూస్వామ్య విధానానికీ వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని, జాతుల పోరాటాన్ని రెండింటిని అనుసంధానిస్తూ నడుపుదాం.

జాతుల పోరాటానికి కార్మికవర్గ అగ్రగామి దళంగా మన పార్టీ – భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) గత 50 సంవత్సరాల కాలంలో భారతదేశంలోని జాతుల పోరాటాలకు నాయకత్వాన్ని అందించడంలోని సకారాత్మక, నకారాత్మక అనుభవాలను గమనంలో ఉంచుకుని, ప్రస్తుతం జాతుల పోరాటాలకు చొరవగా నాయకత్వాన్ని అందిద్దాం. భారతదేశంలో జాతుల సమస్యను, చారిత్రకంగానూ, అది ఏయే సమస్యలపై, ఏయే రూపాల్లో కొనసాగుతున్నదనే విషయాన్ని ఈ అధ్యాయంలో పేర్కొన్నాం.

## ప్రపంచ రాజకీయ చిత్రపటంపై భారతదేశం

మన భారతదేశం ఇపుడున్నంత సువిశాల భూభాగాన్ని కలగిన దేశంగా బ్రిటిష్ వారి దురాక్రమణకు పూర్వ చరిత్రలో ఎన్నడూ లేదు.

క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాలలో సింధూ నది పరిసరాలలోకి వాయవ్య దిశ నుండి ఆర్యులు వలస వచ్చారు. వారు ప్రాచీన సింధూ నాగరికత కలిగిన, నాగరిక జాతులైన కంచుయుగపు ద్రావిడులను, తమ కంటే అనాగరికులైన రాతియుగపు ఆటవికులను ఓడించారు. మిగిలిన ప్రాచీన గణ సముదాయాలు ఆర్యులతో ఘర్షణ పడుతూనే, వారితో కలసిపోయాయి. ఆర్యులు ఉత్తర భారతదేశంలోని గంగా మైదానంలోకి విస్తరించారు. కాలక్రమంలో గణాలు తెగలుగా అభివృద్ధి చెందాయి. ఆ తర్వాతనే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి ప్రాచీన తెగ సముదాయాలు జనపదాలుగా అవతరించాయి. ఇవి బ్రాహ్మణాధిపత్య వర్ణవ్యవస్థ కలిగిన తొలి ఫ్యూడల్ రాజ్యాలుగా వృద్ధి చెందాయి. ఇవి ఎప్పుడూ పరస్పరం కలహించుకుంటూ అనేక మార్పులకు లోనయ్యేవి. పశుపోషణ, వ్యవసాయం, గణవ్యవస్థ నుండి వర్గ వ్యవస్థకు పరివర్తన చెందిన ఈ దశ, ఆర్యులు వలస రావడంతో, సింధూ నాగరికత పతనం కావడంతో

ఆరంభమై, ఇనుము విస్తృత వాడకం, వ్యవసాయాన్ని ప్రధాన జీవనాధారం చేసుకొని స్థిర నివాసాలు ఏర్పర్చుకొనే (క్రీ.పూ. 600) వరకూ కొనసాగింది. క్రీ.పూ. 600 నుండి క్రీ.శ. 4వ శతాబ్దం వరకు కొనసాగిన తొలి ఫ్యూడల్ రాజ్య కాలం నాటికి వాణిజ్యం, పెద్ద పెద్ద కేంద్రీకృత రాజ్యాలు వృద్ధి చెందాయి. బౌద్ధ, జైన మతాలు వ్యాప్తి చెందాయి.

ఈ కాలంలో దక్షిణ భారతదేశంలో జరిగిన అభివృద్ధి గంగా, యమున లోయల్లో జరిగిన దానికి కొంత భిన్నమైనది. ఆర్యులు సంచార జీవులుగా ఉన్న కాలంలో దక్షిణాన సాపేక్షికంగా స్థిరమైన వ్యవసాయంపై ఆధారపడిన స్థిర నివాసాలు ఏర్పడ్డాయి. క్రీ.పూ 322–298 మధ్య 24 సంవత్సరాలు పాలించిన మౌర్యుల సామ్రాజ్యం అఫ్ఘనిస్తాన్, వాయవ్య భారతం, వర్తమాన ఉత్తరప్రదేశ్, బిహార్, బంగాల్ సహ దక్షిణ భారతదేశంలో మైసూర్ వరకు విస్తరించింది. అయినప్పటికీ ఇంకా విశాల ప్రాంతం మౌర్య సామ్రాజ్యానికి బయటే ఉంది. మౌర్య సామ్రాజ్యం లో బింబిసారుని కాలంలో (క్రీ.పూ.298–273) కొన్ని మార్పులు చోటుచేసుకున్నవి. తిరిగి ఆయన కుమారుడు అశోకుడి కాలంలో (క్రీ.పూ. 273–232) సుదూర దక్షిణాదిలో చిన్న–చిన్న ప్రాంతాలు మినహా చాలా వరకు ఒకే సామ్రాజ్యంగా అవతరించింది. కానీ అది అలాగే ఎంతో కాలం నిలువలేదు. అశోక చక్రవర్తి తర్వాత మౌర్య సామ్రాజ్యం పతనమైంది.

మౌర్యుల తర్వాత గుప్తుల కాలంలో (క్రీ.శ.319–412) అనేక రాజ్యాలు ఒకే సామ్రాజ్యం కిందికి వచ్చాయి. గుప్తులలో రెండవ వాడు సముద్రగుప్తుడు (క్రీ.శ. 335–380). ఆయన ఉత్తర భారతంలో తొమ్మిది రాజ్యాలను, దక్షిణ భారతదేశంలో 12 రాజ్యాలను జయించి సామ్రాజ్య విస్తరణ చేయగా ఆయన తర్వాత అది మరింత విస్తరించింది. తూర్పున బంగాల్, పశ్చిమాన మాల్వా (రాజస్థాన్), గుజరాత్ అలాగే సింధ్ సహ వాయవ్య ప్రాంతాలకూ విస్తరించింది. కానీ హూణుల దండయాత్రలతో అది కూడా చివరకు ఛిన్నాభిన్నమై ఆ విశాల సామ్రాజ్యం 28 చిన్న–చిన్న స్వతంత్ర రాజ్యాలుగా విచ్ఛిన్నమైపోయింది.

క్రీ.శ నాల్గవ శతాబ్దారంభం భారత సమాజంలో బ్రాహ్మణీయ కుల ఆధారిత ఫ్యూడలిజానికి నాంది పలికింది. కుల వ్యవస్థ స్థిరపడింది. ఈ నయాబ్రాహ్మణ్యానికి పాలకుల మద్దతు, ప్రత్యేకించి గుప్తుల కాలం (క్రీ.శ. 4వ శతాబ్దం)లోనూ, ఆ తరువాతా లభించింది. బౌద్ధమూ, జైనమూ క్షీణించాయి. బ్రాహ్మణ మతం ప్రాబల్యం పొందింది. పట్టణాలు దెబ్బతిని, వాణిజ్యం క్షీణించి, స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అస్థిత్వంలోకి వచ్చిన క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి నయా బ్రాహ్మణ్యమూ, మనుస్మృతిపై ఆధారపడిన కులవ్యవస్థ భారతదేశంలోని అత్యధిక భాగంలో ప్రాబల్యాన్ని సాధించింది. బ్రిటిష్ వారు వచ్చే వరకూ ఈ వ్యవస్థ కొనసాగింది.

సాధారణంగా ఫ్యూడల్ రాజ్యాలు స్థిరమైన ఎల్లలను కలిగి ఉండవు. ఫ్యూడల్ రాజ్యాలు నిరంతరం అనేక మార్పులకు గురవుతుంటాయి. కాబట్టి ఫ్యూడలిజంలో జాతి రాజ్యాల నిర్మాణం ఉండదు. పైన పేర్కొన్న పరిణామాలను బట్టి భారత సమాజం అప్పటికి నేటిలా ఒక స్థిరమైన

దేశంగా ఆవిర్భవించని కాలం. అలాగే, స్టాలిన్ చెప్పినట్లుగా, ఆనాడు "ఒకే భాష, ఒకే భూభాగం, ఒకే ఆర్థిక జీవితం, ఉమ్మడి సంస్కృతిగా వ్యక్తమయ్యే మానసికత పునాదిగా ఏర్పడిన చారిత్రకంగా స్థిర సముదాయంగా రూపొందే క్రమం" లేకపోవడంతో ఆధునిక జాతులూ ఏర్పడలేదు.

16వ శతాబ్దంనాటికి మొగలులు నేటి భారతదేశంలోని గణనీయమైన భాగాన్ని ఆనాడు తమ సామ్రాజ్యంగా ఐక్యపర్చినారు. అయితే 18వ శతాబ్దం మధ్యలో ఫ్యూడల్ యుద్ధాల మూలంగానూ, రైతు తిరుగుబాట్ల మూలంగానూ మొగల్ సామ్రాజ్యం తిరిగి అనేక చిన్న ఫ్యూడల్ రాజ్యాలుగా విచ్ఛిత్తి పొందింది. ఆ విధంగా ఛిన్నాభిన్నమై అంతర్గత విభేదాలతో బలహీనమైన మొగలుల నాటి భారతదేశం 1757 ప్లాసీ యుద్ధంతో బ్రిటిష్ వారి దురాక్రమణకు గురైంది. దీనితో భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యానికి వలసగా మారి వారి ప్రత్యక్ష పాలనలోకి వెళ్లింది. 16వ శతాబ్దం చివరలో, 17వ శతాబ్దం ప్రారంభంలో వర్తకానికై మన దేశానికి వచ్చిన డచ్, పోర్చుగీసు వారితో పాటే బ్రిటిష్ వారు వచ్చినా, గోవా లాంటి చిన్న చిన్న ప్రాంతాలు మినహా క్రమంగా బ్రిటిష్ వారే యావత్ దేశాన్ని తమ వలసగా మార్చుకోగలిగారు.

## వలస భారతదేశం – జాతుల వికాసానికి అవరోధాలు

బ్రిటిష్ వారి దురాక్రమణకు ముందే భారతదేశంలో పట్టణాల పెరుగుదల, వర్తక పెట్టుబడి అభివృద్ధి చోటు చేసుకుంది. ఢాకా, అహ్మదాబాద్, కేంబే, సూరత్, ముర్షిదాబాద్, బెంగళూరు, దావణగేరే, మచిలీపట్టణం లాంటి అనేక పట్టణాలు ఉన్నత నాణ్యత కలగిన బట్టల తయారీకీ, వర్తకానికీ కేంద్రాలుగా ఉండేవి. కశ్మీర్ శాలువలు, ఆగ్రా, లాహోర్ తివాచీలు, ముర్షిదాబాద్ పట్టుబట్టలు చాలా ప్రసిద్ధి చెందాయి. భారత వస్త్రాలు – మజ్లిన్, కాలికో, టఫెటా, వగైరా రకాలు యూరప్‌కూ ఎగుమతయ్యేవి. బ్రిటిష్ వలసవాదులు వచ్చేనాటికే దేశ జనాభాలో దాదాపు పది శాతం పట్టణాలలో నివసించేవారు. 1757 నాటికి ముర్షిదాబాద్ నగరం లండన్‌తో సమాన స్థాయిలో ఉండేదనీ రాబర్ట్ క్లైవ్ పేర్కొన్నాడు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో వర్తక పెట్టుబడిదార్లు అభివృద్ధి చెందారు. పట్టణ జనాభా పెరిగింది. ప్రధానంగా బట్టల తయారీతో పాటు లోహపరిశ్రమ, గడియారాలు, భూతద్దాలు, ఓడల నిర్మాణం, వైజ్ఞానిక యంత్రాలు, యుద్ధ సామగ్రి, తుపాకులు, మస్కట్లు, కార్బైన్‌లు, కాగితం, గాజు తయారీ లాంటి పలు రకాల పరిశ్రమలు నెలకొనడం లాంటి అభివృద్ధికర పరిణామాలు దేశంలో చోటుచేసుకున్నాయి. జాతుల వికాసం, జాతి రాజ్యాల నిర్మాణం జరిగే క్రమంలో ఆ మేరకు భాషల వికాసం జరిగింది. అలాంటి పరిస్థితులలోనే దేశ అధికారాన్ని బ్రిటిష్ వారు హస్తగతం చేసుకోవడంతో దేశ సహజ వికాస క్రమం దెబ్బతింది.

దేశంలో వర్తకం పెరగడంతో ప్రాంతాల వారిగా మార్కెట్‌ను తమ అదుపులో వుంచుకున్న వర్తక వర్గాలు ఏర్పడ్డాయి. మొగల్ సామ్రాజ్యంలో ఒకే దేశీయ ఆర్థిక వ్యవస్థ లేదా మార్కెట్,

దానితో పాటు ఒకే కరెన్సీ యింకా ఏర్పడకపోయినా ప్రాంతీయ మార్కెట్లు ఏర్పడ్డాయి. లోగడ కొన్ని పట్టణాలకు మాత్రమే పరిమితమై వ్యాపారం చేస్తున్న వర్తకులు 16వ, 17వ శతాబ్దాలలో ప్రాంతాల వారిగా వర్తక మార్కెట్‌లను ఏర్పరచుకున్నారు. వీరిలో వివిధ 'జాతుల' (ప్రాంతాలు) వారు ఉన్నారు. ముఖ్యంగా రాజస్థానీ మార్వాడీలు, గుజరాతీ బనియాలు, తమిళ చెట్టియార్లు, కన్నడ బనిజగలు ఆనాటి ప్రముఖ వర్తక పెట్టుబడిదారులు.

భారతదేశంలోని ఫ్యూడల్ వ్యవస్థ ప్రత్యేక లక్షణం కులాధారిత భూస్వామ్యం. దేశంలో బ్రిటిష్‌వారి పాలనా ఏర్పడే వరకూ కుల వ్యవస్థ చెక్కుచెదరకుండానే కొనసాగింది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలోని వర్తకులు ప్రధానంగా వైశ్య వర్ణానికే చెందిన వారైనప్పటికీ మార్వాడీలలో ఓస్వాల్, అగర్‌వాల్, మహేశ్వరీ కులాలు; గుజరాతీలలో బనియా, మోదీ, భాటియా కులాలు; కర్ణాటకలో బనిజగలు; ముస్లింలలోనూ బోహ్రా, ఖోజాలు ప్రముఖ వర్తక పెట్టుబడిదారీ వర్గంగా రూపొందాయి. బొంబాయిలో పార్సీలు, గుజరాత్‌లో బనియాలు, రాజస్థాన్‌లో మార్వాడీలు ఎంతో మంది ఈస్ట్ ఇండియా కంపెనీకి దళారీ ముకద్దంలుగా పని చేశారు. భారతదేశంలో చేతివృత్తుల వారి నుండి వర్తకులుగా మారే క్రమం దాదాపుగా జరగలేదు. ఇక్కడి వర్తకులు ఉత్పత్తిలో ఎన్నడూ భాగస్వామ్యం వహించలేదు. వీరు ప్రధానంగా ఫ్యూడల్ ప్రభువులకు వడ్డీలకు ఋణాలు ఇవ్వడం మూలంగానూ, ఫ్యూడల్ ప్రభువులకు, విదేశీ మార్కెట్లకు సరుకులు సరఫరా చేసి అభివృద్ధి చెందడం వల్లనూ వారిలో పెట్టుబడిదారీ లక్షణాలకంటే ఫ్యూడల్ లక్షణాలే ఎక్కువ ఉండినాయి. అందువల్లనే ఎర్ర సముద్రం రేవులలోనూ, గల్ఫ్ రేవులలోనూ వారు నివాసాలు ఏర్పరచుకొని వర్తకం చేసినా కాలం చెల్లిన ఫ్యూడల్స్‌తో వారు ఎన్నడూ పోరాటానికి దిగలేదు. వారి దోపిడీ, పీడన, అణచివేత విధానాలలో, కుల వ్యవస్థలో వర్తకులు భాగమైనారే తప్ప పశ్చిమ యూరప్‌లో ఫ్యూడల్ ప్రభువులకు, చర్చికి వ్యతిరేకంగా యూరోపియన్ వర్తకులు పోరాడి పెట్టుబడిదారీ వ్యవస్థను స్థాపించడంలో, జాతి రాజ్యాల్ని ఏర్పర్చడంలో పోషించిన ప్రగతిశీల, విప్లవాత్మక పాత్ర వీరిక్కడ పోషించలేదు. కర్ణాటకలోని బనిజగలను మాత్రం ఇందుకు మినహాయింపుగా చెప్పుకోవచ్చు. బనిజగలు, గుజరాతీ బనియాలు, మార్వాడీ దళారీ వ్యాపారుల లాగా కాకుండా పెరుగుతున్న 'జాతీయ బూర్జువాజీ'కి ప్రతీకగా నిలిచారు.

మన దేశ వర్తక పెట్టుబడిదారుల మధ్య అనేక వైరుధ్యాలుండేవి. తమిళ, తెలుగు పెట్టుబడిదారుల మధ్య కావచ్చు, లేదా దక్షిణాది పెట్టుబడిదారులకు, శక్తిమంతమైన మార్వాడీ–గుజరాతీ–పార్సీ దళారీ పెట్టుబడిదారులకు మధ్య గావచ్చు తీవ్రమైన వైరుధ్యాలే ఉండేవి. అప్పటికే వారు పలు వర్తక సంస్థలను కూడా ఏర్పరచుకున్నారు. దక్షిణ భారతదేశంలో 'దక్షిణ భారత వర్తక సంఘం' (1909), 'నట్టుకొట్టై నగరత్తక సంఘం' (1917), 'భారత వ్యాపార సంఘం' కోయంబత్తూర్ (1929), 'దక్షిణ భారత పారిశ్రామిక యజమానుల సంఘం' (1933) లాంటివి ఏర్పడ్డాయి. ఇవి తమిళనాడుకు చెందిన నట్టుకొట్టై చెట్టియార్‌ల ఆధిపత్యంలో

ఉండేవి. అయితే వీరి విపరీత ఆధిపత్యాన్ని తెలుగు వ్యాపారుల సంఘాలు నిరసించాయి. మరోవైపు 'బొంబాయి మిల్లు యజమానుల సంఘం' (1875), 'బ్రిటిష్ చాంబర్ ఆఫ్ కామర్స్' (1923) మొదలైయినవి మరికొన్ని వుండేవి. ఏమైనప్పటికీ అవన్నీ మార్వాడీ, గుజరాతీ వర్తక బూర్జువాలయిన ఘన్‌శ్యాందాస్ బిర్లా, సర్ పురుషోత్తం దాస్ ఠాకూర్ దాస్‌ల నాయకత్వంలోని 'ఫిక్కీ' (ఫేడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ)కి అనుబంధంగానే ఉండేవి.

మన దేశ వర్తక రంగం నుండి డచ్, పోర్చుగీసు వర్తకులను ఓడించి గుత్తాధిపత్యం సాధించిన బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీతో బొంబాయి పార్శీలు, గుజరాతీ బనియాలు, రాజస్థానీ మార్వాడీలు మొదటి నుండి మిలాఖతై తమ వర్తకంలో విపరీత లాభాలు గడించారు. బ్రిటిష్ వర్తకులు చేసే ప్రతి వ్యాపార లావాదేవీలో వీరికి 2% కమిషన్ ముట్టేది. అందువల్ల వారు సునాయసంగానే సామ్రాజ్యవాదులకు దళారీలుగా మారగలిగారు. వారి అడుగు జాడలలో యావత్ దేశాన్ని దోపిడీ చేయాలనే లక్ష్యంతోనే తొలి నుండి 'భారత జాతి' అనే భావనకు వారు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. ఈ రకంగా దళారీ పాత్ర పోషించిన వర్తక శ్రేణులు ఆయా ప్రాంతాలలో అభివృద్ధి చెందుతున్న జాతులకు ప్రాతినిధ్యం వహించకుండా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై భారత స్వతంత్ర పోరాటంలో, జాతుల వికాస క్రమంలో అభివృద్ధి నిరోధక పాత్రనే పోషించారు.

ఫ్యూడల్ సమాజ గర్భాన్ని చీల్చుతూ దేశంలో క్రమంగా అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారీ సంబంధాలు బ్రిటిష్ వారి రాకతో దెబ్బతిన్నాయి. దేశంలో అధికారాన్ని చేపట్టిన బ్రిటిష్ సామ్రాజ్యవాదమే దేశంలోని సమస్త జాతుల, తెగల, భాషల వికాసానికీ, జాతీయ పెట్టుబడిదారుల అభివృద్ధికీ ప్రధాన అడ్డంకిగా మారింది. దేశం వలసగా మారడంతో దేశంలోని అన్ని ప్రాంతాల (జాతుల) ప్రజలకు వలస శృంఖలాలను తెంచుకోవడమే ప్రధాన, తక్షణ కర్తవ్యంగా ముందుకు వచ్చింది. ఆనాటి సామ్రాజ్యవాద వ్యతిరేక భారత ప్రజాస్వామిక విప్లవంలో బడా బూర్జువా/ దళారీ బూర్జువా వర్గ నాయకత్వంలో సమస్త వర్గాలు, జాతులు, తెగలు, కులాలు, మతాలు వాటి మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ సమైక్యంగా, చురుగ్గా పాల్గొన్నాయి. యావద్భారతదేశంలోని ప్రజలు – కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు అందులో పాల్గొని వీరోచితంగా పోరాడినారు. ఆ ప్రజా సమైక్యతను కార్ల్ మార్క్స్ 'భారతదేశంలో రాజకీయ సమైక్యత బ్రిటిష్ వాడి ఖడ్గంతో సాధ్యమైందన్నాడు.'

బ్రిటిష్ పాలకులు మొత్తం భారతదేశాన్ని ఐదు ప్రధాన ప్రాంతాలు (ప్రావిన్స్)గా విభజించి వాటిని 'బ్రిటిష్ ఇండియా'గా తమ ప్రత్యక్ష పాలనలో పెట్టుకున్నారు. ఆ ప్రాంతాలు పోగా దేశంలోని 562 సంస్థానాలు బ్రిటిష్ వారికి కప్పం చెల్లిస్తూ బ్రిటిష్ వారి పరోక్ష ఆధిపత్యంలో, తమ సొంత అధికార పాలనా యంత్రాంగాలతో ఉన్నాయి. ఈ సంస్థానాలు దేశంలో ఐదింట

రెండో వంతు భూభాగాన్నీ, ఐదింట ఒక వంతు జనాభానూ కలిగి వున్న విశాల ప్రాంతాలు. సంస్థానాధీశులలో అత్యధికులు బ్రిటిష్ వారి సమర్థకులే. బ్రిటిష్ వారి పరిపాలనా యూనిట్ల విభజన జాతుల వికాసాన్ని అడ్డుకునే కుట్రలలో ఒక భాగమే.

20వ శతాబ్దం ప్రారంభంలో అంటే 1905లో వైస్రాయి కర్జన్ కాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 'వంగ (బంగాల్) విభజన'కు పూనుకున్నారు. బ్రిటిష్ వారి రాకకు పూర్వం భారతదేశం అన్న భావన గానీ 'హిందూ' సమాజం అన్న చైతన్యం గానీ లేని చోట బంగాల్ విభజన భారత ప్రజలను ఒక్క త్రాటి మీదికి తేవడానికి నాంది పలికింది. బంగాల్ విభజన నుండి ముందుకు వచ్చిన 'దేశ భావన' స్వతంత్ర సమరంలో గతం కన్నా (1857–తొలి భారత స్వతంత్ర సంగ్రామం) సమైక్యంగా అన్ని జాతుల ప్రజలను పోరాడేలా చేసింది. ఆ సమయంలోనే ఆర్య సమాజ్, హిందూ మహాసభ లాంటి సంస్థలను హిందూ సనాతనవాదులు ఏర్పర్చి స్వాతంత్ర్యోద్యమంతో తమ హిందూ మత పునరుద్ధరణను జోడించారు. 'వందేమాతరాన్ని' ముందుకు తీసుక వచ్చారు. బంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలో అది ఒక శక్తిమంతమైన నినాదంగా రూపొందింది.

ప్రజల సమరశీల పోరాటాలతో బ్రిటిష్ పాలకులు తమ బంగాల్ విభజన నిర్ణయాన్ని అనివార్యంగా వెనక్కి తీసుకున్నారు. బంగాల్ విభజనకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ఆ ప్రజా ఉద్యమం నుండి పొందిన జాతి చైతన్యమే తర్వాతి కాలంలో దేశంలో బ్రిటిష్‌వారి దురాక్రమణకు వ్యతిరేకంగా ముందు నుండే అభివృద్ధి చెందుతున్న బంగాలీ జాతి సహా తెలుగు, తమిళ, మరాఠా కన్నడ, గుజరాతీ తదితర అనేక జాతుల ఉద్యమాలకు ఊపిర్లు పోసింది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వతంత్ర పోరాటంలో వీధులలోకి వస్తున్న విభిన్న జాతులకు చెందిన ప్రజానీకాన్ని తమ అదుపులో ఉంచుకోవడానికిగాను కాంగ్రెసు పార్టీకి నాయకత్వం వహిస్తున్న దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు దేశంలో నూతనంగా అభివృద్ధి చెందుతున్న జాతుల చైతన్యానికి భయపడి భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణాన్ని అంగీకరించాయి. కాంగ్రెసు పార్టీ 1920లో జరుపుకున్న 'నాగపుర్ కాంగ్రెస్'లో అదే ప్రాతిపదికపైన దాని సంస్థాగత నిర్మాణం చేయ తలపెట్టింది. ఆ తీర్మాణం ప్రకారం అప్పటి తమిళనాడు, ఆంధ్ర, కేరళ, సింధ్, గుజరాత్, బొంబాయి, మహారాష్ట్ర, విదర్భ, మహా కోసల, అజ్మీర్–మార్వార్, యునైటెడ్ ప్రావిన్సెస్, ఢిల్లీ, బిహార్, ఉత్కళ, అస్సాం, బంగాల్, పంజాబ్, వాయవ్య సరిహద్దు రాష్ట్రాల పేర్లతో మన దేశాన్ని 18 రాష్ట్రాలుగా విభజించి ఆ ప్రాతిపదికనే 1927లో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాన్ని చేపట్టింది.

1941లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ "ఏ ప్రాంతం కూడా దాని అభిష్టానికి భిన్నంగా భారత యూనియన్‌లో చేరటానికై బలవంత పెట్టబడదనీ", తన ఢిల్లీ సమావేశంలో మరోసారి తీర్మాణాన్ని

ఆమోదించింది. దానితో అన్ని జాతుల ప్రజల్ని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తన నాయకత్వం కింద అది సులువుగా సమీకరించగలిగింది. అయితే దాని వెనక ప్రజలలో వలసవాదుల విధానాల పట్ల పెరుగుతున్న ఆగ్రహం ప్రాణ వాయువులా పని చేసింది. తన చేతిలోకి రాజకీయ అధికారం బదిలీ అయ్యేంత వరకూ ప్రజల ఆకాంక్షలను ఆమోదించినట్లే నటిస్తూ తుదకు ప్రజలను మోసపుచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి లోబడి దళారీగా ఉండడం, ఫ్యూడల్ శక్తులతో మైత్రి వల్ల దళారీ బడా బూర్జువా వర్గం సహజంగానే జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రతీఘాతుక పాత్ర వహించింది. సామ్రాజ్యవాదంతో, భూస్వామ్య శక్తులతో మిలాఖతైన భారత బడా బూర్జువా (దళారీ బూర్జువా) వర్గం, వారి రాజకీయ ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ చేతుల్లోకి 1947లో అధికార మార్పిడి జరిగిన ఫలితంగా జాతుల వికాసానికి సంబంధించినంత వరకు అది గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కింది.

అనేక రాజ్యాలుగా ఉన్న భారత ఉపఖండాన్ని తన దోపిడీ ప్రయోజనాల కోసం చరిత్రలోనే ప్రప్రథమంగా తన అధికారంతో బ్రిటన్ ఒక్కటి చేసింది. అధికార మార్పిడి తర్వాత భారతదేశం విచ్ఛిన్నమైతే తమ దోపిడీ ప్రయోజనాలు దెబ్బతినడమే కాకుండా ప్రపంచంలో బలపడుతున్న కమ్యూనిజం దక్షిణాసియాకు చొరబడే ప్రమాదం అధికంగా ఉందన్న బెంగతో భారత దళారీ బూర్జువా వర్గం అఖండ భారత్‌నే కోరుకుంది. అందుకు తగినట్టే అది మొదట 'డొమీనీయన్ స్టేట్'ను (బ్రిటన్ వారి నియంత్రణలో స్వయం పాలనా దేశం) కోరుకుంది.

## అధికార మార్పిడి తర్వాతి స్థితి– దేశ విభజన

1947 అధికార మార్పిడి (నామమాత్ర స్వాతంత్ర్యం)తో వలస, అర్ధ భూస్వామ్య భారతదేశం అర్ధ వలస అర్ధ భూస్వామ్యంగా మారింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు తొలి నుండి సేవలు అందించిన మన దేశ దళారీ బడా బూర్జువా వర్గం 1947 అధికార మార్పిడితో దళారీ 'నిరంకుశ' బడా బూర్జువా వర్గంగా మారింది. దేశంలోని వివిధ జాతుల వికాసానికి దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గం, బడా భూస్వామ్య వర్గం కలసి ప్రధాన అడ్డంకిగా నిలిచాయి.

అధికార మార్పిడితో అర్ధ వలసగా మారిన భారతదేశంలో ఒక వైపు పలు సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలను ఈడేరుస్తూనే మరో వైపు దేశంలోని కులాధారిత భూస్వామ్య సమాజాన్ని కాపాడడంలో దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గం ప్రధాన పాత్ర పోషిస్తున్నది. ఫలితంగా మన దేశ కార్మిక, కర్షక తదితర శ్రామిక ప్రజలకు, జాతీయ బూర్జువా శక్తులకూ, జాతుల వికాసానికీ, జాతుల సమైక్యతకూ, అన్ని ప్రాంతాల అభివృద్ధికీ, అన్ని భాషల సమానత్వానికీ, అన్ని జాతుల, భాషల, ప్రాంతాల వికాసానికీ ఈ వర్గం ప్రధాన అడ్డంకిగా మారింది.

అధికార మార్పిడి తయారీలలో భాగంగా మూడు దుష్ట శక్తులు కలిసే (బ్రిటన్, కాంగ్రెస్, ముస్లిం లీగు) మత ప్రాతిపదికపై దేశాన్ని రెండుగా చీల్చాయి. అయితే ముస్లింలను అటు

వైపు నెట్టింది మాత్రం ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ, దాని హిందూ పునరుద్ధరణవాద భావజాలమే. ప్రబల ముస్లిం ప్రాంతాలైన పంజాబ్, వాయవ్య సరిహద్దు ప్రాంతం (ఎన్.డబ్ల్యు.ఎఫ్.పీ.), కశ్మీర్, సింధ్, బలూచిస్తాన్‌లను మత ప్రాతిపదికన పాకిస్తాన్ అన్నారు. టాటా, బిర్లాల తదితర దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గ ప్రతినిధులైన పిడికెడు మంది కాంగ్రెస్, ముస్లిం లీగు నాయకులు 'మౌంట్‌బాటెన్ అవార్డు'ననుసరించి 'డొమీనీయన్ స్టేటస్' సహ మత ప్రాతిపదికపై, భారత, పాకిస్తాన్‌లను ఏర్పర్చడానికి అంగీకరించారు. ఇది బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, భారత, పాక్ దోపిడీ పాలక దళారీ వర్గాలకు అవసరమైన చీలిక. దీని ఫలితంగా మూడు జాతులు–బంగాలీ, పంజాబీ, కశ్మీరీ జాతులు–భారత, పాకిస్తాన్‌ల మధ్య విభజనకు గురయ్యాయి. 'ముస్లిం జాతులు' అన్న తప్పుడు భావన ద్వారా సీ.పీ.ఐ. పాకిస్తాన్ డిమాండ్‌ను సమర్థించింది. కానీ, ఆ 'ముస్లిం  జాతుల' ప్రజలలో మైనార్టీ మాత్రమే ఆనాడు పాకిస్తాన్‌ను వాంఛిస్తున్నారన్న విషయాన్ని అది పరిగణనలోకి తీసుకోలేదు.

## జాతి రాష్ట్రాల ఏర్పాటును అడ్డుకున్న రాజ్యాంగం–బలమైన కేంద్రం

1948 జూన్‌లో భారత రాజ్యాంగ సభ ముగ్గురితో కూడిన భాషా ప్రయుక్త రాష్ట్రాల కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ ఆంధ్రా, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలు భాషా ప్రాతిపదికన ఏర్పడడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అది 'భారత జాతి' ఇంకా శైశవదశలోనే ఉన్నప్పుడు 'ఉప జాతులకు' భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పర్చలేం అంది. భారతదేశం సంపూర్ణ జాతిగా ఆవిర్భవించేవరకూ రాష్ట్రాల పునర్విభజన జరగదనీ కరాఖండిగా చెప్పింది. వాటికి స్వపరిపాలన ఇవ్వడం ద్వారా అంతిమంగా 'భారతజాతి' విలుప్తమవుతుంది అంటూ అది బలమైన కేంద్రంగా ఎన్నటికీ ఏర్పడబోదనీ కమిషన్ గట్టిగా వాదించింది. అంతేకాదు, దేశంలో జాతీయ భాష, జాతీయ భావనకు భాషా ప్రయుక్త రాష్ట్రాలు తీవ్ర ఆటంకం అవుతాయంటూ స్పష్టం చేసి, ప్రస్తుతం మన ఏకైక (తొలి, తుది) ఆవశ్యకత భారతదేశం ఒక జాతిగా ఆవిర్భవించడమే అంటూ తన వర్గ స్వభావాన్ని చాటుకుంది.

రాజ్యాంగ సభ ముగ్గురితో ఏర్పాటు చేసిన 'భాషా ప్రయుక్త రాష్ట్రాల కమిషన్' వైఖరి పై విధంగా ఉండగా, 1948 డిశంబర్‌లో కాంగ్రెస్ పార్టీ నెహ్రూ, పటేల్, బీ. పట్టాభి సీతారామయ్యలతో కూడిన 'భాషా ప్రయుక్త రాష్ట్రాల కమిటీ'ని నియమించింది. అధికార మార్పిడికి ముందు భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థించిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఈ కమిటీ నిరసించింది. 'దేశ రక్షణ, సమైక్యత, ఆర్థిక ప్రగతి' కోసం అన్ని రకాల ప్రత్యేక, చీలిక ధోరణులను దృఢంగా నిరసించాలని ఈ కమిటీ అభిప్రాయపడింది. 'భాష బలమైన బంధాన్ని వేయడమే కాదు, అది విడగొడుతుంది కూడా' అని అంటూ హిందీ భాష ప్రజల మధ్య బలమైన బంధాన్ని వేస్తే, మిగతా ప్రాంతీయ భాషాలు చీలదీస్తాయి అని చెప్పింది. విభ్రాంతికరమైన విషయమేమంటే ఈ కమిటీలోని బీ. పట్టాభి సీతారామయ్య ఆ కాలంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు. ఆయన

1946 డిసెంబర్ 8న దిల్లీలో జరిగిన 'భారతదేశంలో భాషా-సాంస్కృతిక ప్రాంతాల సదస్సు'లో ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రాంతీయ భాషలను నిర్ద్వంద్వంగా సమర్థించాడు. 'ఎక్కడికక్కడే ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా గుర్తించకపోవడం ప్రాంతీయ స్వపరిపాలనకు ద్రోహం, ఫెడరలిజాన్ని కాలతన్నడమే' అన్నాడు.

ఒక వైపూ రాజ్యాంగ సభ, మరో వైపూ కాంగ్రెస్ పార్టీ భాషా ప్రాతిపదికన రాష్ట్రాల నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎక్కడికక్కడే ప్రజలు మాత్రం తమ ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌లను వదులుకోలేదు. నిజానికి 1947 తర్వాత జాతుల వికాస క్రమంలో ప్రత్యేక రాష్ట్రాల నిర్మాణాన్ని తొలి చర్యగా భావించాలి. కాని దానిని దోపిడీ భారత పాలక వర్గాలు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాయి.

అనేక జాతుల వారితో కూడుకొని ప్రధానంగా గుజరాతీ బనియాల, రాజస్థానీ మార్వాడీల నాయకత్వంలో ఉన్న దళారీ నిరంకుశ బడా బూర్జువాల, బడా భూస్వాముల కూటమి మన దేశ అధికారాన్ని హస్తగతం చేసుకొన్న ఫలితంగా, వారి ప్రయోజనాల దృష్ట్యానే దేశంలోని రాష్ట్రాలను కేవలం పరిపాలనా యునిట్లుగానే ఉంచి, ఆర్థిక, రాజకీయాధికారమంతా కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లోనే కేంద్రీకృతం చేసుకుంది. అలా చేసుకోవడం దోపిడీ పాలకవర్గాల ఆర్థిక దోపిడీకీ, రాజకీయ పెత్తనానికి అవసరం. కాబట్టి వారు 'భారతజాతి', 'భారతీయ సంస్కృతి', 'అఖండ భారత్', 'అవిభాజ్యమైన భారత జాతి' మొదలగు అచారిత్రిక నినాదాలను నూతనంగా ప్రజల ముందుకు తెచ్చారు. పాకిస్తాన్‌లో సైతం అక్కడి పాలకవర్గాలు 'పాక్-ఇస్లామిజం', 'పాకిస్తానీ జాతీయవాదం' లాంటి నినాదాలే ముందుకు తెచ్చాయి.

మన దేశంలోని జాతుల అభివృద్ధికి దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వాముల కూటమి చేతుల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వం పెద్ద అడ్డంకిగా తయారైంది. భారతదేశం ఐక్యంగా ఉండాలంటే బలమైన కేంద్రం తప్పనిసరి అన్నదే వారి వాదన.

భారత పాలకవర్గాలు తమ భారత జాతీయతా, బలమైన కేంద్రం వాదనలకు సరిపడే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. 26 నవంబర్, 1949 నాడు రాజ్యాంగసభ ఆమోదించిన భారత రాజ్యాంగం 26 జనవరి, 1950 నుండి దేశంలో అమలులోకి వచ్చింది. అందులో రాష్ట్రాలలో ఎన్నికైన రాజ్యాంగబద్ధ శాసన సభలను నియంత్రించే, రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసే సంపూర్ణ అధికారాన్ని కేంద్రానికి కల్పించారు.

భారతదేశం ఫెడరల్ మరియు యూనిటరీ లక్షణాలను కలిగి వుంది. జాతుల విషయంలో రాజ్యాంగం చాలా ముందు చూపుతో తన బలమైన కేంద్రం అనే వాదన నుండి ఏమాత్రం వైదొలగకుండా రాష్ట్రాలకు పరిమిత హక్కులను, అధికారాలను కల్పించింది. నిజానికి, భారత రాజ్యాంగం జాతుల పాలిట ఒక 'శాపం'. జాతుల, ప్రజల ఆకాంక్షల వ్యక్తీకరణకు అది

ఎలాంటి అవకాశం ఇవ్వడం లేదు. రాజ్యాంగంలో ఇలా రాసిపెట్టారు. "భారత యూనియన్ నుండి విభజనను కోరుకోకూడదు. అనగా, విడిపోయె హక్కు సహా స్వయంనిర్ణయాధికారాన్ని డిమాండ్ చేయడం చట్ట రహితం. సభ్య రాష్ట్రం తలపెట్టిన భౌగోళిక మార్పులనైనా రాష్ట్రపతి సిఫారస్ లేకుండా పార్లమెంటులోని ఏ సభలోనూ ప్రవేశపెట్టరాదు" అంటూ రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్ (87-93, 98-99, 113-14) స్పష్టంగా హెచ్చరిస్తున్నవి. ఇలా అన్ని కీలక అధికారాలూ కేంద్రమే దఖలు పర్చుకుంది.

భారత పార్లమెంట్ నిజమైన ఫెడరల్ స్ఫూర్తికి పూర్తి భిన్నంగానే దేశంలోని అన్ని ప్రాంతాలకు సంబంధించి చట్టాలను చేసే అధికారాన్ని కలిగి వుంది. అంతే కాకుండా రాష్ట్రాలకు గవర్నర్లను రాష్ట్రపతే మరోమాటలో 'బలమైన కేంద్ర ప్రభుత్వమే' నియమిస్తుంది. 'భారత భద్రత, సుస్థిరత, సమైక్యత'ను దృష్టిలో పెట్టుకొని అలా చేయాల్సి వుంటుందని రాజ్యాంగం దానిని సమర్థిస్తుంది. రాష్ట్రాల వ్యవహారాలనేకం రాష్ట్ర ప్రభుత్వాలకు కానీ, అక్కడి ప్రజలకు గానీ రాజ్యాంగం ప్రకారం ఈషన్మాత్రమైనా సంబంధమున్న వ్యవహారాలు కావు. నిజానికి గవర్నర్ పదవీ ఎంత మాత్రం అలంకార ప్రాయం కాదు. అది బలమైన కేంద్రానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. వాస్తవంగా, జాతులకు స్వయంనిర్ణయాధికారాన్ని గుర్తిస్తే ఆ పదవే అవసరం వుండదు.

ఈ సందర్భంగా, స్వయంనిర్ణయాధికారం విషయంలో ఐక్య రాజ్య సమితి ఏం చెప్పిందో కూడా చూద్దాం. ఐక్య రాజ్య సమితి రూపకల్పన చేసిన 'అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడిక' లోని మొదటి ఆర్టికల్ 'స్వయంనిర్ణయాధికారం అన్ని ప్రజా సమూహాల హక్కు' అని ప్రకటించింది. దాని విశదీకరణగా 'తమ రాజకీయ స్థితిగతులను (స్టేటస్) స్వేచ్ఛగా నిర్ణయించుకునే హక్కు, తమ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పురోగమనాన్ని స్వేచ్ఛగా ఆవిష్కరించుకునే హక్కు అన్ని ప్రజా సమూహాలు కలగివుంటాయని' అది వివరించింది. కాని మన రాజ్యాంగం మాత్రం స్వయంనిర్ణయాధికారాన్ని నిర్ద్వంద్వంగా అణచివేస్తూంది. అంతేకాదు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 356వ అధికరణాన్ని వినియోగించుకొని గడచిన 70 ఏళ్లలో దేశంలో ఏర్పడిన అన్ని కేంద్ర ప్రభుత్వాలు తనకు లొంగి వుండని రాష్ట్ర ప్రభుత్వాలను అప్రజాస్వామిక ంగా బర్తరఫ్ చేశాయి. అధికార మార్పిడి తరువాత కేరళలో మొదటిసారి ఎన్నికైన 'మార్క్సిస్టు' ప్రభుత్వాన్నీ 1956లో కేంద్రం బర్తరఫ్ చేయడంతో ఆరంభించి, 2018లో కశ్మీర్‌లో పీడీపీ (పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ) తో ఏర్పరచుకున్న సంకీర్ణ ప్రభుత్వం నుంచి బీజేపీ కుట్రపూరితంగా వైదొలగిన తర్వాత ఆ అసెంబ్లీని రద్దు చేసే వరకు అనేక రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వాలు నిరంకుశంగా బర్తరఫ్ చేశాయి.

జాతులకు స్వయంనిర్ణయాధికారాన్ని కోరడం భారత రాజ్యాంగం ప్రకారం చట్ట సమ్మతం కాదనడంతో దేశంలోని అనేక జాతుల ప్రజలకు తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి అవకాశాలు లేకుండా చేసి భారత రాజ్యాంగం దారులు మూసేసింది. ఒకవైపు జాతులకు

స్వయంనిర్ణయాధికారాన్ని కాలదన్నుతున్న రాజ్యాంగం, మరోవైపు 'దేశంలో భాగం కావడానికి సిద్ధంగా ఉన్న విదేశీ భూభాగాన్ని' మాత్రం పార్లమెంట్ చట్టం ద్వారా విలీనం చేసుకోవచ్చునని ఆర్టికల్ 2లో తెలిపింది. వాస్తవంగా ఇది భారత విస్తరణ వాదానికి అద్దం పడుతుంది.

దేశంలోని అనేక ప్రాంతాల నుండి నిరంతరం ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్‌ను ఎదుర్కొన్న నెహ్రూ ప్రభుత్వం 1953లో 'రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్'ను నియమించింది. ఆ కమిషన్ రెండేళ్ల తర్వాత తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అది ఒక రకంగా రాష్ట్రాల పునర్విభజనను వ్యతిరేకిస్తూనే 'సంస్కృతి ఆధారంగా భాష ఏకత్వం చుట్టూ ప్రాంతాలు సమీకరించబడాలని' చెప్పింది.

మన రాజ్యాంగం పేరుకే ఫెడరల్ తప్ప అందులో యూనిటరీ లక్షణాలే ఆధిపత్యంలో ఉన్నాయి. రాజ్యాంగంలో కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా, విశేషాధికారాలు అంటూ పొందుపరిచి దేశ యావత్తు ఆదాయ వనరులను, అధికారాలను రంగాల/విభాగాల వారిగా విభజించారు. ఆర్టికల్ 246లో పేర్కొన్న కేంద్ర జాబితాలో 97 విభాగాలను, రాష్ట్ర జాబితాలో 66 విభాగాలను, ఉమ్మడి జాబితాలో 47 విభాగాలను పొందుపరిచారు. కేంద్ర లిస్టులో రక్షణ, అణుశక్తి, విదేశీ వ్యవహారాలు, రైల్వే, జాతీయ రహదారులు, నౌకా రంగం, ఓడ రేవులు, విమానయానం, తంతి-తపాలా, కరెన్సీ, అంతర్జాతీయ వ్యాపారం, బ్యాంకింగ్, బీమా, భారీ పరిశ్రమలు, గనులు మరియు ఖనిజాలు, ఉన్నత మరియు అత్యున్నత న్యాయస్థానాలు, ఎక్సైజ్ (ఆబ్కారీ) మరియు కస్టమ్స్ (సరిహద్దు) సుంకాలు, కార్పొరేటు పన్నులు మొదలైనవి ఉన్నాయి. నిజానికి ఇవన్నీ విశ్లేషించుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థపై కేంద్రపు భల్లూకపు పట్టూ, దాని అసాధారణ అధికారాలూ అర్థమవుతాయి. న్యాయ వ్యవస్థను చూస్తే దేశంలో తుది తీర్పు కేంద్ర జాబితాలోని సుప్రీంకోర్టుదే అని రాసారు.

రాష్ట్రాల జాబితాలో రాజ్యాంగం పేర్కొన్నవి పరిమిత అధికారాలకు సంబంధించినవి మాత్రమే. వాటికి కూడా 'బలమైన' కేంద్రం తన దయా దాక్షిణ్యాలపైనే రాష్ట్రాలను ఆధారపడేలా చేసింది. ఇక ఉమ్మడి జాబితా పేరుకే ఉమ్మడి తప్ప అది ప్రధానంగా కేంద్రం ప్రయోజనాలనే నేరవేరుస్తుంది.

రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో గల అనేక అంశాలను కేంద్రం తన చిత్తానుసారంగా మారుస్తుంది. 1950లలో చేసిన మూడవ, ఏడవ, 42వ రాజ్యాంగ సవరణలు రాష్ట్రాల అధికారాలను, ఆదాయ వనరులను కేంద్రం ఎలా కైవశం చేసుకుంటుందో తెలియచేస్తున్నాయి. కేంద్రం ఉమ్మడి జాబితాను విస్తరిస్తూ అందులో భూములు, అడవులను చేర్చింది. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై సర్కారియా కమిషన్ లాంటివి ఎన్నో కమిషన్‌లను ప్రభుత్వమే వేసినప్పటికీ ఏ ఒక్క కమిషన్ సిఫారస్‌లనైనా కేంద్రం అమలు చేసింది లేదు. మోదీ ప్రభుత్వ జీఎస్‌టీ విధానం అన్ని రాష్ట్రాల ఆదాయాలను మరింతగా కైవసం చేసుకునే అధికారాన్ని కేంద్రానికి కల్పించింది. ఫలితంగా దేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు మున్సిపాలిటీల స్థాయికి దిగజారి

ఫెడరల్ స్ఫూర్తి పూర్తిగా ఎగిరిపోయింది.

ఇకపోతే, రాజ్యాంగంలో పేర్కొన్న ప్రత్యేక అధికారాలు (రిసిడ్యూరీ పవర్స్) అన్నీ ఆచరణలో కేంద్రానివే. ఆచరణలో రాజ్యాంగం పేర్కొన్న ఫెడరల్ లక్షణాలు హుళక్కే. అందులో యూనిటరీ లక్షణాలే ఆధిపత్యంలో ఉండి బలమైన కేంద్రాన్ని ఏర్పర్చే దిశలో దేశంలోని జాతుల, ప్రాదుర్భావ జాతుల వికాసాన్నీ అడ్డుకుంటున్నాయి. 'దేశ రక్షణ పేరుతో నూతన రాజ్యాంగంలో కేంద్రానికి విస్తృతాధికారాలు ఇచ్చారనీ, ఇది దేశంలోని అన్ని జాతుల ఆర్థిక, రాజకీయ రంగాలపై మార్వాడీ-గుజరాతీ పెట్టుబడిదారుల అడ్డు లేని ఆధిపత్యాన్ని కల్పించడం తప్ప మరేం కాదని' ఆనాటి కమ్యూనిస్టు పార్టీ తన ప్రణాళికలో విమర్శించింది.

నిజానికి అభివృద్ధి చెందుతున్న జాతుల సమస్య పరిష్కారానికి భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం ఒక ఆరంభమేగాని తుది మాత్రం కాదు. తమ భవిష్యత్తును తాము రూపొందించు కొనేందుకు వీలుగా స్వయంనిర్ణయాధికారాన్ని సాధించుకోవడమే అందుకు పరిష్కారం. అవి ఎలాంటి డిమాండు లేవనెత్తుతాయనేది ప్రధానంగా యూనియన్ ప్రభుత్వం చేపట్టే వైఖరిపైనే ఆధారపడి ఉంటుంది.

మన దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలకు, అన్ని జాతులకు చెందిన ప్రజలు విద్య, ఉద్యోగాలు, భూములు తదితరాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర జాతి ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్నారు. 1947 తర్వాత ప్రత్యేకంగా ప్రపంచీకరణ విధానాలు అమలులోకి వచ్చినప్పటి నుండి ఈ క్రమం గణనీయంగానే పెరిగింది. వీరిని జాతి మైనారిటీలుగా పిలుస్తున్నారు. వీరు తమ హక్కుల కోసం పలు రూపాలలో పోరాడుతున్నారు. భారత రాజ్యాంగం వీరికి కొన్ని హక్కులను కల్పించినప్పటికీ వాటి అమలు నామమాత్రంగానే ఉంది. ఈ జాతి మైనారిటీల ప్రజాస్వామిక హక్కులన్నీ న్యాయమైనవే. వేరే రాష్ట్రం/జాతి భూభాగంలోకి వెళ్లి నివసిస్తున్నందున వీరికి స్వయంనిర్ణయాధికార హక్కు ఉండనప్పటికీ, గణనీయమైన సంఖ్యలో ఒకే భూభాగంలో వీరు నివసిస్తున్న చోట తమ అభివృద్ధి కోసం పరిపాలనా యూనిట్లను ఏర్పరచుకునే హక్కు వీరికి ఉండాలి.

## దేశంలో చోటుచేసుకున్న జాతుల ఉద్యమాలు

1947 అధికార మార్పిడి తర్వాత కాంగ్రెస్ నాయకత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణాన్ని 'బాల్కనైజేషన్ ఆఫ్ ఇండియా' (పరస్పరం కలహించుకునే చిన్న రాష్ట్రాల విభజన) అంటూ అడ్డుకున్న ఫలితంగా, మన దేశంలో 'స్వాతంత్ర్య'నంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల (ప్రత్యేక రాష్ట్రాల) ఏర్పాటు డిమాండ్ ఉద్యమాల రూపంలో ముందుకు వచ్చింది. బ్రిటిషర్స్ కాలంలోనే దేశంలోని కన్నడ, తమిళ తదితర జాతుల ప్రజలతో పాటు ఝార్ఖండ్‌లోని సంథాలీ ఆదివాసులు 1927లో ఏర్పడిన సైమన్ కమిషన్‌కు ప్రత్యేక రాష్ట్రంకోరుతూ మెమోరాండం సమర్పించుకున్నారు.

అదే సమయంలో, స్వయాన కాంగ్రెస్ పార్టీ, దేశాన్ని 18 రాష్ట్రాలుగా విభజించాలని బలంగా అభిప్రాయపడింది. అది మద్రాస్ పునర్విభజనతో తక్షణం ప్రారంభం కావాలని కూడా కోరింది. కాని బ్రిటిష్‌వారి హయాంలో ప్రజల డిమాండ్ నెరవేరలేదు. ఆనాటి నుండి అధికార మార్పిడి జరిగి దశాబ్దం గడిచే వరకూ వారు కేంద్రానికి మెమోరాండములు అందిస్తూనే వచ్చారు.

'దక్షిణ భారత విముక్తి ఫెడరేషన్' నాయకుడు తమిళనాడులో ఈ.వీ.రామస్వామి నాయకర్ (పెరియార్–సాధువు) 'భారతదేశం ఒక జాతి' అనే భావనను సవాల్ చేస్తూ 'ద్రావిడులకు ద్రవిడనాడు', 'తమిళులకు తమిళనాడు' అనే డిమాండ్‌ను లేవనెత్తాడు. 1944లో ఆయన చొరవతోనే ఏర్పడిన 'దక్షిణ భారత విముక్తి ఫెడరేషన్' ఆ తరువాత 'ద్రవిడ కజగమ్'గా పేరు మార్చుకుంది. అది, 1946 మే 16నాడు క్యాబినెట్ మిషన్‌కు 'ద్రావిడులకు సార్వభౌమ స్వతంత్రత' కావాలనీ విజ్ఞప్తి చేసింది. ఆ తర్వాత కాలంలో అది 'ద్రవిడ కజగం' ఉద్యమానికి రణ నినాదం అయింది. కానీ, 1927లో 18 రాష్ట్రాలు కావాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరి నిండా పాతికేండ్లు అయినా తిరక్కముందే, భారత రాజ్యాంగంలో ఆ సంఖ్య తొలుత 14కే దిగింది. ఫలితంగా, ప్రజలు సహజంగానే తిరగబడ్డారు. దేశంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల సాధనకై వీధుల్లోకి వచ్చారు.

భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల నిర్మాణం జరగాలనే ప్రధాన నినాదానికి మాత్రమే ఆనాడు వివిధ జాతుల డిమాండ్ పరిమితమైంది. అది ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల వ్యక్తీకరణే. దాని కోసం దేశంలో పెద్దెత్తున్న ప్రజా పోరాటాలు కొనసాగి ఎంతో మంది ప్రజలు తమ ప్రాణాలను అర్పించారు. చివరికి, కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పర్చుకున్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మున్నగు రాష్ట్రాలు ఏర్పడినాయి. అప్పుడు పెల్లుబికిన ఉద్యమాలలో అన్ని భాషా ప్రాంతాల ప్రజా ఉద్యమాలకు న్యాయం జరగనే లేదనడానికి 1962లో ప్రధాని నెహ్రూ పంజాబ్ 'సూబా' (రాష్ట్రం) డిమాండ్‌పై స్పందిస్తూ 'పంజాబీ మాట్లాడే రాష్ట్రాన్ని ఏర్పర్చడం కన్నా నేను అంతర్యుద్ధాన్ని ఎదుర్కోవడానికే సిద్ధం' అనడమే పెద్ద ఉదాహరణ.

నిజానికి మన దేశంలో సాగుతున్న జాతుల ఉద్యమాలను మూడు రకాలుగా విభజించి చూడాల్సి వుంటుంది. వాటిలో మొదటి రకం, ఇంతకు ముందెప్పుడూ ఇండియాలో లేకుండా అధికార మార్పిడి తర్వాత బలవంతంగా ఇండియాలో కలుపుకున్నవి. ఇవి దశాబ్దాలుగా సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తూ విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారాన్ని డిమాండ్ చేస్తున్నవి. వాటి డిమాండ్ అత్యంత న్యాయ సమ్మతమైనది. ఎందుకంటే, ఆ ప్రాంతాలు చారిత్రకంగా మున్నెన్నడూ భారతదేశంలో అంతర్భాగం కావు. 1947 తర్వాతే, భారత పాలకవర్గాలు ఆ ప్రాంతాలను దౌర్జన్యంగా, అప్రజాస్వామికంగా, సైనిక చర్యలతో బ్రిటిష్ వారి వారసత్వంలో భాగంగా వాటిని దేశంలో విలీనం చేసుకున్నాయి. ఆ ఉద్యమాలను దోపిడీ పాలకవర్గాలు

వేర్పాటువాద ఉద్యమాలంటూ, అవి విదేశీ శక్తుల ప్రోద్బలంతో సాగుతున్నాయంటూ, వారి సాయుధ పోరాట చర్యలను ఉగ్రవాద (సరిహద్దు ఉగ్రవాద) చర్యలంటూ అనేక రకాలుగా దుష్ప్రచారం చేస్తూ వాటిని ప్రధానంగా సైనికంగా అణిచివేస్తోన్నవి. దేశంలోనూ, అంతర్జాతీయ వేదికల పైననూ ఎడతెరపి లేకుండా వాటిని నిందిస్తూ దుష్ప్రచారం చేస్తోన్నవి. భారత పాలక వర్గాల వైఖరిని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ఆ పోరాటాలను సమర్థిస్తున్నది.

ఇక రెండవ రకానివి అంటే, దేశంలోనే భాగంగా ఉంటూ చాలా వరకు ఆయా ప్రాంతాల అభివృద్ధీ, లేదా వారి భాషలకు గుర్తింపూ, తమ తమ రాష్ట్రాలకు కేంద్రం నుండి అధిక అధికారాలూ, నిధులూ, ప్రత్యేక హోదా కావాలనడం, రాష్ట్రాల అసమాన అభివృద్ధిని వ్యతిరేకిస్తూ తమ ప్రాంతాల వికాసం కోసం ప్రత్యేక రాష్ట్రాల నిర్మాణాన్ని కోరుకోవడం, రాష్ట్రాల సరిహద్దుల మార్పులు కోరడం, నదీ జలాల పంపకంలో సముచిత వాటాలుండాలంటూ ఇంకా పలు ప్రజాస్వామిక డిమాండ్లతో సాగుతున్న ఉద్యమాలు. ఇవి జాతుల అభివృద్ధీ, ప్రజాస్వామిక ఆకాంక్షల సాధనకై ప్రధానంగా 'శాంతియుతంగా' సాగుతున్న ఉద్యమాలివి. ఇవి దేశం నుండి విడిపోయే హక్కును కోరుకోవడం లేదు.

మూడో రకమైన ఉద్యమాలు ప్రాదుర్భావ జాతులకు సంబంధించినవి.

ఇపుడు ఆ మూడు రకాల ఉద్యమాల వివరాలు సంక్షిప్తంగా చూద్దాం. ముందుగా విడిపోయే హక్కుతో సహ స్వయంనిర్ణయాధికారాన్ని డిమాండ్ చేస్తున్న ఉద్యమాలను చూద్దాం.

## విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారం కోసం సాగుతున్న జాతుల ఉద్యమాలు:

భారత యూనియన్‌లో దౌర్జన్యపూరితంగా, తుపాకి బలంపై విలీనమైన కశ్మీర్, ఈశాన్య ప్రాంతాలలో దశాబ్దాల తరబడిగా ప్రజా ఉద్యమాలు సాగుతున్నాయి. ఆ ఉద్యమాలకు తొలి నుండి పెటీబూర్జువా శక్తులే నాయకత్వం వహిస్తున్నాయి. తొలుత స్వాతంత్ర్యోద్యమ కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ లెనిన్ బోధనలను వల్లించినప్పటికీ క్రమంగా విప్లవ రాజకీయాలను వదలుకుని రివిజనిస్టు పార్టీగా మారడంతో దేశంలోని జాతుల ఉద్యమాల పట్ల బూర్జువా వైఖరినే చేపట్టింది. దాని నుండి విడిపోయీ ఉనికిలోకి వచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కూడా అదే దారి పట్టింది.

మన దేశంలో పెట్టిబూర్జువా శక్తుల నాయకత్వంలో సాగుతున్న ఆ ఉద్యమాలు అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. విద్రోహాలకూ బలవుతున్నాయి. అందులో భాగమే కశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా, మిజోరం ప్రజల వీరోచిత పోరాటానికి లాల్‌డెంగా, మణిపుర్ పోరాటానికి విశ్వేశ్వర సింగ్, నాగాల పోరాటానికి ఫిజో, అసోం పోరాటానికి ఉల్ఫా నాయకత్వంలోని ఒక సెక్షన్, ఏ.జీ.పీ.లు అంతిమంగా ద్రోహమే చేశారు. దేశంలో 1967 నక్సల్‌బరీ సాయుధ రైతాంగ పోరాటం బద్దలైన తర్వాత ఏర్పడిన మన పార్టీ జాతుల ఉద్యమాల విషయంలో

సరైన వైఖరిని చేపట్టింది. కాని వివిధ కారణాల వల్ల చాలా వరకు ఈ ఉద్యమాలకు నాయకత్వాన్ని అందించలేకపోయింది. అయినప్పటికీ, ఈ పోరాటాలు విజయవంతం కావాలంటే, వీటి ఆకాంక్షలు నెరవేరాలంటే ఈ ఉద్యమాలకు నాయకత్వం వహించాల్సిన, వాటిని సమైక్యం చేయాల్సిన చారిత్రక బాధ్యత మన పార్టీ పైనే ఉంది.

**కశ్మీర్ :** భారతదేశానికి ఉత్తరాన గల కశ్మీర్ ప్రజలు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారం కోసం దీర్ఘకాలంగా, వీరోచితంగా పోరాడుతున్నారు.

వలస కాలంలో కశ్మీర్ ఒక స్వతంత్ర రాజ్యంగానే కొనసాగింది. 1947 అగస్టు అధికార మార్పిడి తర్వాత కశ్మీర్‌ను తమ సైనిక చర్యలతో రెండుగా చీల్చి భారత, పాక్ పాలకవర్గాలు పంచుకున్నాయి. దాదాపు మూడింట రెండొంతుల భూభాగం భారత ఆక్రమిత కశ్మీర్(ఐ.ఓ.కే.)గా, మూడింట ఒక వంతు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీ.ఓ.కే.)గా అది చీలిపోగా, కశ్మీర్ ప్రజలు ఐక్య కశ్మీర్ కోసం పోరాడుతున్నారు. భారత ఉప ఖండం నుండి బ్రిటిష్ వారు తెర మరుగయ్యాక అమెరికా ముందుకొచ్చింది. పాకిస్తాన్ లోని అత్యంత కీలకమైన, నాలుగు దేశాల (చైనా, రష్యా, భారత్, పాక్) సరిహద్దులలోని గిల్గిట్ ప్రాంతంలో అమెరికా తన సైనిక శిబిరాన్ని స్థాపించింది. 1947 అక్టోబర్‌లో నెహ్రూ ప్రభుత్వం భారత సైన్యాన్ని పంపి తుపాకీ మొనమీద నిలపిన కశ్మీర్ చరిత్రను మనమిక్కడ సంక్షిప్తంగా చూద్దాం.

1846లో కశ్మీర్‌లో గులాబ్ సింగ్ డోగ్రా అధికారాన్ని చేపట్టిన నాటి నుండి నేటి వరకు కశ్మీర్ ప్రజలు తమ 'స్వాతంత్ర్యం' కోసం పోరాడుతూనే ఉన్నారు. 1947లో డోగ్రా రాజు రాజా హరిసింగ్ భారత యూనియన్‌కు లొంగిపోవడంతో కశ్మీర్‌లో డోగ్రాల పాలనా అంతమైంది. 'ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా సమస్య పరిష్కరించుకోవాలనే' ఒప్పందంతో 1947 అక్టోబర్, 26 నాడు కశ్మీర్ భారత యూనియన్‌లో 'విలీనమై' భారత దోపిడీ పాలకుల ఫాసిస్టు పాలనలో భాగమైంది.

1947 అక్టోబర్‌లో కశ్మీర్‌లో మత ఘర్షణలు చెలరేగినపుడు దాదాపు రెండున్నర లక్షల ముస్లిం ప్రజలు చనిపోగా రాజా హరిసింగ్ జమ్మూకు పారిపోయాడు. ఆ తర్వాత నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు షేక్ అబ్దుల్లాను కశ్మీర్‌కు ప్రధాన మంత్రిగా నియమిస్తున్నట్లు ఒక బూటకపు లేఖను పాత తేదీతో భారత పాలకులు సృష్టించి ఆయనను గద్దె నెక్కించారు. 1951లో కశ్మీర్‌లో ఎన్నికలు జరిపించగా నేషనల్ కాన్ఫరెన్స్ అక్కడి 75 స్థానాలలో 73 స్థానాలకు పోటీ లేకుండానే ఎన్నికైంది. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించేలా నెహ్రూతో, షేక్ అబ్దుల్లా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. దాని ప్రకారం కశ్మీర్‌లో కేంద్రం అధికారాలు పరిమితం అయ్యాయి. మండుతోన్న కశ్మీర్ సమస్యను చల్లార్చడానికి భారత రాజ్యాంగంలో ఆగమేఘాల మీద ఆర్టికల్ 370ని రూపొందించారు. దాని ప్రకారం కశ్మీర్ ఒక ప్రత్యేక ప్రతిపత్తి గల రాష్ట్ర హోదాను సంతరించుకుంది. కేవలం విదేశీ వ్యవహారాలు, రక్షణ, కరెన్సీ లాంటి అంశాలు

మినహా మిగితా పాలనా వ్యవహారాలలో భారతదేశ జోక్యం ఉండదనీ ఒప్పందం చేసుకుని దానిని రాజ్యాంగంలో పొందుపరిచారు. దేశానికి సంబంధించి భారత పార్లమెంటు చేసిన చట్టాలు ఆ ఒప్పందం ప్రకారం కశ్మీర్‌కు వర్తించవు. అలాగే ఆ రాష్ట్ర అధినేతకు ప్రధాన మంత్రి హెూదా కల్పించారు. వారికి సంబంధించిన చట్టాలు వాళ్ళే చేసుకునే స్వయం పాలనా అధికారాన్ని కల్పించారు. ఇది ఒక నిజమైన ఫెడరల్ వ్యవస్థ లక్షణం. కానీ అవేవీ ఆచరణ రూపం తీసుకోలేదు.

శ్రీనగర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాలన పట్ల ఢిల్లీలో అసంతృప్తి మొదలయింది. డోగ్రా రాజు కైవశంలోని భూములను అధికారంలో వున్న షేక్ అబ్దుల్లా ప్రభుత్వం వ్యవసాయ సంస్కరణలు తీసుకొచ్చి రైతాంగానికి పంచి ప్రజాభిమానాన్ని చూరగొంది. అప్పటివరకూ స్తబ్దుగా వున్న కాంగ్రెస్ పార్టీకి దేశంలో తాను ఎన్నడూ ఊహించని భూసంస్కరణలు కశ్మీర్‌లో జరగడంతో దానికి అది ఏ మాత్రం జీర్ణం కాలేదు. షేక్ అబ్దుల్లా చేపట్టిన చర్యలు మింగుడుపడని నెహ్రూ ప్రభుత్వం ఆయన కశ్మీర్ స్వాతంత్ర్యం కోసం ప్రయత్నిస్తున్నాడన్న సాకుతో ఆయనకిచ్చిన గత హామీలన్నీ బుట్టదాఖలా చేసి, ఆయన్ను కశ్మీర్ ప్రధాని పదవి నుంచి తొలగించింది. ఆయన విద్రోహానికి పాల్పడ్డాడన్న సత్య దూరమైన ఆరోపణతో ఆయనను భారత జైళ్లలో 14 సంవత్సరాలకు పైగా నిర్బంధించారు.

14 సంవత్సరాలు జైలు జీవితం గడిపినప్పటికీ చివరికి షేక్ అబ్దుల్లా 1977లో భారత పాలకవర్గాలకు లొంగిపోయాడు. నిజానికీ, షేక్ అబ్దుల్లా ఎన్నడూ ప్రజలపై ఆధారపడి కశ్మీర్ స్వయంనిర్ణయాధికారం కోసం పోరాడలేదు. 'తూర్పు స్విట్జర్లాండ్'లా తన స్వతంత్ర కశ్మీర్ ఉంటుందనీ, 'నయా కశ్మీర్' దస్తావేజ్ ద్వారా అబ్దుల్లా ప్రజలకు హామీ ఇచ్చాడు. కాని దాని కోసం అమెరికా సామ్రాజ్యవాదుల పై ఆశలు పెట్టుకొని అది ఆడించినట్టు ఆడే భారత, పాక్ పాలకవర్గాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి కశ్మీర్ 'స్వయంనిర్ణయాధికారం' కలలు కన్నాడు. ఆయనే కాదు, ఆయన తర్వాత అక్కడ అధికారాన్ని చేపట్టిన ఏ ఒక్కరూ ప్రజల పక్షాన నిలబడకుండా, దోపిడీ భారత పాలకవర్గాలనే అంటకాగుతున్నారు. పార్లమెంట్ రాజకీయాలను అనుసరిస్తున్న అక్కడి రాజకీయ పార్టీలన్నీ అదే వరుసలో నిలిచాయి. మరోవైపూ 'భారత యూనియన్‌లో కశ్మీర్ అంతర్భాగం' అన్న కల్పిత భావనను వివిధ కుట్రల ద్వారా ప్రజలలో బలపడేట్టు భారత పాలకులు ఎడతెరపి లేకుండా ప్రచారం చేస్తూనే ఉన్నారు.

కశ్మీర్ ప్రజల ఉద్యమం ఆగిందెన్నడూ లేదు. 1989లో రెండవ విడుత ఉద్యమం ముందుకు వచ్చిన నాటి నుండి 2018 చివరి వరకు లక్షకు పైగా ప్రజలు ఆ ఉద్యమంలో భారత సైనికుల, కేంద్ర పారామిలిటరీ బలగాల, రాష్ట్ర పోలీసుల తుపాకి గుళ్లకు బలయ్యారు. ప్రస్తుతం భారతదేశంలో కశ్మీర్ అంటేనే ఆజాదీ కోరుకునే ప్రజల హత్యలు, సామూహిక అత్యాచారాలు, మాయం చేయడాలు, సామూహిక ఖననాలు, అరెస్టులు, పెల్లెట్ గన్నుల ప్రయోగం, కఠిన

జైలు శిక్షలు, ఉరిశిక్షలకు పర్యాయ పదమైంది. భారత దోపిడీ పాలక వర్గాలు తప్ప ప్రపంచమంతా కోడై కూస్తున్న వాస్తవాలివి. అయినప్పటికీ రోజూ తుపాకీ కాల్పుల మధ్య అక్కడి ప్రజలు అసమాన త్యాగాలతో 'ఆజాదీ కశ్మీర్' అంటూ భారత సైన్యాలతో తలపడుతున్నారు.

కశ్మీర్‌లో ప్రతి 17 మంది పౌరులకు ఒక సైనికుడిని భారత పాలకులు మోహరించి ప్రపంచంలోనే అత్యంత సైనికీకరణ ప్రాంతంగా మార్చివేశారు. రా (ఆర్.ఏ.డబ్ల్యు.), ఐ.బి., ఎన్.ఐ.ఏ., మొసద్, సీ.ఐ.ఏ., ఎఫ్.బీ.ఐ., బీ.ఎన్.డీ. మొదలైన దేశ, విదేశ కుఖ్యాత గూఢచారి సంస్థలు ఎంతో క్రియాశీలంగా అక్కడ పని చేస్తున్నప్పటికీ, ఆఫ్‌స్పా (సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం) లాంటి నరహంతక చట్టాలను అక్కడ అమలుచేస్తున్నప్పటికీ భారత పాలకులు నిలకడగా, నిశ్చింతగా కశ్మీర్‌ను పాలించలేకపోతున్నారు.

భారత పాలకులు కశ్మీర్ ప్రజల జాతి పోరాటాన్ని రక్తపుటేరులలో ముంచుతూ కశ్మీర్ ఉద్యమాన్ని వేర్పాటువాదమంటూ, అక్కడి ఉద్యమకారులను పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద శక్తులంటూ, ఆ ఉద్యమం సరిహద్దు ఉగ్రవాదం (క్రాస్ బార్డర్ టెర్రరిజం) అంటూ దానిని విచ్ఛినకరమైనదిగా చిత్రిస్తూ దేశ, ప్రపంచ వేదికలపై అపఖ్యాతి పాలు చేస్తున్నారు. తమ జాతి మనుగడ కోసం, విడిపోయే హక్కుతో సహ స్వయంనిర్ణయాధికారం కోసం ఉద్యమిస్తున్న ఆ ప్రజల పోరాటాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి తమ అణచివేత చర్యలకు సాధికారం కోసం అనేక కుట్రలు పన్నుతున్నారు.

కశ్మీర్ జాతి ప్రజా ఉద్యమాన్ని మా పార్టీ సమర్థిస్తున్నది. విప్లవ కార్మికవర్గ నాయకత్వాన ఏర్పడే 'భారత జనతా ప్రజాతంత్ర రిపబ్లిక్' లోనే దేశంలోని సమస్త జాతులకు విడిపోయే హక్కు సహ స్వయంనిర్ణయాధికారం ఉంటుందనీ, వారి సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందనీ, జాతుల శాశ్వత విముక్తికి మార్గం సుగమం అవుతుందని మా పార్టీ స్పష్టం చేస్తోంది.

**మణిపుర్ :** ఈశాన్య ప్రాంత జాతి విముక్తి పోరాటాలలో మణిపురీ జాతి ప్రజలకు సుదీర్ఘ వీరోచిత పోరాట చరిత్ర వుంది.

మణిపుర్‌లో నివసించేది ప్రధానంగా హిందువులుగా మారినఆదివాసేతర మీయ్‌తీలు కాగా, కొండలలో ఉండేది క్రైస్తవులుగా మారిన నాగా, కుకీ తెగలు. ఈశాన్య భారతంలో వేరే ఏ ప్రజల చరిత్ర చెప్పుకున్నా అందులో బంగాల్, అసోంల ప్రస్తావన అధికంగానే వుంటుంది. ఎందుకంటే బ్రిటిష్ పాలకులు తమ ప్రత్యక్ష పాలనలో ఉన్న ఈశాన్య భారత ప్రాంతాన్నంతా తొలుత బంగాల్ రాష్ట్రంలో భాగంగాను, 1874లో అసోం రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన తరువాత అసోం రాష్ట్రంలో భాగంగాను పరిపాలించారు. అందుకే అధికార మార్పిడి తర్వాత ఆ ప్రాంతాలన్నీ మొదట అసోంలో భాగంగా ఉండి, అక్కడ మొదలైన పోరాటాల ఫలితంగా, తరువాత అవి

విడి విడి రాష్ట్రాలయ్యాయి. అయితే మణిపుర్‌ను మాత్రం బ్రిటిష్ వాళ్లు ప్రత్యక్షంగా ఎప్పుడూ పరిపాలించలేదు. కాబట్టి అది ఎన్నడూ బెంగాల్‌లోగానీ, అసోంలోగానీ భాగంగా లేదు. 1947 తర్వాతనే కేంద్రం దౌర్జన్యంగా దానిని సైనిక చర్యతో ఒక రాష్ట్రంగా భారత్‌లో విలీనం చేసుకుంది.

1947లో జరిగిన అధికార మార్పిడి తర్వాత భారత పాలకులు మణిపుర్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చి 'స్వయంప్రతిపత్తి'తో కూడిన విలీనానికి ఆమోదింపచేశారు. దానితో, 1948లో అది భారత ఎన్నికల కమిషన్‌తో నిమిత్తం లేకుండా అక్కడ వారు ఎన్నికలు నిర్వహించుకోవడంతో మణిపుర్ స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతంగా అవతరించింది. అది భారత్ కోరికను కాదనకుండా రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార రంగాలలో మాత్రం అధికారం దిల్లీకే వదిలేసి తన వ్యవహారాలను తాను నిర్వహించకోవడం మొదలుపెట్టింది. కానీ, ప్రధానమంత్రి నెహ్రూకూ, హోంమంత్రి పటేల్‌కు అది నచ్చలేదు. వారు మణిపుర్‌ను సంపూర్ణంగా భారత్‌లో కలిపేసుకోవాలనే నిర్ణయించుకున్నారు.

1947లో వి.కే.క్రిష్ణ మీనన్ మణిపుర్ రాజును భారత్‌లో చేరేలా ఒప్పించే ప్రయత్నాలు చేసి విఫలమయ్యాడు. తుదకు మణిపుర్ రాజును భారత సైన్యంచే మాయం చేయించి తుపాకీని ఎక్కుపెట్టి భారత యూనియన్‌లో చేరుతున్నట్టు ఆయనతో 21 సెప్టెంబర్ రోజు నెహ్రూ, పటేల్‌లు సంతకం పెట్టించుకున్నారు. ఫలితంగా మణిపుర్ ప్రజలకు ప్రధాని నెహ్రూ, ఉపప్రధాని పటేల్ మిగిల్చింది తమ జాతికి విడిపోయే హక్కుతో సహ స్వయంనిర్ణయాధికారం కోసం భారత పాలకులతో యుద్ధం చేయడమే. తొలుత మణిపుర్‌ను భారత్‌లో ఒక రాష్ట్రంగానైనా స్వీకరించకుండా 20 సంవత్సరాలు కేంద్ర పాలిత ప్రాంతంగానే పెట్టారు. ఆ తర్వాత 1972లో దానికి ఒక రాష్ట్ర గుర్తింపు ఇచ్చారు.

గత ఏడు దశాబ్దాలుగా మణిపురీ ప్రజలు (ప్రధానంగా మీయ్‌తీలు) జాతీయ విప్లవకర సంస్థల నాయకత్వాన విముక్తి సైన్యాలను ఏర్పర్చుకొని భారత సైన్యాలతో తలపడుతున్నారు. సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం, 1958 లాంటి క్రూరమైన చట్టాలను సైతం ఎదుర్కొంటూ వారు పోరాడుతున్నారు. ఆ జాతి ప్రజల ఆకాంక్షలు నెరవేరేవరకు వారు పోరాడి తీరుతారు. ఆ ప్రజల ఉద్యమాన్ని మన పార్టీ సమర్థిస్తూ భారత విస్తరణ వాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడుదామని స్పష్టం చేస్తోంది.

**నాగాలాండ్ :** ఈశాన్య ప్రాంతంలోని మరో జాతి ఉద్యమం నాగాలాండ్ ఉద్యమం. నాగా అన్నది ఒక తెగ పేరు కాదు. నాగా అనేది భాషా సంస్కృతులలో పరస్పరం దగ్గరి వారయిన కొన్ని తెగల సామాన్య నామధేయం. ఆ తెగలన్నీ తమను తాము 'నాగా తెగలు'గా భావించుకుంటాయి. వాటిలో ముఖ్యమైనవి అంగామీ, తంగ్‌కుల్, మావో, ఆవో మొదలైనవి.

నాగాలు అప్పటి అసోం రాష్ట్రంలోనే కాక మణిపుర్‌లోనూ పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

అసోంలో గల 15 లక్షల నాగా జనాభాలో సగం మందినీ, 30 భాషలు మాట్లాడే 15 ప్రధానమైన తెగల వారినీ బాప్టిస్ట్ మిషనరీలు వలస కాలంలోనే క్రైస్తవ మతంలోకి మార్చేశాయి. నాగా ప్రజల ప్రాతినిధ్య సంస్థ 'నాగా నేషనల్ కౌన్సిల్' (ఎన్.ఎన్.సి.) 1947 జూన్‌లో అసోం గవర్నర్ అక్బర్ హైదరీతో ఒక ఒప్పందం చేసుకుంది.

గవర్నర్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం 10 సంవత్సరాల పాటు నాగాలాండ్ భారత్‌లో ఉండాలనీ, ఆ తరువాత ఆ ఒప్పందాన్ని పునఃపరిశీలించాలనీ అంగీకారం కుదిరింది. అంటే నాగాలు తాము ఇండియాలో కొనసాగాలా లేదా అనే విషయాన్నీ నిర్ణయించుకునే అధికారాన్ని కలిగి వున్నారు. ఇది ఇలా ఉండగా, భారతదేశానికి బ్రిటన్ అధికారం అప్పగించడానికి ఒక రోజు ముందే నాగా ప్రజల నాయకుడు ఫిజో నాయకత్వంలో వారు అక్కడ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. 1952 మార్చిలో ఫిజో దిల్లీలో నెహ్రూను కలిశాడు. దేశ ప్రధాని నెహ్రూ 'నాగాలకు స్వాతంత్ర్యం ఇచ్చే ప్రసక్తే లేదు' అంటూ తన విస్తరణవాద వైఖరిని స్పష్టం చేసాడు. 1953లో 'నాగా నేషనల్ కౌన్సిల్' గుర్తింపును నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో నాగా ఉద్యమకారులపై పోలీసు, సైనిక దాడులు తీవ్రం అయ్యాయి. దానితో నాగాలు కొండల్లో రహస్యంగా సమావేశమై సాయుధ పోరాట నిర్ణయం తీసుకున్నారు. 1955 చివరి నాటికి వాళ్లు నాగా ఫెడరల్ ప్రభుత్వాన్ని ప్రకటించుకున్నారు. మరోవైపు కేంద్రం 1963లో నాగాలాండ్‌ను సైనిక అణిచివేతతో భారత యూనియన్‌లో ఒక రాష్ట్రంగా మార్చివేసింది.

గత ఏడు దశాబ్దాలుగా నాగా ప్రజలు విడిపోయే హక్కు సహ స్వయంనిర్ణయాధికారం కోసం సాయుధంగా పోరాడుతూ భారత సైన్యాలను ప్రతిఘటిస్తున్నారు. భారత దోపిడీ పాలకులు నాగా ప్రజల పోరాట సంస్థలను నీరుగార్చడానికి ప్రధానంగా సైనిక దాడులకు పాల్పడుతూనే అనేక కుట్రలు పన్నుతున్నారు. గత 20 ఏండ్లకు పైగా ప్రధాన నాగా పోరాట సంస్థలతో భారత ప్రభుత్వం 'కాల్పుల విరమణ' ఒప్పందాన్ని కొనసాగిస్తోంది. కొద్ది సంవత్సరాల క్రితమే ఒక సంస్థ భారత ప్రభుత్వంతో చర్చల నుండి విరమించుకుని సాయుధంగా పోరాడుతున్నది. వారి పోరాట చేవను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం ఎడతెగని చర్చల ప్రహసనాన్ని కొనసాగిస్తూ అనేక దుష్ట పథకాలు రూపొందిస్తున్నది. నిజానికి భారత విస్తరణవాదులతో చర్చల ద్వారా 'విడిపోయే హక్కు సహ స్వయంనిర్ణయాధికారం' డిమాండ్ పరిష్కారం అయ్యేది కాదు. నాగా జాతి ప్రజల విముక్తికి సాయుధ పోరాటమే ఏకైక మార్గం.

మన పార్టీ నిర్ద్వంద్వంగా నాగా ప్రజల విడిపోయే హక్కుతో సహ స్వయంనిర్ణయాధికారాన్నీ, వారి సాయుధ పోరాటాన్నీ సమర్థిస్తోంది. వారితో భుజం భుజం కలిపి భారత విస్తరణవాదానికి వ్యతిరేకంగా పోరాడే తన వైఖరిని సుస్పష్టంగా ప్రకటించింది.

**అసోం :** 1826లో అసోం బ్రిటిష్ వారి దురాక్రమణకు గురై 1874వరకు బంగాల్ ప్రావిన్స్‌లో భాగమైంది. 44 సంవత్సరాలు బంగాల్ ప్రావిన్స్‌లో భాగమైన అసోంను 1874

నుండి 1905 వరకు అంటే 31 సంవత్సరాలు తూర్పు బంగాల్‌లో భాగం చేశారు. ఫలితంగా, అసోం జనాభాలో 60 శాతానికి లోపు అసామీ భాష మాట్లాడే వారుంటే మిగిలిన 40శాతం ఇతరులే. ఆ నలభై శాతంలో దాదాపు సగం మంది 1826 తర్వాత బ్రిటిష్ వారి బలవంతపు తరలింపులతోనే అక్కడి టీ తోటలలో కార్మికులుగా చేరారు. వారిలో బంగాలీలే అధికంగా ఉంటారు. వారిలోనూ బ్రిటిష్ వారికి ఉద్యోగ వర్గంగా చేరింది ప్రధానంగా బంగాలీలే. కాగా కొద్ది మంది దేశంలోని ఇతర ప్రాంతాల నుండి బ్రతుకు తెరువు కొరకు అక్కడికి వెళ్లిన వారుంటారు. 1837లో అక్కడి పాఠశాలలలో బ్రిటిష్ వారు అసోం భాష బదులు బలవంతంగా బంగ్లా భాషను అధికార భాషగా ప్రవేశపెట్టారు. అది దాదాపు 60 సంవత్సరాలు అలాగే కొనసాగింది. అసోం మధ్య తరగతి ప్రజలు ఉద్యోగాల వేటలో ఇంగ్లిష్ నేర్చుకొని బంగాలీలతో పోటీ పడాల్సి వచ్చింది.

1947లో దేశ విభజన జరిగిన తర్వాత తూర్పు పాకిస్తాన్ (వర్తమాన బంగ్లాదేశ్) నుండి అసోంకు తరలి వచ్చిన 'శరణార్థులు' సగం మంది ఉంటారు. మొదట దేశ విభజనానంతరం జరిగిన మత ఘర్షణలు, 1965, 1971లలో జరిగిన భారత, పాక్ యుద్ధాలతో ప్రజలు వెల్లువలా వలస రావడంతో అక్కడ జనాభా పెద్ద ఎత్తున పెరిగింది. అసోంకు భూముల కోసం తూర్పు పాకిస్తాన్ నుండి వలస రావడం 20వ శతాబ్దమంతా కొనసాగింది. దానికి తోడు 1947 తర్వాత పొరుగునున్న తూర్పు పాకిస్తాన్ పాలకవర్గాలు మైనారిటీల పట్ల అనుసరించిన వివక్షాపూరిత విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న కటిక పేదరికం, మైనారిటీలపై ముస్లిం మత ఛాందసవాదుల దాడులూ అసోంలో వలసలు పెరగడానికీ, అక్కడ జనాభా పెరుగుదలకు ప్రధాన కారణమయ్యాయి. అసోం ప్రజలలో సమస్యలు పెరిగే కొద్దీ అక్కడి జనాభా దామాషాలో వస్తున్న మార్పులు అస్సామీయులను తీవ్రంగా కలవరపెట్టింది.

బ్రిటిష్ వారి అడుగు జాడలలో వారి ప్రాపకం పొందిన మార్వాడి వ్యాపారస్థులు ఈశాన్యంలోకి చేరుకున్నారు. బ్రిటిష్ వారు, ఈ దళారీ బూర్జువాలు అక్కడి అమూల్యమైన వనరులను కొల్లగొట్టారు. 1947 తర్వాత అక్కడ బ్రిటిష్ వారి స్థానంలో సామ్రాజ్యవాదులతో కుమ్మక్కైన భారత దళారీ పాలకవర్గాలు దోపిడీ చేయడమే తప్పా మరే మార్పు లేదు. అక్కడి తేయాకు, కలప, ముడి చమురు లాంటి విలువైన వనరులను దోపిడీ పాలకవర్గాలు దోచుకోవడమే తప్ప అసోం ప్రజల అభివృద్ధి గురించి అవి ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. అసోంలో బ్రిటిష్ వారి హయాంలో ఆరంభమయిన పెట్రోలియం, టీ, కలప పరిశ్రమలు మినహా 20వ శతాబ్దం చివరి వరకు అక్కడ ఆధునిక పరిశ్రమ ఒక్కటి కూడా పెంపొందలేదు. రైల్వే నిర్మాణం నామమాత్రంగానే ఉంది.

అసోం ప్రజలలో పెంపొందుతున్న అసంతృప్తి అంతా తనకు వ్యతిరేకంగా సంఘటితం కాకుండా తప్పుదారి పట్టించడానికి బ్రిటిష్ వారి ఫక్కీలోనే కేంద్ర ప్రభుత్వం కూడా భాషా,

సంస్కృతి వగైరా విషయాలపై, అస్సామీయులకు, అస్సామేతరులలో అధిక సంఖ్యలో ఉన్న బంగాలీలకూ మధ్య వైరుధ్యాలుగా చిత్రిస్తూ వారి మధ్య గలాటాలు పెంచడానికి పూనుకుంది. అలాంటి కేంద్ర ప్రభుత్వం పన్నాగాలకు బంగాలీ బ్యూరోక్రసీ, వ్యాపారస్తులు, తదితర బంగాలీ జాతీయ దురహంకారులు తగినంతగా ఉప్పందించారు. 1950, 1960, 1968, 1972 సంవత్సరాలలో జరిగిన అసోం ప్రజల న్యాయమైన పోరాటాలకు పోటీగా బంగాలీలను నిలబెట్టడంలో కేంద్ర ప్రభుత్వం చాలా వరకు సఫలమైంది.

1980లలో అసోంలో 'ఉల్ఫా' (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం–యు.ఎల్.ఎఫ్.ఏ) నాయకత్వంలో పోటెత్తిన ప్రజా పోరాట వెల్లువను, వారి కార్యక్రమాన్ని, దేశం నుండి విడిపోయే ధోరణి కలదిగా కేంద్రంలోని పాలకవర్గాలు, రివిజనిస్టు మార్క్సిస్టు పార్టీ నాయకులు అబద్ధపు ప్రచారం చేశారు. అంతేకాదు, అసోం ప్రజల పోరాటం కేవలం అసోంకే పరిమితమయి లేదనీ, ఈశాన్య భారతమంతా ఒక సంయుక్త నాయకత్వం కింద, ఒక పథకం ప్రకారం విస్తరిస్తున్న 'విచ్ఛిన్నకర' ఉద్యమంలో అది విడదీయరాని భాగమని కూడా కేంద్ర ప్రభుత్వమూ, రివిజనిస్టు మార్క్సిస్టు పార్టీ నాయకులూ కలిసి తెగ ప్రచారం చేశారు. అంత మాత్రమే కాదు, ఏదో ఒకనాడు అసోంతో సహా ఈశాన్య భారతమంతా మిగిలిన భారతదేశం నుండి విడిపోతుందనీ, అందుకు ఆ ప్రాంత ప్రజలను విదేశీ శక్తులేవో ప్రోత్సహిస్తున్నాయనీ కూడా కల్పిత ప్రచారం చేశారు.

అసోం ప్రజల పోరాటాన్ని గానీ ఈశాన్యంలో రగులుకున్న జాతుల పోరాటాలను గాని బలపరిచే వారందరినీ దేశ సమైక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారనీ, విదేశీ ఏజంట్లనీ దుమ్మెత్తి పోశారు. పోస్తూన్నారు.

సీ.పీ.ఐ.(మార్క్సిస్టు) అప్పట్లో తమ 'పీపుల్స్ డెమోక్రసీ' పత్రికలో ఈశాన్య ప్రాంత విద్యార్థి సంఘం ప్రకటించిన రహస్య కార్యక్రమం అంటూ : "అసోం ఉద్యమకారుల కార్యక్రమం మైనారిటీలకు వ్యతిరేకమైనది, దేశం నుండి విడిపోయే ధోరణి గలది" అనే శీర్షికతో 35 పాయింట్ల కార్యక్రమాన్ని ప్రచురించింది. అయితే అందులో వారు ప్రచారం చేసినట్లు దేశం నుండి విడిపోయే అంశం ఒక్కటి కూడా లేదు. అలానే బంగాలీ సెటిలర్సుకు వ్యతిరేకమైన పాయింటూ లేదు. పైపెచ్చు ఆ సెటిలర్సును గూర్చి 10వ పాయింటులో "చాలా కాలం క్రితం నుండి స్థిరపడ్డవారిని ఏమీ చేయరాదు". అని స్పష్టంగా రాశారు.

అసోం ప్రజల ఉద్యమానికి పోటీగా, అఖిల అసోం మైనారిటీ యువ పరిషత్తును రెచ్చగొట్టి న్యాయమైన అసోం పోరాటాన్ని అసోం – అసోమేతర ప్రజల మధ్య ముఖ్యంగా అసోం ప్రజలకీ అసోంలో నివసిస్తున్న బంగాలీ ప్రజలకూ మధ్య అంతర్యుద్ధంగా మార్చడానికి ఇందిరాగాంధీ ప్రభుత్వం, మార్క్సిస్టు పార్టీ నాయకులు కలసి పథకం ప్రకారం ప్లాన్ చేశారు. ప్రధాన ఉద్యమ సంస్థ అయిన ఉల్ఫాను దెబ్బతీయడానికి ప్రతీఘాతుక నిర్మాణాలను (సల్ఫా) ముందుకు తెచ్చారు.

ఇంకా అనేక కుట్రలకు పాల్పడ్డారు. సైనిక అణచివేతకు పూనుకున్నారు. ఫలితంగా, అసోం ఉద్యమ పెటీబూర్జువా నాయకత్వంలో ఒక సెక్షన్ అంతిమంగా ఆ ప్రజల న్యాయమైన డిమాండ్‌లను వదిలి దోపిడీ భారత పాలకవర్గాల పంచన చేరింది. పార్లమెంటు రాజకీయాలలోకి ప్రవేశించి ఉద్యమ ప్రతిష్టను సొమ్ము చేసుకుంటున్నారు.

దేశంలో సామ్రాజ్యవాద నూతన ఉదారీకరణ ఆర్థిక విధానాలను అమలులోకి తెచ్చిన పిదప భారత పాలకవర్గాలు ఈశాన్య ప్రాంతాల ప్రాకృతిక వనరులను దోపిడీ చేయడం తీవ్రం చేశాయి. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని గత 'సంయుక్త ప్రగతిశీల కూటమి' (యూ.పీ.ఏ.) కాలంలో 'లుక్ ఈస్ట్' (తూర్పుపై దృష్టి పెట్టండి) అనే విధానాన్ని చేపట్టగా, బీ.జే.పీ. నాయకత్వంలోని ప్రస్తుత 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి' (ఎన్.డీ.ఏ.) 'ఆక్ట్ ఈస్ట్' (తూర్పును 'కొల్లగొట్టండి') విధానాన్ని చేపట్టింది. ఇది మహా దూకుడుగా తన ఫాసిస్టు దోపిడీ విధానాలను అమలు చేస్తోంది. ప్రస్తుతం ఈశాన్య ప్రాంతంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో బీ.జే.పీ. ప్రత్యక్షంగా లేదా రీజినల్ పాలక ముఠాలను కలుపుకొని అధికారం చలాయిస్తున్నది. మోదీ ప్రభుత్వం రూపొందించిన జాతీయ పౌరసత్వ జాబితా (ఎన్.ఆర్.సీ.), 'పౌరసత్వ సవరణ చట్టం' (సీ.ఏ.ఏ.) అందులో భాగమే. అక్కడ అది చేపడుతున్న మూలవాసీ-ఆదివాసీ వ్యతిరేక, ముస్లిం-క్రైస్తవ వ్యతిరేక, దళిత వ్యతిరేక బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలతో పాత సమస్య పరిష్కరించబడకపోగా కొత్త సమస్యలు పుట్టుక వస్తున్నాయి. దీనితో అసోంలో లక్షలాది మంది ప్రజలలో తీవ్ర అభద్రతా భావం సృష్టించబడింది, ప్రజల మధ్యఘర్షణలు తలెత్తే పరిస్థితి ఏర్పడింది.

నిజానికి, ఈశాన్యమంతటా పెరుగుతోన్న జాతుల ఉద్యమాలకు ప్రధాన శత్రువు కేంద్ర ప్రభుత్వం, సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై దాన్ని కంట్రోలు చేస్తున్న దేశంలోని దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు మరియు వారి తొత్తులేనన్నదీ ప్రత్యేకంగా నేడు బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీలేనన్నది మరువరాదు.

ఈశాన్య జాతుల పోరాటాలు ఎంత అభ్యుదయకరమైనవో, 'బృహత్ బంగాల్' నినాదం అంత అభివృద్ధి నిరోధకమైనది. ఈశాన్య జాతుల పోరాటాలకు విప్లవ కార్మికవర్గమే నాయకత్వం వహించాల్సి ఉంటుంది. అప్పుడే ఆ ప్రజల విజయానికి పూర్తి హామీ ఉంటుంది.

ఈశాన్య జాతుల పోరాటాలకు కార్మిక వర్గం నాయకత్వం వహించినపుడే అక్కడ ప్రజాస్వామ్యం నెలకొని, ప్రతి జాతి సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది. అపుడే ఈనాటి ప్రపంచ సోషలిస్టు మహా విప్లవంలో భాగంగాను, భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో అంతర్వాహినిగాను ఆ పోరాటాలు అంతిమంగా తప్పక జయప్రదమవుతాయి.

## ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలు:

ఏ ఉద్యమానికైనా దాని వెనుకాల ఆర్థిక రాజకీయ సామాజిక చారిత్రక కారణాలుంటాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలకు కూడా ఇలాంటి కారణాలే ఉన్నాయి. భారతదేశంలో నెలకొని వున్న పరిస్థితులలో ప్రాంతీయ అసమానతల వల్ల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాతుల వ్యతిరేక విధానాల వల్ల జాతి ఆకాంక్షలకు ప్రతిబింబంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు ముందుకు వస్తున్నాయి. అందువల్ల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను జాతుల సమస్యలో భాగంగా కొనసాగుతున్న ప్రజాస్వామిక ఉద్యమాలుగా పరిగణించాలి, వీటిని బలపరచాలి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ తక్షణ కార్యక్రమాన్ని కేంద్రంగా చేసుకొని పనిచేస్తూనే, నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమంతో దీనిని జోడించి మన పార్టీ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలకు నాయకత్వం వహించాలి.

నేడు దేశంలో 29 రాష్ట్రాలు 7 కేంద్ర పాలిత ప్రాంతాలున్నాయి. వాటిలో అన్నిటికన్నా తక్కువ జనాభా కలిగిన రాష్ట్రం సిక్కిం. 2011 జనాభా లెక్కల ప్రకారం అక్కడి జనాభా 61 లక్షలు మాత్రమే. దేశంలో అధిక జనాభా కల రాష్ట్రం ఉత్తర ప్రదేశ్. అక్కడి జనాభా ఇంచుమించు 20 కోట్లు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో ముందుకు వచ్చిన కొన్ని ముఖ్యమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను గురించి ఇక్కడ సంక్షిప్తంగా చూద్దాం.

**ఝార్ఖండ్:** ఝార్ఖండ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పర్చాలన్నది చాలా సుదీర్ఘకాల డిమాండ్. పాత బిహార్‌కు చెందిన ఛోటా నాగపుర్, సంథాల్ పరగనాలను (ధన్‌బాద్, బోకారో, గిరిడీహ్, హజారీబాగ్, చతరా, పలామూ, లాతేహార్, గఢ్వా, లోహార్‌దగా, గుమ్లా, రాంచీ, సింఘ్‌భూం, జమ్‌షెడ్‌పుర్, దుమ్కా, దేవ్‌గఢ్, గొడ్డా, సాహెబ్‌గంజ్‌తో కూడిన 17 జిల్లాలు); ఒడిశాకు చెందిన సుందర్‌గఢ్, క్యోంఝుర్, మయుర్‌భంజ్, సంబల్‌పుర్‌లతో కలపి 4 జిల్లాలు; మధ్యప్రదేశ్ (ప్రస్తుత ఛత్తీస్‌గఢ్)లోని రాయగఢ్, సర్గుజా రెండు జిల్లాలు; పశ్చిమ బంగాల్‌లోని మెదినీపుర్, పురులియా, బాంకురాలు కలసి మూడు జిల్లాలు మొత్తంగా నాలుగు రాష్ట్రాలలోని 26 జిల్లాలతో ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్రం ఏర్పర్చాలన్నదే ఆ డిమాండ్.

వాస్తవానికి పైన పేర్కొన్న ప్రాంతమంతా బంగాల్ నుండి బిహార్ విడివడక పూర్వం 1912 వరకు ఒకే ప్రాంతంగా ఉండింది. బంగాల్ నుండి బిహార్ విడిపోవడం, బిహార్ నుండి పైన పేర్కొన్న నాలుగు జిల్లాల ఒడిశా ప్రాంతం వేరుపడడంతో పాటు మధ్యప్రదేశ్‌లోకి కొంత ప్రాంతం పోయి ఆ ప్రబల ఆదివాసీ ప్రాంతమంతా ముక్కచెక్కలైంది. ఆదివాసీ ప్రజల సమైక్యతనూ వారి పోరాట శక్తినీ దెబ్బతీసే దుష్ట లక్ష్యంతోనే బ్రిటిష్ పాలకులు ఆ భూఖండాన్ని ముక్కచెక్కలు చేయ కుట్రపన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చరిత్రకెక్కిన అనేక తిరుగుబాట్లకు (కోల్ తిరుగుబాట్లు, సంథాల్ తిరుగుబాట్లు, భూమిజ్ తిరుగుబాటు, చౌవాడ్ తిరుగుబాటు,

బిర్సాముండా తిరుగుబాటు) కేంద్రంగా నిలిచిన ప్రాంతమిది. దేశంలోని ప్రజలకు ఎంతో ప్రేరణగా నిలిచి, బ్రిటిష్‌వారిని జడిపించిన ఆ తిరుగుబాట్లు మరింత విస్తరించకుండా ఉండడానికే వలస పాలకులు ఆ ఆదివాసీ ప్రజల మధ్య చీలికకు పాల్పడ్డారు.

పై నేపథ్యంలో ఝార్ఖండ్‌లో మొట్టమొదట 1915లో ఏర్పడిన 'ఛోటా నాగపుర్ ఉన్నతీ సమాజ్' తొట్టతొలిసారి తమకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పర్చాలని 1927లో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సైమన్ కమిషన్'ను మెమోరాండం ద్వారా డిమాండ్ చేసింది. ఆ తర్వాత 1937లో 'ఆదివాసీ మహాసభ' ఏర్పడింది. ఇవి కాక అధికారమార్పిడి తర్వాత 1950లో జయపాల్ సింఘ్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో 'ఝార్ఖండ్ పార్టీ' ఏర్పడింది. 1937లో ఏర్పడిన ఆదివాసీ మహాసభ కొత్త అవతారం ఇది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికలలో 'ఝార్ఖండ్ పార్టీ' మొత్తం 32 సీట్లను గెలుచుకొని లోకసభలో అడుగు పెట్టింది.

ఆ తర్వాతి క్రమంలో అక్కడ పురుడు పోసుకున్న పదుల సంస్థలు ఆ వీర ఆదివాసీ ప్రజానీక సాయుధ తిరుగుబాట్ల సంప్రదాయానికి స్వస్తిచెప్పి పరమ సంస్కరణవాదంతో పుట్టుక వచ్చిన సంస్థలే. అయితే వాటికి భిన్నంగా 1973లో వినోద్ బిహారీ మహతో, శిబూ సోరేన్‌ల నాయకత్వంలో 'ఝార్ఖండ్ ముక్తి మోర్చా' ఏర్పడింది.

ఝార్ఖండ్ ముక్తి మోర్చా మొదట అనేక రణ నినాదాలను ప్రజల ముందుంచింది. 'మారో మహాజన్ (వ్యాపారి) కో', 'మారో దరోగా కో', 'కైసే లోగే ఝార్ఖండ్, లడ్‌కే లేంగే ఝార్ఖండ్', 'కైసే లేంగే ఝార్ఖండ్, వోట్‌సే నహీ, చోట్‌సే', 'ఝార్ఖండ్‌కో లాల్‌ఖండ్‌మే బదల్ డాలో' లాంటి ప్రజాపోరాట నినాదాలతో రంగంలోకి దిగింది. ఝార్ఖండ్ వాసుల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆ పార్టీ భూస్వాములతో, పోలీసు-మిలిటరీ శక్తులతో తలపడింది. ఆ సమరశీల పోరాటాలలో పలువురు కార్యకర్తలు అసువులు బాసారు. ప్రజా సమస్యలను చేపట్టి అది కొనసాగించిన పోరాటాలలో కొన్ని విజయాలు కూడా సాధించారు. కానీ, అనతి కాలంలోనే విరుచుకుపడిన రాజ్యహింస, పోలీసు దాడులతో భీతిల్లిన నాయకత్వం సాయుధ ప్రతిఘటనకు స్వస్తి చెప్పి 1975నాటి 'ఎమర్జన్సీ'లో ఇందిరాగాంధీ ముందుకు తెచ్చిన 20 సూత్రాల కార్యక్రమాన్ని సమర్థించి సంస్కరణవాద రాజకీయాల తీర్థం పుచ్చుకుంది. మూడేళ్ల లోపే ఓట్ల రాజకీయాలకు ఉద్యమాన్ని బలి పెట్టడంతో సంస్థ చీలి పోయింది.

రకరకాల పార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుక రావడం, స్వార్థ ప్రయోజనాలతో ఉద్యమాన్ని బలిపెట్టడం ఝార్కండ్‌లో సాధారణమైంది. ఆ క్రమంలో 1986లో 'ఆల్ ఝార్ఖండ్ విద్యార్థి సంఘం' ఏర్పడింది. ఆ సంఘం 'నో ఝార్ఖండ్, నో ఎలక్షన్' అనే ఎన్నికల బహిష్కరణ నినాదం ఇచ్చింది. ఝార్ఖండ్ ముక్తిమోర్చా (శిబూ గ్రూపు) అధ్యక్షుడు నిర్మల్ మహతో హత్యకు

వ్యతిరేకంగా అది ఇచ్చిన బంద్ పిలుపు యావత్ ప్రాంతంలో జయప్రదమైంది. ఆ సంస్థ కూడా కొంత కాలం మిలిటంట్‌గా ఉద్యమాన్ని నడిపినప్పటికీ అంతిమంగా ఎన్నికలలో కూరుకుపోయింది. అదే సమయంలో 1987లో 50 సంస్థలతో కూడిన 'ఝార్ఖండ్ సమన్వయ సమితి' ఏర్పడినప్పటికీ ఎన్నికల బహిష్కరణ విషయంలో వివాదాలు చోటుచేసుకొని అంతిమంగా అదీ చీలిపోయింది. రాందయాల్ ముండా, సూర్యసింహ్ లాంటి వాళ్లు ఏర్పర్చిన 'ఝార్ఖండ్ పీపుల్స్ పార్టీ' సహా అన్ని పార్టీలు, సంస్థలు అవినీతి సంస్థలుగా ప్రజలలో అభాసుపాలై, ఎన్నికలకు ఎగబడుతూ అధికారాన్ని కైవశం చేసుకునే మత్తులో మునిగిపోయాయి. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల పరిపూర్తికై ఆ ఉద్యమానికి కార్మికవర్గ నాయకత్వం లేని ఫలితమిది.

ఝార్ఖండ్ ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చడానికి, ఎన్నికల రాజకీయాల తీర్థం పుచ్చుకున్న పార్టీలను లోబరుచుకోవడానికి దిల్లీ పాలకులు 'ఝార్ఖండ్ స్వయం పాలనా సంస్థ'ను ఏర్పర్చారు. కానీ ఆ సంస్థ కూడా ఉద్యమాన్ని గాలికి వదిలి అధికార మత్తులో నిండా అవినీతిలో కూరుకుపోయింది.

ఝార్ఖండ్‌లో ఏర్పడిన అనేక సంస్థల ఆచరణ చూస్తే ఏ డిమాండ్‌ల సాధన కోసమైతే అవి ప్రజల ముందుకు వచ్చాయో, ఉద్యమం దాదాపు వందేండ్ల క్రితం ఏ డిమాండ్‌ల సాధన కోసమైతే ప్రారంభమైందో ఆ ప్రజా డిమాండ్లు ఏవీ మౌలికంగా పరిష్కారం కాలేదు.

ప్రత్యేక ఝార్ఖండ్ కోసం అక్కడి ప్రజలు సమరశీలంగా ఉద్యమిస్తున్న సమయంలోనే 1969 నుండి నక్సల్బరీ రాజకీయాలతో పలు విప్లవ సంస్థలు అక్కడ తమ కార్యక్రమాలను ప్రారంభించాయి. అవి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో ప్రజలను సంఘటితం చేయసాగాయి. ఆనాటి మన పార్టీ నాయకత్వంలో భారత దోపిడీ పాలక వర్గాలకు, వారి రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ ప్రతిఘటనోద్యమం సంఘటితపడసాగింది. ఆ క్రమంలో ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం బద్దలైంది. మన పార్టీ నాయకత్వంలో 'ఝార్ఖండ్ ముక్తి మంచ్' (ఝార్ఖండ్ లిబరేషన్ ఫోరం) ఏర్పడింది. భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఝార్ఖండ్ ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని సమర్థిస్తూ, ఝార్ఖండ్‌ను దోపిడీ రహిత లాల్‌ఖండ్‌గా ఏర్పర్చాలనే కార్యక్రమంతో (ప్రజాస్వామిక ఝార్ఖండ్) ఆవిర్భవించిన 'ఝార్ఖండ్ ముక్తి మంచ్' ప్రజలతో మమేకమై, వ్యవసాయ విప్లవ కార్యక్రమాలతో తన కార్యక్రమాలను అనుసంధానిస్తూ ఉద్యమాన్ని పురోగమింపచేసింది. కానీ, పాలకవర్గాలు చాలా ముందుచూపుతో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లను అక్కడి అపార ప్రాకృతిక వనరులను దోచుకోవడం, విప్లవోద్యమాన్ని సమూలంగా దెబ్బతీసే వ్యూహంతో ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పర్చాయి. అయినప్పటికీ ఝార్ఖండ్ జాతి స్వయంనిర్ణయాధికారం డిమాండ్ ప్రజల మనసులలో బలంగా నిలిచి ఉంది. ఆ డిమాండ్ సాధన ఈ దేశంలో మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమంతో విడదీయరానిదిగా ముడిపడి ఉంది.

**ఛత్తీస్‌గఢ్:** 21.11.1955నాడు మధ్యప్రదేశ్ విధానసభ (నాగపుర్)లో ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చర్చకు వచ్చింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 32 శాతం ఆదివాసీ ప్రజలు ఉండగా, 44 శాతం అడవులున్నాయి. ఝార్ఖండ్‌లా ఈ ప్రాంతం ప్రబల ఆదివాసీ ప్రాంతం కావడమే ఆ డిమాండ్ రావడంలో పని చేసింది. అప్పుడు దాని పేరు 'గోండ్వానా'గా తొలిసారి ప్రతిపాదించిన వారిలో రాజనాంద్‌గాం జిల్లాలోని పానాబరస్ సంస్థాన రాజు, విధానసభ సభ్యుడు లాల్ శ్యాం షాహ్ ఒకరు. ఆయన ఆ సందర్భంగా చేసిన ఉపన్యాసంలో మొగలులకు ముందూ, మొగలుల కాలంలోనూ ఈ ప్రాంతాన్ని గోండ్వానాగానే వ్యవహరించేవారంటూ ఇక్కడ లక్షల సంఖ్యలో ఆదివాసీలు, దళితులు ఉన్నారనీ వివరిస్తూ దానిని సమర్థించాడు. ఆ తర్వాత దానిపై ఎస్.ఆర్.సీ.కి మెమోరాండం సమర్పించినా వారు లక్ష్య పెట్టలేదు. మరోవైపు 1956 నవంబర్ 1నాడు విడిగా ఛత్తీస్‌గఢ్ ప్రాంతాన్ని కూడా కలిగిన మధ్యప్రదేశ్ ఒక రాష్ట్రంగా ఉనికిలోకి వచ్చింది.

'ఆదివాసీ సేనా మండల్' అధ్యక్షుడు లాల్ శ్యాం షాహ్ 1960 అక్టోబర్, 30నాడు తొలిసారి రాయపుర్‌లో జరిగిన 'అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీ' సమావేశానికి హాజరైన కాంగ్రెస్ అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి, దేశ ప్రధాని నెహ్రూలను 30 వేల మంది ఆదివాసీ ప్రజలతో పాదయాత్రతో వెళ్లి కలిశాడు. ఛత్తీస్‌గఢ్‌ను గోండ్వానా పేరుతో 9 జిల్లాలతో రాయపుర్, దుర్గ్, బిలాస్‌పుర్, సర్గుజ, రాయగఢ్, బాలాఘాట్, శహడోల్, భండారా, చంద్రపుర్ (చివరి రెండు ప్రస్తుతం మహారాష్ట్రలోని విదర్భలో ఉన్నాయి. అయితే చంద్రపుర్ జిల్లాలోని కొంత భాగాన్ని మాత్రమే ఇందులో కలిపాడు) జిల్లాలతో కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పర్చాలనే డిమాండ్‌ను నిర్దిష్టంగా మళ్లీ ముందుకు తెచ్చాడు. కానీ ఆయన డిమాండ్ బుట్ట దాఖలా అయింది. మరోవైపు 'జాతీయ అభివృద్ధి పరిషత్' తూర్పు పాకిస్తాన్ శరణార్థులకు దేశ మధ్య భాగంలో నిలిచిన దండకారణ్యంలో శాశ్వత శరణు కల్పించాలని నిర్ణయం తీసుకోవడానికి వ్యతిరేకంగా 1962లో శాహ్ తన లోకసభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. గత 62 ఏండ్లుగా ఈ ప్రాంతంలో ఆదివాసులకు, బంగాలీలకు మధ్య ఏదో రూపంలో సమస్యలు కొనసాగుతునే ఉన్నవి. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ వెనక్కి పోయింది. ఆ సమయంలోనే ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ డిమాండ్ ముందుకు వచ్చింది. కానీ, అది ముందుకు సాగలేదు. తిరిగి 1980ల చివర మన పార్టీ చేసిన చొరవతో మరో విడుత ఆ డిమాండ్ ముందుకు వచ్చింది. దానితో అనేక పార్టీలు ఆ డిమాండ్‌పై స్పందించాయి. కానీ, అది ఉద్యమరూపం తీసుకోలేదు.

1999 మేలో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకుడు, బడా భూస్వామి విద్యాచరన్ శుక్లా ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటు ఖాయం అని పసిగట్టిన వెంటనే ముందుచూపుతో రాజకీయ లబ్దిని ఆశించి రంగంలోకి దిగి 'ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోరాట సంస్థ' (మోర్చా)ను స్థాపించాడు. ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర డిమాండ్‌పై రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాడు. ఇలాంటి సంస్థలు అంతిమ

మాసాలలో మరికొన్ని ఏర్పడినాయి. యేడాదిలోపే 2000 అగస్టు, 31నాడు లోకసభలో 'మధ్యప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన బిల్లు' ఆమోదం పొందింది. 2000 సెప్టెంబర్ 9నాడు విడిగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర నిర్మాణానికి రాజ్యసభ ఆమోద ముద్ర పడింది. 2000 నవంబర్, 1నాడు నూతన ఛత్తీస్‌గఢ్ 26వ రాష్ట్రంగా అవతరించింది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోనున్న అపారమైన, అమూల్యమైన ప్రాకృతిక వనరులను దోచుకోవడం, అక్కడ పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడమనే ద్విముఖ లక్ష్యాలతో దోపిడీ పాలకవర్గాలు ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఏర్పర్చాయి. దేశంలో ప్రత్యేక రాష్ట్రంగా పంజాబ్ ఏర్పడిన పిదప దాదాపు 34 సంవత్సరాలకు ఒకే సంవత్సర కాలంలో ఛత్తీస్‌గడ్, ఝార్ఖండ్, ఉత్తరాఖండ్‌లు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి.

రాష్ట్ర అవతరణతో ప్రజల జీవితాలలో జరిగిన పెను మార్పులు ఏమీ లేవు. రాష్ట్ర అవతరణతో లబ్ధి పొందుతున్నది దోపిడీ దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలే. ఛత్తీస్‌గఢ్ అపార ప్రాకృతిక వనరులున్న ప్రాంతం కావడంతో వాటిని వారు యధేచ్ఛగా దోచుకోవడానికి గతం కన్నా అవకాశాలు రాష్ట్ర అవతరణతో ఎంతో పెరిగాయి. అలాగే అక్కడ గత నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న విప్లవోద్యమ అడ్డు తొలగించుకునే లక్ష్యంతో నిరంకుశ పాలనా యంత్రాంగాన్ని బలోపేతం చేసుకుంటున్నారు. ప్రబల ఆదివాసీ బస్తర్‌ను ప్రత్యేక రాష్ట్రంగా మొదట డిమాండ్ చేసిన మన పార్టీ తుదకు ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడడాన్ని ఆహ్వానిస్తూనే రాష్ట్ర అభివృద్ధికి భాషతో సహా అన్ని రంగాలలో సమరశీలంగా ప్రజలు పోరాడాలనీ పిలుపునిస్తూ, దోపిడీ వర్గాలను మట్టుబెట్టకుండా, ప్రజాస్వామిక ఛత్తీస్‌గఢ్ సాధించకుండా, భౌగోళిక రాష్ట్ర అవతరణతో ప్రజల నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేసింది.

**తెలంగాణ:** 1950వ దశకంలో తెలంగాణలో కమ్యూనిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండడం దిల్లీ పాలకులకు కంటగింపుగా ఉండింది. తెలంగాణలో కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరగకుండా ఉండడానికి, ఆంధ్ర బూర్జువా, భూస్వామ్య వర్గాలు భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం పేరిట ముందుకు తెచ్చిన తెలుగు ప్రజలను ఒక్కటి చేయాలనే డిమాండ్‌లో భాగంగా తెలంగాణ బూర్జువా, భూస్వామ్య వర్గాలతో ఒక్కటై కేంద్రంతో పోరాడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 1956 నవంబర్ 2 నాడు సాధించుకున్నాయి. తెలంగాణ బూర్జువా, భూస్వామ్య వర్గాలను లోబర్చుకోవడానికి 'పెద్ద మనుషుల ఒప్పందాన్ని' కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం లోని అంశాలు అమలు కాలేదు. నూతన ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం అత్యంత వివక్షకు గురై అన్ని విషయాలలో వెనుకబడిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఏదో రూపంలో వివక్షకు వ్యతిరేకంగా తెలంగాణలో ప్రజల అసంతృప్తి వ్యక్తమవుతూనే వచ్చింది. ఫలితంగా, ప్రాంతీయ అసమానతలను వ్యతిరేకిస్తూ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో 1969లో

సమరశీల ఉద్యమం బద్దలయింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుండి ముల్కీ ఆందోళనను నిర్వహించిన పెటీ బూర్జువా వర్గం, ఆ తర్వాత 1969లో బద్దలైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ముందు వరుసలో నిలువగా బూర్జువా భూస్వామ్య వర్గాలే నాయకత్వం వహించాయి. విద్యార్థులు, ఉద్యోగస్థులు ఆ ఆందోళనలో మిలిటెంట్ పాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగించిన అణచివేతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర పోలీసుల తూటాలకు 370 మంది విద్యార్థి యువజనులు ప్రాణ త్యాగం చేశారు. అదే సమయంలో, 1969లోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కొనసాగింపుగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా నక్సల్బరీ, శ్రీకాకుళ విప్లవోద్యమాల ప్రభావంతో మన పార్టీ నాయకత్వంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఆరంభమైంది. విప్లవోద్యమం తెలంగాణ సమాజంలో మౌలిక వైరుధ్యాల పరిష్కారం కోసం సాగింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ప్రజాస్వామిక ఉద్యమంగా, జాతుల పోరాటంలో భాగంగా మన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఎంచి దానికి వెంటనే మద్దతు ప్రకటించడంతో పాటు నాయకత్వం వహించాలనీ నిర్ణయించింది. కానీ ఆ కాలంలో తెలంగాణలో విప్లవోద్యమం చాలా బలహీనంగా ఉండింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెన్నారెడ్డి విద్రోహం తలపెట్టిన తర్వాత ఆ ఉద్యమం దాదాపు 30 సంవత్సరాల పాటు నివురు కప్పిన నిప్పులా ఉండిపోయింది. మరోవైపు మన పార్టీ నాయకత్వాన 1978 మధ్య నుండి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల విప్లవ రైతాంగ పోరాటాలు పెల్లుబికాయి. 1980 నాటి కల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా విప్లవోద్యమం విస్తరించి 2000 వరకు ఒక వెల్లువలా సాగింది. ఆ ఉద్యమం తెలంగాణలో సాపేక్షికంగా బలంగా సాగింది. ఆ ఉద్యమం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా అన్ని రంగాలను ప్రగాఢంగా ప్రభావితం చేసింది.

1995 తదుపరి మలిదశ ఉద్యమంగా 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్' ముందుకు వచ్చింది. అది క్రమంగా బలోపేతం అవుతూ విస్తరిస్తూ ముందుకు సాగింది. మన పార్టీ ఆ ఉ ద్యమానికి నాయకత్వం వహించడానికి ఒక సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో క్రియాశీలంగా పాల్గొని, దానికి నాయకత్వం వహిస్తూ దానిని సరైన మార్గంలో నడిపించడానికి ఒక సరైన తక్షణ, దీర్ఘకాలిక ప్రజాస్వామిక కార్యక్రమాన్ని ప్రజల ముందుంచింది. ఆ ఉ ద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వాన్నందించడానికి అవసరమైన రాజకీయ ప్రజా సంస్థలను, ఇతర ప్రజా సంఘాలనూ ఏర్పరచి మార్గదర్శకత్వం వహించి విశేష కృషి సలిపింది.

మలిదశ ఉద్యమంలో కూడా పెటీ బూర్జువా వర్గం – విద్యార్థి యువజనులు, ఉద్యోగులు – ముందు వరుసలో ఉన్నా ప్రాంతీయ బూర్జువా, భూస్వామ్య శక్తులు ఇందులో ఆధిపత్యంలో

ఉన్నాయి. ఇది మేధావుల్లోకి, కవులు, కళాకారుల్లోకి, కార్మికులు, దళితులు, ఆదివాసులు, మహిళల్లోకి కొంత వరకు రైతాంగంలోకి విస్తరించింది. మలి దశలో వేలాది మంది ప్రజలు ప్రభుత్వ పాశవిక అణచివేతకు గురవడంతో పాటు వందలాది మంది యువకులు ఉద్వేగంతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలంగాణ ప్రజలు ఒక్కటై సమరశీలంగా ఉద్యమాన్ని కొనసాగించిన ఫలితంగా 2014 ఫిబ్రవరిలో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొంది భౌగోళికంగా దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. దేశంలోని 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలు తెలంగాణ విస్తీర్ణం, జనాభా కన్నా చిన్నవి. తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ సహ దాదాపు అన్ని బూర్జువా భూస్వామ్య వర్గాల పార్టీలు, మన పార్టీతో పాటు వివిధ ఎంఎల్ పార్టీలు, రివిజనిస్టు పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు ఉద్యమానికి నాయకత్వాన్ని వహించిన ఫలితమే భౌగోళిక తెలంగాణ అవతరణ.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సొమ్ము చేసుకొని అధికారంలోకి వచ్చిన టీ.ఆర్.ఎస్. ప్రాంతీయ దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల నాయకత్వంలోని పార్టీ. స్వభావ రీత్యానే సామ్రాజ్యవాదుల, దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కొరకు పని చేస్తున్నది. ఫ్యూడల్ సంస్కృతినీ, హిందూ మతాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నది. ఉద్యమ కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు తిలోదకాలిచ్చింది. తెలంగాణ ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం సామ్రాజ్యవాదానికీ, దాని కావలికుక్కలైన దళారీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా 'ప్రజాస్వామిక తెలంగాణ' కోసం, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ఉద్యమిస్తున్నారు. మన పార్టీ నాయకత్వాన తెలంగాణలో విప్లవోద్యమం తాత్కాలిక వెనకంజలో ఉన్నప్పటికీ ఈ రెండు ప్రధాన కార్యక్రమాలను అనుసంధానిస్తూ అశేష ప్రజారాసులను సమీకరించడానికి కృషి చేస్తున్నది.

**పంజాబ్:** భారతదేశం అంతటా భాషా ప్రయుక్త రాష్ట్రాలు 1956లో ఏర్పడితే, పంజాబ్ రాష్ట్రం 1966 నాటికి గాని ఏర్పడలేదు. అందుకు ప్రధాన కారణం కేంద్రం అనుసరించిన ప్రత్యేక రాష్ట్రాల నిర్మాణ వ్యతిరేక వైఖరే. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు ఎంత మాత్రం ప్రజాస్వామికంగా లేవని మనకు పంజాబ్‌ని చూస్తే తెలుస్తుంది. ఆనందపుర్ సాహెబ్ తీర్మానానికి అనుగుణ్యంగా తనకు రావలసిన జల వనరుల వాటా గురించి పంజాబ్ ఏనాటి నుంచో కేంద్రాన్ని డిమాండు చేస్తోంది. కానీ, భారత పాలక వర్గాలు చాలా నిరంకుశంగా వ్యవహరించడం తో పంజాబ్ విడిపోయే హక్కుని ముందుకు తీసుకువచ్చింది. పంజాబ్‌లో జాతి విముక్తి ఉద్యమం, మతం విడదీయరానంతగా మిళితం అయిపోయాయి. ఎందుకంటే పంజాబ్‌లో హిందువులున్నప్పటికీ రైతాంగంలో అధిక భాగం సిక్కు మతస్థులు కావడం వలన అది సిక్కు ఉద్యమంగా చాలా మంది భావించారు. మరోవైపూ భారత పాలక వర్గాలకు మెడ లోతు హిందూ మత స్వభావం ఉండడంతో పంజాబ్ జాతి ప్రజల న్యాయమైన డిమాండ్‌లకు సిక్కు

మత రంగును పులిమాయి. దానితో పంజాబ్ ప్రజల్లో చీలిక వచ్చింది.

వ్యవసాయ రంగంలో పంజాబ్ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా అభివృద్ధి సాధించింది. వక్రీకరించిన పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తులు అక్కడ బాగా వేగం పుంజుకున్నాయి కూడా. అయినా, అక్కడే జాతుల సమస్య ఈ రూపం తీసుకోవడానికి భారత పాలక వర్గాలు జాతుల సమస్య పట్లా అనుసరిస్తున్న అణచివేత ధోరణే ప్రధాన కారణం. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు జరిగి తాత్కాలికంగా జాతుల ప్రధాన సమస్యలను కొంతకాలం వెనక్కి నెట్టినప్పటికీ అపరిష్కృత సమస్యలపై ఉద్యమాలు మళ్లీ ముందుకు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఐ.ఎమ్.ఎఫ్, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలతో ఒప్పందాలు చేసుకొని వనరులన్నీ తన గుప్పిట్లో వుంచుకుని, రాష్ట్రాల మీద పెత్తనం చలాయిస్తున్న ఫలితంగానే పంజాబ్ ఉద్యమం తలెత్తింది.

1960లలో పంజాబ్‌లో ప్రారంభించిన హరిత విప్లవం సామ్రాజ్యవాదుల, భారత పాలక వర్గాల ప్రయోజనాల కోసమే ఉద్దేశించబడింది. దానివల్ల పంజాబ్, వ్యవసాయ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. వ్యవసాయ మిగులు ఎంతగానో చేకూరింది. దాన్నంతా అటు సామ్రాజ్యవాదులు, ఇటు భారత దళారీ నిరంకుశ బడా బూర్జువాలు దిగమింగారు. సామ్రాజ్యవాదుల నుండి దిగుమతైన వ్యవసాయోపకరణాల ద్వారా మెరుగైన దిగుబడి ఉన్నప్పటికీ ఆ వ్యవసాయ ఉత్పత్తుల మీద పంజాబ్ రైతులకేమీ అదుపు లేదు. ఫలితంగా ఆ వనరులు పెద్ద పెద్ద వ్యాపారస్తులకే ఉపయోగపడ్డాయి. అవి ఇతర రంగాలకూ తరలించబడ్డాయి. అఖిల భారత స్థాయిలో వున్న పెట్టుబడి మార్కెట్లు, ఎల్.ఐ.సీ. లాంటి పలు బీమా సంస్థలు రైతులను దోచుకోసాగాయి. వ్యవసాయాన్ని అభివృద్ధిపరచడానికి రైతుల వద్ద పెట్టుబడి కరువైంది. వ్యాపార సంస్థల అభివృద్ధి వ్యవసాయరంగ అభివృద్ధిని దెబ్బతీసింది.

గ్రామీణ ప్రాంతాల్లో వుండే పంజాబ్ రైతాంగం నీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటోంది. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ ఉపకరణాలు అన్నీ కేంద్రం చేతుల్లోనే వుండడంతో పంజాబ్ రాష్ట్రం కేంద్రం దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడవలసి వచ్చింది. 1980లలో రైతాంగ సమస్యలపై పెద్ద ఎత్తున ప్రజా పోరాటం బద్దలైంది. మరోవైపు కేంద్రం పంజాబ్ ప్రజా పోరాటాన్ని విచ్ఛిన్నకరమైనదిగా, వేర్పాటువాదంగా దుష్ప్రచారం చేసింది. ఆ పోరాటంలో వేల సంఖ్యలో ప్రజలు కేంద్ర ప్రభుత్వ విధానాలకు, పోలీసుల తుపాకీ గుండ్లకు బలయ్యారు.

కేంద్రం గుప్పిట్లోనే అధికారం, వనరులూ కేంద్రీకృతమై వుండడంతో పంజాబ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కేంద్రం అనుసరించిన పంజాబ్ ప్రజా వ్యతిరేక, అణచివేత విధానాల మూలంగానే ఆ ఉద్యమం విడిపోయే హక్కును బలంగా ముందుకు తెచ్చింది.

చాలా విప్లవకర శక్తులకు ఆ సమస్య పట్ల సరైన అవగాహన, స్పష్టమైన వైఖరి కొరవడింది. కొన్ని విప్లవకర సంస్థలు ఆ ఉద్యమాన్ని వ్యతిరేకించాయి కూడా. మన పార్టీ లెనినిస్టు అవగాహనతో ఆ ఉద్యమం పట్ల విమర్శనాత్మక దృష్టి కలిగి ఉంటూనే దానిని బలపరిచింది.

పంజాబ్ ఉద్యమాన్ని కానీ ఆ ఉద్యమం లేవనెత్తిన సమస్యలు గానీ నేటికీ అపరిష్కృతంగానే మిగిలాయి. ఆ సమస్యలను పరిష్కరించడానికి పంజాబ్ ప్రజానీకాన్ని నూతన మార్గంలో కదిలించాల్సిన కర్తవ్యం మన పార్టీ ముందుంది. ఆ ప్రజా ఉద్యమంపై ఉగ్రవాదుల, చీలికవాదుల ఉద్యమంగా ముద్రవేసి దేశ, స్థానిక పాలకవర్గాలు చేపట్టిన అణచివేత విధానాలతో అది తాత్కాలికంగా వెనకంజకు గురైంది.

**ప్రాదుర్భావ జాతులు**

మన దేశ జనాభాలో దాదాపు 8%పైగా ఆదివాసీలు 400కు పైగా తెగలుగా ఉన్నారు. వారి జనాభా నిష్పత్తితో పోల్చితే వారు నివసించే ప్రాంతం అనేక రెట్లు అధికంగా ఉంటుంది. వారు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో ఉన్నప్పటికీ, విశాలమైన పర్వత ప్రాంతాలలో, అడవులలో సాపేక్షికంగా వెనుకబడిన మైదాన ప్రాంతాలలో ప్రత్యేకించి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలలో వీరి సంఖ్య అధికంగా ఉంది. ఈ ప్రాంతాలన్నీ ఖనిజాలు, అడవులు, నీరు లాంటి అపారమైన ప్రకృతి సంపదలకు నెలవుగా ఉన్నాయి. చారిత్రకంగా భారత సమాజంలో ఆదివాసీ తెగలు నిరంతరాయంగా ఫ్యూడల్ రాజ్యాల దాడులకు, ప్రత్యేకంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల తీవ్రమైన దాడులకు గురవుతూ వచ్చాయి.

1947 నుండి ఈ ప్రాంతాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే అత్యంత తీవ్రమైన దోపిడీ పీడనలకు, వివక్షకు గురవుతూ వచ్చాయి. సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారులు, బడా కాంట్రాక్టర్లు, భూస్వాములు, వడ్డీవ్యాపారులు, వ్యాపారస్తులు, ప్రభుత్వాధికారులు నిరంతరాయంగా ఈ ప్రాంతాల్లోని ప్రకృతి సంపదలను, ఆదివాసీ ప్రజల శ్రమశక్తిని అనేక రూపాల్లో కొల్లగొడుతూ వారిని నిరాశ్రయులను చేస్తున్నారు. కానీ, ఆదివాసీ ప్రజలు గత, వర్తమాన దోపిడీ, పీడన, వివక్షతల దాడులకు వ్యతిరేకంగా నిరంతరాయంగా పోరాడుతూ మహత్తర పోరాట సాంప్రదాయాల్ని కొనసాగిస్తున్నారు. అందువల్ల, వారి రాజకీయ స్వయంనిర్ణయాధికారానికి/స్వయంప్రతిపత్తికి హామీని కల్పిస్తూ వీరిని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భాషాపరమైన, విద్యాపరమైన సమస్యలపై సంఘటితపరచాలి. వారు సంపూర్ణ విముక్తి సాధించుకునేలా వారి పోరాటాలకు నాయకత్వం వహించాలి. దేశంలోని వివిధ ఆదివాసీ తెగలు విముక్తిని సాధించే వ్యూహాత్మక దృష్టితో గానీ, దేశంలో జాతుల రిపబ్లిక్‌ల స్వచ్ఛంద సమాఖ్యను స్థాపించే వ్యూహాత్మక దృష్టితో గానీ చూసినప్పుడు ఈ ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది.

ఆదివాసీ ప్రాంతాలలో ఉత్పత్తి విధానం వివిధ దశలలో కొనసాగుతోంది. అది కొన్ని చోట్ల నేటికి పోడు వ్యవసాయంపై, ఉత్పత్తి–వినియోగం పద్ధతిపై ఆధారపడి ఉంది. కొన్ని తెగలను బ్రిటిష్ వాళ్లు నేరస్త తెగలుగా ప్రకటించారు. ఆదివాసీ తెగలు చాలా వరకు విశాల ఏకీకృత భూఖండంలో (అటవీ భూభాగం) జీవిస్తున్నాయి. ఇంచుమించు అన్ని తెగల ఆదివాసీలకు స్వంత భాషలున్నాయి. ఆయా తెగల ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, మానసిక స్థితి ఒకే విధంగా వుంటాయి. వారిని మన దేశంలోని మూలవాసులుగానే గుర్తించాలి. కానీ, కేంద్రం మూలవాసుల అస్థిత్వాన్నే గుర్తించడం లేదు. హిందుత్వ శక్తులు అడవులలో ఉంటున్న వారంతా వనవాసులే అంటూ, అసలు మూలవాసుల ఉనికినే గుర్తించ నిరాకరిస్తున్నాయి. పాలకవర్గాల నిర్లక్ష్యం, ప్రాంతీయ భాషల ఆధిపత్యంతో ఎన్నో ప్రాచీన ఆదివాసీ భాషలు వేగంగా నశించిపోతున్నాయి. విశాల ప్రాంతంలోని ఒకే తెగకు చెందిన ఆదివాసీ ప్రజలు వివిధ రాష్ట్రాల మధ్య పంపకమై, ఒకే రాష్ట్రంలో ఉన్న అల్పసంఖ్యాక తెగల ప్రజలుగా మారిపోయి, కాలక్రమంలో తమ అస్తిత్వాన్ని కోల్పోతూ ఆయా జాతులలో కలిసిపోతున్నారు.

మన దేశంలోని తెగలలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాయుధంగా తిరుగబడని తెగలు దాదాపుగా లేవు. ఈ తిరుగుబాట్లన్నీ వారి ప్రజాస్వామిక ఆకాంక్షల వ్యక్తీకరణే.

మన దేశంలోని మెజార్టీ తెగలన్నీ ప్రాదుర్భావ జాతులే. ఇవి వివిధ దశలలో అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో సంథాలీ ఆదివాసీ ప్రజానీకం తమకొక ప్రత్యేక రాష్ట్రం ఝార్ఖండ్ కావాలని డిమాండ్ చేసి దశాబ్దాల తరబడి పోరాడారు. సంథాలీ ఆదివాసీ ప్రజల డిమాండ్‌ను తుంగలో తొక్కిన కేంద్రం తనకు అవసరమైన సరిహద్దులను ఏర్పర్చి ఆ తెగ ప్రజలను ముక్క చెక్కలు చేసి ఝార్ఖండ్ రాష్ట్రాన్ని ఏర్పర్చింది. రాష్ట్ర జనాభాలో మూడింట ఒక వంతు ఆదివాసీలున్న ఛత్తీస్‌గఢ్ ప్రజలతోపాటు పొరుగు రాష్ట్రాలలోని గోండు ఆదివాసీ ప్రజలంతా తమకు ప్రత్యేక గోండ్వానా రాష్ట్రం కావాలని దశాబ్దాలుగా పోరాడుతున్నారు. కాని, వారి న్యాయపూర్ణమైన ఆకాంక్షలు నెరవేరనే లేదు. వారి డిమాండ్‌ను మన పార్టీ సమర్థిస్తూ ప్రజాస్వామిక గోండ్వానా లక్ష్యంతో వారి పోరాటానికి నాయకత్వాన్ని అందించాల్సిన తక్షణ ఆవశ్యకత మన ముందుంది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా ఆదివాసీ సముదాయాలను ఎక్కడికక్కడే వారి ఆకాంక్షలకు భిన్నంగా ఆయా భాషా రాష్ట్రాలలో కలిపివేశారు. ఈ రాష్ట్రాలలో వీటికి ఎటువంటి గణనీయమైన ప్రత్యేక హక్కులు కల్పించలేదు. అక్కడ అధిక జనాభా కలిగిన ఆదివాసీ తెగలలో ఒకటైన 'కోయతూర్' (గోండు) తెగ మూలవాసులు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాలలోని దాదాపు 50కి పైగా జిల్లాలలో విభజించబడ్డారు. ఏ రాష్ట్రంలో కూడా వారికి కనీసం 'స్వయంప్రతిపత్తి' ప్రాంతాలను ఏర్పర్చింది లేదు. వారంతా ఒకే భూభాగంలోని తమ తెగ ప్రజలందరినీ కలిపి ప్రత్యేక గోండ్వానా రాష్ట్రాన్ని ఏర్పర్చాలనే

న్యాయమైన డిమాండును ముందుకు తెచ్చారు. కానీ, భారత దోపిడీ పాలకవర్గాలు వీరిలో ఒక సెక్షన్ తెగల నాయకులను చేరదీసి, లొంగదీసుకొని, వారిని తమలో కలుపుకొని బూర్జువీకరణ గావించి తమ ప్రయోజనాలను ఈడేర్చే విధంగా ఆ ప్రాంతాలను దుర్భరమైన దోపిడీ పీడనలకు గురి చేస్తున్నారు. ఆ ప్రజలను ఉక్కుపాదాల కింద అణచివేస్తున్నారు. కానీ, ఆ ప్రజలు మాత్రం ఇప్పటికీ తమ డిమాండ్లను వివిధ రూపాలలో ముందుకు తెస్తూనే ఉన్నారు. మరోవైపు దేశంలోని అనేక ఆదివాసీ ప్రాంతాలలో మన పార్టీ నాయకత్వంలో దశాబ్దాల తరబడిగా కొనసాగుతున్న విప్లవోద్యమం వారి న్యాయమైన డిమాండ్లను సమర్థిస్తూ నాయకత్వం వహిస్తోంది. నేటి ప్రాదుర్భావ జాతుల సమగ్ర వికాసానికి మన పార్టీ కట్టుబడి ఉంది.

ప్రాదుర్భావ జాతులన్నింటికీ స్వయంనిర్ణయాధికారం లభించడం కోసం, వీటి ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణ్యంగా స్వయంప్రతిపత్తి ప్రాంతాలు, ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పరచాలనే డిమాండ్లపై మన పార్టీ నాయకత్వాన బలమైన ఉద్యమాలు నిర్మించాలి. 1990ల నుండి భారత పాలక వర్గాలు చేపట్టిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల మూలంగా అన్ని ప్రాకృతిక వనరులనూ, మానవ శ్రమశక్తినీ, మార్కెట్లనూ ఏ అడ్డూ-అదుపూ లేకుండా కొల్లగొట్టడమే ఏకైక విధానంగా మారిన పరిస్థితులలో ఈ దేశంలోని దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్య విధానానికీ, వారికి అండగా ఉన్న సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా పోరాడి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయడం ద్వారానే ప్రాదుర్భావ జాతుల సమస్య సవ్యంగా పరిష్కరించబడుతుంది.

దేశంలోని ఈశాన్య ప్రాంత తెగల కోసం భారత రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌ను, మిగితా ప్రాంతాల ఆదివాసీల కోసం 5వ షెడ్యూల్‌ను ప్రత్యేకించి పొందుపరిచారు. 6వ షెడ్యూల్ ప్రకారం 'స్వయంప్రతిపత్తి' ప్రాంతాల ఏర్పాటుకు చట్టం వీలు కల్పించింది. ఆ ప్రాంతాలు బలవంతంగా దేశంలో విలీనం చేసుకున్నవి కావడంతో, అక్కడి ప్రజల విడిపోయే హక్కు డిమాండ్‌ను చల్లార్చడానికి వాటికి 'స్వయంప్రతిపత్తి' హోదాను సమకూర్చారు. ఇవి కేవలం వారిని మోసపుచ్చే చర్యలేనన్నది స్పష్టం. అందుకే నాగాలు 6వ షెడ్యూల్‌ను బహిష్కరించారు.

దేశంలో పురోగమిస్తున్న ఆదివాసీ ప్రజల విప్లవ పోరాటాల ఫలితంగా పాలకవర్గాలు 5వ షెడ్యూల్ ప్రాంతాల కోసం నూతనంగా 'పెసా' (పంచాయిత్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ షెడ్యూల్డ్ ఏరియాస్) చట్టాన్ని 1996 డిశంబర్ 24 నాడు రూపొందించారు. దాని ప్రకారం అడవులపై ఆదివాసులకే సర్వహక్కులని భ్రమింపచేశారు. పెసాను ఆదివాసులు తమ స్వయం పాలన కోసం శక్తిమంతంగా ఉపయోగించుకోవచ్చని బుకాయిస్తున్నారు. దాని అమలు కోసం ఆదివాసులు ఉద్యమిస్తున్న చోట వారిపై లాఠీలను, తుపాకులనూ ప్రయోగిస్తున్నారు. వాస్తవానికి ఆదివాసులను మోసగించడానికే ఆ చట్టాన్ని ముందుకు తెచ్చారు. దేశంలోని ఆదివాసుల

విషయంలో ప్రభుత్వాలు చట్టాలు ఎన్ని చేసినా అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప అడవులలోని ఆదివాసులకు ఆచరణలో భూములూ, అడవులూ, వాటిపై అధికారం దక్కనే లేదు. వారికి విప్లవోద్యమం ద్వారానే అవి దక్కుతావి.

ఏ రోజూకారోజూ ఆదివాసీ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాల వలన దేశంలోని అడవులు హరించుకుపోతున్నాయి. దేశంలోని అపార ప్రాకృతిక సంపదలను బహుళ జాతుల కార్పొరేషన్‌లకు, దళారీ బడా పెట్టుబడిదారులకు మన దేశ పాలకులు కారుచౌకగా సమకూరుస్తున్నారు. దేశంలోని అడవులు సహా సమస్త ప్రకృతి సంపదలను, పర్యావరణాన్నీ కాపాడుకోవడానికి ఆదివాసీ ప్రజలతో పాటు దేశంలోని అశేష ప్రజానీకం సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య శక్తులతో, వారి భద్రతా బలగాలతో దృఢంగా పోరాడాలి.

అధికార మార్పిడికి పూర్వం బ్రిటిష్ వారు మన దేశంలోని ఆదివాసులను పెద్ద ఎత్తున్నే క్రైస్తవ మతంలోకి మార్పిడి చేశారు. జనగణనాల సమయంలో వారిది 'ప్రకృతి మతం' అనిబ్రిటిష్ వారు గుర్తించేవారు. ఇప్పటికీ, మన దేశంలోని ఆదివాసులను హిందూ, క్రైస్తవ, ఇస్లాం మతాలు తమలో విలీనం చేసుకోవడానికి రకరకాల కుట్రలకు, కుహకాలకు, దాడులకూ పాల్పడుతున్నాయి. ఇందులో దేశ పాలకులు తమ అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ ఆదివాసులలో హిందూ మత వ్యాప్తికి అత్యంత దూకుడుగా వ్యవహరిస్తోన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా ప్రజలలో శాస్త్రీయ అవగాహనను పెంపొందిస్తూ వారిని రాజకీయంగా జాగరూకులను చేయాలి.

ఆదివాసీల అభివృద్ధి పేరుతో భారత రాజ్యాంగంలో వారికి రిజర్వేషన్‌లను కల్పించారు. కాని ఆచరణలో వాటిని ఆదివాసులలోని కేవలం ఒక చిన్న సెక్షన్ మాత్రమే వినియోగించుకోగలుగుతోంది. అడవులపై ఆదివాసులకు అధికారం దక్కకుండా, వారి సమగ్ర వికాసానికి సరైన విధానాలు అమలు చేయకుండా,వాటి కోసం నిజాయితీతో కూడిన కృషి లేకుండా ఈ వ్యవస్థలో కేవలం రిజర్వేషన్‌లతోనే వారి సర్వతోముఖ అభివృద్ధి అసాధ్యం. ఈ దోపిడీ వ్యవస్థను మార్చడం ద్వారానే అవి సాధ్యం.

## భాషా సమస్య

ఒక జాతి అభివృద్ధిలో, దాని ఏకత్వంలో భాష కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఏ ప్రాంతంలోనైనా ఒక జాతి రాజకీయంగా మనుగడ సాధించాలంటే అక్కడి జనాభా ఒకే భాష మాట్లాడేవారై ఉండాలి. వర్తక వాణిజ్యాలు పెరగాలన్నా, ఉత్పత్తిలో అభివృద్ధి జరగాలన్నా, మార్కెట్టు విస్తరించాలన్నా వాటన్నింటిలో భాష స్థానం విశిష్టమైనది. మన దేశంలో భూస్వామ్య పూర్వ కాలంలో బ్రాహ్మణ పండితులు సంస్కృతభాషలో రచించేవారు. కానీ ఆ తర్వాత దేశంలో సాగిన భక్తి ఉద్యమాలు ప్రాంతీయ భాషల వికాసానికి నాంది పలికాయి.

చరిత్రలో బ్రిటిష్ వారికి పూర్వం భారతదేశం ఎలాగైతే ఒక దేశంగా ఏకీకృతం కాలేదో, అలాగే బ్రిటిష్ వారికి పూర్వం గానీ, తర్వాత గానీ ఎన్నడూ ఇక్కడి ప్రజలందరి మధ్య సామన్య భాష అంటూ ఏదీ లేదు.

ఒక ప్రాంతంలోని ప్రజలను జాతిగా ఏర్పర్చడంలో వారి మధ్య మాధ్యమంగా ఉండే భాష ఒక ముఖ్య సాధనం అవుతుంది. దేశంలోని వేరు వేరు ప్రాంతాలలో వేరు వేరు భాషలున్నాయి. అనేక ప్రాచీన మూలవాసీ ప్రజా సముదాయాల భాషలకు మాత్రం చాలా వరకు లిపిలు లేవు. లిపిలు లేని భాషలను అసలు భాషలుగానే పాలకవర్గాలు గుర్తించడం లేదు. వాటిని 'బోలీ' లంటూ అపహాస్యం చేస్తున్నారు. దేశంలోని అతి పెద్ద ఆదివాసీ సముదాయాలలో ఒకటయిన కోయ (గోండు) తెగ ప్రజానీకం మాట్లాడే భాషకు ఇంతవరకూ ప్రామాణికమైన లిపే రూపొందలేదు. భిల్, ఉరావ్, కువ్వీ లాంటి అనేక విశాల ఆదివాసీ ప్రజా సముదాయాల భాషలకు సైతం ప్రామాణికమైన లిపిలు లేవు. భాష విషయంలో పరమ రియాక్షనరీ హిందుత్వ గోల్వల్కర్ చరిత్రను వక్రీకరిస్తూ ఇలా అంటాడు. 'మనకు మరే భాషా లేదు, ఉన్నది సంస్కృతమే. నేటి అనేక పిల్ల భాషలు ఆ మాతృ భాష సంతానమే'. వర్తమానంలో అధికారంలో ఉన్న బీ.జే.పీ.కి, హిందుత్వ శక్తులకు ఆయన బోధనలే శిరోధార్యంగా ఉన్నాయి. 'ఒకే భాష, ఒకే సిద్ధాంతం, ఒకే దేశం' అనేది వారి కరుడుగట్టిన హిందుత్వ భావజాలంలో భాగమే.

ప్రాంతీయ భాషల వికాసం జరిగి జాతులు మరింత అభివృద్ధి చెందితే దోపిడీ వర్గాల వాంఛిత (కల్పిత) భారత జాతికి ముప్పు వాటిల్లుతుంది. వారి భారత జాతికీ, మిగతా ప్రాంతాల జాతులను ఉప–జాతులుగా నిలపాలనే వారి కుట్రలకు అది ఒక ప్రమాదకర పరిణామంగానే తయారవుతుంది. దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారుల లాభాపేక్ష, వారి పెట్టుబడుల ప్రయోజనాలకు అది విఘాతాన్ని కలిగిస్తుంది. అందుకే వారు హిందుత్వ ఆధిపత్య భావజాలంతో హిందీ మినహా మిగతా భాషలను అణచివేస్తున్నారు.

మగధ కాలానికి సామాన్య జనం మాట్లాడుకునే పాళీ భాష పరిపాలనా భాష కాగా, మొగలుల కాలంలో హిందుస్తానీ అధికార భాష కాగా, బ్రిటిష్ వారి కాలంలో ఆంగ్లమే అధికార భాషగా ఉండింది. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముందు పీఠిన నిలచిన కాంగ్రెస్ నాయకులంతా దళారీ నిరంకుశ బడా బూర్జువావర్గ ప్రయోజనాల కోసం హిందీని ఆయా జాతుల భాషలపై రుద్దడం ప్రారంభించారు.

దోపిడీ పాలకవర్గాల సమస్త కుట్రలకు, కుహకాలకు భారత రాజ్యాంగం సాధికారతను కల్పిస్తుంది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఉర్దూ సహ 22 భాషలకు స్థానం (గుర్తింపు) కల్పించారు. నిజానికి వీటిలో పలు భాషలకు తొలినాటి రాజ్యాంగ ప్రతిలో స్థానమే లేకపోగా

ఆ తర్వాత ముందుకొచ్చిన ప్రజా పోరాటాలతో రాజ్యాంగ సవరణలు జరిగి మరి కొన్ని భాషలను చేర్చారు. అస్సామీ, బంగాలీ, బోడో, డోగ్రీ, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, కొంకణీ, మైథిలీ, మలయాళం, మణిపురీ, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, సంస్కృతం, సంథాలీ, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషలు భారత రాజ్యాంగంచే గుర్తింపు పొందిన భాషలు. దేశంలో అభివృద్ధి చెందిన ఇంకా పలు జాతుల భాషలకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపే లేదు. ఈ వైఖరి ఆయా జాతుల అణచివేతలో భాగమే తప్ప వేరు కాదు. ఇది ఇలా ఉంటే మరో వైపూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 343లో కేంద్ర అధికార భాష హిందీ అనీ, లిపి దేవనాగరీ అని రాసి పెట్టారు. జాతీయ అధికార భాషా (హిందీ) దినంగా సెప్టెంబర్ 14ను పాటిస్తున్నారు. మిగతా ఏ భాషకు లేని ప్రాముఖ్యతను హిందీకి కల్పించడం అంటే ఆ భాషలను రెండవ శ్రేణికి నెట్టడమే.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 345–7లు రాష్ట్రాలలో స్థానిక భాషలే అధికార భాషలుగా వుండవచ్చునని చెప్పినప్పటికీ, ఇంకనూ పలు రాష్ట్రాలలో హిందీయే అధికార భాషగా కొనసాగుతోంది. దేశంలో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఉన్న సంబంధాలలో భాష కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఒకే జాతి, ఒకే జాతీయ భాష ఉండాలి అనే కేంద్రం, తన నిరంకుశ విధానాలతో హిందీని 'జాతీయ' భాషగా రుద్దుతోంది. హిందీ ప్రాంతాలుగా చెప్పబడుతున్న చోట కూడా కోట్లాది మంది ప్రజలకు హిందీ మాతృభాష కాదు. వారిపై కూడా బలవంతంగా హిందీని రుద్దుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పిల్లలకు మాతృభాషలోనే విద్య నేర్పాలి. కాని దేశంలోని అనేక రాష్ట్రాలలో, ముఖ్యంగా వెనుకబడిన ఆదివాసీ ప్రాంతాల పిల్లలు ఈ హక్కు నుండి పూర్తిగా వంచించబడుతున్నారు.

త్రిభాషా సూత్రం అమల్లో ఉన్న రాష్ట్రాల్లో స్కూలు పిల్లలు పరాయి భాషల బరువు మోస్తున్నారు. ఈ క్రమంలో ప్రాంతీయ భాషలు వెనక్కి పోతూ, ఇంగ్లిష్ భాష వేగంగా విస్తరిస్తూంది. ఇది మొదట వలస పాలన విష ఫలితం. ఇప్పుడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితం. దేశ పాలకులు ప్రజలలో ఇంగ్లిష్ పట్ల అనేక భ్రమలను పెంచుతున్నారు. ఇంగ్లిష్ చదువకుంటే పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలలో లక్షలు సంపాదించే ఉద్యోగాలు రావనే వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇవాళ ఆచరణలో ఇంగ్లిష్, హిందీ దేశంలోని అన్ని జాతుల భాషలను వెనక్కి నెడుతున్నాయి. అందువల్లనే దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రత్యేకంగా దక్షిణ భారతదేశంలో గల వేరు వేరు భాషల ప్రజలు కేంద్రం రుద్దుతున్న హిందీ భాష ఆధిపత్యాన్ని, దురభిమానాన్ని వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ హిందీ అనుకూల వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ దక్షిణ భారతదేశంలో భారత రాజ్యాంగ ప్రతులను తగలబెట్టే సంప్రదాయం ముందుకు వచ్చింది.

ఆయా జాతుల భాషలు అభివృద్ధి చెందాలంటే, ప్రభుత్వం అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో ఆయా ప్రాంతాల ప్రజల మాతృభాషలను, లిపి లేని భాషలకు లిపిని రూపొందించడాన్ని

ప్రోత్సహించాలి. మాతృభాషలో విద్యా బోధనతో పాటు 'కామన్ స్కూల్' సిస్టం ఉండాలి. త్రిభాషా సూత్రాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రజలు తమకు అవసరమైన లేదా ఇష్టమైన భాషలను ఎవరైనా ఐచ్ఛికంగా నేర్చుకునే, తమకు నచ్చిన ఏ లిపినైనా ఐచ్ఛికంగా ఎంచుకునే అవకాశాలు కల్పించాలి. ఆయా ప్రాంతాలలో, న్యాయ వ్యవస్థలో, పరిపాలనా వ్యవస్థలో, మీడియాలో ప్రాంతీయ భాషలనే విధిగా వాడాలి. కొన్ని ప్రాంతాల్లో అరుదుగా ఉన్న చిన్న చిన్న ఆదిమ సమూహాల భాషలకు కూడా ప్రభుత్వం సమాన హోదా కల్పించాలి. అన్ని జాతుల, భాషల మధ్య సమానత్వం ఉన్నప్పుడే భాషా సమస్య సవ్యంగా పరిష్కారమవుతుంది. దేశ ప్రజల మధ్య సమన్వయం పేరుతో కేంద్రం ఉమ్మడి భాషగా ఏ భాషనూ రుద్దకూడదు.

## జాతుల వికాసంలో కులవ్యవస్థ అడ్డుగోడ

మన దేశంలో ప్రజల మధ్య సోదరభావానికి, జాతుల వికాసానికి, సమానత్వానికి, వాటి విముక్తికి బ్రాహ్మణీయ కులాధారిత అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ ఓ పెద్ద అడ్డుగోడ. మన దేశంలోని అన్ని మతాలలో, జాతులలో వివిధ రూపాలలో కుల వ్యవస్థ ఉనికిలో ఉంది. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య భారతదేశంలో అన్ని రంగాలలో సమాజాన్ని కులవ్యవస్థ పట్టి పీడిస్తున్నది. దోపిడీ పాలకవర్గాలు కుల, మత అంతరాలను వినియోగించుకుని ప్రజలను చీలదీసి తమ స్వార్థ ప్రయోజనాలను ఈడేర్చుకుంటున్నాయి. కుల పీడన, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా, పీడిత ప్రజల న్యాయమైన డిమాండ్ల మీదా, వివిధ పోరాటాలలో వారిని సంఘటితపర్చడంలో కులాంతరాలు అనేక ఆటంకాలను కల్పిస్తున్నాయి.

మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయడానికి దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ, భూస్వామ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వర్గ ప్రాతిపదికన, బ్రాహ్మణీయ కులాధారిత వ్యవస్థను కూల్చే లక్ష్యంతో అన్ని కులాల ప్రజలను ముఖ్యంగా పీడిత కులాల ప్రజలను సమైక్యపర్చాలి. తద్వారా జాతుల విముక్తి మార్గం సుగమమై భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి ప్రధాన టార్గెట్లయిన ఆ మూడు 'మహా పర్వతాలను' కూల్చగలుగుతాం.

## రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలు:

ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 19 శాతం కాగా, నేల మీదా లభించే నీరు మాత్రం నాలుగు శాతమే అంటారు. అయినా మన దేశంలో 70 వేల టీ.ఎం.సీల నీరుంది. ప్రతీ ఎకరానికి నీరిచ్చే అవకాశం ఉంది. 40 కోట్ల ఎకరాల భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. అయినా 70 ఏళ్లుగా నీటి కోసం రాష్ట్రాలు కొట్లాడుకుంటూనే ఉన్నాయి. 70 ఏళ్లయినా దేశంలో ఇప్పటికీ తాగునీటి కటకట పరిష్కారం కాలేదు. దేశంలో లభించే నీటిని భారత దోపిడీ పాలకవర్గాలు స్వార్థ రాజకీయాలను అనుసరిస్తూ ప్రజా అవసరాలకు సద్వినియోగం

చేయడం లేదు. మన దేశంలో పదుల సంఖ్యలో జీవనదులు ప్రవహిస్తున్నాయి. అనేక రాష్ట్రాల గుండా ఆ నదులు ప్రవహిస్తూ సముద్ర లో కలుస్తున్నాయి. వివిధ రాష్ట్రాల గుండా ప్రవహిస్తూన్న ఆ నదీ జలాల వినియోగంపై ఎడతెగని వివాదాలు కొనసాగుతున్నాయి. ఆ వివాదాలకు కేంద్ర, రాష్ట్ర పాలక ముఠాల స్వార్థ రాజకీయాలే కారణం.

నదీ జలాల వినియోగానికి అవసరమైన ప్రాజెక్ట్‌లను ఎక్కడ నిర్మించాలనీ, ఎంత ఎత్తుతో నిర్మించాలనీ, నీటి వినియోగంలో ఏ రాష్ట్రం వాటా ఎంత అనే పలు విషయాలపై నడుపుతున్న దోపిడీ వర్గాల రాజకీయాలు, అవి సృష్టిస్తున్న ప్రజా ఆందోళనలు, ఘర్షణలు, వైషమ్యాలు, హత్యలు మన దేశంలో నిరంతరం ఎక్కడో దగ్గర చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ వివాదాలను వినియోగించుకొని రాజకీయ లబ్ది పొందడానికి అన్ని దోపిడీ రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. జాతీయ పార్టీలుగా చలామణి అవుతున్న 'బడా' పార్టీలు ఒక రాష్ట్రంలో ఒక విధానం, మరో రాష్ట్రంలో మరో విధానాన్ని అనుసరిస్తూ భిన్న రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చులు రేపుతున్నాయి. ఈ వివాదాలను సుదీర్ఘకాలం వాయిదా వేయడానికి, ఆ కాలంలో అవసరమైనపుడల్లా తమ పబ్బం గడుపుకోవడానికి ట్రిబ్యునల్‌లను (న్యాయస్థానం) ఏర్పరుస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతోఈ వివాదాలు మరింత తీవ్రతరమవడమే కాకుండా కొత్త వివాదాలకు దారులు తెరిచాయి.

మన దేశంలో ఆయా రాష్ట్రాలు తమ సరిహద్దులలోని నదులపై 'అభివృద్ధి' పథకాలను రూపొందించి కేంద్ర జల సంఘానికి పంపుతాయి. కానీ నదీ బేసిన్‌పై సమగ్ర అభివృద్ధి పథకాలను రూపొందించి వాటిని అమలు చేసే వ్యవస్థను మాత్రం కేంద్రం రూపొందించని ఫలితంగా, కేంద్ర రాష్ట్రాల అసమ సంబంధాల మూలంగా నదీ జలాల పంపకాలలో అనేక వివాదాలు ఉత్పన్నమవుతున్నాయి.

1956లో రాష్ట్రాల పునర్విభజన సమయంలో ఆర్టికల్ 262 కింద అంతర్ రాష్ట్ర నదీ జలవివాదాల నివారణ విధానాన్ని రూపొందించారు. అందులో భాగంగా దేశంలో ఐదు నదీ జల వివాద నివారణ ట్రిబ్యునల్స్ ఏర్పడ్డాయి. అవి కృష్ణా, గోదావరి, నర్మద, కావేరీ, రావి-బియాస్ నదీ జలాల ట్రిబ్యునళ్లు. ఏ ట్రిబ్యునల్స్ ఏర్పడినప్పటికీ రాష్ట్రాల మధ్య నీటి పంపకాల తగాదాలు మాత్రం అలాగే ఉన్నాయి.

1956 చట్టానికి కొన్ని సవరణలు చేస్తూ సర్కారియా కమిషన్ సిఫారసుల అమలులో భాగంగా జల తగాదాల పరిష్కారానికి సంవత్సరంలోపు న్యాయపీఠాన్ని ఏర్పాటు చేయాలని 1987లో మరో చట్టం చేశారు. అయినప్పటికీ అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల సత్వర పరిష్కారం మాత్రం కావడం లేదు. కావేరి నదీ జల వివాదం అలనాటి మదరాసు, మైసూర్ ప్రభుత్వాల మధ్య 1807లో మొదలైతే, 1956 వరకు సాగలాగారు. 1956లో రాష్ట్రాలను విభజించి

తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, కర్ణాటకలకు నీటి పంపకాల తగాదానూ పంచారు. కావేరీ నదీ జల వివాదం మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఆ రాష్ట్రాల ప్రజలందరూ ఇన్నేళ్లుగా పాలక వర్గాల స్వార్థ రాజకీయాల మూలంగా అన్ని విధాలా నష్టపోతూనే ఉన్నారు.

రావి-బియాస్ నదీ జలాల వివాదానికి కూడా సుదీర్ఘ చరిత్ర ఉంది. భారత-పాకిస్తాన్‌ల మధ్య 1960 సంవత్సరంలో ఓ వైపు సింధూ నదీ జలాల ఒప్పందం జరుగుతున్నపుడే దేశంలోని పంజాబు, హర్యానా, జమ్మూ-కశ్మీర్, రాజస్థాన్‌ల మధ్య ఆ నదీ జలాల పంపకంపై చర్చలు జరిగి ఒక అంగీకారానికి వచ్చినా, గత 60 ఏళ్లుగా ఆ వివాదానికి తెరపడిందే లేదు. 1980లలో పంజాబ్ ఉద్యమం తలెత్తడానికి ఒక ముఖ్య కారణం రావి-బియాస్ నదీ జలాల పంపకం సమస్య.

అంతర్రాష్ట్ర నదుల నీటి పంపకాల తగాదాలు మన దేశంలో అనేకం ఉన్నాయి. కర్ణాటక ప్రభుత్వం తలపెట్టిన ఆల్మట్టి డ్యాం ఎత్తు విషయంలో యేండ్ల తరబడిగా ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. తెలుగు గంగ, భీమా, ఎన్.ఎల్.బీ.సీ. విషయంలో కర్ణాటక-ఆంధ్రప్రదేశ్‌ల మధ్య జల వివాదాలు మాత్రం ఇంకా తెగలేదు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపకం తగువులున్నవి. కావేరీ నదీ జలాల గురించి తమిళనాడు, కర్ణాటకల మధ్య విభేదాలు ఉన్నాయి. ముల్ల పెరియార్ డ్యాం విషయంలో తమిళనాడుకు కేరళతో కూడా వివాదం ఉంది. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల మధ్య నర్మదా నదీ జలాల పంపకం తగదాలున్నవి. ఛత్తీస్‌గఢ్, ఒడిశాల మధ్య ఇంద్రావతి, మహానది నదీ జలాల కోసం తగువులున్నాయి. గోదావరీ, కృష్ణా నదీ జలాల పంపకం విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య వివాదాలున్నవి. ఇలా దేశంలోని అనేక రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలు కేంద్ర సాచివేత ధోరణి మూలంగా దశాబ్దాలుగా కొనసాగుతున్నవి.

1987లో ఏర్పడిన నదీ జలవనరుల పరిషత్తు కానీ, అది ముందుకు తెచ్చిన నూతన డాకుమెంటు కానీ, రాజ్యాంగానికి చేస్తున్న సవరణలు కానీ అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలను పరిష్కరించలేకపోతున్నాయి. అందుకు ఏకైక కారణం దోపిడీ పాలకవర్గాల స్వప్రయోజనాల జల రాజకీయాలే. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముందుకు రావడానికి ఒక ముఖ్యమైన సమస్య నదీ జలాల పంపకం. పాలకవర్గాల ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. నిజానికి దేశంలో నిర్మితమవుతున్న భారీ ప్రాజెక్టులు అనేక విధాల వినాశనానికి దారి తీస్తున్నాయి. వీటి స్థానంలో ప్రజలకు, పర్యావరణానికి భారీ నష్టం కలిగించని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణాలనే చేపట్టాలి.

ఒకవైపు అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలు ఏళ్ల తరబడిగా కొనసాగుతుండగానే మధ్య

మధ్య మరోవైపు రాజకీయ పార్టీలు, నాయకులు తమ అవసరాల కోసం నదుల అనుసంధాన చర్చలు లేవనెత్తుతుంటారు. హిమాలయ నదుల అభివృద్ధి పథకం, ద్వీపకల్ప నదుల అభివృద్ధి పథకం అంటూ అనుసంధాన పథకాలను రూపొందించారు.

హిమాలయ నదుల అభివృద్ధి పథకంలో ప్రధానంగా గంగా, బ్రహ్మపుత్ర నదులపైన మన దేశం, నేపాల్‌లో వున్న వాటి ఉపనదులపైన జలాశయాలు నిర్మించి వర్షాకాలపు నీటిని భద్రపరిచి సాగునీరు, విద్యుదుత్పాదన, వరద నియంత్రణ సాధించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం. గంగ ఉపనదులైన కోసి, గండక్, ఘాగ్రాలలోని అదనపు జలాలను కాల్వలు నిర్మించి అనుసంధానం వ్యవస్థ ద్వారా పశ్చిమ ప్రాంతాలకు తరలించడం దీని ఉద్దేశ్యం. ద్వీపకల్ప నదుల అభివృద్ధి పథకం మహానది–గోదవరి–కృష్ణా–కావేరీ నదులను అనుసంధానం చేసే పథకం.

నిజానికీ పై పథకాలు ఏవి కూడా ప్రజల ప్రయోజనాలను ఈడేర్చే లక్ష్యంతో చేపట్టినవి కాదు. కేంద్రంలో హిందుత్వ శక్తులు అధికారాన్ని చేపట్టిన తర్వాత సాగర్‌మాల పేరుతో లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. అంతకన్న ఎక్కువగా పాకిస్తాన్‌ను బెదిరించడానికి ప్రజల ప్రాణాలను బలిగొనే నదీ జల రాజకీయ విధానాలు అనుసరిస్తున్నారు. ప్రజల ప్రయోజనాలను నెరవేర్చడాన్ని కేంద్ర బిందువుగా తీసుకుని అంతర్ రాష్ట్ర జల వివాదాలు పరిష్కరించబడాలంటే దోపిడీ పాలకవర్గాలను అధికారం నుండి కూలదోయాలి. నదీ జలాల పంపకం విషయంలో మన పార్టీ ఆయా ప్రాంతాల స్థితి గతులు, ప్రజా ప్రయోజనాలను కాపాడే విధంగా ఒక పాలసీని రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

నదీ జలాల వివాదాల పరిష్కారంలో మొదట తాగు నీరు, రెండవదిగా సాగునీరు, మూడవది విద్యుచ్ఛక్తి, నాల్గవది జల రవాణా, అయిదవది పారిశ్రామిక, ఇతర ప్రయోజనాలు వుండాలి. వీటిని పర్యావరణానికి, ప్రజల జీవన విధానానికి భారీ నష్టాలను కలిగించకుండా రూపొందించాలి.

### జాతుల సమస్యపై వివిధ పాలకవర్గ పార్టీల వైఖరి

దేశంలోని ప్రధాన పార్లమెంటరీ రాజకీయ పార్టీల పేర్లు, జెండాలు మాత్రమే వేరు తప్పా అవి అనుసరించే ఆర్థిక, రాజకీయ విధానాలలో మౌలికమైన తేడాలేమీ లేవు. అవన్నీ దేశంలోని దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకే ప్రాతినిధ్యం వహిస్తున్నవి. విడిపోయే హక్కుతో సహ జాతుల స్వయం నిర్ణయాధికారం విషయంలో మన దేశంలో పలు పార్టీలతో కూడిన రాజకీయ కూటములకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్, బీ.జే.పీ లతో పాటు రివిజనిస్టు పార్టీల, ప్రాంతీయ పార్టీల వైఖరులను ఇక్కడ సంక్షిప్తంగా చూద్దాం.

**కాంగ్రెస్ పార్టీ వైఖరి:** కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యోద్యమ కాలంలో భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాల ఏర్పాటును ఆమోదించినప్పటికీ 1947 అధికార మార్పిడి తర్వాత అది తన వైఖరిని మౌలికంగానే మార్చుకుంది.  భారతదేశంలో భాషాపరంగా, రాష్ట్రాల పరంగా ఉన్న విభిన్న సంస్కృతులను గుర్తించి భారతదేశానికి ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థను కోరిన కాంగ్రెస్ 1947 అధికార మార్పిడితో వాటన్నింటిని నిరాకరించింది. 1946 వరకూ ఫెడరల్ యూనియన్‌లో చేరిన రాష్ట్రాలకు 95% స్వయం నిర్ణయాధికారాలు ఉంటాయనీ, దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు లాంటివి 5% మాత్రం ఉమ్మడిగా ఉంటాయని నమ్మ పలికిన కాంగ్రెస్ పార్టీ తరువాతి కాలంలో రాష్ట్రాలను వంచిస్తూ వచ్చింది.

భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాల పునర్విభజనను, నూతన రాష్ట్రాల ఏర్పాటును దేశంలోని టాటా, బిర్లా లాంటి దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారులు వ్యతిరేకించారు. అలా చేయడం ద్వారా వాళ్ళ గుత్తాధిపత్యానికి విఘాతం ఏర్పడుతుందని వారు సులువుగానే గ్రహించారు. దానితో రాష్ట్రాల పునర్విభజనతో దేశ ఆర్థిక అభివృద్ధి కుంటుపడుతుందని వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు సాకు చెప్పి మోసగించింది.

విడిపోయే హక్కుతో సహ జాతుల స్వయం నిర్ణయాధికారానికి కాంగ్రెసే కాదు దాని నుండి శాఖోపశాఖలుగా పుట్టుకొచ్చిన పార్టీలూ ఆమోదించవు. అవన్నీ ఒకే తాను ముక్కలు. జాతుల వికాసానికీ, భాషల వికాసానికీ, అన్ని ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ సహ సామ్రాజ్యవాద ప్రయోజనాలను ఈడేర్చే అన్ని బూర్జువా పార్టీలు వ్యతిరేకమే. వాటన్నిటి వైఖరి ఒక్కటే. నిజానికి దేశంలో పలు దశాబ్దాలుగా కొనసాగుతున్న జాతుల సమస్యలకు కాంగ్రెస్ అనుసరించిన అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలే మూల కారణం. కాంగ్రెస్ బూర్జువా జాతీయ దురహంకారానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అది భారత జాతి అనే రూపంలో వ్యక్తమవుతుంది.

**ఆర్.ఎస్.ఎస్., బీ.జే.పీ.ల వైఖరి:** ఆర్.ఎస్.ఎస్.ను మొదట స్వభావ రీత్యా బ్రాహ్మణ-బనియా సంస్థగానే వ్యవహరించేవారు. అది తనది జాతీయ సాంస్కృతిక వాదమని చెప్పుకుంటుంది. సర్ సంఘ్‌చాలక్‌గా దాదాపు మూడు దశాబ్దాలకు పైగా కొనసాగిన దాని సంస్థాపక నాయకులలో ఒకరైన గోల్వాల్కర్ 1939లో రాసిన 'వీయ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' అనే గ్రంథంలో ఆయన దేశంలోని జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారాన్ని నిరాకరించాడు. ఆయన దృష్టిలో  'హిందువులు, హిందువులు మాత్రమే నిఖార్సయిన భారతవాసులు'. అంతే కాదు, 'మేం-హిందువులం-నిర్వివాదంగా, నిర్విఘ్నంగా ఏ విదేశీ జాతి (రేస్) దురాక్రమణకు గురి కాని రోజులనుండి భారత భూభాగంపై ఉంటున్నాం. అందుకే ఇది హిందుస్తాన్‌గా, హైందవ భూమిగా ఉనికిలోకి వచ్చింది' అంటాడు.

ఆర్.ఎస్.ఎస్. రూపొందించుకున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 3లో ఇలా ఉంది: 'హైందవ సమాజంలోని భిన్న సమూహాలను కలిపి ఉంచడంలో సంఘ్ లక్ష్యం, ఉద్దేశ్యం ఏమంటే మతం,

సంస్కృతి ప్రాతిపదికపై వాటిని పునరుజ్జీవింపచేసి బలోపేతం చేయడమే. అలా చేయడం ద్వారానే భరతవర్ష సమగ్ర అభివృద్ధిని చేరుకోగల్గుతుంది'. హిందీ భాష, హిందూ మతం, బ్రాహ్మణీయ హిందూ సంస్కృతి అనే అంశాల ఆధారంగా భారత జాతి రూపొందిందనే మరింత కట్టుదిట్టమైన భావనను భారతీయ జనతా పార్టీ ప్రచారం చేస్తోంది. ఇదీ, బ్రాహ్మణీయ హిందూ మత ఛాందసవాదుల వైఖరి.

ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యాల సాధనకై రాజకీయ రంగంలో పని చేసే పార్లమెంటరీ పార్టీయే బీజేపీ. కశ్మీర్ విషయంలో బీజేపీ వారి దృక్పథం చాలా స్పష్టంగానే ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 జాతీయతా భావానికి, భారత జాతి రాజ్య నిర్మాణానికి ఒక అవరోధంగా భావిస్తూ దానిని రద్దు చేయాలనీ హిందుత్వ ఎజండాతో పని చేస్తున్న సకల శక్తులూ నడుం బిగించాయి. వారు కశ్మీర్ సమస్యను హిందూ ముస్లిం సమస్యగా, పాకిస్తాన్ ప్రేరేపిత అల్లర్లుగా చిత్రీకరిస్తారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అననివారు ఈ దేశాన్ని వదలి పాకిస్తాన్ వెళ్లాలనీ బహిరంగంగా ప్రకటిస్తున్నారు.

వారు 'ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్' అంటూ 'నయా భారత్' నిర్మాణ దిశలో పని చేస్తూన్నారు. వారు 'వన్ నేషన్–వన్ టాక్స్' అంటూ ముందుకు తెచ్చిన 'వస్తు సేవల పన్ను' రాష్ట్రాల (జాతుల) ప్రయోజనాలను కాలదన్నేదే. వారు 'వన్ నేషన్–వన్ పోల్' అంటూ కేంద్ర–రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలను జరిపించాలనే చర్చను ముందుకు తెచ్చారు. వారు చేపట్టిన 'వన్ నేషన్–వన్ గ్రిడ్', వన్ నేషన్–వన్ రాషన్ కార్డు', 'సాగర్‌మాలా', 'భారత్‌మాలా', మొదలైనవన్నీ వారి 'ఒకే దేశం, ఒకే సిద్ధాంతం, ఒకే నాయకుడు' అని చెప్పే బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజంలో భాగమే. వారు దేశంలోని అనేక పట్టణాల, ప్రముఖ స్థలాల, ప్రజా సంస్థల పేర్లనూ హైందవీకరిస్తున్నారు.

కశ్మీర్, ఈశాన్య ప్రాంత జాతుల ఉద్యమాల విషయంలోనూ వేర్పాటువాద శక్తులంటూ నిందిస్తూ విషం కక్కడం వారి అఖండ భారత్ సిద్ధాంతంలో భాగమే. గోల్వాల్కర్ చెప్పే దాని ప్రకారం దేశమంటే ఐదు ఐక్యతలతో కూడుకున్నది. 1. భౌగోళిక ఐక్యత, 2. జాతిపర (రేసియల్) ఐక్యత, 3. ధార్మిక ఐక్యత, 4. సాంస్కృతిక ఐక్యత, 5. భాషా ఐక్యత. ఇన్ని ఐక్యతలు వాంఛించే మనువాదులకు దేశంలోని భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, భిన్న మతాలు మింగుడుపడవు. వారు జాతులకు స్వయంనిర్ణయాధికార హక్కు కానీ వాటి స్వతంత్ర అభివృద్ధి గానీ అవి తిరిగి ప్రజాస్వామిక ప్రాతిపదికపై సంలీనమయ్యే స్వేచ్ఛ కానీ వారు నిరాకరిస్తారు.

**రివిజనిస్టు పార్టీల వైఖరి:** భారత దేశంలోని జాతుల సమస్యను గానీ, జాతుల సమస్యకు భారత ప్రజాస్వామిక విప్లవంలో గల ప్రాధన్యతను గానీ సీ.పీ.ఐ. ఎన్నడూ అర్థం చేసుకోలేదు. భారత దేశం బహు జాతులకు నిలయమనే విషయాన్ని అది చాలాకాలం వరకూ గుర్తించనేలేదు.

1940 మార్చిలో ముస్లిం లీగ్ పాకిస్తాన్ డిమాండును ముందుకు తెచ్చింది. పాకిస్తాన్ డిమాండ్ పట్ల తన వైఖరిని నిర్ణయించుకోవడం కోసం సీ.పీ.ఐ. భారతదేశంలో జాతుల సమస్యను పట్టించుకోవలసి వచ్చింది. 1942 సెప్టెంబర్ 19న జరిగిన కేంద్రకమిటీ ప్లీనంలో సీ.పీ.ఐ. "ఆన్ పాకిస్తాన్ అండ్ నేషనల్ యూనిటీ" అనే తీర్మానాన్ని ఆమోదించింది. భారత దేశంలో జాతుల సమస్య పట్ల సీ.పీ.ఐ. వైఖరిని అది వివరించింది.

అది 1943లోని 'డ్రాఫ్ట్ ప్లాట్‌ఫాం'లో మొదటిసారిగా జాతుల స్వయంనిర్ణయాధికార హక్కును ప్రస్తావించింది. అది విప్లవానంతర కాలంలో ఏర్పడబోయే జాతుల స్వచ్ఛంద ఫెడరేషన్‌ను దృష్టిలో వుంచుకుని రాష్ట్రాల ఏర్పాటు గురించి చేసిన ప్రస్తావన మాత్రమే. నిర్దిష్టంగా భారత దేశంలో జాతుల సమస్య స్వభావాన్ని గానీ, భిన్న రూపాలలో ముందుకొస్తున్న జాతుల స్వయంనిర్ణయాధికార సమస్యపట్ల కార్మికవర్గ పార్టీ అనుసరించవలసిన వైఖరినిగానీ అది పేర్కొనలేదు.

1943లో జరిగిన మొదటి పార్టీ కాంగ్రెస్ 'డ్రాఫ్ట్ ప్లాట్‌ఫాం' డాక్యుమెంటును ఆమోదించింది. భారత దేశాన్ని బహు జాతుల నిలయంగా గుర్తించడంలో తాను విఫలమైనానని ఆ సందర్భంగా అది అంగీకరించింది. జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికార హక్కును డిమాండు చేసింది. యుద్ధ కాలంలోనూ ఆ తరువాతా కూడా జాతుల స్వయంనిర్ణయాధికార హక్కు సీ.పీ.ఐ. ప్రధాన రాజకీయ నినాదాలలో ఒకటిగా వుండింది. నాటినుండి 1960ల వరకూ జాతుల స్వయంనిర్ణయాధికార హక్కు సీ.పీ.ఐ. కార్యక్రమంలో భాగంగా ఉంటూ వచ్చింది. కానీ అది ఆచరణలో మాత్రం ఆ డిమాండ్‌ను ముందుకు తేలేదు.

నెహ్రూ ప్రభుత్వం పట్ల మారుతున్న తన వైఖరి కనుగుణంగా జాతుల సమస్యపై సీ.పీ.ఐ. 1953 నుండి తన అవగాహనను సర్దుబాటు చేసుకోవడానికి ప్రయత్నించింది. "జాతుల స్వయంనిర్ణయాధికార హక్కు" డిమాండు దేశ విభజనకు తోడ్పడిందంటూ 1964లో సీ.పీ.ఐ. ఆత్మవిమర్శ చేసుకుని దళారీ నిరంకుశ బడా బూర్జువావర్గ వైఖరిని చేపట్టి భారతదేశ "జాతీయ సమగ్రత"ను తలకెత్తుకుంది. 1972లో సీ.పీ.ఐ.యమ్. (9వ కాంగ్రెస్) "విడిపోయే హక్కు సహా జాతుల స్వయంనిర్ణయాధికార హక్కు భారత దేశ నిర్దిష్ట పరిస్థితులకు వర్తించదని" సూత్రీకరించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ గొప్ప పోరాటం చేసిందనీ, ఈ పోరాటాల క్రమంలోనే భారత జాతి రూపొందిందని సీపీఐ; భారతదేశంలో ఆధునిక కాలంలో భారత జాతి రూపొందడంతో పాటు మరి కొన్ని జాతులు కూడా రూపొందాయని ఈ జాతులు భారత జాతిలో కలిసిపోవడాన్ని 'ప్రగతిశీల కలయిక' (progressive amalgamation) అనీ సీపీఎమ్ అంటుంది. అంతిమంగా, రెండు రివిజనిస్టు పార్టీలూ ఒకే వైఖరితో భారతదేశంలోని జాతుల పోరాటాలకు ద్రోహం చేశాయి.

**ప్రాంతీయ పార్టీల వైఖరి:** మన దేశంలో అధికార మార్పిడికి పూర్వమే అనేక జాతుల

ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఎక్కడికక్కడే ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. మొదట తమిళనాడులో 'తమిళ కజగం' పేరుతో ప్రాంతీయ పార్టీ అస్థిత్వంలోకి వచ్చింది. ఆ తరువాత అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. ప్రాంతీయ పార్టీలు మహారాష్ట్ర, ఝార్ఖండ్, పంజాబ్, బంగాల్ సహ దక్షిణ భారతదేశం, ఈశాన్యంలో ఎక్కువగా ఏర్పడినాయి. నిర్దిష్టంగా కేంద్రానికి వ్యతిరేకంగా లేదా ఆయా రాష్ట్రాల సమస్యల పట్ల కేంద్రం అనుసరించిన వ్యతిరేక వైఖరి నుండే ప్రాంతీయ పార్టీలు ఏర్పడినాయి. పంజాబ్‌లో ప్రధానంగా నీటి సమస్య, అసోంలో అస్సామేతరుల వలస సమస్య, తెలంగాణలో, విదర్భలో ప్రాంతీయ అసమానతలు, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి అభిమానం ఇలా ఎక్కడికక్కడే చూస్తే ప్రాంతీయ పార్టీలన్నీ ఆయా జాతుల ప్రజల సమస్యలను తీసుకొనే ఏర్పడ్డాయి. ఇప్పటికీ ఈ క్రమం కొనసాగుతూనే ఉంది.

ప్రాంతీయ సమస్యలు తీసుకొని ఏర్పడిన అన్ని పార్టీలూ అక్కడి జాతి ప్రజల ఆకాంక్షలను ఉపయోగించుకుని తమ స్వంత ప్రయోజనాలను ఈడేర్చుకోవడంలో ముందున్నాయి. వివిధ సమస్యలపై కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, సంఘటితపరిచి బూర్జువా పద్ధతిలో ఉద్యమాలు నడిపిస్తున్నాయి. ఆ ఉద్యమాలలో ప్రజల మిలిటెన్సీ పెరుగకుండా మాత్రం అన్ని విధాలా నియంత్రిస్తాయి. కేంద్రంతో చాలా వరకు రాజీ బేరాలకు, లాబీయింగ్‌ల ద్వారా లబ్ది పొందడానికి తీవ్రంగా వెంపర్లాడుతుంటాయి. కేంద్రంతో అవి అనుసరించే వైఖరిపై ఆ సమస్యల పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

మన దేశంలో ఇప్పటివరకు ఆయా రాష్ట్రాలలో పెల్లుబికిన సమస్యలు ఏవైనా స్వభావ రీత్యా అవి చాలా వరకూ ఆయా జాతుల వికాసంలో భాగంగా ఉత్పన్నమైనవే. కేంద్రం అనుసరించిన జాతుల అణిచివేత విధానాల ఫలితంగా తలెత్తినవే. కేంద్రం ప్రజా ఉద్యమాలను అణిచివేయడానికే పూనుకుంటూ, వాటి డిమాండ్‌లను నీరుగారుస్తూ, తనకు అనుకూలంగా మలచుకోవడానికి ప్రయత్నిస్తోంది.

ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన ప్రాంతీయ దళారీ బూర్జువా, భూస్వామ్య, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా శక్తులు కేంద్రం అణచివేతను ప్రతిఘటిస్తూ డిమాండ్‌ల పరిష్కారానికై ఉద్యమాలను తుదివరకూ కొనసాగించిన అనుభవాలు మన దేశంలో దాదాపు లేవు. ఆ ఉద్యమాలకు నాయకత్వం వహించే వర్గాల స్వభావమే అటువంటిది. ఇందులో ప్రాంతీయ దళారీ బూర్జువా, భూస్వామ్య శక్తులు దేశంలోని దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలలో ఒక భాగం. కాబట్టి అవి ప్రజా హితవు కోరి ఉద్యమాలను చేపట్టడం లేదు, వాటి పరిష్కారానికి పూనుకో(వు)వడం లేదు.

## హిందూ రాష్ట్ర నిర్మాణ దిశలో ప్రజా వ్యతిరేక పౌరసత్వ చట్టం

1951లో మొదటిసారి అసోంలో 'జాతీయ పౌరసత్వ జాబితా' (ఎన్.ఆర్.సీ.) తయారైంది. అసోంలో చట్టరహితంగా ఉంటున్న వారిని వెనక్కి పంపించాలనీ 1979లో 'అఖిల అసోం విద్యార్థి సంఘం' (ఆసు) ఆందోళనకు దిగింది. ఆ ఉద్యమం దాదాపు ఆరేళ్లు సాగింది. ఆ సమయంలో చాలా మిలిటంట్‌గానే ప్రజలు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. 'ఆసు' పార్లమెంటరీ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇవ్వగా దాదాపు అది సంపూర్ణంగానే జయప్రదమైంది. ఆ ఉద్యమంపై రాజ్యం పాశవికంగా అమలు చేసిన హింస, అణచివేత దాడులలో దాదాపు వెయ్యి మంది ప్రజలు అసువులు బాసారు.

'ఆసు'తో పాటు అసోం గణ పరిషత్, 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం' (ఉల్ఫా) లాంటి సంస్థలు ఉనికిలోకి వచ్చి ఉద్యమానికి నాయకత్వాన్ని అందించాయి. పెటీబూర్జువా శక్తుల నాయకత్వంలో సాగిన ఆ ఉద్యమం 1985లో కేంద్రంతో చర్చలకు సిద్ధమై అగస్టు 15 నాడు ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. దానితో ఆ ఒప్పందం 'రాజీవ్ గాంధీ ఒప్పందం'గానే పిలువబడుతోంది. 1971 తర్వాత అసోం చేరిన హిందూ, ముస్లిం ప్రజలను గుర్తించి ఆ ఒప్పందం ప్రకారం వెనక్కి పంపాలనే నిర్ణయం జరిగింది. కానీ అది 2014 వరకూ ఏ రూపంలోనూ అమలులోకి రాలేదు.

అసోం సమస్యకు అసలు మూలం వలసలే కనుక ప్రజా ఉద్యమంతో పాటుగా వివాదం సుప్రీంకోర్టుకు వెళ్లడంతో 1951నాటి ఎన్.ఆర్.సీ జాబితాను అప్‌డేట్ చేసి అసలు పౌరులు ఎవరో తేల్చుమని ప్రభుత్వాన్ని అది ఆదేశించింది. ఒడంబడికలోని తేదీ ప్రాతిపదికనే అసోంలోకి వచ్చిన బంగ్లాదేశీయులందరినీ విదేశీయులుగా గుర్తించాలని 2015లో మోదీ ప్రభుత్వం సైతం ఆదేశాలు ఇచ్చింది. కానీ, మరుసటి ఏడాది ఇందుకు భిన్నంగా పొరుగు దేశాలనుంచి వలస వచ్చిన హిందువులకు భారత పౌరసత్వం ఇచ్చేట్టుగా పౌరసత్వ (సవరణ) బిల్లు ప్రతిపాదించడంతో అసోంలో ఆందోళనలు ఆరంభమైనాయి.

2018 జనవరి 1 నాడు అసోం ప్రభుత్వం మొదటి విడుత ఎన్.ఆర్.సీ. ముసాయిదాను విడుదల చేసింది. అసోంలోని 3.29 కోట్ల జనాభాలో కేవలం 1.9 కోట్లు మాత్రమే చట్టబద్ధంగా అసోం ప్రజలంటూ అందులో పేర్కొన్నారు. దానితో ప్రజలు అట్టుడికిపోయారు. ఆ ముసాయిదా లక్షలాది కుటుంబాలలో చిచ్చురేపింది. కేవలం బంగ్లాదేశ్ నుండి వచ్చిన వారినే కాకుండా దశాబ్దాల ముందు అసోంకు చేరిన భారత వాసులను కూడా సరైన అధికారిక ప్రమాణ పత్రాలు లేవంటూ (ఆధార్ కార్డు, రాషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవడం లేదు)ఆ ముసాయిదా విదేశీయుల కిందే లెక్కించింది. ఆ జాబితాలో విదేశీయుల కింద లెక్కించబడినవారిలో హిందూ, ముస్లిం సహ ఇతర మతాల వారూ ఉన్నారు. వారంతా అసోంలో 1971కి ముందు

నుండే ఉంటున్న వారిగా నిరూపించుకోని పక్షంలో అసోం నుండి వారు బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

అసోం చేరిన లక్షలాది బంగ్లాదేశ్ పేద ముస్లిం ప్రజలను ఇపుడు అర్ధ శతాబ్దం దాటాకా బంగ్లాదేశ్‌కు వెనక్కి పంపాలనీ భారత ప్రభుత్వం నిర్ణయించినంత మాత్రాన అక్కడ వారిని బంగ్లాదేశ్ ప్రభుత్వం స్వీకరించి, ఆ దేశ పౌరులుగా గుర్తించి పునరావాసం కల్పించే స్థితే ఉంటే వాళ్లు నిజంగా 'శరణార్థులయ్యేవారే' కాదు. ఏన్‌ఆర్‌సీ ముసాయిదా విడుదలయ్యాక బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా వారు తమ దేశ పౌరులు కాదంది. ఐదు దశాబ్దాలకు పైబడిన కాలంలో ఇక్కడే జన్మించిన తరాలను భారత ప్రభుత్వం ఇక్కడి పౌరులుగా గుర్తించకపోవడాన్ని వ్యతిరేకించాలి. 2019 అగస్టులో ప్రకటించిన తుది ఎన్‌ఆర్‌సీ ప్రకారం దాదాపు 15 లక్షల మందిని విదేశీ పౌరులుగా ప్రకటించారు. వారిలో దాదాపు 10 లక్షలకు పైగా హిందువులే ఉన్నారు. గత 35 ఏండ్లుగా రాజీవ్ ఒప్పందాన్ని మూలనపడేసి ఇవాళ లక్షలాది ముస్లిం ప్రజలను వీధుల్లోకి ఈడ్వడం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టుల కుట్ర తప్ప మరేం కాదు. వాళ్లను చొరబాటుదార్లుగా ప్రభుత్వం పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించాలి. భారత ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ అసోంలో ప్రజాందోళనలు చెలరేగుతున్నాయి. మరోవైపు కేంద్రం యావత్ భారతదేశానికి ఎన్‌ఆర్‌సీని వర్తింప చేస్తామంటూ ప్రకటించడం వారి హిందూ 'రాష్ట్ర' నిర్మాణంలో భాగమంటూ దేశ వ్యాపితంగా ప్రజలు దానికి వ్యతిరేకంగా వీధులలోకి వస్తున్నారు. ఏన్‌ఆర్‌సీతో పాటు జాతీయ జనాభా జాబితా (ఎన్‌పీఆర్)ను తయారుచేయడాన్ని కూడా దేశంలోని విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులు, మత మైనార్టీలు ముఖ్యంగా ముస్లింలు వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్నారు. మన పార్టీ వాటి ఉపసంహరణకు డిమాండ్ చేస్తోంది.

ఎన్‌ఆర్‌సీని వ్యతిరేకిస్తూ  అసోం అట్టుడికిపోతుండగా కేంద్రం మత ప్రాతిపదికపై పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంటులోని ఉభయసభలలో ప్రవేశపెట్టి 2019 డిశంబర్‌లో ఆమోదం పొందింది. దాని ప్రకారం బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్‌లకు చెందిన అధిక సంఖ్యలో గల హిందూ మతం వారినీ, అల్ప సంఖ్యలో గల క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మతాల వారిని ఈ దేశ పౌరులుగా గుర్తిస్తారు. ఆ దేశాలకు చెందిన ముస్లిం ప్రజలను మాత్రం దేశ బహిష్కృతులను  చేస్తారు.

కేంద్రంలో పాగా వేసిన హిందుత్వ ఫాసిస్టులు పీడిత జాతులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విస్తరణవాద విధానాలకు వ్యతిరేకంగా, ఈ సందర్భంగా ప్రత్యేకించి పౌరసత్వ సవరణ  చట్టానికి వ్యతిరేకంగా యావత్ ఈశాన్య ప్రాంత ప్రజలు సమరశీలంగా ముస్లిం ప్రజలతో ఐక్యమై పోరాడాల్సిన ఆవశ్యకత ఈ రోజు ఎంతగానో ఉంది. అసోం ప్రజల సమస్యలకు అసలు కారణం కేంద్ర ప్రభుత్వ దోపిడీ విధానాలలోనే ఉంది. వాటికి వ్యతిరేకంగా దృఢంగా

పోరాడకుండా, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల దోపిడీని అంతమొందించకుండా ఈశాన్య జాతుల ప్రజల నిజమైన డిమాండ్లు పరిష్కారం కావు.

## 'భారత జాతీయత' (ఇండియన్ నేషన్‌హుడ్) అనే తప్పుడు రాజకీయ భావనను ఎదుర్కోవడం

భారతదేశ దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య దోపిడీ పాలకవర్గాలు 'భారత జాతి'కి ప్రాతనిధ్యం వహిస్తున్నాయి. దాని ఆధిపత్యం కింద మిగితా జాతులుండాలని అవి బలంగా వాంఛిస్తూ వాటిని ఉప జాతుల స్థాయికి కుదించాలని చూస్తున్నాయి. అవి పథకం ప్రకారం 'భారత జాతీయతా' భావాన్ని సృష్టించాయి. మొదట ఈ భావాన్ని కాంగ్రెస్ పార్టీ సృష్టించి ప్రజలను నమ్మించగలిగింది. ఈ తప్పుడు భావనను రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీలయిన సీపీఐ, సీపీఐ(ఎం)లే కాకుండా కొన్ని మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు కూడా అంగీకరించాయి. భారత దళారీ నిరంకుశ బడా బూర్జువాజీని ఉత్తరాది బూర్జువాజీగా ఈ పార్టీలు వర్గీకరించాయి. ఉత్తర, మధ్య భారతంలో మాట్లాడే భాష హిందీ అనీ, అదే 'భారత జాతి' సమైక్యతకు తోడ్పడుతుందనీ, అలాగే 'భారతీయ సంస్కృతి' ఆధారంగా 'భారత జాతి' రూపొందిందని కట్టుకథను సృష్టించి భారత పాలకవర్గాలు ప్రజల్ని మోసగిస్తున్నాయి. లేని 'భారత జాతి'ని ముందుకు తెచ్చి స్థిరీకరించే ప్రయత్నాలు చేసినందునే ఈనాడు దేశంలో బలమైన కేంద్రానికి మరియు దేశంలోని అన్ని రాష్ట్రాలకూ, జాతులకూ మధ్య వైరుధ్యం కొనసాగుతున్నది. ఇది నిజానికి దోపిడీ పాలకవర్గాలు అనుసరిస్తున్న జాతుల వ్యతిరేక విధానాల మూలంగానే తలెత్తింది.

నిజానికి భారతదేశం ఎన్నడూ ఒక జాతి దేశంగా లేదు. దేశంలో జాతుల మధ్య అసమానాభివృద్ధి ఉన్నదనీ, వాటిలో ఏవీ ఉపజాతులు కావనీ, 'భారత జాతి' అనే పెద్ద జాతీ గానీ, దాని కింద ఉపజాతులు గానీ ఏవీ లేవనీ మన పార్టీ స్పష్టం చేస్తోంది. ఆయా జాతులలోని దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య శక్తులు తమ స్వార్థ ప్రయోజనాలను ఈడేర్చుకోవడానికి పెంచి పోషిస్తున్న బూర్జువా జాతీయ దురహంకారాన్ని, బూర్జువా జాతుల సంకుచితత్వాన్ని మన పార్టీ నిర్ద్వంద్వంగా ఖండిస్తుంది.

భారతదేశంలో జాతుల పోరాటాన్ని సరిగా నడపడం కోసం మొట్టమొదట, భారత దోపిడీ పాలకవర్గాలు, వాటి రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బీజేపీలు, సీపీఐ, సీపీఐ (ఎం) రివిజనిస్టు పార్టీలు సృష్టించిన 'భారత జాతి' అనే భావన మోసపూరితమైనదనీ, కుట్రపూరితమైనదనీ ఎండగడుతూ ఇది భారతదేశంలోని జాతులను అణచివేయడానికి సాధికారత సృష్టించే సిద్ధాంతమనీ నిరంతరం మనం ప్రజల్లో బహిర్గతం చేయాలి. అలాగే ఉత్తరాది బూర్జువాజీయే భారత బడా బూర్జువాజీ అనే తప్పుడు సిద్ధాంతాన్ని కూడా బహిర్గతం చేయాలి. గుజరాతీ

బనియాలతో, మార్వాడీ వ్యాపారులతో, పార్శీ వ్యాపార వర్గాలతో పాటు దేశంలో అన్ని ప్రాంతాల బడా వ్యాపార వర్గాలన్నీ కలిసే భారత దళారీ బడా బూర్జువా వర్గం రూపొందిందనీ, 1947 అధికార మార్పిడి ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుని ఇదే భారత దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గంగా ఎదిగిందనీ, ఇదే భారతదేశంలోని పీడిత జాతులన్నింటికీ ఉమ్మడి శత్రువని మనం పీడిత జాతుల్లో ప్రచారం చేస్తూ వారిని జాగృతం చేయాలి. జాతుల అణచివేతకు సంబంధించిన సకల రూపాలకు వ్యతిరేకంగా పరిస్థితులకు అనుగుణంగా మన పార్టీ పోరాట నిర్మాణ రూపాలను చేపట్టిచొరవతో నాయకత్వాన్ని అందించాలి.

## జాతుల ఉద్యమాలలో తలెత్తుతున్న తప్పుడు ధోరణులు

దేశంలోని జాతుల పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న వారెవరైన ముందు తమ శత్రువులనూ మిత్రులనూ స్పష్టంగా గుర్తించాలి. భారతదేశంలో అన్ని జాతులకు శత్రువులు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బడా బూర్జువావర్గం, బడా భూస్వామ్య వర్గం. ఈ మూడు శక్తులకు వ్యతిరేకంగా అలాగే దానికి ప్రాతినిథ్యం వహిస్తున్న భారత రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడకుండా జాతి విముక్తి ఉద్యమాలలో విజయం సాధించలేరు. మన దేశంలో జాతీయ విముక్తి ఉద్యమాలకు పెటీబూర్జువా శక్తులు నాయకత్వం వహిస్తున్న చోట ఈ భౌతిక వాస్తవాన్ని వారు గుర్తించలేకపోతున్నారు. ఫలితంగా వారు సంస్కరణవాదం వైపు కొట్టుకపోతున్నారు. లేదా రాజీ బేరాల ద్వారా సమస్యల పాక్షిక పరిష్కారానికి సిద్ధపడుతున్నారు. జాతి ప్రజల ఆకాంక్షలను తుది వరకూ కొనసాగించి ఉద్యమాలను జయప్రదం చేయడంలో విఫలం అవుతున్నారు.

కొన్ని చోట్ల జాతి విముక్తి ఉద్యమాలలో మతం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. గతంలో పంజాబ్‌లో సిక్కు మతం ముందుకురాగా, కశ్మీర్‌లో ఇస్లాం మతం చోటు చేసుకుంటున్నది. భారత దోపిడీ పాలకవర్గాలు హిందుత్వ మత దురహంకారాన్ని రెచ్చగొడుతూ మిగతా మతాలపై దాడులు చేస్తున్నందువల్లనే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఆయా ప్రాంతాలలో భిన్న మతాల ప్రజల మధ్య హిందూ మతోన్మాదులు వైషమ్యాలను రెచ్చగొడుతున్నారు. అందులో భాగమే కశ్మీర్ పండితుల సమస్య. అలాగే దేశ వ్యాప్తంగా కశ్మీరీయులపై, ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై హిందూ మతోన్మాద శక్తుల దాడులు తీవ్రతరమవుతున్నవి. ఇలాంటి దాడులు ఒకే జాతిలోని, దేశంలోని భిన్న మతాల, జాతుల ప్రజల మధ్య శతృత్వాన్ని పెంచి జాతి/జాతుల సమైక్యతకు భంగం కలిగిస్తున్నవి.

జాతి విముక్తి ఉద్యమాలలో దోపిడీ శక్తులు జాతి దురహంకారాన్ని రెచ్చగొడుతున్నవి. అసోం జాతి దురహంకారానికి బోడోలు, మరాఠీ జాతి దురహంకారానికి ఇతర జాతుల ప్రజలు, బంగాలీ జాతి దురహంకారానికి ఈశాన్య జాతుల ప్రజలు గురవుతున్నారు.

సాధారణంగా అన్ని జాతుల ఉద్యమాలలో భిన్న జాతుల లేదా ఒకే జాతిలోని శ్రామిక ప్రజల మధ్యనే జాతి దురహంకారులు ఘర్షణలను సృష్టిస్తున్నారు.

దేశంలో ప్రాంతీయ దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య, పెటీబూర్జువా శక్తులు జాతుల ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న చోట జాతి ప్రయోజనాలకన్నా తమ స్వార్థ ప్రయోజనాలకు జాతి ఉద్యమాలను వినియోగించుకుంటున్నాయి. భారత రాజ్యాంగానికి లోబడి ఉండేలా చేస్తూ ప్రజల క్రియాశీల పాత్రను నిర్వీర్యపరుస్తూ సంస్కరణవాదంలో ముంచుతున్నాయి. ఇప్పటివరకు దేశంలో ముందుకు వచ్చిన అనేక జాతుల సమస్యలకు ఈ శక్తులే నాయకత్వం వహిస్తూ ప్రజల ప్రయోజనాలకు తీరని ద్రోహం చేశాయి. జాతి ప్రజల ఆకాంక్షలను సొమ్ము చేసుకోవడానికి ప్రాంతీయ పార్టీలను ఏర్పరుస్తూ ఎన్నికలలో అధికారానికి వస్తున్నవి. శివసేన, డీ.ఎమ్.కే., అన్నా డీ.ఎం.కే, అకాలీదళ్, తెలుగుదేశం, తృణముల్ కాంగ్రెస్, అసోం గణ పరిషత్, తెలంగాణ రాష్ట్ర సమితి లాంటివి ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మన దేశంలో కొనసాగుతున్న వివిధ సెక్షనల్ ఉద్యమాలను ఆధునికానంతరవాదం ప్రభావితం చేస్తున్నది. వాటిలో భాగంగా ఆదివాసీ ఉద్యమాలను కూడా ప్రభావితం చేస్తున్నది. దీని వల్ల, ఒక సెక్షన్ పెటీబూర్జువా నాయకత్వం తమ ఉద్యమాన్ని ఒక విడి, రాజకీయేతర, సంస్కరణవాద ఉద్యమంగా మలచటానికి ప్రయత్నిస్తున్నది. వీటిని దేశ, విదేశీ బడా కార్పొరేట్లు నడిపే స్వచ్ఛంధ సంస్థలు (ఎన్‌జీఓలు), రకరకాల ప్రభుత్వ సంస్థలు, రాజ్యం బలపరుస్తున్నాయి, ఆర్గనైజ్ చేస్తున్నాయి. మన పార్టీ నాయకత్వాన ఆదివాసీ ప్రజానీకం సమైక్యంగా, సమరశీలంగా వర్గపోరాటం కొనసాగిస్తున్న ప్రాంతాలలో ప్రత్యేకించి బలమైన ఉద్యమ ప్రాంతాలలో ఇవి బాగా ముందుకొస్తున్నాయి. వ్యవస్థ సమూల మార్పు కోసం కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవ పురోగమనానికి అస్తిత్వవాద ఉద్యమాలలోని ఈ తప్పుడు ధోరణి తీవ్రమైన ఆటంకంగా ఉంది.

కమ్యూనిస్టు విప్లవకారులలో కూడా జాతుల పోరాటాల పట్ల పైన పేర్కొన్న తప్పుడు ధోరణులలో ప్రధానంగా వాటిని సమర్థించే పేరుతో సంస్కరణవాదానికి గురవడం లేదా విప్లవ కార్మికవర్గ దృష్టికోణంతో వాటిని సమర్థిస్తూ నాయకత్వం వహించాల్సినచోట వాటి పట్ల సెక్టేరియన్‌గా ఉంటూ వ్యతిరేకించే ధోరణులు తలెత్తుతున్నవి.

పైన పేర్కొన్న అన్ని రకాల తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా మన పార్టీ దృఢంగా పోరాడాలి. మన దేశంలోని మూడు రకాల జాతుల ఉద్యమాలకు మన పార్టీయే నాయకత్వాన్ని అందించాలి. జాతుల ఉద్యమాలు ముందుకు వచ్చినపుడు మన పార్టీ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించి చురుగ్గా పని చేయాలి. బూర్జువా, పెటీ బూర్జువా లేదా దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య శక్తుల నాయకత్వంలో సాగే ఉద్యమాలలో తలెత్తే తప్పుడు ధోరణులను ఖండిస్తూ వాటికి వ్యతిరేకంగా నిరంతరం ప్రజలను అప్రమత్తం చేయాలి. మన విధానానికి కట్టుబడి ప్రజా ఉ

ద్యమాలకు నాయకత్వం వహించాలి.

## సామ్రాజ్యవాదం పీడిత జాతుల నిజమైన వికాసాన్నీ, విముక్తిని అనుమతించదు

పెట్టుబడిదారీ విధానం దాని వికాస క్రమంలో అనుసరించిన ప్రగతిశీల విధానాలన్నింటినీ దాని అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాద దశలో తుంగలో తొక్కింది. సామ్రాజ్యవాద దేశంలోని పెట్టుబడిదారీ వర్గం వలస, అర్ధవలస దేశాలలోని అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ వర్గాలతో కుమ్మక్కై పరమ అభివృద్ధి నిరోధకంగా తయారైంది. 20వ శతాబ్దపు ప్రారంభం నుండి మొదలైన సామ్రాజ్యవాద యుగం దాని ఉనికిని కాపాడుకోవటానికి, ప్రపంచంపై దాని ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ఏ నినాదాలు ముందుకు తెచ్చినా సారాంశంలో అవి దాని దోపిడీని తీవ్రతరం చేయడానికే తప్పా మరే మార్పు కోసం కావు.

వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల మధ్య పరస్పరం ఆధారపడడం అనేది మునుపెన్నడూ ఎరుగని స్థాయికి పెరిగింది. అయితే, 17, 18 శతాబ్దాల నాటి వర్తక పెట్టుబడి దశలోనే ఈ పరిణామం ప్రారంభమైంది. ఆఫ్రికాలోని బానిసల వ్యాపారం, బానిసల శ్రమపై ఆధారపడిన అమెరికా ఖండాలలోని ప్లాంటేషన్ ఆర్థిక వ్యవస్థ, పశ్చిమ యూరప్‌లోని పారిశ్రామిక పెట్టుబడులు పరస్పరం ఆధారపడే అభివృద్ధి చెందాయి. ఈ పరస్పరాధీనతే 18వ శతాబ్దంలో పెద్దఎత్తున పెట్టుబడి పోగుబడడానికీ, 19వ శతాబ్దం ద్వితీయ అర్థభాగంలో ఒకే ప్రపంచ మార్కెట్ ఏర్పడడానికి దారితీసింది. 20వ శతాబ్దం మధ్యవరకు సామ్రాజ్యవాద దేశాలు చౌకగా లభించే ముడి పదార్థాల వనరుల కోసం, మార్కెట్ల కోసం, పెట్టుబడి మదుపులు చేయగల రంగాల కోసం వలసల పైన, అర్థవలసల పైన, ఆధీన దేశాల పైనా ఆధారపడ్డాయి. వలసలు, అర్ధవలసలు, ఆధీన దేశాలు తయారీ వస్తువుల కోసం, టెక్నాలజీ కోసం, పెట్టుబడి కోసం, ఆయుధాల కోసం సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడ్డాయి. ఒక దేశం తన భూభాగానికి వెలుపలి నుండి పుట్టుకొచ్చే స్థూల ఆర్థిక ధోరణుల పైనా, విధానాల పైనా నిస్సహాయంగా ఆధారపడాల్సిన స్థితి ఏర్పడింది. దీనితో ఒక దేశానికి ఆర్థికంగా తన ఇష్టానుసారం మెసలడానికి గానీ, స్థూల ఆర్థిక వ్యవస్థ నిర్వహణకు గానీ శక్తి లేకుండా పోయింది. ఒక దేశంలోని సంక్షోభం ఇతర దేశాలలోని సంక్షోభానికి దారితీసింది. అంతర్జాతీయ కార్పొరేషన్ల కార్యకలాపాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడం వలన జరిగిన ఉత్పత్తి ప్రపంచీకరణ వివిధ ఆర్థిక వ్యవస్థల మధ్య పరస్పరాధీనత పెరగడానికి దోహదం చేసింది. అంతర్జాతీయ కార్పొరేషన్లు, సర్వీసు కంగ్లామరేట్లు అర్ధవలసలలో, నయావలసలలో స్వేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగించాలంటే ఆ దేశాలలోకి తమ వస్తువులు, సేవలు, పెట్టుబడి మదుపులను ప్రవహింపజేయడానికి వీలుగా వాటి ఆర్థిక వ్యవస్థలను తమ కోసం బార్లా తెరవడం అవసరం. ఆ లక్ష్య సాధన కోసమే ఉద్దేశించిన వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమాలు, ఎగుమతి ప్రాధాన్య వ్యూహాలు వాటిని మరింతగా ప్రపంచ మార్కెట్‌పై ఆధారపడేవిగా మార్చాయి. ఇదే ప్రపంచీకరణ అసలు సారాంశం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అంటే హద్దులెరుగని ప్రపంచాన్ని యథేచ్ఛగా దోచుకోవడం. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ఆటంకాలేర్పరచే ఏ గొంతునైనా వారు నిర్దాక్షిణ్యంగా అణచివేస్తారు. వారు పీడిత దేశాల స్వాతంత్ర్యాన్నీ, పీడిత జాతుల విముక్తినీ, ప్రజా విప్లవాన్నీ ససేమిరా ఎన్నటికీ అనుమతించరు. భారతదేశాన్ని ప్రపంచంలోనే ఒక పెద్ద ఆర్థిక సామ్రాజ్యంగా ఏర్పరచాలని కలలు కంటున్న దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు ఈ దేశంలోని జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కును అనుమతించవు. దానిని కార్మికవర్గ నాయకత్వాన ప్రజలు పోరాడి సాధించాల్సిందే. కార్మికవర్గ నాయకత్వం లేకుండా, సామ్రాజ్యవాదం దానితో కుమ్మక్కైన దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలను ఓడించలేవు. అది జరుగకుండా నిజమైన అర్థంలో జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికారం దక్కదు. అలాంటి పోరాటాలకు ఏ పెటీబూర్జువా శక్తులు తుదివరకు నాయకత్వాన్ని అందించలేవు. అందుకు కార్మికవర్గ అగ్రగామి దళమైన మన పార్టీయే నాయకత్వాన్ని అందించగలుగుతుంది. తద్వారానే జాతులకు నిజమైన విముక్తి లభిస్తుంది.

## జాతుల ఐక్యతకు ప్రాతిపదిక

భారతదేశంలోని జాతి పీడనకు మూలాలు భారత ప్రజల ముగ్గురు శత్రువులు – దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం వారి రాజ్యం జాతులపైన కొనసాగిస్తున్న అణచివేతలో ఉన్నాయనేది స్పష్టం. అందువల్ల సామ్రాజ్యవాద కనుసన్నలలో కొనసాగుతున్న దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వాముల ప్రభుత్వాన్ని నిర్మూలించి, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య దోపిడీ పీడనలను సమూలంగా తుదముట్టించి, విభిన్న జాతులు సమాన హోదాలో, స్వచ్ఛందంగా పాల్గొనే ఫెడరల్ పద్ధతిలో నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పడం ద్వారానే జాతుల ఐక్యతకు సరైన ప్రాతిపదిక ఏర్పడుతుంది తప్ప దేశాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను యథాతథంగా సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలలో కొనసాగించడం ద్వారా ఎంత మాత్రమూ కాదు. ఇది మన దేశాన్ని శాశ్వతంగా వర్గ దోపిడీ పీడనలకూ, జాతీయ పీడనకు నెలవుగా, జాతుల బందిఖానాగా మాత్రమే వుంచేస్తుంది. జాతుల నిజమైన విముక్తిని కోరుకునేవారు ఎవరైనా ఇలాంటి దుస్థితిని సహించరు. అలాంటి వారి ముందు ఈనాడు ఒకే ఒక కర్తవ్యం ఉంది : సామ్రాజ్యవాదులతో షరీకైన దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా దేశంలో విభిన్న జాతులకు చెందిన విశాల ప్రజానీకాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవంలో సంఘటితపరచి, ఆ విప్లవాన్ని జయప్రదం చేయడం. అందుకొరకు సామ్రాజ్యవాద దోపిడీని నిర్మూలించుట, గుత్త పెట్టుబడిని స్వాధీనం చేసుకొనుట, దేశాన్ని పారిశ్రామికం చేయుట, భూస్వామ్య విధానాన్ని సమూలంగా నిర్మూలించుట, ఆధునిక విజ్ఞానాన్నంతటినీ వినియోగించి వ్యవసాయోత్పత్తిని

గరిష్ట ప్రమాణానికి పెంపొందించుటకు అవసరమైన అన్ని పద్ధతులను అమలు జరుపుట వగైరా ఆర్థిక, రాజకీయ కార్యక్రమంతో పాటు, ఈ కింది అవగాహనతో వివిధ జాతుల ప్రజలను ఆ విప్లవంలోకి సమీకరించాలి:

భారతదేశం విభిన్న జాతులకు నిలయం గనుక, విప్లవానంతరం ప్రతి జాతీ ఒక ప్రజా రిపబ్లిక్‌ను ఏర్పరచుకుంటుంది; వివిధ జాతులకు చెందిన ప్రజా రిపబ్లిక్‌లు సమాన హోదాలో, స్వచ్ఛందంగా చేరడం ద్వారా ఫెడరేషన్ రూపంలో 'భారత ప్రజా రిపబ్లిక్‌ల యూనియన్' ఏర్పడుతుంది; అలా ఏర్పడే ఫెడరల్ ప్రభుత్వం వాటి లక్ష్యానికి అనుగుణంగా సమన్వయించే కేంద్రంగా ఉంటుంది; ప్రతీ జాతికీ స్వయంనిర్ణయాధికారం ఉంటుంది గనుక ఆ ప్రభుత్వంలో ఉండడం ఏనాడు నష్టదాయకంగా భావిస్తే ఆనాడు విడిపోయే హక్కు ప్రతి రిపబ్లిక్‌కూ ఉంటుంది; ఇంకా ప్రాదుర్భావ దశలో ఉండే జాతులకు పై రిపబ్లిక్‌లో అంతర్భాగంగా, స్వయంప్రతిపత్తి గల హోదాలో అవి మనగల్గడానికి అవకాశం ఉంటుంది; జాతి మైనారిటీలకు సాంస్కృతిక అభివృద్ధి కొరకు, తమ భాషలో విద్యా సౌకర్యాలు కలిగించడం వగైరా గ్యారంటీలన్నీ ఉంటాయి. ఈ ప్రాతిపదికనే అన్ని జాతుల ప్రజల మధ్య సమైక్యత, సత్సంబంధాలు, పరస్పర సహకారం, విశ్వాసం పెంపొందుతూ జాతులు సమ్మిళతం కావడానికి ముందుకు సాగుతాయి.

ఈనాడు మన దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులలో పై అవగాహన మాత్రమే వివిధ జాతులకు చెందిన ప్రజలనూ, సామ్రాజ్యవాదాన్నీ దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య వర్గాలనూ వ్యతిరేకించే వివిధ వర్గాలకు చెందిన అశేష ప్రజానీకాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవంలో సమీకరించగలుగుతుంది. మన దేశంలోని జాతుల ఉద్యమాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. భారత దోపిడీ పాలక వర్గాల దురాక్రమణకు గురై దేశంలో విలీనమైన జాతులు తమ విడిపోయే హక్కు సహ స్వయంనిర్ణయాధికారం కోసం దశాబ్దాలుగా తమ న్యాయమైన పోరాటాలను కొనసాగిస్తున్నాయి. వాటితో పాటుగా దేశంలోని వివిధ జాతుల ప్రజలు తమ తమ జాతుల వికాసంలో భాగంగా కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా వివిధ సమస్యలపై పోరాడుతున్నాయి. అలాగే దేశంలోని ప్రాదుర్భావ జాతులు తమ సమస్యలపై పోరాడుతున్నాయి. అన్ని పోరాటాలకు ఉమ్మడి శతృవు కేంద్ర ప్రభుత్వం, దానికి నాయకత్వం వహిస్తున్న దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు, వాటి స్థానిక దళారీ పాలకవర్గాలే. వాటికి వ్యతిరేకంగా పీడిత జాతులు, ప్రజలు సమైక్యంగా పోరాడాలి.

ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా అన్ని జాతుల ప్రజలను ఒక ఐక్య సంఘటనలోకి సమీకరించాలి. బూర్జువా జాతీయవాదానికి వ్యతిరేకంగా, అంటే, ఒక వంక జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టే అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా పోరాడాలి. మరోవంక సంకుచితమైన ఒంటెత్తుపోకడ జాతీయవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. సామ్రాజ్యవాదులు,

వారి ఏజంట్లు భిన్న జాతుల మధ్య ఆనైక్యతను, చీలికను సృష్టించడానికి చేసే ప్రతి కుట్రకు వ్యతిరేకంగా పోరాడాలి.

కార్మికవర్గం తన రాజకీయాలకు, మార్క్సిజం–లెనినిజం–మావోయిజం భావజాలానికి విధేయంగా వుండడం ద్వారా మాత్రమే, తన సొంత రాజకీయ, నిర్మాణపరమైన స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవడం ద్వారా మాత్రమే బూర్జువా జాతీయ దురహంకారవాదం నుండి, ఒంటెత్తు జాతీయవాదం నుండి ప్రజలను విముక్తి చేసి వారికి నాయకత్వం వహించగలుగుతుంది. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేసి, కార్మికవర్గ నాయకత్వం కింద "యూనియన్ ఆఫ్ పీపుల్స్ రిపబ్లిక్స్" ఏర్పడినప్పుడు మాత్రమే దేశంలోని విభిన్న జాతులు సర్వతోముఖంగా వికసించటానికి అవకాశం కలుగుతుంది. తద్వారానే లెనిన్ మహాశయుడు ఆశించినట్లుగా 'మానవుని మరో మానవుడు దోచుకోవడానికి వీలులేని సమాజం పునాదిగా ప్రపంచంలోని జాతులన్నీ సమ్మిళితమై విశ్వ మానవజాతిగా రూపొందడానికి' బాట సుగమమవుతుంది.

# మూడవ అధ్యాయం

## జాతుల సమస్య- మన విప్లవ కార్యక్రమం

మనం ఇంతవరకు మార్క్సిజం–లెనినిజం–మావోయిజం వెలుగులో జాతుల సమస్య పట్ల కార్మికవర్గ సాధారణ అవగాహన గురించి, దీనిపై ఆధారపడి భారతదేశంలో జాతుల సమస్య పట్ల మన వైఖరి గురించి కూడా పైన పేర్కొన్నాం. పైన పేర్కొన్నట్లు మన దేశంలో ప్రజాస్వామిక విప్లవం పరిపూర్తి కాకపోవడం వల్ల జాతుల సమస్య మౌలికంగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిందనేదీ, జాతుల ప్రజాస్వామిక ఆకాంక్షలు అన్నీ నెరవేరే వరకు జాతుల ఉద్యమాలు కొనసాగితీరుతాయనేదీ, ఈ సమస్యను పరిష్కరించే చారిత్రక కర్తవ్యాన్ని కార్మికవర్గ పార్టీయే (మన పార్టీయే) చేపట్టాలనేది సుస్పష్టం. భారతదేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం కావడం వల్ల ఈ దేశానికీ, ఇక్కడి ప్రజలకు నిజమైన స్వతంత్రమూ లేదు, ప్రజాస్వామ్యమూ లేదు. సామ్రాజ్యవాదులతో కుమ్మక్కైన భారత పాలకవర్గాల రాజ్యం చేత పీడనకు గురవుతున్న అనేకానేక జాతులకు, జాతీయ మైనారిటీలకు, ప్రాదుర్భావ జాతులకు నిజమైన స్వాతంత్ర్యం లేదు. అందువల్లనే, దేశం జాతుల బందీఖానాగా మగ్గిపోతున్నది. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా మాత్రమే సామ్రాజ్యవాద బానిసత్వాన్నీ, దాని దోపిడీని, అజమాయిషీని కూకటివేళ్లతో సహా పెకిలించివేసి జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించడం గానీ, భూస్వామ్య నిరంకుశత్వాన్ని బ్రద్దలుకొట్టి ప్రజల ప్రజాస్వామ్యాన్ని స్థాపించడంగానీ సాధ్యమవుతుంది. ఈ రెండు–జాతీయ, ప్రజాస్వామిక కర్తవ్యాలు పరస్పరం సన్నిహితంగా పెనవేసుకొని ఉన్నాయి. కార్మికవర్గ దృష్టితో ఒక స్థిరమైన ప్రజాస్వామిక మార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే ఈ సమస్య పరిష్కారానికి సరైన, బలమైన పునాది వేయగలుగుతామని మన పార్టీ దృఢంగా నమ్ముతున్నది. దేశంలో విప్లవానికి నాయకత్వం వహిస్తున్న మన పార్టీ ఈ సమస్యను సరైన పద్ధతిలో పరిష్కరించడానికి ప్రత్యేక కర్తవ్యాన్ని చేపట్టింది.

అన్ని రకాల సామాజిక పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడినట్టే మనం జాతుల అణచివేత, పీడనలకు వ్యతిరేకంగా సరిగా, క్రియాశీలంగా పోరాడటానికి మొదట మనం ఈ సమస్యను ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా, మన దేశ నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా గుర్తించడం అవసరం. జాతి సమస్య మూలాలను సరిగా గుర్తించనప్పుడు ఈ సమస్య బూర్జువా ప్రజాస్వామిక విప్లవ పరిధిలోనిదనీ, ఈ సమస్యకు పెట్టుబడిదారీ వర్గమే నాయకత్వం వహిస్తుందనే తప్పుడు భావాలకు గురవుతాం లేదా జాతుల పోరాటాల్ని నడిపితే వర్గ పోరాటం బలహీనపడుతుందనే అపోహకు గురవుతాం. జాతుల విముక్తి ఉద్యమంలో తలెత్తే తప్పుడు

ధోరణులకు వ్యతిరేకంగా పోరాడడంలో ప్రజాస్వామిక ఉద్యమాలను సమైక్యపరచడంలో విఫలమవుతాం.

కార్మికవర్గ నాయకత్వంలో జాతుల సమస్యపై పోరాటం చేపడితే అది వ్యవసాయక విప్లవ/వర్గ పోరాట పురోగమనానికి తోడ్పడుతుంది. వ్యవసాయక విప్లవ/వర్గ పోరాట పురోభివృద్ధి పీడిత జాతుల్లో విముక్తి చైతన్యాన్ని పెంపొందింపజేస్తుంది. అందుకే ఈ రెండింటి మధ్య వైరుధ్యం ఏమీ లేదు. అందుకే జాతుల సమస్యను నూతన ప్రజాస్వామిక విప్లవంలో విడదీయరాని సమస్యగా పరిగణించి జాతులకు సంబంధించిన అన్ని సమస్యలపై పోరాటాలు చేపడుదాం, ప్రజాస్వామిక జాతి ఉద్యమాలను సమైక్యపరుద్దాం, వీటికీ మనమే నాయకత్వాన్ని అందిద్దాం.

రష్యాలోలాగా భారతదేశంలో ఏదోఒక ప్రత్యేక జాతి, జాతి అణచివేతను సాగించడం లేదు. భారత రాజ్యం ద్వారా జాతుల పైన అణచివేత కొనసాగడం అనేది దేశంలోని జాతి పీడనకు ఉన్న విలక్షణత. సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అనే మూడు మహా పర్వతాలు మన దేశంలోని జాతులను కుంగదీస్తూ వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, భాషాసంస్కృతుల విషయంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. దేశంలో జాతి పీడన నిర్మూలించబడకుండా జాతీయ విముక్తి సాధించడంగానీ, వివిధ చారిత్రకాభివృద్ధి దశల్లో ఉన్న అన్ని జాతులకు నిజమైన స్వయంనిర్ణయాధికార హక్కుతో సహా సమాన హక్కులు–విస్తృత ప్రజాస్వామ్యం లభించడంగానీ, అవి పరస్పర ప్రయోజనాల కోసం పరస్పర సహాయసహకారాలతో శాంతియుత సహజీవనం సాగించడంగానీ సాధ్యం కాదు. ఈ మూడు మహాపర్వతాలను కూలదోయనిదే ఇవేవీ సాధ్యపడజాలవు. ఈ ముగ్గురు పీడకులను కూలదోయగానే వివిధ జాతుల ప్రజాస్వామిక రిపబ్లిక్‌లతో కూడిన స్వచ్ఛంద భారత సమాఖ్యను ఏర్పరచగలుగుతాం. ఈ స్వచ్ఛంద సమాఖ్యలో జాతులన్నింటికీ విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార ప్రజాస్వామిక హక్కు రాజ్యాంగబద్ధంగానే గ్యారంటీ చేయబడుతుంది. అందువల్ల, మన పార్టీ, అన్ని జాతుల మధ్య, అన్ని భాషల మధ్య సమానత్వాన్నీ, స్వయంనిర్ణయాధికార హక్కును గుర్తించే, సమానత్వంపై ఆధారపడిన జాతుల స్వచ్ఛంద ఫెడరల్ డెమోక్రటిక్ రిపబ్లిక్‌ను స్థాపించే లక్ష్యంతో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించే మహత్తర కర్తవ్యాన్ని చేపట్టింది.

జాతులకు సంబంధించిన ప్రతి ప్రజాస్వామిక డిమాండును ఎత్తిపట్టే విషయంలోనూ మన పార్టీ తప్పనిసరిగా ముందు వరుసలోనే ఉంటుంది. అన్ని జాతుల, అన్ని భాషల సమానహోదా కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం, స్వయంప్రతిపత్తి కోసం, ఒక జాతిపై మరోజాతి సాగించే రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రూపాలలోని పీడనకు, వివక్షకు వ్యతిరేకంగా

ముందు నిలుస్తుంది. జాతి పీడనకు సంబంధించిన ప్రతి వ్యక్తీకరణకు వ్యతిరేకంగా పోరాడటానికి తగిన పోరాట, నిర్మాణ రూపాలను రూపొందించుకుంటుంది. అదే సమయంలో, వివిధ జాతి ప్రజలను జాతిపరమైన ఒంటరితనం నుండి బైటికి తెచ్చి, వారిలో జాతుల సమైక్యతా భావననూ, అంతర్జాతీయ సౌభ్రాతృత్వ స్ఫూర్తిని పెంపొందింపజేయటానికి కూడా కృషి చేస్తుంది.

ప్రస్తుత భారత పాలకవర్గ రాజకీయ వ్యవస్థ స్థానంలో ప్రతిఒక్క జాతికీ విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కు కలిగిన వివిధ జాతుల రిపబ్లిక్‌ల స్వచ్ఛంద సమాఖ్యను స్థాపిస్తుంది. దేశంలోని జాతి పీడనను నిర్మూలించి నిజమైన జాతీయ సమానత్వం నెలకొల్పడానికీ, జాతుల స్వేచ్ఛాయుత ఐక్యతను నెలకొల్పడానికి అన్ని జాతులకు, అన్ని భాషలకు చట్టపరంగానే సమానత్వ హక్కు, స్వయంనిర్ణయాధికార హక్కు కల్పిస్తుంది. ఏ జాతి కూడా మైనార్టీ జాతుల హక్కులను హరించి వేయడాన్ని నిషేధిస్తుంది. ప్రాదుర్భావ జాతులతో పాటు అన్ని జాతులు సర్వతోముఖ ఆర్థిక, రాజకీయ, భాష, సాంస్కృతిక అభివృద్ధి సాధించడానికి హామీ కల్పిస్తుంది. జాతులు తమ ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా తమ స్వయంనిర్ణయాధికార హక్కును వినియోగించుకోవటానికి తగిన ప్రజాస్వామిక పద్ధతిని, ఉదాహరణకు ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండం), రాజ్యాంగంలో పొందుపరుస్తుంది. జాతి, వర్గ తదితర అన్ని రకాల పీడనల నుండి మానవాళి విముక్తి సాధించే ఈ మార్గంలో దృఢంగా ముందుకు సాగుతుంది. పైన పేర్కొన్నట్లు భారతదేశంలోని జాతుల సమస్య పట్ల మన పార్టీ అనుసరిస్తున్న మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు వైఖరి యొక్క అంతస్సారం ఇదే.

భారతదేశంలోని జాతుల సమస్యపైన నేడు మన పార్టీ, అఖిల భారత ప్రజాస్వామిక సంఘటన, విప్లవ ప్రజాకమిటీలు ఈ కింది కార్యక్రమంపై ఆధారపడి పనిచేస్తాయి. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని జాతుల, ప్రాదుర్భావ జాతుల ప్రజలలో ప్రచారం చేస్తాయి. ప్రజలను కదిలించి పోరాటాలను నిర్మిస్తాయి. జాతుల ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటికీ ముందుపీఠీన నిలిచి నాయకత్వం వహిస్తాయి. జాతుల సంపూర్ణ విముక్తి లక్ష్యంతో వీటిని నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా వ్యవసాయ విప్లవంతో అనుసంధానిస్తూ నడుపుతాయి. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానంతరం ఏర్పడే జనతా ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ ఈ కార్యక్రమాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసి అమలు చేస్తుంది.

1. కశ్మీర్ జాతి ప్రజలతో పాటు నాగాలు, మణిపురీలు, అస్సామీలు తదితర ఈశాన్య ప్రాంతంలోని వివిధ జాతులు భారత రాజ్యపు దురాక్రమణకు, క్రూరమైన అణచివేతకు వ్యతిరేకంగా తమ స్వయంనిర్ణయాధికారం కోసం సాగిస్తున్న న్యాయమైన పోరాటాలకు అండగా నిలవాలి. ఈ ఉద్యమాలకు మద్దతుగా సంఘీభావ ఉద్యమాలను నిర్మించాలి.

వీటిపై కొనసాగే దమనకాండకు వ్యతిరేకంగా పోరాడాలి. భారత విస్తరణవాద రాజ్యం వీటిని వేర్పాటు ఉద్యమాలుగా చిత్రించి, వీటికి వ్యతిరేకంగా భారత ప్రజలలో బూర్జువా జాతీయ దురభిమానాన్నీ, బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టటానికి చేస్తున్న కుట్రలను బట్టబయలు చేయాలి.

ఈ ప్రాంతాలలో పని చేసే మన పార్టీ కమిటీలు జాతుల సమస్యను కేంద్రంగా చేసుకొని ఆ ఉద్యమాలకు నాయకత్వం వహించేందుకు కృషి చేయాలి. జాతి విముక్తి ఉద్యమాలను వర్గ పోరాటంతో సమన్వయించి నడపాలి. ఆయా ప్రాంతాలలో ఈ సమస్యపై పని చేసే సంస్థలతో ఏర్పడే ఐక్యసంఘటనా నిర్మాణాలలో ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదికన పనిచేస్తూనే మన స్వతంత్రాన్ని నిలబెట్టుకోవాలి. జాతుల సమస్యపై పోరాడే సంస్థలలోని తప్పుడు ధోరణులపై స్నేహపూర్వక విమర్శనా వైఖరిని అవలంబించాలి. ఈ ప్రాంతాలలోని పలు జాతుల, ప్రాదుర్భావ జాతుల, జాతి మైనారిటీల మధ్య అనైక్యతను సృష్టిస్తున్న భారత దోపిడీ పాలకవర్గాల కుట్రలను బహిర్గతం చేస్తూ ఉమ్మడి లక్ష్యం కోసం వాటిని ఐక్యం చేసేందుకు కృషి చేయాలి.

2. విశాలమైన భారతదేశంలో వివిధ ప్రాంతాలలో గల జాతి మైనారిటీలకు, ప్రాదుర్భావ జాతులకు, వాటి ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర రూపంలో, స్వయంప్రతిపత్తి రూపంలో నిజమైన స్వయంప్రతిపత్తికి గ్యారంటీ కల్పించాలని పోరాడాలి. వీటి స్వయం పాలన రూపం గురించీ, వీటి ఎల్లల గురించి సంబంధిత ప్రజల భౌగోళిక, సామాజిక, ఆర్థిక, భాష, సంస్కృతి, జీవన విధానం, చరిత్రల ఆధారంగా సంబంధిత స్థానిక ప్రజలచే నిర్ణయించబడాలనీ, వీటిని ఏర్పరచేటప్పుడు తలెత్తే వివాదాలను సంబంధిత ప్రజల పరస్పర ప్రయోజనాలకు హాని కలగకుండా పరస్పరం సంప్రదింపుల ద్వారా పరిష్కరించబడేలా ప్రజలను కదిలించాలి. జాతి మైనారిటీల సాంస్కృతిక అభివృద్ధి కొరకు, తమ భాషలో విద్యా సౌకర్యాలు వగైరా ప్రజాస్వామిక హక్కులకు హామీ కల్పించాలని పోరాడాలి.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువా, బడా భూస్వామ్య దోపిడీ పీడనల మూలంగా దేశంలో అనేక రాష్ట్రాల్లో పీడిత జాతులు ప్రత్యేక రాష్ట్రాల్ని డిమాండ్ చేస్తున్నాయి. 'ప్రజాస్వామిక జాతి రాష్ట్రాల' ఏర్పాటు కోసం పోరాడేలా ఆ పోరాటాలకు దిశానిర్దేశం చేయాలి, సమర్థించాలి. ఇందులో భాగంగానే గోండ్వానా రాష్ట్ర డిమాండ్‌ను, విదర్భ, కోసల, గోర్ఖాలాండ్, బుందేల్‌ఖండ్, పూర్వాంచల్ తదితర ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు ఉద్యమాలను సమర్థించాలి. ఈశాన్య భారతంలోని చిన్న జాతుల ముందు

'ప్రజాస్వామిక స్వయంపాలనా కౌన్సిల్స్ కోసం' (డెమోక్రటిక్ అటనామస్ కౌన్సిల్స్) పోరాడే కార్యక్రమాన్ని ఉంచాలి.

3. దేశంలోని వివిధ తెగల రాజకీయ స్వయంనిర్ణయాధికారానికి/స్వయంప్రతిపత్తికి హామీని కల్పించాలనే రాజకీయ డిమాండ్‌పై పోరాడాలి. వీరిని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భాషాపరమైన, విద్యాపరమైన సమస్యలపై సంఘటితపరచాలి. వీరు సంపూర్ణ విముక్తి సాధించుకునే లక్ష్యంతో వీరి పోరాటాలకు నాయకత్వం వహించాలి. వీరు నిజమైన విముక్తిని సాధించే వ్యూహాత్మక దృష్టితో గానీ, దేశంలో జాతుల రిపబ్లిక్‌ల స్వచ్ఛంద సమాఖ్యను స్థాపించే వ్యూహాత్మక దృష్టితో గానీ చూసినప్పుడు ఈ ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. అందువల్ల, ఆదివాసీ ప్రజలను 'జల్, జంగల్, జమీన్‌పై అధికారం ఆదివాసులదే/స్థానిక ప్రజలదే', 'ఆదివాసీ ప్రాంతాలకు రాజకీయ స్వయంప్రతిపత్తి కల్పించాలి', 'విడిపోవద్దు, కలిసికట్టుగా ఉండండి', 'నిజమైన శత్రువులకు వ్యతిరేకంగా నిజమైన మిత్రుల్ని ఐక్యపరచండి', 'స్వంత సంస్కృతిని, భాషను, వనరులను రక్షించుకునే హక్కు, అభివృద్ధి పథకాలను రూపొందించుకునే హక్కు ఆదివాసులదే/స్థానిక ప్రజలదే' మొదలైన నినాదాలతో వీరిని కదిలించాలి. స్వయంప్రతిపత్తి ప్రాంతాల ఏర్పాటు కోసం, చట్టపరంగా వీరికి లభించిన హక్కును వినియోగించుకోవడం కోసం, స్వయంప్రతిపత్తి ప్రాంతాల్లో అధికారాల కోసం జరిగే పోరాటాలను సమర్థించాలి. ఆదివాసీ ప్రాంతాల్లో 5వ షెడ్యూల్, పెసా, 6వ షెడ్యూల్ అమలు కోసం తలెత్తే డిమాండ్స్‌ను సమర్థించాలి. వీటి పరిమితులను ప్రజల ముందుంచుతూ, ఈశాన్య భారతంలో 6వ షెడ్యూల్ అమలయినప్పటికీ అక్కడి ఆదివాసీ సముదాయాల ఆకాంక్షలు నెరవేరని అనుభవాల్ని ప్రజల ముందుంచుతూ ప్రజాస్వామిక స్వయంపాలనా కౌన్సిల్స్ (డెమోక్రటిక్ అటానమస్ కౌన్సిల్స్) కోసం పోరాడేలా ప్రజలను సన్నద్ధం చేయాలి.

4. అన్ని జాతుల తెగల భాషలకు సమాన హోదా కల్పించాలనీ, ఈ విషయం ప్రాథమిక హక్కుల్లో చేర్చాలనీ, జాతీయ భాష లేక అనుసంధాన భాష పేరుతో గానీ, మరే పేరుతో గానీ ఏ భాషనూ ఇతర భాషలపై రుద్దరాదనే, నేటి త్రిభాషా సూత్రాన్ని రద్దు చేయాలనే డిమాండ్లతో ప్రజలను కదిలించాలి. అన్ని కేంద్ర, రాష్ట్ర, స్వయంప్రతిపత్తి ప్రభుత్వాలు అన్ని స్థాయిల్లో ఆయా జాతుల మాతృభాషలో ఉచిత విద్యనందించాలనీ, కేంద్ర, రాష్ట్ర, స్వయంప్రతిపత్తి ప్రాంత చట్టసభల్లోనూ, న్యాయ, పరిపాలన మొదలైన వాటిలోనూ యావత్తు అధికారిక కార్యకలాపాలు ఆయా జాతుల భాషలలో

నిర్వహించుకునే హక్కు కల్పించాలనీ, ప్రజలు మాట్లాడే, లిపిలేని భాషలకు తగిన లిపిని అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర, స్వయంప్రతిపత్తి ప్రభుత్వాలు కృషి చేయాలనీ, సంబంధిత జాతుల ప్రజలు తమ లిపిని అభివృద్ధి చేసుకోవడానికి ఈ ప్రభుత్వాలు అన్ని విధాలుగా తోడ్పడాలనే డిమాండ్లతో ప్రజలను కదిలించాలి.

జాతుల వికాసంలో విద్యా, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా విద్య, వైద్య రంగాలు ప్రైవేటీకరించబడి పీడిత జాతి సముదాయాల అభివృద్ధి కుంటుపడుతున్నందునా ఆ రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి. 'కామన్ స్కూల్ విధానం' కోసం దేశంలో జరుగుతున్న పోరాటాల్ని సమర్థించాలి, వాటిలో పాలుపంచుకోవాలి, ఈ పోరాటాలను నడపాలి.

5. భారతదేశం నిజమైన వివిధ జాతి రిపబ్లిక్‌ల స్వచ్ఛంద సమాఖ్యగా మనగలుగుతూ, అన్ని జాతులూ, మొత్తం దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి తోడ్పడేలా కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన చట్టపర నియమాలను రూపొందించాలనీ, ఈ చట్టపర నియమాలను అనుసరించే కేంద్ర ప్రభుత్వం రాజకీయ, ఆర్థిక-వనరుల, భాషా సంస్కృతి తదితర అన్ని విషయాలలో రాష్ట్రాలతో, స్వయంప్రతిపత్తి ప్రాంతాలతో ప్రజాస్వామిక సంబంధాలను కొనసాగించాలని డిమాండ్ చేయాలి. వీటికి వ్యతిరేకంగా వ్యవహరించే కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యానికి, నిరంకుశపూరిత నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించాలి.

   కేంద్ర, రాష్ట్రాల మధ్య అసమ సంబంధాల రద్దు కోసం ఆయా రాష్ట్రాల్లోని బూర్జువాజీ లేవనెత్తే డిమాండ్స్‌ను సమర్థించాలి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటాను, స్థానిక సంస్థల వాటాను పెంచే డిమాండ్‌ను, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం, ప్రత్యేక హోదాల కోసం, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీల కోసం తలెత్తే డిమాండ్‌ను సమర్థించాలి. ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేయాలి.

6. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక విధానాల మూలంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలు దీర్ఘకాలికంగా వివక్షకు గురై వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాల ప్రజలు తమ హక్కుల కోసం చేస్తున్న న్యాయమైన పోరాటాలను సమర్థించాలి. వీటి పరిష్కారానికై పోరాడాలి. ప్రాంతీయ అసమానతల నిర్మూలనకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలనీ. ఇందుకు దీర్ఘకాలిక, తక్షణ పథకాలను

రూపొందించి అమలు చేయాలని పోరాడాలి.

7. వివిధ రాష్ట్రాలు, జాతులు, తెగలు మధ్య గల సరిహద్దు వివాదాలతో పాటు, నదీజలాలు తదితర ప్రకృతి వనరులు, పర్యావరణం విషయంలో ముందుకు వచ్చే వివాదాలు పరస్పర ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఇచ్చిపుచ్చుకునే వైఖరితో పరస్పర సంప్రదింపుల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కారించుకోవాలని ప్రచారం చేయాలి. న్యాయం, సహేతుకత, పరస్పర ప్రయోజనం ప్రాతిపదికగా సామ్రాజ్యవాదాన్ని, దళారీ నిరంకుశ బడా బూర్జువాజీని బలహీనపరచేలా నదీ జలాల వివాదాల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులతో, నదీ జల వనరుల నిపుణులతో కూడిన ప్రజా ట్రిబ్యునల్స్ (ప్రజా న్యాయ స్థానాలు) ఏర్పాటు చేయాలి. ఇలాంటి వివాదాలలో కేంద్ర ప్రభుత్వ పెత్తందారీ జోక్యాన్నీ, సంబంధిత ప్రాంతాల రాజకీయ పార్టీలు/ప్రభుత్వాలు తమ సంకుచిత ప్రయోజనాల కోసం ప్రజలను పరస్పరం ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని ఉసి గొల్పడానికి చేసే కుట్రలు, కుహకాలను వ్యతిరేకించాలి, బహిర్గతం చేయాలి, తిప్పికొట్టాలి, ప్రజల మధ్య సమైక్యతను నిలబెట్టటానికి కృషి చేయాలి.

8. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువాజీ దోపిడీ ఫలితంగా కేంద్ర ప్రభుత్వపు వివక్షాపూరిత విధానాల వల్లా పీడిత జాతులకు చెందిన, జాతీయ బూర్జువాజీకి చెందిన లక్షలాది కుటీర, లఘు, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి దివాలా తీస్తున్నాయి. జాతీయ బూర్జువాజీ నిర్వహించే కుటీర, లఘు, మధ్యతరహా పరిశ్రమలకు ఉచిత/సబ్సిడీ రేట్లతో విద్యుత్తు, ఉచిత నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలనీ, పన్నుల్లో మినహాయింపులు కల్పించాలని డిమాండ్ చేయాలి.

9. అక్రమ చొరబాటుదార్ల వలసలను నివారించే సాకుతో దేశంలో హిందూ రాజ్యాన్ని (హిందూ నేషన్) స్థాపించే కుట్రలో భాగంగా బీజేపీ ప్రభుత్వం ఈ మధ్య నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్‌షిప్ (ఎన్ఆర్‌సీ) చట్టాన్ని ముందుకు తెచ్చింది. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల నుండి ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలతో భారతదేశంలోకి వచ్చిన హిందువులకు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు ఈ చట్టం పౌరసత్వం కల్పిస్తుంది. బంగ్లాదేశ్ తదితర దేశాల నుండి భారతదేశంలోకి వలస వచ్చిన ముస్లిం మత మైనారిటీలను అక్రమ వలసదార్ల పేరుతో ఈ దేశం నుండి తరిమేయడం లేదా వారిని హిందువులుగా మారేలా ఒత్తిడి చేయడం ఈ చట్టం వెనకనున్న ప్రమాదకర లక్ష్యాలు. ఈ చట్టం ద్వారా భారతదేశంలోని

పీడిత జాతులు, ముఖ్యంగా ఈశాన్య, తూర్పు భారతంలోని పీడిత జాతుల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం జరిగి ఆ జాతుల అస్తిత్వం పెనుప్రమాదంలో పడనుంది. ఈ చట్టం అమలు ద్వారా హిందుత్వ ఫాసిజం పీడిత జాతులకు, పీడిత ప్రజలందరికీ ప్రమాదకరంగా మారనున్న విషయాన్ని పెద్దెత్తున ప్రచారం చేసి దాన్ని అడ్డుకోవాలి. ఈ చట్టం రద్దు కోసం పోరాడాలి. వలస సమస్యపై ఐక్యరాజ్యసమితి చార్టర్‌పై ఆధారపడి దక్షిణాసియాలో వలస సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను కదిలించాలి. దక్షిణాసియాలో వలస సమస్యకు కారణమైన దక్షిణాసియాలోని పాలకవర్గాల, ప్రత్యేకంగా భారత విస్తరణవాద విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రజలతో పాటు దక్షిణాసియా ప్రజలను సమీకరించి పోరాడాలి.

10. బూర్జువా జాతీయ దురహంకారాన్నీ, బూర్జువా జాతీయ సంకుచితత్వాన్నీ, ప్రత్యేకించి బూర్జువా జాతీయ దురహంకారాన్ని వ్యతిరేకించాలి. అదే విధంగా వీటికి వ్యతిరేకంగా పోరాడాలి. జాతుల సమానత్వ భావనను పెంపొందింపజేయాలి.

11. భారత అభివృద్ధి నిరోధక పాలకవర్గాలు రెచ్చగొట్టే విస్తరణవాదానికీ, కుహనా దేశభక్తికీ, బూటకపు దేశ సమగ్రతకూ వ్యతిరేకంగా పోరాడాలి. వారు వివిధ అభివృద్ధి దశల్లో ఉన్న అనేకానేక జాతుల సుసంపన్నమైన సంస్కృతిని, భాషలను నాశనం చేసి, మతమైనార్టీలపై నిరంతరాయంగా దాడులు చేస్తూ వాటిపై బ్రాహ్మణవాద సంస్కృతిని, హిందూ మతాన్ని, హిందీ సంస్కృతం భాషలను రుద్దటానికీ, దేశంలో ఫాసిస్టు పాలన నెలకొల్పి హిందూ రాష్ట్ర నిర్మాణంకై పన్నుతున్న బ్రాహ్మణీయ హిందూ మతఛాందసవాద/మతదురహంకార కుట్రలను బట్టబయలు చేయాలి. ఈ శక్తులకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడి ఓడించాలి.

12. జాతీయ, ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో ఆయా జాతి ప్రాంతాలలో ప్రత్యేక నిర్మాణాలను ఏర్పరచాలి. ఈ సంస్థలు జాతి విముక్తి ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఆయా జాతులకు సంబంధించిన ప్రతీ సమస్యపై ప్రజలను కదిలించాలి. ఈ సంస్థలు సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల విభజించి–పాలించే విధానాలకు వ్యతిరేకంగా, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు అన్ని జాతుల ఉద్యమాలకు మద్దతునివ్వాలి, సంఘీభావ ఉద్యమాలను నిర్మించాలి. ఈ ఉద్యమాలకు వెన్నుపోటు పొడిచే జాతి విద్రోహులను బట్టబయలు చేయాలి.

జాతుల సమానత్వంపై ఆధారపడిన, స్వయంనిర్ణయాధికారం కలిగిన నిజమైన ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ స్థాపనా లక్ష్యంతో ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా

వివిధ విప్లవ పార్టీలతో, వివిధ జాతి విముక్తి ఉద్యమాల సాయుధ సంస్థలతో, ఈ ఉద్యమాలను బలపరిచే వివిధ ప్రజాస్వామిక సంస్థలతో వ్యక్తులతో ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా ఒక వ్యూహాత్మక ఐక్యసంఘటన ఏర్పరచాలి. దీని నాయకత్వాన జాతుల సమస్యపై దేశంలోని వివిధ జాతుల ప్రజలను జాతీయ ప్రజాస్వామిక విప్లవం దిశగా నడపాలి.

ఆయా జాతుల ప్రజల సంసిద్ధతపై ఆధారపడి నిర్దిష్ట నినాదాలతో ఎత్తుగడలపర ఐక్యసంఘటన వేదికలను నిర్మించి పోరాటాలు నడపాలి. ఈ ఐక్యసంఘటన నిర్మాణాలన్నీ జాతుల ఉమ్మడి ఆశయం కోసం పోరాడాలి.

13. సామ్రాజ్యవాదుల పీడన కింద నలిగిపోతున్న ప్రపంచంలోని పీడిత జాతుల, పీడిత ప్రజల విముక్తి ఉద్యమాలతోనూ, పెట్టుబడిదారీ/సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గ తదితర ప్రజాస్వామిక ఉద్యమాలతోనూ మైత్రిని ఏర్పరచుకోవాలి. ప్రపంచ స్థాయిలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్ నిర్మాణానికీ, ప్రపంచ ప్రజల సమైక్య ఉద్యమాల నిర్మాణానికి శాయశక్తులా పాటుపడాలి. మన ఈ కృషి అంతా దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం దిశగా, ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయం దిశగా సాగించాలి. తద్వారానే ప్రపంచంలోని సమస్త కార్మికవర్గం, పీడిత ప్రజలూ, పీడిత జాతులూ, వర్గ, జాతి తదితర అన్ని రకాల అసమానతల, పీడనల నుండి విముక్తి చెంది ఏకైక ప్రపంచ మానవజాతి ఆవిర్భవించే దిశగా ముందుకు సాగుతాయి.

జాతుల సమస్యపై పైన పేర్కొన్న కార్యక్రమంపై ఆధారపడి దేశంలో, రాష్ట్రాల్లో ఆయా కాలాల్లో నెలకొనే రాజకీయ పరిస్థితులను, ఉద్యమ బలాబలాలను పరిగణనలోకి తీసుకుని చొరవతో పోరాటాలు చేపట్టాలి. తగిన నిర్మాణాలను ఏర్పరచాలి. శత్రువును బలహీనపరచదానికి, విప్లవోద్యమ అభివృద్ధికి తోడ్పడేలా ఈ పోరాటాల్ని చేపట్టాలి.

మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవంలానే జాతుల ఉద్యమాలు అలలు అలలుగా ఆటుపోట్ల క్రమం గుండానే సాగుతున్నాయి. మొదటి నుండీ మన పార్టీ జాతుల సమస్య పట్ల తీసుకున్న వైఖరి ఎంఎల్ఎంకు అనుగుణంగా మౌలికంగా సరిగానే ఉంది. కశ్మీర్ జాతి, ఈశాన్య జాతుల విముక్తి ఉద్యమాలకు అండగా నిలిచి సంఘీభావాన్ని నిర్మించింది. ఈ ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలను కూడా కొనసాగించింది. ఒక విశాల ఫ్రంట్‌ను ఏర్పరచే వ్యూహాత్మక దృష్టితో ఈ కృషి చేసింది. దేశంలోని కొన్ని ప్రాంతాలలో జాతి సమస్య మూలాలపై ఆధారపడి తలెత్తిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను బలపరచడమే గాకుండా వీటికి నాయకత్వాన్ని అందించటానికి కృషి చేసింది. అన్నిటికంటే మించి సుదీర్ఘకాలం నుండి తీవ్రతరమైన విప్లవ

ప్రతీఘాతుక పాలకవర్గాల బహుముఖ దాడులను ఎదుర్కొంటూ అనన్య త్యాగాలు చేస్తూనే దేశంలోని విశాలమైన అనేక ఆదివాసీ ప్రాంతాలలో లక్షలాది/కోట్లాది ఆదివాసీ ఆదివాసేతర ప్రజలను కదిలిస్తూ వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని నడుపుతున్నది. జాతుల సమస్య పట్ల ప్రతీఘాతుక పాలకవర్గాల, వారి తొత్తుల, కుహనా జాతీయ వాదుల, రివిజనిస్టుల వైఖరులకు పూర్తి భిన్నంగా తీసుకున్న మన సరైన వైఖరీ, సుదీర్ఘ ఆచరణా దేశవ్యాప్తంగానే గాకుండా దక్షిణాసియాలో కూడా విప్లవకర మావోయిస్టు శక్తులతోనూ, జాతీయోద్యమాలతోనూ ఫ్రంట్‌ను ఏర్పరచే ప్రాతిపదికను సిద్ధం చేసింది. దీనిపై ఆధారపడి ఈ దిశలో ముందుకు సాగటానికి దృఢసంకల్పంతో కృషి చేయాల్సిన అత్యంత ముఖ్యమైన కర్తవ్యం మన ముందుంది. చివరగా, జాతి సమస్య శాశ్వత పరిష్కారం గురించి మన మహోపాధ్యాయులైన మార్క్స్, ఏంగెల్స్‌లు ఎంతో ముందుచూపుతో కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన గొప్ప మార్గదర్శక సిద్ధాంతాన్ని మరోమారు గుర్తు చేసుకుందాం : "ఒక వ్యక్తి మీద మరొక వ్యక్తి చేసే దోపిడీ యే మేరకు అంతమౌతుందో ఆ మేరకు ఒక జాతి మీద మరొక జాతి చేసే దోపిడీ కూడా అంతమౌతుంది. ఒక జాతిలోని భిన్న వర్గాల మధ్య వైరుధ్యం యే మేరకు అంతరిస్తుందో ఆ మేరకు ఒక జాతికీ మరొక జాతికీ మధ్య ఉండే శత్రుత్వం కూడా అంతరిస్తుంది". మనం ఈ దిశలో, దేశంలో పీడిత వర్గాల, పీడిత జాతుల విముక్తి కోసం జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి సోషలిజం–కమ్యూనిజం నెలకొల్పే లక్ష్యంతో మానవాళి సకల పీడనల నుండి విముక్తి చెందే లక్ష్యంతో ముందుకు సాగుదాం.